

'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 48

గురువారం 2-11-2023



కివీస్ నెత్తిన సఫారీ పిడుగు!

న్యూజిలాండ్‌పై 190 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా విజయం - 12లో



బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష సక్సెస్

నిర్దేశించిన లక్ష్యాన్ని క్షిపణి అందుకుందని నేవీ వెల్లడి - 6లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఫ్యాక్ట్‌చెక్

'పీఎస్పీ' ప్రయోజనాలు కనిపించవా?

- రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులకు ఇస్తున్న ప్రోత్సాహానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు
- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా రాష్ట్రంలోని పీఎస్పీలు
- పీఎస్పీలతో పీక్ టైమ్‌లోనూ విద్యుత్ యూనిట్ రూ.3కే లభ్యం
- ఎగువ సీలేరు ప్రాజెక్టు గురించి తెలియకుండానే కథ అల్లేసిన ఈనాడు
- రాష్ట్ర ప్రజలకు ప్రయోజనకరమైన ప్రాజెక్టుపై రామోజీ అక్కసు

3లో





అసామాన్యులకు సత్కారం

గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ విజయమ్మ చేతుల మీదుగా వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానం 2లో

వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో సీఎం జగన్ ఆయన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ

గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారం అందుకుంటున్న కరణం మల్లీశ్వరి

న్యూస్‌రీల్

ఉద్దానంలో పెద్దపులి



శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో పశువులపై పెద్దపులి పంజా విసిరింది. కవిటి మండలం సహలాల పుట్టుగలో ఆవుపై, కొండిపుట్టుగలో గేదె దూడపై పులి దాడి చేసి హతమార్చింది. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో భయాందోళనలు మొదలయ్యాయి.
వివరాలు 10లో ▸

సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లకు పోస్టింగ్‌లు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఖాళీల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరింది. శుక్ర, శనివారాల్లో విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీలో 340 మంది వైద్యుల సర్టిఫికెట్‌లను పరిశీలించి, కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇవ్వనున్నారు.
వివరాలు 10లో ▸

పలు సమస్యలున్నాయి!



ఎన్నికల బాండ్లతో పలు సమస్యలున్నాయని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. విరాళాలు పొందేందుకు పార్టీలన్నింటికీ అవి సమాన అవకాశం కల్పించకపోతే వివక్షే అవుతుందని అభిప్రాయపడింది. ఈ పథకంలో అస్పష్టత కూడా దాగుందని పేర్కొంది.
వివరాలు 6లో ▸



..మన పొత్తయితే.. పక్కానే కదా!

ఉద్యోగాలు వచ్చేశాయ్!

ఈ నెలలో వరుసగా 23 నోటిఫికేషన్లకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు

900 గ్రూప్-2 పోస్టులతోపాటు 100 గ్రూప్-1 ఖాళీలు భర్తీ

- వందల సంఖ్యలో డిగ్రీ లెక్చరర్ల పోస్టుల భర్తీకి సన్నద్ధం
- డిసెంబర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల పరీక్షల నిర్వహణ
- పూర్తి పారదర్శకంగా పరీక్షల ప్రక్రియ.. నోటిఫికేషన్లపై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు
- ఏపీపీఎస్సీ చైర్మన్ సవాంగ్





సాక్షి, అమరావతి: ప్రభుత్వ శాఖల్లో పలు పోస్టుల భర్తీకి ఈ నెలలో వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ వెల్లడించారు. వీటిల్లో 900 వరకు గ్రూప్-2 పోస్టులుండగా వందకుపైగా గ్రూప్-1 పోస్టులున్నాయి. డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ లెక్చరర్ల పోస్టులతో కలిపి మొత్తం 23 నోటిఫికేషన్లను విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడిన యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి డిసెంబర్‌లో సర్వీస్ కమిషన్ ద్వారా పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గతేడాది ఎలాంటి వివాదాలకు తావు లేకుండా గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ చేసి 11 నెలల వ్యవధిలో పారదర్శకంగా ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. ఏటా నియామకాలను కూడా అతి తక్కువ సమయంలోనే పూర్తి చేశామన్నారు. గత నాలుగేళ్లల్లో న్యాయపరమైన పలు వివాదాలను అధిగమించి సంస్కరణలు తీసుకొచ్చినట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ తెలిపారు. గ్రూప్–1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, సమర్థంగా ఎంపిక, హేతుబద్ధంగా అభ్యర్థుల వాస్తవిక నైపుణ్యాలను అంచనా వేసేందుకు కొత్త విధానాన్ని రూపొందించినట్లు వివరించారు. ఇందుకోసం దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థలైన ఐఐటీ, హెచ్‌సీయూతో పాటు రాష్ట్రంలోని
మిగతా 10వ పేజీలో ▶

93 శాతం శిబిరాలు పూర్తి

తుది దశకు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- మిగిలిన శిబిరాలు 15వ తేదీ లోగా పూర్తి
- ఐదు జిల్లాల్లో ఇప్పటికే వంద శాతం నిర్వహణ
- 520 మందికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స
- ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయిన వారిపైనా ప్రత్యేక శ్రద్ధ



తిరుపతి తాతయ్యగుంటలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న స్థానికులు

సాక్షి, అమరావతి: వైద్యాన్ని పేదలకు చేరువలోకి తీసుకువచ్చి, ప్రజలందరి ఆరోగ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతంగా కొనసాగుతోంది. సెప్టెంబర్ 30వ తేదీన ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది మొదలు ప్రజలు పెద్దఎత్తున శిబిరాలకు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం అందించడంతో పాటు.. ఉచితంగా మందులిస్తుండటంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో
మిగతా 14వ పేజీలో ▶

ఒకటో తేదీనే అవ్వాతాతల చేతికి

రూ.1,359.35 కోట్లు

తంఛన్‌గా ఒకటో తేదీనే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పింఛన్ డబ్బులు పంపిణీ చేసింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి 49,32,936 మందికి రూ.1,359.35 కోట్ల పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు.

10లో



గుంటూరు బాలాజీనగర్‌లో సైదానీకి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ అనూష

ఫైబర్‌నెట్ కేసులో వేగం పెంచిన సీఐడీ

చంద్రబాబు సన్నిహితుల స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు నిర్ణయం

- ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలని ప్రతిపాదన
- సీఐడీ ప్రతిపాదనకు హోంశాఖ ఆమోదం
- అనుమతి కోసం ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్న సీఐడీ

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు దర్యాప్తులో సీఐడీ వేగం పెంచింది. నిబంధనలకు విరుద్ధంగా టెరాసాఫ్ట్ కంపెనీకి ఫైబర్ నెట్ టెండర్లను కట్టబెట్టిన ఆ కేసులో తదుపరి చర్యలకు ఉపక్రమించింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సన్నిహితుడు వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీతోపాటు ఈ కేసులో కీలకపాత్ర పోషించిన చంద్రబాబు సన్నిహితుల ఆస్తులను అటాచ్ చేయాలని
మిగతా 3వ పేజీలో ▶



బాధితులకు సత్వర భరోసా

విజయనగరం రైలు ప్రమాద బాధితులకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. రైల్వే శాఖ ప్రకటించిన నష్ట పరిహారంతో సంబంధం లేకుండా సీఎం మానవతా దృక్పథంతో ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేశారు. 13 మంది మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, క్షతగాత్రులకు తీవ్రతను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల చెక్కులను అందించారు.

సాగు నీటిలో నవచరిత్ర



నేడు విశాఖలో ప్రతిష్టాత్మక ఐసీఐడీ సదస్సు ఆరంభం

కేంద్ర మంత్రి షెకావత్‌తో కలసి ప్రారంభించనున్న సీఎం జగన్

- ర్యాడిసన్ బ్లూ రిసార్ట్స్ వేదికగా దేశంలో 57 ఏళ్ల తరువాత ప్రతిష్టాత్మక సదస్సు.. దేశ విదేశాల నుంచి నగరానికి చేరుకున్న ప్రతినిధులు
- 5న తాటిపూడి రిజర్వాయర్, ఆయకట్టు నీటి సరఫరా పరిశీలన
- నీటి ఎద్దడిని అధిగమించడం, అధిక దిగుబడులే సదస్సు ప్రధాన అజెండా
- ఏటా కోటి ఎకరాలకుపైగా నీటిని అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సుస్థిర సాగు, ఆహార భద్రతే లక్ష్యంగా అన్నదాతకు దన్నుగా అడుగులు

సాక్షి, అమరావతి: సాగునీటి ఎద్దడిని అధిగమించి మానవాళికి ఆహార భద్రత చేకూర్చడమే అజెండాగా విశాఖ వేదికగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక ఐసీఐడీ (ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్) 25వ సదస్సును జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. ఐసీఐడీ చైర్మన్ డాక్టర్ రగబ్ అధ్యక్షతన ఈ నెల 8వతేదీ వరకు జరిగే ఈ సదస్సులో సాగునీటి కోసం ప్రత్యామ్నాయ జలవనరుల వినియోగం, తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగు, అధిక దిగుబడులను అందించే వ్యవసాయ సాంకేతిక విధానాలపై ప్రధానంగా చర్చించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా 82 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు దీనికి హాజరు కానుండగా
మిగతా 10వ పేజీలో ▶



గాజా రక్తసిక్తం

6లో

ఇజ్రాయెల్ సైన్యం చేస్తున్న భీకర దాడులతో గాజా రక్తసిక్తంగా మారుతోంది. హమాస్ మిలిటెంట్లతో పాటు వందలాది మంది సాధారణ ప్రజలు కూడా మృత్యువాత పడుతున్నారు. జబాలియాలో సాధారణ నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన హమాస్ కమాండ్ సెంటర్‌ను, మిలిటెంట్ల సొరంగాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

వైఎస్సార్ అవార్డు గ్రహీతలతో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎం మాతృమూర్తి వైఎస్ విజయమ్మ



వైద్యరంగం



వైద్య రంగంలో వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకుంటున్న ఇండ్ల రామసుబ్బారెడ్డి



డాక్టర్ ఈసీ వినయ్‌కుమార్

తెలుగు భాష



బేతవోలు రామబ్రహ్మం



నామిని సుబ్రహ్మణ్యం నాయుడు



అట్టాడ అప్పలనాయుడు



ఖదీర్ బాబు



మహెజబీన్

సామాజిక సేవ



బెజవాడ విల్సన్



నిర్మల హృదయ భవన్ (ప్రతినిధి)



డాక్టర్ జి. సమరం



శ్యామ్ మోహన్

వ్యవసాయం



పురస్కారాన్ని అందుకుంటున్న ఎస్టీ మహిళా రైతు పాంగి వినీత



వైవీ మల్లారెడ్డి

కళలు - సంస్కృతి



ఎడ్ల గోపాలరావు



తలిశెట్టి మోహన్



కోట సచ్చిదానంద శాస్త్రి



కోన సన్యాసి



ఉప్పాడ హ్యాండ్‌లూమ్ వీవర్స్ సొసైటీ (ప్రతినిధి)



ఎస్వీ రామారావు



సూర్యారావు (రావు బాల సరస్వతి తరఫున)



తల్లావఝుల శివాజీ



చిగిచెర్ల కృష్ణారెడ్డి



కలీషాబీ - మహబూబ్ సుభానీ దంపతులు

అసామాన్యులకు సత్కారం

క్రీడలు



పి.గోపిచంద్ తరఫున ఆయన సతీమణి లక్ష్మి

మీడియా



గోవిందరాజు చక్రధర్



హన్మంతరెడ్డి (హెచ్.ఆర్.కే)

వేడుకగా వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు-2023 ప్రదానోత్సవం

ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, విశిష్ట అతిథిగా వైఎస్ విజయమ్మ

- 23 మందికి లైఫ్ టైం అచీవ్‌మెంట్, నలుగురికి అచీవ్‌మెంట్ పురస్కారాలు
- వరుసగా మూడో ఏడాది 7 రంగాల్లో 27 మందికి ప్రదానం
- గొప్ప దార్శనికుడు డాక్టర్ వైఎస్సార్: గవర్నర్
- వైఎస్సార్ ప్రవేశ పెట్టిన అనేక పథకాలు దేశానికే ఆదర్శం
- సమాజాన్ని ప్రభావితం చేస్తున్న అసామాన్యులకు ఇస్తున్న అవార్డులివి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: దివంగత సీఎం వైఎస్సార్ దేశ చరిత్రలో చెరగని ముద్ర వేశారని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఆయన వేసిన బాటను ఎన్నో రాష్ట్రాలు అనుసరించాయన్నారు. ఇంత గొప్ప దార్శని కుడి పేరిట అవార్డులు ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన తొలుత రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు-వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు-2023 ప్రదానోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విజయవాడలో వేడుకగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా గవర్నర్, విశిష్ట అతిథిగా వైఎస్ విజయమ్మ, సీఎం జగన్



పాల్గొన్నారు. వ్యవసాయం, కళలు-సంస్కృతి, సాహిత్యం, క్రీడలు, వైద్యం, మీడియా, సామాజిక సేవ రంగాలలో విశిష్ట సేవలు అందించిన 27 మంది ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. వీరిలో 23 మందిని లైఫ్ టైం అచీవ్‌మెంట్, నలుగురిని అచీవ్‌మెంట్ పురస్కారాలతో సత్కరించారు. గవర్నర్ మాట్లాడుతూ.. వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డ్స్-వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డ్స్‌ను తన చేతుల మీదుగా అందించడం ఆనందాన్నిస్తోందన్నారు. దివంగత వైఎస్సార్ తన సంక్షేమ పథకాల ద్వారా తెలుగు ప్రజల హృదయాలను గెలుచుకున్నారని, ఆయన ప్రవేశపెట్టిన అనేక పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఉమ్మడి ఏపీలో పేదలకు 78 లక్షల ఇళ్లను కట్టించారని, ఆయన ప్రారంభించిన 108 అంబులెన్సు సేవలను దేశంలో 15 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయడం గొప్ప విషయమన్నారు. రైతాంగాన్ని వ్యవసాయ సంక్షోభం నుంచి కాపాడేందుకు 30 భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, 18 మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం కోసం జలయజ్ఞం ప్రారంభించిన ఘనత ఆయనదేనన్నారు. అదే బాటలో సీఎం జగన్ సాగుతున్నారన్నారని చెప్పారు.

ఆర్థిక, రాజకీయ రంగాల్లోనూ ఏపీ అభివృద్ధి

ఏపీ మూడు ప్రధాన రంగాలలో గణనీయమైన వృద్ధిని సాధించిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగాల్లో అద్భుతమైన పని తీరుతో 2022-23 సంవత్సరానికి 16.22% వృద్ధి రేటుతో ఏపీ గొప్ప పురోగతి సాధించిందన్నారు. 2021-22లో తలసరి ఆదాయం 14.02%తో ఆకట్టుకునే వృద్ధి రేటు నమోదు చేసిందని, సంవత్సరానికి జీఎస్‌డీపీ వృద్ధి రేటు 11.43%గా ఉందన్నారు. ఇది అన్ని రాష్ట్రాలతో పోలిస్తే అత్యధికం అని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఏపీలో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తూ, పరిపాలనను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లడంలో విజయం సాధించాయని కితాబిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆర్థిక, సామాజిక శ్రేయస్సు, ప్రగతి కోసం రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాల కింద వివిధ ప్రధాన సంక్షేమ కార్యక్రమాలకు రూ.2.38 లక్షల కోట్లు వెచ్చించడం గమనార్హం అన్నారు. నవరత్నాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సామాజిక న్యాయం జరిగిందని, 56% రాజకీయ పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందించడం గొప్ప విషయమన్నారు. నామినేటెట్ పోస్టుల్లోనూ సగానికి పైగా ఈ సామాజిక వర్గాల వారికి కేటాయించడం ఏపీలోనే చూస్తున్నామన్నారు. 2022లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రం 7వ స్థానంలో నిలిచి జాతీయ స్థాయిలో మంచి ప్రగతి సాధించిందని చెప్పారు. మార్చిలో విశాఖలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో ఏపీ రూ.13.42 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలను సాధించిందని, తద్వారా ఈ ఏడాది 16 కీలక అభివృద్ధి రంగాలలో 6 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించే అవకాశం ఉందన్నారు. దేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌లో ఏపీ స్థిరంగా ఒకటో స్థానంలో కొనసాగుతోందని చెప్పారు. 26 జిల్లాలు, 76 రెవెన్యూ డివిజన్లు, 108 పోలీసు డివిజన్లు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా పరిపాలనను వికేంద్రీకరించారన్నారు.

వైఎస్సార్ తన సంక్షేమ పథకాల ద్వారా తెలుగు ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. అనేక పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు 78 లక్షల ఇళ్లు, 108 అంబులెన్స్, కోటి ఎకరాలకు సాగు నీరు, వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి కాపాడటం, ప్రధానంగా జలయజ్ఞం ద్వారా వైఎస్సార్ అందరి హృదయాల్లో నిలిచి పోయారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ కూడా అదే బాటలో కొనసాగుతున్నారు.

- అబ్దుల్ నజీర్, రాష్ట్ర గవర్నర్

ఈ అవార్డులు అందుకుంటున్నవారంతా తమ తమ రంగాల్లో వారి జీవితాన్ని అర్పించారు. మన వారసత్వాన్ని తమ భుజాల మీద మోస్తున్నారు. వీరంతా మన జాతి సంపద. ఈ రోజు సమాజం ఇచ్చిన గుర్తింపు ఆధారంగా ప్రదానం చేస్తున్న ఈ అత్యున్నత అవార్డుల్లో చరిత్రలో కనీ వినీ ఎరుగని విధంగా ఈ మూడేళ్లలో సామాజిక న్యాయం సంపూర్ణంగా వర్ధిల్లింది. ఈ అవార్డులు అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక అభినందనలు, శుభాకాంక్షలు.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

పురస్కార గ్రహీతలు మన సంపద: సీఎం జగన్

సీఎం జగన్ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఏపీ అవతరించి నేటికి 67 సంవత్సరాలైందని, వరుసగా మూడో ఏడాది ఈ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పలు రంగాల్లో రాణిస్తున్న మహనీయులను గౌరవిస్తూ వైఎస్సార్ అవార్డులతో మూడేళ్లుగా సత్కరించుకునే సంప్రదాయం పాటిస్తున్నామని తెలిపారు. మన సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తూ వివిధ రంగాల్లో ఆకాశమంత ఎదిగినా సామాన్యులుగానే ఒదిగి ఉన్న అసామాన్యులకు ఇస్తున్న అవార్డులని తెలిపారు. ఈ ఏడాది 27 మందిని వైఎస్సార్ అవార్డులతో సత్కరిస్తున్నామని, 23 మందికి లైఫ్ టైం అచీవ్‌మెంట్, నలుగురికి అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేస్తున్నామన్నారు. 'తెలుగుదనానికి, తెలుగు మాటకు, తెలుగువాడి గుండె ధైర్యానికి మన పల్లెలు, మన పేదలు, మన రైతుల మీద మమకారానికి, మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు రూపం డాక్టర్ వైఎస్సార్. ఆ మహనీయుని పేరిట ఏటా ప్రభుత్వం అత్యున్నత అవార్డులు ప్రదానం చేస్తోంది. వైఎస్సార్ హయాంలో వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం.. ఇలా ఏ రంగం తీసుకున్నా అంతకు ముందున్న చరిత్రగతిని మారుస్తూ ఎన్నో ముందడుగులు పడిన విషయం చూశాం. మన వ్యవసాయం, చేనేత, తప్పెట గుళ్లు, జానపదం, రంగస్థలంలో రాణిస్తున్న వారికి, అభ్యుదయ.. హేతువాదం, సాటి మనుషులకు విశిష్ట సేవలందిస్తున్న గొప్ప వ్యక్తులకు ఈ ఏడాది అవార్డుల్లో చోటు దక్కింది' అని చెప్పారు. వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు కింద రూ.10 లక్షలు, మెమెంటో, ప్రశంసా పత్రం.. వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు కింద రూ.5 లక్షలు, మెమెంటో, ప్రశంసా పత్రమిచ్చారు. పుల్లెల గోపీచంద్ తరఫున ఆయన సతీమణి లక్ష్మి..రావు బాలసరస్వతి తరఫున ఆమె కుమారుడు అవార్డులు అందుకున్నారు. మంత్రులు, సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, అవార్డు కమిటీ సభ్యులు సజ్జల, జీవీడీ కృష్ణమోహన్, దేవులపల్లి అమర్, ముత్యాలరాజు, అరుణ్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలసుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ అవార్డు గ్రహీతల నేపథ్యం

1. పాంగి వినీత, మహిళా రైతు, అల్లూరి సీతారామరాజు జిల్లా (వైఎస్సార్ అచీవ్‌మెంట్)

సేంద్రీయ విధానాలను పాటిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. రైతు సాధికార సంస్థ సహాయంతో కషాయాల తయారీ.. రైతులకు పంపిణీ చేయడంతో పాటు పంట మార్పిడి విధానాన్ని కచ్చితంగా పాటిస్తూ ఏడాది పొడవునా వ్యవసాయ ఉత్పత్తులు సాగు చేస్తున్నారు. రైతులకు సేంద్రీయ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు.

2. డాక్టర్ వై.వి.మల్లారెడ్డి, అనంతపురం (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

ప్రముఖ సామాజిక కార్యకర్త ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ)లో 42 ఏళ్లగా సేవలు అందిస్తున్నారు. 15 ఏళ్లగా అసియన్ ఫ్రాటెర్నా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. అనంతపురం జిల్లాలో 235 గ్రామాల పరిధిలో 60 వేల మందికి పైగా రైతులు, భూమి లేని వారు, ఇతర వర్గాలతో కలిసి వ్యవసాయం చేస్తున్నారు. జీవావరణం, పర్యావరణం వంటి రంగాల్లో సేవలు అందిస్తున్నారు.

3. యడ్ల గోపాలరావు, రంగస్థల కళాకారుడు, శ్రీకాకుళం (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

చిన్ననాటి నుంచే కళలపై మక్కువ ఉన్న ఈయన నక్షత్రక, శ్రీకృష్ణ, శ్రీరాముడి పాత్రలకు జీవం పోశారు. 14 ఏళ్ల వయసులో సాంఘిక నాటకాల ద్వారా అరంగేట్రం చేసి 5 దశాబ్దాలుగా సాంఘిక, పౌరాణిక పాత్రల ద్వారా వేలాది ప్రదర్శనలిచ్చారు.

4. తలిశెట్టి మోహన్, కలంకారీ కళాకారుడు, తిరుపతి (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

1974 నుంచి కలంకారీ కళకు విశేష సేవలు అందిస్తున్నారు. సహజ రంగులతో అద్దకం, ఫ్యాబ్రిక్ తయారీలో నేటి కళాకారులకు శిక్షణ ఇస్తున్నారు. 1990లో కేంద్ర టెక్స్ టైల్స్ మంత్రిత్వ శాఖ ద్వారా నేషనల్ మెరిట్ అవార్డు అందుకున్నారు.

5. కోట సచ్చిదానంద శాస్త్రి, హరికథ, బాపట్ల (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

ప్రసిద్ధ హరికథా విద్వాంసుడు. ఆదిభట్ల నారాయణ దాసు ప్రియశిష్యుడు. ఈయన హరికథ వింటుంటే.. సినిమా చూస్తున్నట్లు కళ్లకు కట్టినట్లు ఉంటుందని పేరుగడించారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో 1500కు పైగా హరికథా ప్రదర్శనలిచ్చారు. భారత ప్రభుత్వం 2023 సంవత్సరానికి పద్మశ్రీ పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది.

6. కోన సన్యాసి, తప్పెటగుళ్ళు, శ్రీకాకుళం (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

ఉత్తరాంధ్రలో తప్పెటగుళ్ల సన్యాసిగా పేరుపొందారు. తెలుగు జానపదాలకు తప్పెటగుళ్ల పాట, ఆటతో దేశవ్యాప్తంగా కీర్తి తెచ్చారు. ఈ కళకు జీవం పోస్తున్నారు. తన ఇద్దరు కుమారులకు తప్పెటగుళ్ల కళను నేర్పించారు.

7. ఉప్పాడ హ్యాండ్‌లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ, కాకినాడ (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

1938లో తన కార్యకలాపాలను ప్రారంభించిన ఉప్పాడ హ్యాండ్‌లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీలో 515 మంది సభ్యులున్నారు. 1986లో ఈ సొసైటీ రాష్ట్రపతి అవార్డు అందుకుంది. ఉప్పాడ జమ్దానీ పట్టు చీర 1999లో భౌగోళిక గుర్తింపు పొందింది.

8. ఎస్వీ రామారావు, అంతర్జాతీయ చిత్రకారుడు, కృష్ణా (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

ప్రముఖ కళాకారుడు, కవి, విద్యావేత్త, రచయిత. సమకాలీన ప్రపంచ కళాత్మక సంప్రదాయానికి మరింత వన్నె తెచ్చారు. తూర్పు- పశ్చిమ కళలకు వారధిగా వ్యవహరించి ప్రశంసలు అందుకున్నారు.

9. రావు బాలసరస్వతి, తొలితరం నేపథ్య గాయని, నెల్లూరు (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

ఈమె తొలితరం తెలుగు సినీ నటి, నేపథ్యగాయని. ఆరో ఏటనే గాత్ర కచేరి ప్రారంభించిన బాల సరస్వతి లలిత సంగీత సామ్రాజ్ఞిగా ప్రసిదిగాంచారు. ఆకాశవాణి సంగీత కార్యక్రమాలలో ఈమె కంఠం తెలుగు వారికి సుపరిచితం.

10. తల్లావఝుల శివాజీ, చిత్రకారుడు, రచయిత, పాత్రికేయుడు, ప్రకాశం (వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్)

తండ్రి శివశంకర శాస్త్రి నుంచి కళాసాహిత్యం అలవడింది. బొమ్మలు గీయడం చిన్నప్పటి నుంచే స్వయం కృషితో నేర్చుకున్నారు. పాత్రికేయుడిగా ఉద్యోగ విరమణ అనంతరం ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. ప్రకృతి, ఆ జీవన విధానపు స్వచ్ఛత, సరళత, నిరాడంబరత, ఇతిహాసాలు ఈయన చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తాయి.

11. డాక్టర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి, జానపద కళలు, అనంతపురం (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో రికార్డు స్థాయిలో 35 పీహెచ్‌డీ డిగ్రీలు, 66 ఎంఫిల్ డిగ్రీలను ప్రదానం చేశారు. జానపద కళలను పర్యవేక్షించి మార్గదర్శకత్వం వహించిన ఏకైక ప్రొఫెసర్‌గా దేశంలోనే ఘనత సాధించారు. తెలుగు రాష్ట్రాల్లో జానపద ప్రదర్శన కళలలో తొలిసారిగా పీహెచ్‌డీ అందించడంలో ప్రత్యేకతను సాధించారు. జానపద కళలు, జానపద సంస్కృతిపై పుస్తకాలను రచించారు.

12. కలీషాబీ మహబూబ్- షేక్ మహబూబ్ సుభానీ దంపతులు, నాదస్వరం, ప్రకాశం (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

ప్రకాశం జిల్లా పెద కొత్తపల్లికి చెందిన షేక్ మహబూబ్ సుభానీ సంగీత విద్వాంసుల కుటుంబానికి చెందినవారు. కలీసాహెబీ మహబూబ్ పూర్వీకులూ నాదస్వరం విద్వాంసులు కావడం విశేషం. ఈ దంపతులు భారత్‌తో పాటు అబుదాబి, జపాన్, మలేషియా, తదితర దేశాల్లో నాదస్వర కచేరీలు ఇచ్చారు.

13. ప్రొఫెసర్ బేతవోలు రామబ్రహ్మం, పశ్చిమ గోదావరి (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

సంస్కృతాంధ్ర పండితుడు, పద్య కవి, అవధాని, కథకుడు, అనువాదకుడు, అధ్యాపకులు. కొవ్వూరు సంస్కృత కళాశాలలో భాషా ప్రవీణ చేసి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు పూర్తి చేశారు. 'దేవీ భాగవతం' వచన రచన ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు.

14. ఎండీ ఖదీర్‌బాబు, రచయిత, నెల్లూరు (వైఎస్సార్ అచీవ్‌మెంట్)

మహమ్మద్ ఖదీర్‌బాబు ప్రసిద్ధ తెలుగు కథా రచయిత, నూతన తరం తెలుగు కథకులలో ప్రత్యేకమైన స్థానం. ప్రపంచంలోని పలు భాషల సాహిత్యాన్ని ఇంగ్లిష్‌లో అనువదించేందుకు ఏటా బ్రిటీష్ కౌన్సిల్ అందించే 'చార్లెస్ వాలెస్ ఫెలోషిప్'కు మహమ్మద్ కథలు ఎంపికయ్యాయి. తెలుగు కథలకు ఈ ఫెలోషిప్ లభించడం ఇదే తొలిసారి.

15. మహజబీన్, నెల్లూరు (వైఎస్సార్ అచీవ్‌మెంట్)

మహజబీన్ న్యాయవాద విద్యను అభ్యసించారు. తన కవితా సంకలనం 'ఆకు రాలు కాలం' 1997లో ప్రచురితమైంది. ఈమె తన కవిత్వంలో లింగ న్యాయం, శాంతి, పర్యావరణం, మహిళలు, పిల్లల హక్కులపై దృష్టి పెట్టడం విశేషం.

16. నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

నామిని సుబ్రమణ్యం నాయుడు చిత్తూరు జిల్లాకు చెందిన ఒక సుప్రసిద్ధ రచయిత. 1980, 1990ల్లో ఈయన కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. సాధారణ రాయలసీమ వాడుక భాషలో పిల్లలు తేలికగా అర్థం చేసుకునేలా పుస్తకాలు రచించారు. ఆయన జీవితానుభవాలనే కథలుగా రచించి పాఠకుల మన్ననలు పొందారు.

17. అట్టాడ అప్పలనాయుడు, శ్రీకాకుళం (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

అట్టాడ అప్పలనాయుడు ఉత్తరాంధ్రకు చెందిన ప్రసిద్ధ కథ, నవలా రచయిత. శ్రీకాకుళ సాయుధ పోరాటం వైపు ఆకర్షితులై జననాట్య మండలిలో పని చేశారు. పార్వతీపురంలో ఇంటర్ చదివి జంఝావతి రిజర్వాయర్ నిర్మాణంలో కూలీగా పని చేశారు. తన మిత్రులతో కలిసి శ్రీకాకుళ సాహితి అనే సంస్థను స్థాపించారు.

18. పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్, గుంటూరు (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

గోపీచంద్ ప్రస్తుతం భారత జాతీయ బ్యాడ్మింటన్ జట్టుకు చీఫ్ నేషనల్ కోచ్‌గా ఉన్నారు. ఈయన 2001లో ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు.

19. కరణం మల్లీశ్వరి, వెయిట్ లిఫ్టింగ్, శ్రీకాకుళం (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

శ్రీకాకుళానికి చెందిన కరణం మల్లేశ్వరి 2000లో జరిగిన సిడ్నీ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించారు. 2022లో ఈమెకు బీబీసీ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు.

20. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, మానసిక వైద్య నిపుణులు, (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

వైఎస్సార్ జిల్లాలోని ప్రొద్దుటూరుకి చెందిన ఈయన 40 ఏళ్లుగా విజయవాడలో కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. 50 పడకల మానసిక వ్యాధుల ఆసుపత్రి 'ఇండ్లాస్' డైరెక్టర్‌గా గుర్తింపు పొందారు.

21. డాక్టర్ ఈసీ వినయ్ కుమార్, స్వచ్ఛంద సేవా సంస్థ, డాక్టర్, వైఎస్సార్ జిల్లా (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ, బీఏహెచ్‌ఏ సర్వే, గురకకు శస్త్రచికిత్స, మైక్రో ఇయర్ సర్జరీలలో ప్రసిద్ధుడైన ఈఎన్‌టీ స్పెషలిస్ట్. హైదరాబాద్ అపోలో హెల్త్ సిటీతో అనుబంధం ఉన్న వినయ్ కుమార్ ట్రస్ట్‌తో పాటు వినికిడి లోపం ఉన్న వారికి సహాయం చేసేందుకు 'సహీ' సొసైటీని ప్రారంభించారు.

22. గోవిందరాజు చక్రధర్, సీనియర్ జర్నలిస్ట్, కృష్ణా జిల్లా (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

జర్నలిస్టుగా, రచయితగా, ప్రచురణకర్తగా గోవిందరాజు చక్రధర్‌ది సుదీర్ఘ ప్రస్థానం. మీడియా వ్యాఖ్యాత, అనువాదకుడు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో కంటెంట్ సృష్టికర్త.

23. హెచ్‌ఆర్కే), ఆధునిక, సంస్కరణవాద కవిత్వం (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

ఆధునిక, సంస్కరణవాద కవిత్వంలో హనుమంతరెడ్డి దిట్ట. హెచ్‌ఆర్కే అనేది ఈయన పేరుకు సంక్షిప్త రూపం. కర్నూలు జిల్లాలోని 'గని'లో 1951లో పేద రైతు కుటుంబంలో జన్మించారు.

24. బెజవాడ విల్సన్, ఎన్టీఆర్ జిల్లా (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

సామాజిక నాయకుడు. భారతీయ మానవ హక్కుల సంస్థ సఫాయి కర్మచారి ఆందోళన్ వ్యవస్థాపకులలో ఒకరు. 2016లో ఈయన రామన్ మెగసెసే అవార్డు అందుకున్నారు.

25. కుసుమ శ్యాంమోహన్ రావు, డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా (వైఎస్సార్ అచీవ్‌మెంట్)

దక్షిణాది రాష్ట్రాల్లో గిరిజన, దళిత గ్రామాల్లోని సమస్యలను, వారి విజయాలను తెలియజేసేలా యూట్యూబ్ ఛానెల్ స్థాపించారు. తన ఛానెల్ ద్వారా అవగాహన కార్యక్రమాలు, ప్రసంగాలు ప్రసారం చేస్తున్నారు.

26. నిర్మల హృదయ భవన్, ఎన్టీఆర్ జిల్లా (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

మదర్ థెరిసా సోదరీమణులు నిర్వహిస్తున్న మిషనరీస్ ఆఫ్ ఛారిటీ నిర్మల హృదయ్ భవన్‌ను 1973లో మదర్ థెరిసా ప్రారంభించారు. కులం, మతంతో సంబంధం లేకుండా పేదలను ఆదుకునే లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థ. వీధుల్లో ఒంటరిగా ఉన్న, అనారోగ్యంతో ఉన్న, ఎవరూ పట్టించుకోని వారిని, పిల్లల ఆదరణకు నోచుకోని వారిని ఆదుకుని రక్షణ కల్పిస్తోంది.

27. డాక్టర్ జి.సమరం, ఎన్టీఆర్ జిల్లా (వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

ప్రముఖ వైద్యుడు, సంఘ సేవకుడు, రచయిత. 1970లో విజయవాడలో వైద్యునిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 1996-97లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు.

క్లుప్తంగా...

286మందికి సేవా పతకాలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక–ప్రకృతి విపత్తుల స్పందన విభాగం, విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, ఏపీఎస్పీ విభాగాలకు చెందిన 286మందికి ప్రభుత్వం వివిధ సేవా పతకాలను ప్రకటించింది. హోమ్ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విభాగాలవారీగా ప్రకటించిన సేవా పతకాల వివరాలు ఇలా ఉన్నాయి..

- **పోలీసు శాఖ:** మహోన్నత సేవా పతకాలు: ముగ్గురికి. ఉత్తమ సేవా పతకాలు: 34మందికి. కఠిన సేవా పతకాలు: 30మందికి. సేవా పతకాలు: 161 మందికి.
- **అగ్నిమాపక–ప్రకృతి విపత్తుల స్పందన విభాగం:** ఉత్తమ సేవా పతకాలు: నలుగురికి. సేవా పతకాలు: 25మందికి
- **విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం:** మహోన్నత సేవా పతకాలు: ఒకరికి. ఉత్తమ సేవా పతకం: ఒకరికి. సేవా పతకాలు: 10మందికి.
- **ఏపీఎస్పీ:** ఉత్తమ సేవా పతకాలు: నలుగురికి. సేవా పతకాలు: 13మందికి.

నేడు విజయవాడలో బుడగ జంగాల కృతజ్ఞత సభ

సాక్షి, అమరావతి: బేడ (బుడగ) జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చి సంబంధిత అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రానికి పంపినందుకు గాను సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ (బుడగ) జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 2న 'కృతజ్ఞత సభ' నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎలమర్తి మధు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ సభ ప్రారంభమవుతుందని అన్నారు. రాష్ట్రంలోని వేలాది బుడగ జంగాలు ఇందులో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు.

ఒంట్లో బాగోలేదని బెయిల్ తెచ్చుకుంటే సంబరాలెందుకు?


విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



ఆమదాలవలస రూరల్: ప్రజాధనాన్ని దోపిడీ చేసిన కేసులో నిందితుడిగా ఉన్న చంద్రబాబుకు కంటి ఆపరేషన్ కోసం కోర్టు బెయిల్ ఇస్తే టీడీపీ సంబరాలు ఎందుకు చేసుకుంటుందో ప్రజలు అర్థం చేసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలో బుధవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంట్లో, కంట్లో బాగోలేదని, చర్మ వ్యాధి వచ్చిందని కోర్టులో చెప్పి బెయిల్ తెచ్చుకున్న బాబుపై కేసు కొట్టేస్తే ఆనందపడాలిగానీ.. తాత్కాలిక బెయిల్ వస్తే ఆనందమెందుకని ప్రశ్నించారు. ప్రజలను ఆదుకునే మానవత్వం సీఎం వైఎస్ జగన్‌కు ఉందని, విజయనగరం జిల్లాలో రైల్వే ప్రమాద ఘటన తెలియగానే.. అదే రోజు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని మంత్రి బొత్స వివరించారు.

భువనేశ్వరీ.. నిజమే గెలవాలని కోరుకుంటున్నాం

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



తిరుపతి అర్బన్: 'అమ్మా భువనేశ్వరి.. ఎప్పుడూ నిజమే గెలవాలని నేనూ కోరుకుంటున్నాను.. అయితే మీరు నిజాలు తెలుసుకోవాలి' అంటూ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చెప్పారు. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'టీడీపీకి చంద్రబాబు ఏ విధంగా వెన్నుపోటు పొడిచి లాక్కున్నారో నువ్వే నిజం చెప్పాలి. మీ తండ్రి ఎన్టీఆర్‌కు మీ భర్త చంద్రబాబు వెన్నుపోటు పొడిచి.. సీఎం కావడం మోసం కాదా.. ఈ అంశంపై నిజమే గెలవాలి. అసెంబ్లీలో ఎన్టీఆర్ నిజాలు చెప్పడానికి అవకాశం లేకుండా ఆయనకు మైక్ ఇవ్వకుండా చంద్రబాబు స్పీకర్ యనమల రామకృష్ణుడును ప్రేరేపించారు. ఇందులోనూ నిజమే గెలవాలి. ఓటుకు కోట్లు కేసుకు సంబంధించి స్టీఫెన్‌కు రూ.50 లక్షలు రేవంత్‌రెడ్డి నుంచి ఇప్పించింది చంద్రబాబు కాదా? స్కిల్ స్కాంలో పేదోళ్ల డబ్బును మింగేసిన ఘనుడు చంద్రబాబు కాదా? చంద్రబాబు తరఫు లాయర్లు ఆయన అవినీతి చేయలేదని వాదించలేదన్న విషయం నిజం కాదా? ఇప్పుడు బాబుకు బెయిల్ వచ్చిందంటే ఆయన కంటి ఆపరేషన్ కోసమే. బెయిల్ ముగిసే సమయానికి చంద్రబాబు తనకు మరిన్ని వ్యాధులున్నాయని, తన బెయిల్ పొడిగించాలంటూ నాటకాలాడతారు. చంద్రబాబు ఏం అభివృద్ధి చేశారో.. ప్రజలకు ఏం చేశారో నిరూపించమనండి.. నేను రాజకీయాలు వదిలేస్తా' అంటూ నారాయణస్వామి సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ సి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లిన బాబు

సాక్షి, అమరావతి/గన్నవరం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయి కంటి ఆపరేషన్ కోసం మధ్యంతర బెయిల్‌పై విడుదలైన ప్రతిపక్ష నేత చంద్రబాబు బుధవారం హైదరాబాద్ వెళ్లారు. మంగళవారం సాయంత్రం జైలునుంచి విడుదలయ్యాక రాజమహేంద్రవరం నుంచి నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీగా ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి తిరుపతి వెళ్లాలనుకున్నా.. ఆ పర్యటన రద్దు చేసుకుని సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక విమానంలో బేగంపేట బయలుదేరి వెళ్లారు. ఎయిర్‌పోర్టులో ఆయనను టీడీపీ నేతలు కలిశారు.

'పీఎస్పీ' ప్రయోజనాలు కనిపించవా?

మార్కెట్‌లో యూనిట్ ధర రూ.8 నుంచి రూ.10.. ఈ మేరకు ప్రజలపై తగ్గనున్న విద్యుత్ చార్జీల భారం

- 1,350 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ప్రాజెక్టు ఉందనడంలో అర్థంలేదు
- అక్కడ ప్రస్తుతం ఉన్నది 240 మెగావాట్ల ప్రాజెక్టే
- 1,350 మెగావాట్ల పీఎస్పీకి అనుమతులు పొందిన ఏపీ జెన్‌కో
- ఇప్పుడు దేశ, విదేశాల్లో అందరి దృష్టీ పీఎస్పీలపైనే
- వాస్తవాలు వెల్లడించిన ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు (పీఎస్పీ)లకు ఇస్తున్న ప్రోత్సాహానికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయి. దీనిని తట్టుకోలేని పచ్చ పత్రిక ఈనాడు పీఎస్పీలపై విషం చిమ్మింది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు అనుసరిస్తున్న పీఎస్పీలు అనవసరమంటూ ఓ కట్టు కథ రాసింది. ఎగువ సీలేరులో ఉన్నది ఎన్ని మెగావాట్ల హైడల్ ప్రాజెక్టో కూడా అవగాహన లేని ఈనాడు పత్రిక.. దానిపై అసత్యాలు అల్లింది. రాష్ట్ర ప్రజలకు కోట్లలో ఆదా చేయడంతో పాటు డిమాండ్ ఎక్కువగా ఉండే సమయాల్లో విద్యుత్‌ను అందించే పీఎస్పీలపై 'జెన్‌కోకు గుదిబండగా.. ఎగువ సీలేరు పీఎస్పీ' శీర్షికతో బుధవారం 'రామోజీ' రాసిన కథనమంతా పచ్చి అబద్ధమని ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) స్పష్టం చేసింది. అదనంగా ఒక్క మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం లేకపోయినా ఎగువ సీలేరులో పీఎస్పీ ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణను ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు ఖండించారు. వాస్తవాలను వెల్లడించారు. ఆ వివరాలు..

అసలు 1350 మెగావాట్ల ప్రాజెక్టు లేనే లేదు

ఎగువ సీలేరులో ప్రస్తుతం 1,350 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల జల విద్యుత్ ప్రాజెక్టు ఉందనడంలో వాస్తవం లేదు. ఇక్కడ ప్రస్తుతం 240 మెగావాట్ల జల విద్యుత్ ప్రాజెక్టు మాత్రమే ఉంది. సీలేరు నది నుంచి 1.7 టీఎంసీల నీటి వినియోగం ద్వారా 1,350 మెగావాట్ల సామర్థ్యంతో పీఎస్పీ నిర్మాణానికి ఏపీ జెన్‌కో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సమర్పించి సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఆమోదంతో పాటు చట్టపరమైన అనుమతులు తీసుకుంది. ఒక్క సీలేరులోనే కాదు.. మిగతా ప్రాంతాల్లోనూ ఏపీజెన్‌కో పీఎస్పీలు ఏర్పాటు చేస్తోంది. ఎన్‌హెచ్‌పీసీ సంయుక్త భాగస్వామ్యంలో యాగంటి, కమలపాడు, అరవేటిపల్లి, దీనేపల్లి, గడికోటలో పీఎస్పీలు ఏర్పాటుకు డీపీఆర్ తయారవుతోంది.

అవసరానికి ఆదుకుంటుంది

డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు ధర తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో మిగులు విద్యుత్‌ను లేదా చౌక ధరకు కొనే విద్యుత్‌ను వినియోగించుకుని నీటిని పంప్ చేసి పీక్ డిమాండ్ సమయంలో ఆ నీటితో విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్నదే పీఎస్పీల లక్ష్యం. ఈ ఉద్దేశంతోనే దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు అనేక ప్రైవేటు సంస్థలూ పీఎస్పీలు నిర్మిస్తున్నాయి. ప్రపంచంలోని అనేక దేశాలు కూడా ఇవే ప్రాజెక్టులు చేపడుతున్నాయి. పీక్ సమయంలో పీఎస్పీ ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ వల్ల బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కరెంటు కొనాల్సిన అగత్యం తప్పుతుంది. రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరతో విద్యుత్ అందించొచ్చు.

యూనిట్ రూ.3 కే విద్యుత్

ఎగువ సీలేరులో 1,350 మెగావాట్ల పీఎస్పీ నిర్మాణం ద్వారా ఏటా సగటున 3,501 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలన్నది ఏపీ జెన్‌కో ప్రణాళిక. దీని ద్వారా గరిష్ట ఉత్పత్తి వ్యయం యూనిట్‌కు రూ.3 ఉంటుందని అంచనా. పీక్ డిమాండ్ సమయంలో ప్రస్తుతం మార్కెట్‌లో విద్యుత్ ధర యూనిట్ రూ.10 ఉంది. మార్కెట్‌లో యూనిట్ కనిష్ట ధర రూ.8 ఉంటుంది. అంటే పీఎస్పీ విద్యుత్ ధర కంటే మార్కెట్ కనిష్ట ధరే చాలా ఎక్కువ. ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను లాభాపేక్ష లేకుండా డిస్కంలకు సరఫరా చేస్తుంది. ఈ మేరకు రాష్ట్ర వినియోగదారులకు (ప్రజలకు) పెద్ద ఎత్తున ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.

ఎందుకీ ఊహాజనిత రాతలు రామోజీ?

ఈ పీఎస్పీ నిర్మాణ వ్యయం రూ.11,884 కోట్లు కాదు. రూ.11,154.39 కోట్లు మాత్రమే. నిర్మాణంలో జాప్యమైతే తీసుకున్న వడ్డీ, ఇతర ఖర్చులు కలిపి వ్యయం రూ.15 వేల కోట్లకు చేరుతుందని అంచనా వేసినట్టు 'ఈనాడు' పేర్కొంది. కానీ సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతోనే ఏపీ జెన్‌కో ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతోంది. నిర్మాణం ఆలస్యమైతే వ్యయం పెరుగుతుందనేది రామోజీ ఊహాజనిత కథనం మాత్రమే. సాంకేతికత పెరిగి బ్యాటరీ స్టోరేజి విధానం అందుబాటులోకి వస్తే పీఎస్పీలు భారమవుతాయని నిపుణులు చెబుతున్నారన్న వాదనలోనూ వాస్తవం లేదు. ప్రస్తుతానికి మన దేశంలో బ్యాటరీ స్టోరేజి విధానం కంటే పీఎస్పీనే ప్రయోజనకరంగా ఉంది. పీఎస్పీ జీవితకాలం 40 ఏళ్లు కాగా బ్యాటరీ స్టోరేజి సిస్టమ్ జీవిత కాలం పదేళ్లు మాత్రమే. పైగా బ్యాటరీ స్టోరేజి సిస్టమ్ ఏర్పాటు వ్యయం చాలా ఎక్కువ. ఈనాడు మాత్రం అదే తక్కువంటూ పచ్చి అబద్ధాలు రాసింది.

'పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్'ను మొట్టమొదటిసారి 1890 కాలంలో ఇటలీ, స్విట్జర్లాండ్‌లో వినియోగించారు. 1930లో యునైటెడ్ స్టేట్స్ (అమెరికా)లో కూడా వాడటం ప్రారంభించారు. ఇప్పుడివి ప్రపంచమంతా విస్తరించాయి. హైడ్రో పవర్ మార్కెట్ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్‌లోని మొత్తం యుటిలిటీ – స్కేల్ ఎనర్జీ స్టోరేజ్‌లో 93 శాతం వాటా పీఎస్పీలకు ఉంది. అమెరికాలో ప్రస్తుతం 43 ప్లాంట్లు ఉన్నాయి.

అంతర్జాతీయంగా ఇదే విధానం

పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లలో పగటిపూట సౌర ఫలకాల ద్వారా విద్యుత్ సరఫరా చేయవచ్చు. రాత్రి వేళ జలాశయం ద్వారా ఎగువ రిజర్వాయర్ నుంచి దిగువ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయడం వల్ల టర్బైన్ కదిలి విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. గాలి తక్కువగా ఉండి, సూర్యరశ్మి లేని పరిస్థితుల్లో కూడా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో, ఆర్థికంగా లాభదాయకంగా, పెద్ద ఎత్తున శక్తిని నిల్వ చేయడానికి పంప్డ్ స్టోరేజీ మాత్రమే సరైన మార్గం. ఈ పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు 82 శాతం సామర్థ్యంతో పని చేస్తాయి. నీటి వనరుల నిర్వహణ, వరద నియంత్రణ, అతి ఎక్కువ జీవితకాలం వీటి అదనపు ప్రయోజనాలు.

ఏపీ ముందు చూపు

సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర విద్యుత్ రంగంలో పలు సంస్కరణలు తెచ్చి, వాటిని ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నారు. వినూత్నమైన, అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో విద్యుత్ రంగాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రజలపైనా భారం పడకుండా చర్యలు చేపడుతున్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో విద్యుత్ కొరత రాకుండా పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులు సరైన మార్గమని ముందు చూపుతో నిర్ణయాలు తీసుకున్నారు. వేరియబుల్ రెన్యూవబుల్ ఎనర్జీ (వీఆర్ఈ)ని బ్యాలెన్స్ చేయడానికి, పీక్ పవర్ డిమాండ్‌ను చేరుకోవడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం పీఎస్పీలను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 32,400 మెగావాట్ల పీఎస్పీల ఏర్పాటుకు 29 సైట్‌ల కోసం టెక్నో కమర్షియల్ ఫీజిబిలిటీ రిపోర్ట్ (టీసీఎఫ్ఆర్)లను సిద్ధం చేసింది. రాష్ట్రంలో మొత్తం 37 ప్రాంతాల్లో 42,370 మెగావాట్ల సామర్థ్యం గల పీఎస్పీల నిర్మాణానికి స్థలాలను ప్రభుత్వం గుర్తించింది. పీఎస్పీల వల్ల గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ చార్జీలు, పన్నుల రూపంలో రాబడి వస్తుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధీ లభిస్తుంది.

బాబుకు అనారోగ్యం సాకు మాత్రమే

- తాత్కాలిక బెయిల్‌పై బయటకు వచ్చిన వెంటనే కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు
- రాజకీయ ర్యాలీ ప్రారంభించారు.. మీడియాతో మాట్లాడారు
- ఆయన ఇలా చేస్తారనే మేం అదనపు షరతులు కోరుతున్నాం
- ఆయన ఉల్లంఘనలను పెన్‌డ్రైవ్‌లో ఉంచాం పరిశీలించండి
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- చంద్రబాబు షరతులను ఉల్లంఘించలేదన్న ఆయన తరఫు న్యాయవాది
- 3న నిర్ణయం వెలువరిస్తానని చెప్పిన జస్టిస్ మల్లికార్జునరావు

సాక్షి, అమరావతి: కంటి శస్త్ర చికిత్స కోసం తాత్కాలిక బెయిల్ పొందిన మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హైకోర్టు విధించిన బెయిల్ షరతులను అప్పుడే ఉల్లంఘించడం మొదలుపెట్టారని సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. అనారోగ్యం సాకుతో బయటకు వచ్చిన చంద్రబాబు ఆ వెంటనే రాజకీయ ర్యాలీ ప్రారంభించారని, జైలు బయటే మీడియాతో కూడా మాట్లాడారని తెలిపారు. హైకోర్టు చంద్రబాబుకు పలు షరతులతో మంగళవారం తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. వీటికి అదనంగా మరిన్ని షరతులు విధించాలంటూ సీఐడీ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. చంద్రబాబు మీడియాతో మాట్లాడటం, ర్యాలీల్లో పాల్గొనడం, కేసు గురించి మాట్లాడటం, ఇంటర్వ్యూలు ఇవ్వడం వంటివి చేయడానికి వీల్లేదంటూ ఆదేశించింది. సీఐడీ అనుబంధ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు బుధవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసి కూడా చంద్రబాబు వాటికి విరుద్ధంగా వ్యవహరించారన్నారు. తాము అదనపు షరతులు విధించాలని ఎందుకు మొత్తుకుంటున్నామో దీనినిబట్టి అర్థం చేసుకోవాలని కోర్టును కోరారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ చంద్రబాబు చేపట్టిన కార్యక్రమాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను కోర్టుకు సమర్పించి, దానిని పరిశీలించాలని కోరారు. చంద్రబాబు కోర్టు షరతులకు లోబడి వ్యవహరిస్తున్నారో లేదో పర్యవేక్షించేందుకు ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారులను ఆయన వెంట ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆ అధికారులు చంద్రబాబు స్వేచ్ఛకు ఏ రకంగానూ భంగం కలగనివ్వబోరని, ఇది తాము ఇస్తున్న హామీ అని నివేదించారు. మధ్యంతర బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌లో కోర్టు ఎలాంటి షరతులు విధించినా వాటికి కట్టుబడి ఉంటామని చంద్రబాబు తెలిపారని సుధాకర్‌రెడ్డి గుర్తు చేశారు. ఈ సమయంలో న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు జోక్యం చేసుకుంటూ.. మీ వద్ద ఇంటెలిజెన్స్ ఉందిగా.. దాని సాయంతో చంద్రబాబుపై నిఘా పెట్టొచ్చుగా అని వ్యాఖ్యానించారు. నిఘా వేరు, ఓ వ్యక్తి వెంట వెళ్లడం వేరని, నిఘా అనేది వ్యక్తికి తెలియకుండా చేసేదని సుధాకర్‌రెడ్డి వివరించారు. అనంతరం చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. సీఐడీ కోరుతున్న అదనపు షరతులు దర్యాప్తు కోసం కాదని, ఇతర కారణాలున్నాయని అన్నారు. సీఐడీ కోరుతున్న షరతులు చంద్రబాబు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. దర్యాప్తు ప్రభావితం కాకుండా ఉండేందుకే బెయిల్ మంజూరు సమయంలో న్యాయస్థానాలు షరతులు విధిస్తాయన్నారు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చినా కోర్టు షరతులను ఉల్లంఘించలేదని, ర్యాలీలో పాల్గొనలేదన్నారు. ఆయనకు మద్దతు, సంఘీభావం తెలిపేందుకు ఆయన వద్దకే ప్రజలు వచ్చారన్నారు. న్యాయస్థానం షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దును కోరే స్వేచ్ఛ సీఐడీకి ఉందని, అందువల్ల సీఐడీ కోరుతున్న విధంగా షరతులు విధించాల్సిన అవసరం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు అదనపు షరతుల విషయంలో శుక్రవారం తన నిర్ణయాన్ని వెలువరిస్తానని తెలిపారు.

ఏఏజీ మీడియా సమావేశం తప్పెలా అవుతుంది?

- ఆయన మీడియా సమావేశం పెట్టకూడదని ఏదైనా చట్టంలో ఉందా?
- ఆయన మాట్లాడిన మాటలను తర్జుమా చేసి మా ముందుంచండి
- పిటిషనర్‌కు హైకోర్టు ధర్మాసనం ఆదేశం.. విచారణ 8కి వాయిదా
- జగన్ కోసం ఏమైనా చేస్తానని సుధాకర్‌రెడ్డి చెప్పారు...
- ఇది సర్వీసు నిబంధనలను ఉల్లంఘనే.. హైకోర్టుకు పిటిషనర్ తరఫు న్యాయవాది నివేదన



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేయడం తప్పెలా అవుతుందని హైకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఆయన మీడియా సమావేశం నిర్వహించకూడదని ఎలా చెబుతారని నిలదీసింది. ఏఏజీ మీడియా సమావేశం నిర్వహించకూడదని ఏదైనా చట్టంలో ఉందా అని కూడా ప్రశ్నించింది. ఉంటే ఆ నిబంధనలను తమ ముందుంచాలంది. మీడియా సమావేశం వివరాలు తెలుగులో ఉన్నాయని, వాటిని ఇంగ్లిష్‌లోకి అనువాదం చేసి తమ ముందుంచాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ఆ వివరాలను పరిశీలించిన తరువాత అదనపు ఏజీ మాట్లాడిన మాటలు సరైనవో కావో నిర్ణయిస్తామంది. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. స్కిల్ కుంభకోణం, ఇతర ఏ కేసుకు సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయకుండా, ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సీఐడీ చీఫ్ సంజయ్‌ని ఆదేశించాలని కోరుతూ ఏపీ యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది మార్తి గిరిబాబు వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం వివరాలను సుధాకర్‌రెడ్డి, సంజయ్ బహిర్గతం చేశారని తెలిపారు. ఢిల్లీ వెళ్లి మరీ మీడియాతో మాట్లాడారని, ప్రజా ధనాన్ని వృథా చేశారని అన్నారు. సుధాకర్‌రెడ్డి తాను జగన్ కోసమే ఉన్నానని, జగన్ కోసం ఏమైనా చేస్తానని ఆ సమావేశంలో చెప్పారని, ఇది సర్వీసు నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని తెలిపారు. వారు ప్రజా ధనంతోనే మీడియా సమావేశాలు నిర్వహించారనేందుకు ఆధారాలు ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగామని, అధికారులు ఇంకా ఇవ్వలేదని గిరిబాబు తెలిపారు.

ఫైబర్‌నెట్ కేసులో వేగం పెంచిన సీఐడీ

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించింది. టెరాసాఫ్ట్ కంపెనీ, చంద్రబాబు సన్నిహితులకు చెందిన ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనకు రాష్ట్ర హోంశాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అటాచ్ ఆస్తుల్లో గుంటూరులో ఇంటి స్థలం, విశాఖపట్నంలో ఓ ఫ్లాట్, హైదరాబాద్‌లోని నాలుగు ఫ్లాట్లు, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉన్నాయి. హోంశాఖ ఉత్తర్వుల నేపథ్యంలో ఆ స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని కోరుతూ సీఐడీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్‌ను దాఖలు చేయనుంది. కోర్టు అనుమతి అనంతరం ఆ ఆస్తుల అటాచ్‌మెంట్ ప్రక్రియను చేపడుతుంది. రూ. 330 కోట్లతో చేపట్టిన ఫైబర్‌నెట్ మొదటి దశ ప్రాజెక్ట్ కాంట్రాక్టును టెరాసాఫ్ట్ కంపెనీకి చంద్రబాబు అడ్డగోలుగా కట్టబెట్టిన విషయం తెలిసిందే. బ్లాక్ లిస్టులో ఉన్న ఆ కంపెనీపై నిషేధం తొలగించి ఏకపక్షంగా టెండరు ఖరారు చేశారు. ఏపీ గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్న వేమూరి హరికృష్ణను ఈ టెండర్ల మదింపు కమిటీలో సభ్యుడిగా నియమించారు. ఆయనకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీయే టెండర్లలో పాల్గొంది. అంటే పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించి మరీ కథ నడిపించారు. ఈ వ్యవహారంలో రూ. 144.53 కోట్లు ముడుపుల రూపంలో కొల్లగొట్టినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

ఫైబర్‌నెట్ కేసులో అటాచ్‌కు నిర్ణయించిన ఆస్తులు

- ఈ కేసులో నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో ఉన్న 797 చ.అడుగుల విస్తీర్ణం గల ఇంటి స్థలం
- నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు డైరెక్టర్‌గా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెందిన విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్
- టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ టి.గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్
- టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ టి.గోపీచంద్ పేరిట హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో ఉన్న ఫ్లాట్
- టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ టి.గోపీచంద్ పేరిట హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో ఉన్న మరో ఫ్లాట్
- ఈ కేసులో నిందితుడు తుమ్మల గోపీచంద్ పేరిట హైదరాబాద్ యూసఫ్‌గూడలో ఉన్న ఫ్లాట్
- తుమ్మల గోపీచంద్ భార్య పవనదేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉన్న వ్యవసాయ భూమి.

రోగినని బెయిల్ తీసుకుని.. యోగిలా వ్యవహరించిన బాబు

- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతుంటే అన్ని గంటలు ఎలా ప్రయాణం చేశారు?
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి/మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తన ఆరోగ్యం బాగోలేనందున ఆస్పత్రికి వెళ్లాలంటూ కోర్టులో దరఖాస్తు చేసుకుని బెయిల్ పొందిన చంద్రబాబు.. రోగి మాదిరిగా కాకుండా తానేదో స్వాతంత్య్ర సమరయోధుడిలా, యోగిలాగా వాహనంలో ఊరేగింపు నిర్వహించడమేంటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలున్నాయని కోర్టుకు పత్రాలు సమర్పించడంతో కోర్టు మానవతా దృక్పథంతో చంద్రబాబుకు నాలుగు వారాల పాటు బెయిల్ ఇచ్చిందని, తానోదో పోరాడి సాధించుకున్నట్లుగా జైలు నుంచి బయటకొచ్చి చంద్రబాబు ఊరేగింపు నిర్వహించారని ఎద్దేవా చేశారు. రాజమండ్రి జైలు నుంచి విజయవాడలోని కరకట్టపై ఉన్న ఇంటికి రెండున్నర గంటల వ్యవధిలో చేరుకోవచ్చని, కానీ చంద్రబాబు 14 గంటలు వాహనంలో ప్రయాణించారని విమర్శించారు. కోర్టు విధించిన ఆంక్షలను చంద్రబాబు ఉల్లంఘించారని చెప్పారు. చంద్రబాబు ఈ జన్మలో మారడని రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. 2019 సంవత్సరంలోనే ప్రజా యుద్ధం ముగిసిందని, ఆ యుద్ధంలో టీడీపీ ఓడిపోవడంతోనే దానిపని అయిపోయిందన్నారు. దత్తపుత్రుడు(పవన్ కళ్యాణ్) భుజంపై చేతులు వేసి టీడీపీని చంద్రబాబు నడిపించే యత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. లోకేశ్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలని, తండ్రి జైల్లో ఉంటే లోకేశ్ ఢిల్లీలో కూర్చున్నారని ఎద్దేవా చేశారు. సంక్షేమం, అభివృద్ధి అంటే ఎలా ఉంటాయో సీఎం జగన్ రాష్ట్రంలో చేసి చూపించారని, ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని సజ్జల స్పష్టం చేశారు.

ఆలిండియా జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

యువతలోని క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించడానికి సీఎం వైఎస్ జగన్ ఎల్లప్పుడూ ముందుంటారని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. విజయవాడలోని దండమూడి ఇండోర్ స్టేడియంలో ఆలిండియా జూనియర్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించడంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. నెల పాటు రాష్ట్రమంతా 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా సంబరాలను నిర్వహించనున్న తరుణంలో ఆలిండియా స్థాయి టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మట్టిలోని మాణిక్యాలను వెలికితీసి వారికి మరింతగా శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేలా క్రీడాకారులను తీర్చిదిద్దామని సజ్జల చెప్పారు. ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథ్, ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది విష్ణు, లలితా జ్యూయలరీ ఎండీ కిరణ్‌కుమార్ ఉన్నారు.



పోటీల్లో తలపడుతున్న పలు రాష్ట్రాల క్రీడాకారులు

హైదరాబాద్‌లోనూ బాబు 'ఉల్లంఘనలు'

కేసు నమోదుకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి, అనారోగ్య కారణాలు చూపించి తాత్కాలిక బెయిలుపై జైలు నుంచి బయటకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు హైదరాబాద్ వాసులకూ నరకం చూపించారు. అనుమతుల్లేకుండా, నిబంధనలు ఉల్లంఘించి ప్రధాన రోడ్లపై అడ్డదిడ్డంగా భారీ ర్యాలీ చేయడమే కాకుండా, టీడీపీ శ్రేణులు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కూడా ఉల్లంఘించారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న హైదరాబాద్ నగర పోలీసులు సుమోటో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. మంగళవారం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలైన చంద్రబాబు బుధవారం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకున్నారు. బాబుకు మద్దతు కోరుతూ అందరూ రావాలంటూ నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. దీంతో దాదాపు రెండు వేల మంది టీడీపీ కార్యకర్తలు అక్కడకు వచ్చారు. సాయంత్రం విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన బాబు కాన్వాయ్‌ను అనుసరిస్తూ పార్టీ జెండాలు, ప్లకార్డులతో ముందుకు కదిలారు. బేగంపేట నుంచి జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి చేరుకోవడానికి దాదాపు మూడున్నర గంటలు పట్టింది.

ర్యాలీపై కేసు నమోదుకు నిర్ణయం

హైదరాబాద్‌లో సాధారణ సమయాల్లోనే ర్యాలీలు, నిరసనలు, ప్రదర్శనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. పైగా, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీని ప్రకారం టీడీపీ తెలంగాణలో పోటీ చేయకపోయినా రాజకీయ పార్టీ కావడంతో రిటర్నింగ్ అధికారి నుంచి ర్యాలీకి అనుమతి పొందాలి. దీనికోసం 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఉల్లంఘనకు పాల్పడటంతో పాటు ర్యాలీలో వాహనాలను అడ్డదిడ్డంగా నడిపి, అంబులెన్స్‌లకు సైతం దారి ఇవ్వకపోవడంతో టీడీపీ శ్రేణులపై కేసు నమోదు చేయాలని హైదరాబాద్ పోలీసులు నిర్ణయించారు.

శాస్త్రీయంగా కరువు ప్రభావిత మండలాల నిర్ధారణ

- వర్షపాతం, భూగర్భ నీటిమట్టం, భూమిలో తేమశాతం లెక్కింపు
- 50% కన్నా తక్కువ వర్షపాతం, పంట దిగుబడుల ఆధారంగా పరిశీలన
- 2018 ఖరీఫ్‌లో 347 కరువు మండలాలు

సాక్షి, అమరావతి: ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయంగా మదించి కరువు ప్రభావిత మండలాలను ప్రకటించింది. 679 మండలాలకుగాను 103 మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో కరువు పరిస్థితులు ఉన్నట్లు నిర్ధారించింది. 80 మండలాల్లో కరువు ప్రభావం ఎక్కువగా ఉండగా, 23 మండలాల్లో స్వల్పంగా ఉందని తేల్చింది. 2016 కరువు నిర్వహణ మాన్యువల్ ప్రకారం అనేక అంశాలను పరిశీలించిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు 574.7 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 487.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో కరువు నిర్వహణ మాన్యువల్ ప్రకారం మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని విపత్తుల నిర్వహణ సంస్థ, జిల్లా కలెక్టర్ల ద్వారా మూడుదశల్లో పరిశీలించింది. మొదటిదశలో లోటు వర్షపాతం, వర్షం పడిన రోజుల (డ్రై స్పెల్) ఆధారంగా మదింపు చేసింది. సాధారణ వర్షపాతం కన్నా 50% తక్కువ వర్షపాతం నమోదై, డ్రై స్పెల్‌ను బట్టి భూమిలో తేమశాతం కూడా తక్కువ ఉంటే మొదటిదశలో ఆ మండలాలను పరిగణనలోకి తీసుకుంది. రెండోదశలో లోటు వర్షపాతం, డ్రై స్పెల్, నీటివనరుల లభ్యత, సాగువిస్తీర్ణం పడిపోవడం, రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం నుంచి లభించిన వివరాలు, భూమిలో తేమశాతం సూచికల్లో మూడు సూచికలు కరువు పరిస్థితులకు అనుగుణంగా ఉంటే ఆ మండలాలను ఎక్కువ కరువు ప్రభావం ఉన్న మండలాలుగా ప్రతిపాదించింది. కనీసం రెండు సూచికలు అనుకూలంగా ఉన్న మండలాలను ఓ మోస్తరు కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించింది.

శాస్త్రీయంగా, పక్కాగా సర్వే

మూడోదశలో క్షేత్రస్థాయి నిజనిర్ధారణ కోసం శాంపిల్ సర్వే నిర్వహించారు. గుర్తించిన మండలాల్లోని పలు గ్రామాలను ర్యాండమ్‌గా ఎంపికచేసి అక్కడ సర్వే చేశారు. ఆ ప్రాంతాల్లోని పలు యూనిట్లలో పంటల దిగుబడిని ఇందుకు ప్రాతిపదికగా తీసుకున్నారు. కనీసం 50% పంట దిగుబడి (ఐదు పెద్ద పంటలు) తగ్గితే అక్కడ కరువు పరిస్థితులు ఉన్నట్లు నిర్ధారించారు. శాస్త్రీయంగా, పక్కాగా నిర్వహించిన ఈ సర్వేలపై కలెక్టర్లు పంపిన నివేదికల్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతాధికారుల కమిటీ పరిశీలించి ఆమోదం తెలిపింది. ఆ తర్వాత కరువు ప్రభావిత మండలాలపై నోటిఫికేషన్ వెలువడింది. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం పక్కాగా కరువు తీవ్రతను అంచనా వేశామని, ప్రతి సూచికను ఒకటికి రెండుసార్లు పరిశీలించామని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. 2018లో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సంవత్సరం ఖరీఫ్‌లో 347 మండలాలు, రబీలో 257 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ తర్వాతే ఇప్పుడే స్వల్పంగా కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.



భౌతిక సాధనంతో వచ్చినట్టు కనబడినప్పటికీ, చేతిరాత అనేది ఒక ఆధ్యాత్మిక పరికల్పన.
– యూక్లిడ్

సాక్షి
గురువారం, 2 నవంబర్ 2023

ఈ గంటల లెక్క సరైనదేనా?!

శ్రమజీవికి జగమంతా లక్ష్మీనివాసం అని కవి వాక్కు. కాకపోతే ఎలా శ్రమించాలి? ఎంతసేపు శ్రమించాలి? ఇది మిలియన్ డాలర్ల ప్రశ్న. అందుకే కావచ్చు... వారానికి 70 గంటలు పని చేయాలంటూ ఇన్ఫోసిస్ సంస్థ సహ–వ్యవస్థాపకులు నారాయణమూర్తి తాజాగా చేసిన వ్యాఖ్య దేశవ్యాప్తంగా, ముఖ్యంగా యువతరంలో పెద్ద చర్చ రేపుతోంది. ఐటీ వృత్తినిపుణుల్ని ఉద్దేశించి ఓ పాడ్ క్యాస్ట్‌లో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయమది. రానున్న దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్త మార్పులతో వచ్చిపడే డిమాండ్లను అందుకొని, భారత ఉత్పాదకతను పెంచుకోవాలంటే ఈ అధిక పని గంటల విధానం అవసరమనేది ఆయన మాట. కార్పొరేట్ దిగ్గజాలు ఆ ప్రతిపాదనను సమర్థిస్తుంటే, శ్రామికవర్గాలు ఈ సుదీర్ఘ పనిగంటల ఆలోచనను వ్యతిరేకిస్తున్నాయి. వెచ్చించిన కాలం, ఉత్పాదకత... ఈ రెంటి మధ్య సంబంధం అన్నిసార్లూ అనులోమానుపాతంలోనే ఉంటుందా అనే మౌలిక ప్రశ్న మొదలైంది.

పనిగంటలు పెంచి, ఎక్కువ పని చేయడమనే ప్రతిపాదన పట్ల పెల్లుబుకుతున్న వ్యతిరేకతకు కారణాలు లేకపోలేదు. మన దేశంలో ఇప్పటికే అధిక సంఖ్యాకులు ఎక్కువ పని చేస్తూ, తక్కువ వేతనాలు పొందుతున్నారు. ఇక, ఇంటిని చక్కబెట్టే మహిళలు, అసంఘటిత రంగ శ్రామికులు లక్షల మంది ఈ 70 గంటల లెక్కకు మించే పనిచేస్తున్నారు. జీతం బత్తెం లేని కుటుంబ స్త్రీలు, వేతనం పొందినా లెక్కల్లోకి రాని అసంఘటిత శ్రామికుల రీత్యా ఉత్పాదకతలో అది కనిపించకపోవచ్చు. 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్' (ఓఈసీడీ) గణాంకాల ప్రకారం అధిక పనిగంటల విషయంలో మొత్తం 187 దేశాల్లో మనది 136వ ర్యాంకు. భారతీయ శ్రామికులు సగటున ఏటా 1660 గంటలు పనిచేస్తూ, 2,281 డాలర్ల మేర తలసరి జీడీపీ అందిస్తున్నారు. ఇండొనేసియా, ఆస్ట్రేలియా వగైరా దాదాపు అంతే గంటల్లో అధిక తలసరి జీడీపీ సాధిస్తున్నాయి.

నిజానికి, రోజుకు గరిష్ఠంగా 8 గంటల పని మాత్రమే అనే పద్ధతిని భారతీయ కార్మిక చట్టాల్లోకి తేవడానికి ఎన్నో పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు వారానికి 70 గంటలు, అంటే రోజుకు 11.5 గంటలు అనే పద్ధతి తెస్తే మునుపటి పోరాటాల ఫలితమంతా గంగలో కలిసిపోతుందనే భయమూ శ్రామికుల్లో ఉంది. అదనపు జీతం, పరిహారాల ఊసెత్తకుండా కేవలం అధిక పని గంటల ప్రతిపాదన తీసుకురావడం అనేక అనుమానాలకు దారి తీస్తుంది. ఒకవేళ ఉత్పాదకత, అభివృద్ధి పెరగాలనుకుంటే... శ్రామికులు తమ ఉద్యోగంతో పాటు నచ్చిన మరో పని కూడా ఏకకాలంలో చేసుకొని అదనంగా సంపాదించుకొనేలా 'మూన్‌లైటింగ్'కు అనుమతించాలని కొందరు నిపుణుల సూచన. తద్వారా శ్రామికులకూ, దేశానికీ ఉపయోగమనేది వారి వాదన. అయితే, పలు దిగ్గజ టెక్ సంస్థల భావన తద్భిన్నంగా ఉంది. మారుతున్న శ్రామిక సంస్కృతిలో మూన్‌లైటింగ్ విడదీయరాని భాగమని కేంద్ర ఐటీ అమాత్యులంటున్నా, దాన్ని శిరోధార్యమంటున్న కార్పొరేట్ల సంఖ్య తక్కువే!

వృత్తి పట్ల అంకితభావం, అచంచలమైన శ్రద్ధ కావాల్సిందే! కానీ, పని మీద దృష్టి అనేది చివరకు ఉద్యోగ జీవితానికీ – కుటుంబ జీవితానికీ మధ్య సమతౌల్యం దెబ్బ తీయకూడదు. మనిషి పూర్తిగా డస్సిపోయే పరిస్థితి తేకూడదు. శారీరక, మానసిక సమస్యలకు కారణం కాకూడదు. ఏ పని చేసినా సంతోషంగా చేస్తే ఫరవాలేదు. ఆ పరిస్థితి అంతటా సాధ్యం కాదు. సంతోషమే సగం బలం అనే మనం అందులో వెనకబడ్డాం. ఇప్పటికే ప్రపంచ సంతోషసూచిలో మన దేశపు స్కోరు గణనీయంగా తగ్గుతోంది. దశాబ్దం క్రితం 2013లో 4,772 స్కోరుతో సంతోషసూచిలో భారత్ 111వ ర్యాంకులో ఉండేది. తీరా ఈ ఏడాది మన స్కోరు 4,036కు పడిపోయింది. మన ర్యాంకు 126కు దిగజారింది. ఈ పరిస్థితుల్లో సంతోషంగా పని చేయాలనే పద్ధతికి నీళ్ళొదిలి, మానసిక ఆరోగ్యాన్ని పణంగా పెట్టి, అధిక గంటల పనితో ఉత్పాదకత పెంచాలని భావిస్తే, మొదటికే మోసం వస్తుంది. దీర్ఘకాలంలో అది దేశానికి నష్టదాయకంగా పరిణమించే ప్రమాదం ఉంది.

నారాయణమూర్తి అన్నట్టు దేశాభివృద్ధికి మరింత శ్రమించాలనడంలో సందేహం లేదు. అయితే ఆ శ్రమను పని గంటలతో కొలవాలనుకుంటేనే చిక్కు. భారత్‌ను ఇప్పటికీ నిరుద్యోగం, తక్కువ ప్రతిఫలానికే పనిచేయాల్సి రావడం పట్టిపీడిస్తున్నాయి. స్వయం ఉపాధికి దిగుదామంటే కావాల్సిన పెట్టుబడి దొరకని పరిస్థితి. విద్య, ఆరోగ్య వసతులూ అంతంత మాత్రమే. అవ్యవస్థీకృత ఆర్థికరంగంలో వారానికి 48 గంటల పైనే పని చేస్తున్నా, వేతనాల్లో వ్యత్యాసం, ఉపాధి భద్రత లేమి లాంటి సమస్యలు సరేసరి. ఈ నేపథ్యంలో జీవన ప్రమాణాల్ని మెరుగుపరిచేలా ప్రభుత్వ విధానాలు మారాలి. పనిగంటల కన్నా మానవ సంక్షేమ మూలధనంపై దృష్టిపెట్టడం కీలకం. అప్పుడు ఉత్పాదకత పెరుగుతుంది. అందుకు పాలకులు ప్రాథమిక వ్యవస్థాగత లోపాలను సవరించడం అవసరం.

గమనిస్తే, అనేక అభివృద్ధి చెందిన దేశాల కన్నా సగటు భారతీయ శ్రామికుడు ఎక్కువ సేపు పనిచేస్తున్నా, ఉత్పాదకత తక్కువగా ఉందని గణాంకాలు సూచిస్తున్నాయి. అంటే, ఎంత నాణ్యమైన పని చేశావనేది ప్రధానం కావాలి కానీ, ఎంతసేపు గానుగెద్దులా పని చేశావనేది కాదు. గంటలకొద్దీ శ్రమను పెంచే కన్నా, నైపుణ్యాలకు పదునుపెట్టి, కొద్దిపాటి పరిశ్రమతో అధిక ఫలితం అందించే నవీన మార్గాలను అన్వేషించాలి. పారిశ్రామిక శిఖరం జేఆర్డీ టాటా మాటల్లో చెప్పాలంటే, 'భారత్ ఆర్థిక అగ్రరాజ్యం కావడం కన్నా, ఆనందమయ దేశం కావాలి.' అంచనాలు, అంతకు మించి ఒత్తిడి అంతకంతకూ అధికమవుతున్న కాలంలో అది చాలా ముఖ్యం. సంతోషం, సామర్థ్యం పెరిగితే సంపద అదే సృష్టి అవుతుంది. శ్రమజీవి ప్రతి చెమటచుక్క సిరులు పండిస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.పంచమి రా.11.12 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మృగశిర ఉ.6.47 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ప.3.36 నుండి 5.18 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.48 నుండి 10.34 వరకు తదుపరి ప.2.24 నుండి 3.10 వరకు, **అమృత ఘడియలు:** రా.9.30 నుండి 11.10 వరకు, రాహుకాలం ప.1.30 నుండి 3.00 వరకు.

సూర్యోదయం : 6.02
సూర్యాస్తమయం: 5.27
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ప్రపంచాన్ని విభజించిన తీర్మానం

విశ్లేషణ



వివేక్ కాట్జూ

అక్టోబర్ 7 నాటి హమాస్ తీవ్రదాడి ఇజ్రాయెల్‌ను రాజకీయంగా ఒక్కటి చేసింది. అయితే అత్యధిక దేశాలు ఇజ్రాయెల్ ప్రతిదాడుల తీవ్రతను ప్రశ్నిస్తున్నాయి. హమాస్ దాడి తీవ్రవాద చర్య అని మరికొన్ని భావిస్తున్నాయి. అందుకే ఐక్యరాజ్య సమితి తీర్మానం చాలా దేశాలను వర్గాలుగా, ప్రాంతాలుగా విడదీసిందంటే అతిశయోక్తి కాదు. అలాగే ఇజ్రాయెల్‌తో అరబ్ దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకున్నా... గాజా ప్రజల కష్టాలపై కనీస స్పందన కనబరచాలనే ఒత్తిడిలో తీర్మానానికి మద్దతు ప్రకటించాయి. అదే సమయంలో తీర్మానానికి మద్దతివ్వని ఏకైక దక్షిణాసియా దేశంగా ఉండటం వల్ల, ఇజ్రాయెల్‌కు సానుకూలంగా భారత్ మారిందన్న భావన అదే అరబ్ దేశాల్లో బలపడే వీలుంది. అందుకే భారత్ ఆచితూచి వ్యవహరించాలి.

అక్టోబర్ 7 నాటి హమాస్ తీవ్రదాడికి కారణమైన నిఘా వైఫల్యాలు, భద్రత లోపాలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రభుత్వంపై విమర్శలు వచ్చినప్పటికీ, ఆ దేశ రాజకీయ వర్గం ప్రభుత్వం వెంట నిలిచింది. జాతీయ అత్యయిక పరిస్థితిలో రాజకీయ పక్షాలన్నీ తమ విభేదాలను పక్కనపెట్టాయి. 'అత్యవసర ఐక్యతా ప్రభుత్వ' ఏర్పాటునకు పార్లమెంటు ఆమోదం పొందే క్రమంలో నెతన్యాహూ మాట్లాడుతూ, 'హోలోకాస్ట్ తరువాత యూదు ప్రజలు ఎదుర్కొన్న అతి దుర్భర ఘటన'గా అక్టోబర్ 7ను అభివర్ణించారు. హమాస్ దాడిలో 1,400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో సాధారణ పౌరులు, మహిళలు, పిల్లలు, వృద్ధులు ఉన్నారు. 229 మందిని హమాస్ బందీలుగా కొనిపోయింది. అయితే ఇజ్రాయెల్ చేపట్టిన ప్రతిదాడుల విషయంలో ప్రపంచ దేశాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అత్యధిక దేశాలు ఇజ్రాయెల్ ప్రతిదాడుల తీవ్రతను ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్ రాజకీయ వర్గాలు హమాస్ అంతు చూడాలన్న దృఢ నిశ్చయంతో ఉన్నాయి.

బందీల పరిస్థితేమిటి?

హమాస్ దాడి జరిగిన వెంటనే, ఇజ్రాయెల్ రక్షణ దళాలు గాజాపై బాంబుల వర్షం కురిపించాయి. వైమానిక, భూతల దాడుల్లో ఇప్పటివరకూ 8,000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ ఇంకో అడుగు ముందుకేసి విద్యుత్ సేవలు నిలిపి వేసింది. ఆహారం కూడా తక్కువ పరిమాణంలో గాజాలోకి వెళ్లేలా నియంత్రిస్తోంది. గాజా ఉత్తర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు దక్షిణం వైపునకు పోవాలని హెచ్చరించింది. అక్టోబరు 27న ఇజ్రాయెల్ భూతల దళాలు గాజాలోకి ప్రవేశించాయి. ఒక రోజు తరువాత నెతన్యాహూ, యుద్ధంలో తరువాతి దశ ఇక మొదలవుతుందనీ, ఇది దీర్ఘకాలిక పోరు కానుందనీ ఇజ్రాయెల్ ప్రజలను హెచ్చరించారు.

బందీలను రక్షించే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయని ఇజ్రాయెల్ చెబుతోంది. తమ చర్యల కారణంగా గాజాలో ప్రాణనష్టానికి భయపడి హమాస్ బందీలను విడుదల చేస్తుందనేది ఇజ్రాయెలీల ఆలోచనగా కనిపిస్తోంది. గాజా ప్రజల ఒత్తిడికి కూడా హమాస్ తలొగ్గ వచ్చునని భావిస్తోంది. ఖతార్, ఈజిప్టు లాంటి దేశాలు హమాస్, ఇజ్రాయెల్ మధ్య శాంతి చర్చలు కొనసాగిస్తున్నాయి. బందీల విడుదలకు ప్రయత్నిస్తున్నాయి. అయితే హమాస్ తమకు రక్షణ కవచంగా ఉంటున్న బందీలను వదులుకునేందుకు సిద్ధంగా ఉందా అన్నది ప్రశ్న. మరోవైపు ఇజ్రాయెలీ అధికారులు కూడా అసందిగ్ధతను ఎదుర్కొంటున్నారు. బందీల కుటుంబ సభ్యులు వారిపై ఒత్తిడి తెస్తున్నారు. బందీలుగా ఉన్న పాలస్తీనీయులను వదిలితే ఇజ్రాయెలీల విడుదలపై ఆలోచిస్తామని హమాస్ షరతు విధించినట్టు తెలుస్తోంది. గతంలో ఒకే ఒక్క ఇజ్రాయెలీ సైనికుడి విడుదల కోసం ఇజ్రాయెల్ చాలామంది పాలస్తీనియన్లను వదిలిపెట్టిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. కానీ ఇప్పుడు పరిస్థితులు వేరుగా ఉన్నాయి.



హమాస్ దాడి సమర్థనీయమే?!

పాలస్తీనాను ఇజ్రాయెల్ చాలాకాలంగా ఆక్రమించి ఉండటం, రెండు దేశాల పరిష్కారానికి సిద్ధంగా లేకపోవడం కారణంగా అక్టోబరు 7 నాటి హమాస్ దాడి అర్థం చేసుకోదగినదే అని కొన్ని అరబ్ దేశాలతోపాటు, కొన్ని ఇస్లామిక్ దేశాలు భావిస్తున్నాయి. ఇంకో అడుగు ముందుకెళ్లి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ గత వారం భద్రతా మండలిని ఉద్దేశించి, హమాస్ దాడి శూన్యంలోంచి పుట్టుకొచ్చింది కాదని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ సమాజంలో చాలామంది ఇజ్రాయెల్ వ్యవహారం ఎలా ఉన్నప్పటికీ హమాస్ దాడి తీవ్రవాద చర్య అనీ, సమర్థనీయం కాదనీ భావిస్తున్నారు.

ఈ అంశాలన్నీ కూడా ఇటీవలే ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో జోర్డాన్ ప్రవేశపెట్టిన తీర్మానం విషయంలో స్పష్టమయ్యాయి. 'ప్రజల భద్రత, న్యాయమైన, మానవీయ బాధ్యత' కోసం ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి 121 దేశాలు మద్దతిచ్చాయి. 14 దేశాలు వ్యతిరేకించాయి. భారత్ సహా 44 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. 'మానవతావాద సంధి ఒకటి తక్షణం కుదరాలనీ, ఈ ఏర్పాటు దీర్ఘకాలం కొనసాగేదిగా ఉండాలనీ' ఈ తీర్మానం ప్రతిపాదించింది. హమాస్, ఇజ్రాయెల్ పేర్లను ప్రస్తావించలేదు. గాజా ప్రజలకు సాయం అందేలా చూడాలనడం, మానవత చట్టాల అమలు గురించి మాట్లాడటాన్ని బట్టి, ఈ తీర్మానం ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ప్రతిపాదించినదని స్పష్టంగా అర్థమవుతుంది... గాజాలోని ఇజ్రాయెల్ బందీలు అని అర్థమయ్యేలా అక్రమంగా నిర్బంధించిన పౌరుల విడుదల అంశాన్ని ఇందులో పేర్కొన్నప్పటికీ.

ముఖ్యమైన విషయం ఏమిటంటే... అరబ్, ఇస్లామిక్ దేశాలతో పాటు రష్యా, చైనా కూడా ఇజ్రాయెల్ నిగ్రహం చూపాలనీ, ప్రస్తుతం అనుసరిస్తున్న మార్గాన్ని వదిలేయాలనీ డిమాండ్ చేయడం. తీర్మానానికి అనుకూలంగా ఓటేసిన దేశాల జాబితాలో ఐక్యరాజ్య సమితి భద్రత మండలి సభ్యదేశమైన ఫ్రాన్స్ కూడా ఉంది. తన 'నాటో' భాగస్వామి అమెరికాతో మాత్రమే కాదు, బ్రిటన్‌తోనూ ఫ్రాన్స్ విభేదించింది. అమెరికా ఈ తీర్మానాన్ని వ్యతిరేకించగా, బ్రిటన్ ఓటింగ్‌కు దూరంగా ఉంది. యూరోపియన్ యూనియన్, ఉత్తర, దక్షిణ అమెరికా, ఆఫ్రికా యూనియన్, ఏసియన్, దక్షిణాసియా దేశాలను ఈ తీర్మానం వర్గాలుగా, ప్రాంతాలుగా విడదీసిందంటే అతిశయోక్తి కాదేమో!

ఇజ్రాయెల్‌కు అమెరికా దన్ను!

ఇజ్రాయెల్‌కు అమెరికా పూర్తి దన్నుగా నిలుస్తోంది. ఎన్నికలకు ఏడాది గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో అధ్యక్షుడు బైడెన్ ను అమెరికా యూదుల లాబీ ప్రభావితం చేయడం దీనికి కారణం కావచ్చు. అమెరికాకు చెందిన బందీలపై ఆందోళన కూడా ముఖ్యమైన కారణం కావచ్చు. ఈ కారణంగానే హమాస్‌ను తుదముట్టించాలనే ఇజ్రాయెల్ కృతనిశ్చయాన్ని అమెరికా సమర్థిస్తుండవచ్చు. దీనర్థం, అమెరికా ఇకపై కూడా తన వీటో పవర్‌తో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఇజ్రాయెల్‌కు దౌత్యపరమైన సాయం కొనసాగిస్తుంది.

మరోవైపు ఇజ్రాయెల్‌తో అరబ్ దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకున్నా... గాజా ప్రజల కష్టాలపై కనీస స్పందన కనబరచాలనే ఒత్తిడిలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తీర్మానానికి మద్దతు ప్రకటించాల్సి వచ్చింది. అయితే ఇజ్రాయెల్‌తో ఆ దేశాలు, ముఖ్యంగా యూఏఈ, బహ్రెయిన్ , ఈజిప్టు తమ సంబంధాలను తెంచుకుంటాయా అనేది చూడాలి.

భారత్ వైఖరి

ఓటింగ్‌కు దూరంగా ఉన్న విషయంపై భారతదేశం వివరణ ఇచ్చింది. అది సరిగ్గానే ఉగ్రవాదంపై దృష్టి కేంద్రీకరించింది. నిగ్రహంగా ఉండాలని పిలుపునిచ్చింది. దౌత్యం, చర్చల ద్వారా మాత్రమే సమస్య పరిష్కారం కాగలదని స్పష్టం చేసింది. మానవతా చట్టాలను గౌరవించాలని చెబుతూనే తాను రెండు దేశాల సిద్ధాంతానికి మద్దతుగా నిలుస్తున్నట్లు స్పష్టం చేసింది. అయితే తీర్మానానికి మద్దతివ్వని ఏకైక దక్షిణాసియా దేశంగా ఉండటం వల్ల, ఇజ్రాయెల్‌కు సానుకూలంగా, పాలస్తీనియన్ల పట్ల పట్టింపు లేనిదిగా భారత్ మారిందన్న భావన అరబ్ దేశాల్లో బలపడేందుకు వీలుంది. ఇది వాస్తవం కాకపోవచ్చు. స్వీయ ప్రయోజనాల దృష్ట్యా ఇజ్రాయెల్‌తో సంబంధాలు ఉన్నప్పటికీ, వాటి విషయంలో భారత్ ఆచితూచి వ్యవహరించాలి. అరబ్ దేశాలతో కూడా మనకు అంతే భారీ ప్రయోజనాలు ఉన్నాయి.

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

శుభాకాంక్షలు



ఎల్లరిగూ కన్నడ రాజ్యోత్సవద శుభాశయగళు (అందరికీ కర్ణాటక రాష్ట్ర అవతరణ శుభాకాంక్షలు).

– అనిల్ కుంబ్లే, క్రికెటర్

సాధించాలి!



తుళువలు మొత్తం ప్రాంతాన్ని ఏకీకృతం చేసి తుళునాడు రాష్ట్రం ఏర్పడేందుకు పనిచేయాలి. తుళు భాష గుర్తింపు గురించి కర్ణాటక నుంచి ఏదో ఆశించడం నిరర్థకం. వాళ్ల ప్రయోజనాలకు వ్యతిరేకం కాబట్టి, అదెప్పటికీ జరగదు.

– నవీన్ శెట్టి, తుళునాడు మద్దతుదారు

అదే మేలు



అన్ని ఇబ్బందులనూ అధిగమించి సచిన్ పైలట్, సారా అబ్దుల్లా 2004లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ పెళ్లికి అబ్దుల్లా కుటుంబం హాజరు కాలేదు. రెండు దశాబ్దాల తర్వాత, దంపతులు అధికారికంగా విడిపోయారు (రానున్న రాజస్థాన్ శాసన సభ ఎన్నికల కోసం సచిన్ పైలట్ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం). జనాలు పెరుగుతారు, మారుతారు... సంతోషంగా ఉండనప్పుడు, సామరస్యంగా విడిపోవడమే మేలు!

– అర్నాజ్ హాథీరామ్, 'వాయిస్ ఫర్ మెన్' వ్యవస్థాపకురాలు

ఎలా సాధ్యం?



మా అమ్మ సత్తువకు ఏదీ సమానం కాదు. నవరాత్రుల్లో జన్మించిన మా పసిదాన్ని ఇరవై నాలుగ్గంటలూ కనిపెట్టుకుని ఉంటోందా... చాలినంత నిద్ర లేదు. అయినా కర్వా చౌత్ ఉపవాసం చేయడానికి నిర్ణయించుకుంది.

– సాన్యా తల్వార్, సంపాదకురాలు

ఒప్పుకోవాలి



ప్రతి ఒక్కరూ గుర్తించి, అంగీకరించాల్సినది ఏమంటే – ఇజ్రాయెల్ అక్కడే ఉనికిలో ఉంటుంది : యూదులు, క్రైస్తవుల మూలాలు మన ప్రాంతంలో ఉన్నాయి తప్ప ఏ న్యూయార్క్‌లోనో, పారిస్‌లోనో లేవు. వాళ్లు మన చరిత్రలో భాగం, భవిష్యత్తులో కూడా తప్పక భాగం కావాలి.

– అలీ రషీద్ అల్ నుయిమి, యూఏఈ నాయకుడు

ఇదీ సమస్య



ఎంఆర్ఎన్ఏ టీకాలతో సమస్య ఇది: వాళ్లు ఎంఆర్ఎన్ఏను మీ కణాల్లోకి మోసుకెళ్లడానికి లిపిడ్ నానోపార్టికల్స్ (ఎల్ఎన్‌పీ)ను ఉపయోగిస్తారు. అనంతరం ఫారిన్ స్పైక్ ప్రొటీన్ ఉత్పత్తయ్యేలా ఎంఆర్ఎన్ఏ మీ కణాన్ని హైజాక్ చేస్తుంది. మీ శరీరంలోకి ఎల్ఎన్‌పీ ప్రతిచోటికీ వెళ్తుంది. గుండె, ఓవరీలతో సహా! అది విషం.

– పీటర్ ఇమాన్యుయెల్‌సేన్, కామెంటేటర్

అనుభవించాల్సిందే!



నా అపార్ట్‌మెంట్‌ను బాగు చేయాలని అనుకున్నప్పుడు – రాయి, కలప, గ్లాసు, మన్ను లాంటి సహజమైన పదార్థాలే తప్పక వాడాలని అనుకున్నాను. దీనికోసం ప్రత్యేకంగా ఒక ఆర్గానిక్ నిర్మాణ కంపెనీని మాట్లాడుకున్నాను. అలాంటి ఇంటి లోపలికి వెళ్లినప్పుడు మానసిక భావనే వేరుగా ఉంటుంది... సంపూర్ణంగా, సౌఖ్యంగా!

– అలెస్సాండ్రా బొక్కి, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ఆహార కల్తీపై నిఘా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం ప్రపంచ ఆరోగ్యసంస్థ మార్గదర్శకాలను చిత్తశుద్ధితో అనుసరిస్తోంది. ముఖ్యంగా దీనిలో ఆహార కల్తీ ఎక్కడా, ఏ స్థాయిలో కూడా జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. నిఘాతో కూడిన తనిఖీ వ్యవస్థను బలోపేతం చేసింది. 'జాతీయ ఆహార భద్రతా చట్టం – 2013' ప్రకారం ఆహారం, పోషకాహార భద్రతను అందించే లక్ష్యాన్ని కొనసాగిస్తోంది. ప్రజలు గౌరవప్రదంగా జీవించడానికి సరసమైన ధరలకు తగిన పరిమాణంలో నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేస్తోంది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేసే 'భారతీయ ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ' నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా 'ఆంధ్రప్రదేశ్ ఆహార కమిషన్' పనిచేస్తోంది. స్వయంగా ఈ సంస్థ చైర్మన్ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సంబంధిత విభాగాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు అందిస్తున్నారు. ఆహారంలో కల్తీని ప్రభుత్వ తనిఖీ సంస్థలు చాలా వరకు అధిగమించాయి. తక్కువ నాణ్యత, తినడానికి వీలులేని ఆహారాన్ని కట్టడి చేయగలిగాయి.

పలు రకాలుగా సరుకులు కల్తీ చేయడం వల్ల అనేక రోగాలు వస్తున్నాయి. ఉదాహరణకు ఆవ నూనెను ఆర్జిమోన్ నూనెతో కల్తీ చేయడం వల్ల 'డ్రాప్సీ' అనే తీవ్ర వ్యాధి వస్తుంది. అర్హర్ పప్పును కేసరి పప్పుతో కలపడం 'లాథైరిజం'కు కారణమవుతుంది. పసుపును తరచుగా లెడ్‌క్రోమేట్ అనే విష పదార్థంతో కలపడం వల్ల మెదడు సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. దుకాణాలు, హోటళ్ళు, మిగతా అమ్మకపు ప్రదేశాల్లో ఆహార కల్తీని వేగంగా గుర్తించేలా 'ఫుడ్‌సేఫ్టీ ఆన్ వీల్స్' పేరిట తనిఖీ ప్రయోగశాల వాహనాల్ని పాలనలోకి తీసుకొచ్చారు. ప్రతి వాహనంలో ఎనభై రకాల పరీక్షలు నిర్వహిస్తారు. పాల కల్తీని గుర్తించేందుకు మిల్క్ అనలైజర్‌నూ, వంట నూనెలను పరీక్షించే సాంకేతిక వ్యవస్థనూ ఈ వాహనాల్లో అమర్చారు. ఆహార రంగులు, ఫుడ్ పాయిజన్ వంటి ఘటనల్లో నీటిలో బ్యాక్టీరియాను గుర్తించే కిట్లు సిద్ధంగా వుంటాయి. ఇలా సాంకేతిక పరిజ్ఞానంతో ఏపీ ప్రభుత్వం ఆహార నాణ్యతను పరిరక్షిస్తోంది.

– కాట్రగడ్డ సురేష్,
ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ ఏపీ అధ్యక్షులు

అందరి మన్ననతోనే గెలుపు సాధ్యం!

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

కమ్యూనిస్టులు చెప్పినట్టు ఈ దేశంలో కులం ఉపరితల అంశం మాత్రమే కాదు. కులానికి దేశంలో బలమైన పునాదులు ఉన్నాయి. కులంలోతైన అనేక విషయాలను ప్రభావితం చేసే అంశంగానే ఉంది. ఈ దేశ కుల స్వభావాన్నీ, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థనూ బాగా అర్థం చేసుకున్న డా॥ బీఆర్ అంబేడ్కర్ కులం పునాదులపై ఏ వ్యవస్థనూ, రాజకీయాలనూ నిర్మించడం సాధ్యం కాదన్నారు. ప్రతి మనిషికీ ఏదో కులం ఉంటుంది. తన కులం వారు ఎక్కువగా ఉన్నచోట్ల తాము పోటీ చేస్తే గెలుస్తామన్న తప్పుడు అవగాహన కొంతమందికుంది.

అలాంటివారిలో పవన్ కల్యాణ్ ఒకరు. అంటే కులం పునాదులపై రాజకీయ సౌధాలను నిర్మించాలని ఈ సినీ రాజకీయ నాయకుడు భావిస్తున్నారు. తన పూర్వీకుల నివాస స్థానమైన ఉభయ గోదావరి జిల్లాల్లో తన కులానికి చెందినవారి సంఖ్య ఎక్కువగా ఉంది కాబట్టి ఆ జిల్లాల్లో ఉన్న మొత్తం అసెంబ్లీ స్థానాలను గెలువగలననీ, ఇక తాను ముఖ్యమంత్రి అయినట్టేననీ సంబరపడుతున్నారు. కాని ఏ రాజకీయ అవగాహన, దృక్పథం లేకుండా కేవలం కులం చూసి ప్రజలు ఓటేయరనీ, ఒకవేళ తన కులం వాళ్ళు కొంత ఎక్కువమంది ఓటేసినా ఆ ఓట్లతో గెలవడం సాధ్యం కాదనీ పవన్ కల్యాణ్‌కు తెలియదనుకుంటాను. రెండు జిల్లాల్లోని కొన్ని సీట్లు గెలిచి పదమూడు (ఉమ్మడి) జిల్లాల ఆంధ్రప్రదేశ్‌ను ఏలడం సాధ్యం కాదన్నది వాస్తవం.

గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీచేసిన రెండు అసెంబ్లీ స్థానాల్లోనూ, తన పార్టీ పోటీచేసిన దాదాపు అన్ని స్థానాల్లోనూ ఓడిపోవడమే కాకుండా డిపాజిట్ కూడా కోల్పోయిన విషయం గుర్తుంచుకోవాలి. బలమైన తన సామాజిక వర్గం బలంతో శాశ్వతంగా రాష్ట్రాన్ని ఏలవచ్చని, తన సామాజిక వర్గం అధికంగా ఉన్న అమరావతిలో రాజధాని ఏర్పాటు చేశారు చంద్రబాబు నాయుడు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా కులం పునాదులపైనే రాజకీయాలను నిర్మించి అందరికీ దూరమై ఎవరికీ కాని వాడయ్యారు. కులం పునాదులను నమ్ముకున్న పవన్, బాబులు రాజకీయ పొత్తులతో ఏపీ రాజకీయాలను నడుపుదామని అనుకుంటున్నారు. ఏ రాజకీయ అవగాహనా, ప్రజలకు ఉపయోగపడే మ్యానిఫెస్టో లేని అవకాశవాద పొత్తుతో రెండు కులాల ఉమ్మడి ఓట్లతో గెలువాలని కలలు గంటున్నారు. ఇదివరకు బీజేపీతో పొత్తుపెట్టుకొని, ఇపుడు రోజురోజుకూ బలహీనపడుతున్న టీడీపీతో పొత్తుపెట్టుకొని పవన్ శృంగభంగం పొందడానికి సిద్ధంగా ఉన్నారు.



ప్రజాస్వామిక వ్యవస్థకు ఉన్నత రూపాలయిన సెక్యులర్, సోషలిస్ట్ పదాలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి వాళ్ళకు నచ్చవు. సామాజిక సమానత్వమూ నచ్చదు. ఆ దిశలో పయనిస్తూ కుల మతాల కతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలనందిస్తున్న జగన్ అందుకే వాళ్ళకు నచ్చరు.


ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల్లో అనేక కారణాల వల్ల సామాజిక, ఆర్థిక అంతరాలున్నాయి. ఆ మూడు ప్రదేశాలను సమానంగా అభివృద్ధి చేయడానికి 'మూడు రాజధాను'ల విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు జగన్. తన మంత్రివర్గంలోనే కాక అన్ని స్థానిక సంస్థలు, కార్పొరేషన్ల పదవుల్లోనూ అత్యధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకూ, మహిళలూ, మైనారిటీలకూ జగన్ స్థానం కల్పించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, మంచి సేద్యం, కార్పొరేట్ స్థాయిని మించిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడం లాంటి జగన్ పనులు బాబు లాంటి వారికి నచ్చడం లేదు.

ప్రజలకు సోషలిజం అంటే తెలియక పోవచ్చు. కాని సామాజిక న్యాయం జరగాలనీ, సామాజిక, ఆర్థిక అంతరాలు తగ్గాలని మాత్రం వాళ్లు కోరుకుంటున్నారు. ఆ దిశగా పయనిస్తున్న జగన్ మళ్లీ రావాలనీ ఆకాంక్షిస్తున్నారు.

వ్యాసకర్త ప్రముఖ కథా రచయిత
మొబైల్: 91829 18567

స్వీయ బందీలు

ఓ గురువుగారు శిష్యులతో తీర్థయాత్రకు బయలుదేరారు. వారి దుస్తులు, వంటసామగ్రి, ఇతర వస్తువులను ఎనిమిది గాడిదలపై వేసుకొని ముందుకు సాగుతున్నారు. చీకటి పడే సమయానికి సత్రం ఉన్న ఒక గ్రామానికి చేరారు. గాడిదలు ఎటూ పారిపోకుండా ఉండటానికి శిష్యులను వాటిని కట్టివేయమన్నారు గురువుగారు. వారు తమ దగ్గర ఉన్న ఒకే ఒక తాడుతో ఏడు గాడిదల కాళ్లను కలుపుతూ కట్టివేసి ఎనిమిదవ దాన్ని కట్టడానికి ప్రయత్నించారు. కాని, ఎంత లాగి కట్టాలనుకున్నా తాడు చాలడం లేదు. తన శిష్యులు పడుతున్న పాట్లను చూస్తున్న గురువుగారు 'ఏడు గాడిదలకు తాడు ఎలా కట్టారో అలాగే ఎనిమిదో గాడిద కాలికి కూడా తాడు కట్టినట్టు నటించండి' అని ఆదేశించారు. శిష్యులు అలాగే చేశారు. తన కాలికి కూడా తాడు కట్టారనుకున్న తలంపుతో ఎనిమిదో గాడిద మిగిలిన గాడిదలతో సహా ఉన్న చోటనే రాత్రంతా నిల్చునుంది. అనంతరం గురుశిష్యులు కబుర్లు చెప్పుకొంటూ నిద్రలోకి జారుకున్నారు. తెల్లవారింది. శిష్యులు ఏడు గాడిదల కాళ్ళకు ఉన్న కట్లను విప్పారు. అవి నడవసాగాయి. కానీ ఎనిమిదో గాడిద ఉన్న చోటనే నిల్చుని ఉంది. శిష్యులకు ఏమీ అర్థం కాలేదు. గురువు గారి వంక చూశారు. అప్పుడు ఆయన 'మీరు దాని కాలికి తాడు కడుతున్నట్టు నటించారు కదా. అలాగే ఇప్పుడు తాడుని విప్పుతున్నట్టూ నటించండి. అప్పుడే అది అక్కడి నుంచి కదులుతుంది' అన్నారు. శిష్యులు అలాగే చేశారు. మరుక్షణం గాడిద ముందుకు కదిలింది.



గాడిదల ప్రవర్తనను అంత కచ్చితంగాఎలా ఊహించగలిగారని ఆశ్చర్యంతో అడిగారు శిష్యులు. 'మనుషులను చూస్తేనే అర్థం చేసుకోవచ్చు. చాలామంది ఏదో అడ్డుగా ఉందనుకుని ముందడుగు వేయడానికి ఆలోచిస్తూ మీనమేషాలు లెక్కిస్తుంటారు. ఎవరో వచ్చి అడ్డంకులేవీ లేవని చెప్పినప్పుడు, అలాగా అనుకుని ఎనిమిదో గాడిదలాగా ప్రవర్తిస్తారు. అది సహజం. అంతే తప్ప ఆశ్చర్యపోవడానికేమీ లేద'న్నారు గురువుగారు.

– యామిజాల జగదీశ్

అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో వికాస్ హాస్పిటల్స్



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో అత్యాధునిక వైద్య సేవలను అందరికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు గుంటూరులో వికాస్ హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్నట్లు హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు చెప్పారు. బుధవారం గుంటూరు మార్కెట్ సెంటర్ కలెక్టరేట్ రోడ్డులో 100 పడకలతో నూతనంగా నిర్మించిన వికాస్ హాస్పిటల్స్‌ను మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు మద్దాళిగిరిధర్, కిలారి రోశయ్య, నంబూరు శంకరరావు, బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా తదితరులు హాజరై ప్రారంభించారు. మంత్రి రజిని మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సేవలు ఒకేచోట అందుబాటులో ఉండటం ద్వారా రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతోందన్నారు. మంత్రి అంబటి మాట్లాడుతూ సేవాభావంతో వైద్యులు ప్రజలకు సేవలందించాలన్నారు. గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, నెఫ్రాలజీ, వాసిక్యూలర్ సర్జరీ, ఎనస్తీషియా క్రిటికల్ కేర్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూరో సర్జరీ, రొమటాలజీ, దంత వైద్య సేవలు, రేడియోలజీ, ఫిజియోథెరఫీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

మండపాల నిర్మాణాలను 'ఆర్కియాలజీ' పర్యవేక్షణలోనే చేపట్టాలి

ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి డిమాండ్



తిరుపతి కల్చరల్: తిరుమలలోని పార్వేటి మండపం తొలగించి యథావిధిగా నిర్మిస్తామని టీటీడీ ఇష్టానుసారంగా చేసిందని, ఇప్పుడు అలిపిరి వద్ద మండపాన్ని తొలగిస్తామని చెప్పడం సరికాదని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. బుధవారం తిరుపతిలోని అలిపిరిని సందర్శించిన ఆమె మీడియాతో మాట్లాడారు. 75 ఏళ్ల పూర్తయిన ఈ మండపాలను తొలగించాలంటే పురావస్తుశాఖ అనుమతి, పర్యవేక్షణ తప్పనిసరన్నారు. అలిపిరిలోని మండపాన్ని ఏమి చేయాలన్నా టీటీడీ ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షణలోనే చేయాలని, లేని పక్షంలో బీజేపీ తప్పకుండా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు. ఆలయాల్లో దళిత అర్చకులకు నిలిపివేసిన సంభావనను కొనసాగించాలని డిమాండ్ చేశారు. టీటీడీ నిధులను సనాతన ధర్మ అభ్యున్నతికే ఖర్చు చేయాలన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతోన్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధిని వివరించే కార్యక్రమాన్ని తిరుపతి నుంచే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తాతయ్యగుంట గంగమ్మను పురందేశ్వరి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు . ఈ సందర్భంగా ఆమె ఆలయ ప్రాంగణంలో తన కారుని నిలిపి అక్కడే చెప్పులను విడిచారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో పురందేశ్వరి పాదరక్షలు ధరించడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

మధుర జ్ఞాపకాలను పంచేది ఫొటోగ్రఫీ

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు నుంచి అవార్డులు అందుకుంటున్న ఫొటోగ్రాఫర్లు

కృష్ణలంక (విజయవాడ తూర్పు): మధుర జ్ఞాపకాల్ని పంచేదే ఫొటోగ్రఫీ అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవ వేడుకలు–2023 ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మన్మథరావు మాట్లాడుతూ.. మనసును హత్తుకునే భావాన్ని చెప్పగలిగే ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అంతర్జాతీయ చిత్రకారుడు పద్మశ్రీ ఎస్‌పీ రామారావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు తదితరులు మాట్లాడారు. అనంతరం గత నెల 24న నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ చూపిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని ఫొటో జర్నలిస్టులకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐఐపీసీ డిజిటల్ అండ్ ఫొటో జర్నలిజం డివిజన్స్ చైర్మన్ టి.శ్రీనివాసరెడ్డి, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ నరేంద్ర, జీఆర్‌కే పోలవరపు, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు జి.నారాయణరావు పాల్గొన్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు: ఫొటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ చూపిన ఆరుగురు 'సాక్షి' ఫొటోగ్రాఫర్లకు జస్టిస్ మన్మథరావు చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. ఫొటో జర్నలిజం విభాగంలో మూడో బహుమతిని వి.రూబెన్ బెసాలియల్, అదే విభాగంలో మెమోరియల్ అవార్డును ఎండీ నవాజ్, పి.విజయకృష్ణ, ఫెస్టివల్ విభాగంలో మూడో బహుమతిని సనకా లక్ష్మీపవన్ అందుకున్నారు. వడ్డే శ్రీనివాసులు, ఎం.ప్రసాద్ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు.

• తెలంగాణ

మధుమేహానికి నోటి ద్వారా ఇన్సులిన్

సాక్షి, హైదరాబాద్: మధుమేహంతో బాధపడుతున్నవారు తరచూ ఇన్సులిన్ ఇంజెక్షన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. ఇది ఇబ్బందికరం. ఈ బాధకు చెక్ పెడుతూ నోటి ద్వారా ఇన్సులిన్ తీసుకోగలిగే కొత్త విధానం అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో నీడ్‌ల్‌ఫ్రీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు డాక్టర్ కె.కోటేశ్వర్‌రావు, సీఏ విశ్వనాథ్ తోషినివాల్, డాక్టర్ జితేంద్ర అంబుల్జే వివరాలు వెల్లడించారు. ప్రపంచంలో ఓరల్ ఇన్సులిన్ మందుపై అనేక పరిశోధనలు జరిగినా ఎక్కడా సఫలం కాలేదని, తాము మాత్రం సఫలీకృతం చేయగలిగామని తెలిపారు. 2025–26 నాటికి ఓరల్ ఇన్సులిన్ మందును మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే మనుషులపై క్లినికల్ ట్రయల్స్ ప్రారంభిస్తున్నామన్నారు. ఈ ఔషధానికి పేటెంట్ హక్కులు తీసుకున్నామని, ఇండియాలో అనుమతి కోసం దరఖాస్తు చేశామని వివరించారు.

అయోధ్య రామయ్య పాదుకలకు భద్రాద్రిలో పూజలు

75 రోజుల పాదయాత్ర ప్రారంభం

భద్రాచలం: అయోధ్య రామయ్యకు చేయించిన బంగారుపూత పాదుకలకు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో, విశాఖ శ్రీ సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి శ్రీ రామానంద భారతీస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతేకాక 75 రోజుల్లో అయోధ్యకు చేరుకునేందుకు చేపట్టిన పాదయాత్ర బుధవారం భద్రాచలం చేరుకుంది. హైదరాబాద్‌లోని భాగ్యనగర్ సీతారామ ఫౌండేషన్ చైర్మన్ చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో అయోధ్య రామయ్యకు 9 కేజీల సువర్ణ పూత వెండి పాదుకలను తయారు చేయించారు. వీటిని అయోధ్యకు తరలించేందుకు గత నెల 28న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పాదయాత్ర ప్రారంభించారు. భద్రాద్రిలో పూజల అనంతరం శ్రీ రామానంద భారతీ స్వామి మాట్లాడుతూ.. శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర నాసిక్, త్రయంబకేశ్వరం, చిత్రకూట్, ప్రయాగ మీదుగా 2 వేల కిలోమీటర్లు సాగి అయోధ్య చేరుకుంటుందని చెప్పారు. జనవరి 15న అయోధ్య చేరుకుని, 22న అయోధ్య ఆలయంలో ప్రాణ ప్రతిష్ట జరగనుందని తెలిపారు. టీటీడీ ఎస్వీబీసీ అడ్వైజర్ అడపా దుర్గ వారికి స్వాగతం పలికారు.



హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. విజయ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ ఎన్. హరినాథ్‌లను సన్మానిస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు

నూతన న్యాయమూర్తులకు ఘనంగా సన్మానం

హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ



న్యాయమూర్తి జస్టిస్ సుమతిని సత్కరిస్తున్న సీజే ధీరజ్ సింగ్ ఠాకూర్



న్యాయమూర్తి జస్టిస్ జి. నరేందర్‌ను సత్కరిస్తున్న సీజే ధీరజ్ సింగ్ ఠాకూర్

సాక్షి, అమరావతి: ఇటీవల రాష్ట్ర హైకోర్టుకు నూతన న్యాయమూర్తులుగా నియమితులైన ఐదుగురిని హైకోర్టు న్యాయవాదుల సంఘం బుధవారం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సంఘం కార్యవర్గ సభ్యులు, సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ చేతుల మీదుగా కొత్త న్యాయమూర్తులను సన్మానించారు. వారికి విజయవాడ కనకదుర్గ అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్ సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



గుంటూరులో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల భారీ ర్యాలీ

గుంటూరులో విద్యార్థుల భారీ ర్యాలీ

పట్నంబజారు (గుంటూరుఈస్ట్): విద్యా సాధికారత జగనన్నతోనే సాధ్యమని గుంటూరు వేదికగా విద్యార్థి లోకం గొంతెత్తి నినదించింది. పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం ''వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్'' కార్యక్రమంలో భాగంగా గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం, శంకర్‌విలాస్, ఓవర్‌బ్రిడ్జి, ఏసీ కళాశాల మీదుగా హిందూ కాలేజ్ సెంటర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ''మా బతుకులు మారాలంటే.. మా తలరాతలు మేమే రాసుకోవాలంటే.. ఉన్నత విద్య, అత్యున్నత ఉద్యోగ అవకాశాలతో మా జీవన స్థితిగతులలో సమూలమైన మార్పు రావాలంటే.. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి'' అంటూ విద్యార్థులు నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ.. విద్యారంగం అభివృద్ధికి జగనన్న ఏమేం చేశారో చెప్పడానికే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అనేక పథకాలతో రాష్ట్రంలో అక్షరకాంతులు పూయిస్తున్నారన్నారు. రాష్ట్రానికి మళ్లీ మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర అవతరణ దినోత్సవాన గుంటూరు వేదికగా విద్యార్థి లోకం గర్వంగా గొంతెత్తి చాటిచెప్పడం శుభపరిణామమని అన్నారు. ర్యాలీలో విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్లు విఠల్, మనోహర్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు వినోద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిరాజ్, నాయకులు గంటి, రవి, బాజీ, జగదీష్, వలి, బంటి, మహేష్, అజయ్, కరీమ్, కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు యూనిట్లతో మరింత చౌకగా విద్యుత్

ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ

మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా): పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో అదనపు యూనిట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ చెప్పారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం వద్ద జరుగుతోన్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నిర్మాణం పూర్తయితే రాష్ట్రానికి మరింత చౌకగా జలవిద్యుత్ ఉత్పత్తి లభిస్తుందని చెప్పారు. కొత్త యూనిట్ల నిర్మాణానికి సంబంధించి పరికరాలను బీహెచ్‌ఈఎల్ సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో 5, 6 యూనిట్ల పరికరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. అప్పటి వరకు పెన్‌స్టాక్ పైపులు పొల్లూరు వద్ద తయారు చేస్తారని తెలిపారు. కొత్త యూనిట్ల నిర్మాణానికి పరికరాలు వచ్చేలోపు కాంక్రీట్, సివిల్ పనులు పూర్తి చేస్తారని తెలిపారు. అప్పర్ సీలేరు వద్ద నిర్మించే ఎత్తిపోతల పథకానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపించామని తెలిపారు. అనుమతులు రాగానే టెండర్లు నిర్వహించి యుద్ధప్రతిపాదికన పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

పీఎం స్వనిధిలోనూ అక్క చెల్లెమ్మలదే అగ్రస్థానం



పీఎం స్వనిధి కింద జాతీయ స్థాయిలో రుణగ్రహీతలు ఇలా	
ఓబీసీ	44 శాతం
జనరల్	26 శాతం
ఎస్సీలు	19 శాతం
మైనారిటీలు	8 శాతం
ఎస్టీలు	3 శాతం

రాష్ట్రంలో పీఎం స్వనిధి కింద రుణగ్రహీతలు ఇలా	
ఓబీసీ	57 శాతం
జనరల్	19 శాతం
ఎస్సీలు	15 శాతం
మైనారిటీలు	7 శాతం
ఎస్టీలు	2 శాతం

వివిధ రాష్ట్రాల్లో పీఎం స్వనిధి రుణగ్రహీతల్లో చురుగ్గా వ్యయం చేస్తున్న వారి శాతం

రాష్ట్రం	శాతం
పంజాబ్	32
ఆంధ్రప్రదేశ్, తమిళనాడు	28
రాజస్థాన్, కర్ణాటక, హరియాణ	25
ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కేరళ	24
తెలంగాణ, ఛత్తీస్‌గఢ్	23
మహారాష్ట్ర, బీహార్	22
మధ్యప్రదేశ్, ఒడిశా	20

దేశంలోనే తొలి స్థానంలో ఉన్న ఏపీ మహిళలు

- ఈ రుణ గ్రహీతల్లో రాష్ట్రంలో 74 శాతం మంది మహిళలే
- జాతీయ స్థాయిలో మహిళలు 43 శాతమే
- సీఎం జగన్ లక్ష్యాల్లో ఒకటైన మహిళా సాధికారత కనుల ముందుకు
- సీఎం జగన్ ప్రోత్సాహంతో అన్ని రంగాల్లో వృద్ధి చెందుతున్న మహిళలు
- ఈ రుణాల సద్వినియోగంలోనూ రాష్ట్రానిది రెండో స్థానం
- రాష్ట్రంలో 4.02 లక్షల దరఖాస్తులకు రూ. 528.85 కోట్లు రుణం మంజూరు
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యున్నత లక్ష్యాల్లో ఒకటైన మహిళా సాధికారత ఈ నాలుగున్నరేళ్ల సుపరిపాలనలో కళ్ల ముందు కనిపిస్తోంది. వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మలు అన్ని రంగాల్లోనూ ముందడుగు వేస్తున్నారు. చిన్న వ్యాపారులు, సూక్ష్మ పరిశ్రమలకు కేంద్రం అందించే పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకొని, కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవడంలోనూ రాష్ట్ర మహిళలు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. రాష్ట్రంలోని పీఎం స్వనిధి రుణగ్రహీతల్లో 74 శాతం మహిళలే. పురుషులు 26 శాతం ఉన్నారు. జాతీయ స్థాయిలో 57 శాతం పురుషులు ఈ రుణాలు తీసుకుంటుండగా, మహిళలు 43 శాతమే ఉన్నారు. ఎస్‌బీఐ రీసెర్చి నివేదిక ఈ వాస్తవాలను వెల్లడించింది.

ఈ రుణాలను చురుగ్గా సద్వినియోగం చేసుకోవడంలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉంది. జాతీయ స్థాయిలో రుణాలను చురుగ్గా ఖర్చు చేస్తున్న లబ్ధిదారులు 22 శాతం మంది కాగా, ఏపీలో వీరు 28 శాతమని ఎస్‌బీఐ రీసెర్చి నివేదిక తెలిపింది. తొలి స్థానంలో ఉన్న పంజాబ్ రాష్ట్రంలో 32 శాతం మంది చురుగ్గా వ్యయం చేస్తున్నట్లు పేర్కొంది. అతి తక్కువగా పశ్చిమ బెంగాల్‌లో 17 శాతం మంది, జార్ఖండ్‌లో 18 శాతం మందే చురుగ్గా వ్యయం చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది.

లక్ష్యానికి మించి రుణాలు

తొలి దశలో రూ.10 వేల చొప్పున దేశవ్యాప్తంగా 50 లక్షల మందికి రుణాలివ్వాలని కేంద్రం నిర్ణయించినప్పటికీ, డిమాండ్ భారీగా ఉండడంతో ఈ ఏడాది డిసెంబర్ నాటికి 63 లక్షల మందికి ఇవ్వాలని నిర్ణయించింది. మొత్తం మూడు దశల్లో 88.5 లక్షల రుణాలివ్వాలని నిర్ణయించింది. అదేవిధంగా రాష్ట్రంలో తొలి దశలో 2,30,000 మందికి వర్తింపజేయాలని నిర్ణయించగా ఇప్పుడు ఈ లక్ష్యాన్ని 3,15,000కు పెంచింది. రెండో దశలో 1,34,200 మందికి, మూడో దశలో 18,900 మందికి రుణాలు లక్ష్యంగా నిర్దేశించింది. డిసెంబర్ నెలాఖరుకి ఈ లక్ష్యాలు చేరాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు మూడు దశల్లో కలిపి రాష్ట్రంలో 4,02,718 దరఖాస్తులకు రూ.528.85 కోట్లు రుణాలు మంజూరు చేశారు. రాష్ట్రంలో ఈ రుణాలను 15 రోజుల్లోగా బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి. దరఖాస్తుదారుల్లో సగటు వయస్సు 42 సంవత్సరాలుగా ఉంది.

ఇదీ పథకం

దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని వీధి వ్యాపారులకు సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కోవిడ్ మహమ్మారి సమయంలో 2020 జూన్‌లో 'ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి)'ని ప్రవేశపెట్టింది. వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఈ రుణాలు అందజేస్తారు. ఈ పథకం కింద బ్యాంకుల ద్వారా తొలుత రూ.10 వేలు రుణ సాయం చేస్తారు. ఈ రుణాన్ని సకాలంలో చెల్లించిన వారికి వ్యాపారాభివృద్ధి కోసం రెండో దశలో రూ. 20 వేలు, మూడో దశలో రూ. 50 వేలు మంజూరు చేస్తారు. వీరికి కేంద్రం వడ్డీలో ఏడు శాతం రాయితీ కూడా ఇస్తుంది.

జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరాలయం



కృష్ణాజలాల నుంచి బయటపడుతున్న ప్రాచీన సంగమేశ్వరాలయం

కొత్తపల్లి(నంద్యాల): కృష్ణాజలాల నుంచి ప్రాచీన సంగమేశ్వరాలయం బయట పడుతోంది. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. బుధవారం నాటికి నీటిమట్టం 885 అడుగుల నుంచి 843.93 అడుగులకు చేరుకుంది. మరో మూడు అడుగుల మేర నీటిమట్టం తగ్గితే సంగమేశ్వరాలయం పూర్తిగా బయట పడనుంది. ఒక ఏడాదిలో ఆలయం ఇంత త్వరగా బయటపడడం ఇదే ప్రథమం.

క్యాషియర్‌ను కత్తితో బెదిరించి రూ.6.50 లక్షలు దోపిడీ

- నరసాపురం ఎస్‌బీఐలో పట్టపగలు ఓ ఆగంతకుడి దుశ్చర్య
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు



నరసాపురం బజార్ బ్రాంచ్ ఎస్‌బీఐలో క్యాషియర్ గదిలో నగదు దోచుకెళుతున్న ఆగంతకుడు

నరసాపురం: పట్టపగలు మిట్ట మధ్యాహ్నం.. ముఖానికి మాస్క్, తలకు టోపీ పెట్టుకుని స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు క్యాషియర్‌ను కత్తితో బెదిరించి రూ.6.50 లక్షల నగదు దోచుకెళ్లిన ఘటన సంచలనం సృష్టించింది. నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరాచారి తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని జోశ్యులవారి వీధిలో ఉన్న ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్‌లోకి మధ్యాహ్నం 3.22 గంటల సమయంలో ఓ ఆగంతకుడు ప్రవేశించాడు. అదే సమయంలో క్యాషియర్ కనకదుర్గ, మరో మహిళా ఉద్యోగి బ్యాంకు సొమ్ము లెక్కిస్తున్నారు. గమనించిన ఆగంతకుడు అకస్మాత్తుగా రూమ్‌లోకి వెళ్లి.. వారిని కత్తితో బెదిరించి టేబుల్‌పై ఉన్న రూ.7.50 లక్షలను తీసుకుని బయటకు పరుగులు తీశాడు. అయితే ఆగంతకుడు బయటకు పారిపోయే క్రమంలో బ్యాగ్‌లోంచి రెండు రూ.500 కట్టలు రెండు (రూ.లక్ష)బ్యాంకు ఆవరణలోనే పడిపోయినట్లు బ్యాంకు సిబ్బంది సీసీ ఫుటేజ్‌లో గుర్తించారు. దీంతో రూ.6.50 లక్షలను దోచుకెళ్లినట్లు తేల్చారు. కాగా, దోపిడీ ఘటన జరిగే సమయానికి బ్యాంకులో కాపలాదారుడు కూడా అందుబాటులో లేడు. డీఎస్పీ రవిమనోహరాచారి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

• తెలంగాణ

కాంగ్రెస్‌లోకి వివేక్... బీజేపీకి గుడ్ బై

వివేక్, ఆయన కుమారుడు వంశీకృష్ణను పార్టీలోకి ఆహ్వానించిన రాహుల్‌గాంధీ

సాక్షి, హైదరాబాద్, శంషాబాద్: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ వివేక్ వెంకటస్వామి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీ లో చేరారు. బీజేపీకి బరువైన హృదయంతో రాజీనామా చేస్తున్నట్టు, పార్టీలో ఉన్నప్పుడు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి రాజీనామా లేఖ పంపించారు. బుధవారం నోవాటెల్ హోటల్‌లో వివేక్, ఆయన కుమారుడు వంశీకృష్ణకు కండువా కప్పి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్టీలోకి ఆహ్వానించారు. ఉదయం తన కుటుంబసభ్యులతో హోటల్‌కు చేరుకున్న వివేక్.. ముందుగా రాహుల్‌గాంధీతో సమావేశమయ్యారు. ఆ తర్వాత బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. ఆయన వెంట ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరాలంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆహ్వానించడంతో అందుకు అంగీకారం తెలిపినట్లు వివేక్ చెప్పారు. కాగా పలు దఫాలుగా వివేక్‌తో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీనేత భట్టి విక్రమార్క చర్చలు జరిపిన దరిమిలా ఈ కీలక పరిణామం చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. వివేక్‌కు, ఆయన కుమారుడు వంశీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ ఒక అసెంబ్లీ టికెట్, ఒక లోక్‌సభ సీటు కేటాయించనున్నట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు నుంచి వివేక్ నిలబడే అవకాశముందని, పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని ఆయన కుమారుడికి కేటాయించే విషయంపై అంగీకారం కుదిరిందని కాంగ్రెస్ వర్గాల సమాచారం.

'రెరా' చట్టానికి లోబడే నిర్మాణాలుండాలి

- ఇష్టానుసారం రియల్ ప్రాజెక్టుల ప్లాన్ల మార్పు కుదరదు
- నిర్మాణ లోపాలకు బిల్డర్లదే బాధ్యత
- 'రెరా'చైర్మన్ సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: స్థిరాస్తి వ్యాపారులు 'రెరా'చట్టానికి లోబడే నిర్మాణాలు జరపాలని, వినియోగదారుల తో పారదర్శకంగా వ్యవహరించాలని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్ ఎన్.సత్యనారాయణ స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లు అందరూ విధిగా 'రెరా' లో రిజిస్టర్ కావాలన్నారు. బుధవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రియల్ ఎస్టేట్, హైదరాబాద్ రియల్టర్స్ అసోసియేషన్ ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన 'రెరా కాంక్లేవ్'కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యనారాయణ మాట్లాడుతూ, రెరా'లో రిజిస్టర్ చేయించి తమ ఇష్టానుసారంగా నిర్మాణాలు జరిపి చేతులు దులుపుకుంటే ఎంతమాత్రం కుదరదని హెచ్చరించారు. నిర్మాణ లోపాలుంటే బిల్డరే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వినియోగదారుల అనుమతి లేనిదే ప్రాజెక్టు ప్లానును తమ ఇష్టానుసారం మార్చడానికి వీలు లేదని స్పష్టం చేశా రు. రెరాలో రిజిస్టర్ కాకుండా ప్రకటన లు జారీచేస్తూ వ్యాపార కార్యకలాపాలు జరిపే ఏజెంట్లు, బిల్డర్లు చట్ట ప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు. రెరా' చట్టంపై హైదరాబాద్ రియల్టర్స్ అసోసి యేషన్ ఏర్పాటు చేసిన 'రెరా కియాస్క్' ను చైర్మన్ పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నారెడ్కో నేషనల్ ప్రెసిడెంట్ జి.హరిబాబు, తెలంగాణ నారెడ్కో ప్రెసిడెంట్ సునీల్ చంద్రారెడ్డి, సెక్రటరీ విజయసాయి తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు వరద తాకిడి

- ఒక క్రస్ట్ గేటు ఎత్తివేత
- ఎగువ నుంచి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టుకు బుధవారం ఎగువ ప్రాంతాల నుంచి వరదనీటి రాక పెరగడంతో అధికారులు ఒక క్రస్ట్ గేటును పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ ఎగువ ప్రాంతాలలో అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతో మూసీ రిజర్వాయర్‌కు 680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటిమట్టం 644.92 అడుగుల వద్ద ఉంది. అధికారులు బుధవారం ప్రాజెక్టు ఒక క్రస్టు గేటును అర అడుగు పైకెత్తి.. 335 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.44 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం

సింధియా(విశాఖ పశ్చిమ): భారత నావికాదళంలోని తూర్పు నావికా విభాగం బ్రహ్మోస్ క్షిపణిని బుధవారం విజయవంతంగా పరీక్షించింది. బంగాళాఖాతంలో పరీక్షలో భాగంగా నావికాదళానికి చెందిన విధ్వంసకనౌక నుంచి ఈ క్షిపణిని ప్రయోగించారు. ఈ క్షిపణి నిర్దేశించిన కచ్చిత పరామితులను అందుకుందని ఇండియన్ నేవీ ఒక ప్రకటనలో పేర్కొంది. పరీక్ష తాలూకు ఫొటోను భారత నేవీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసింది.

విపక్ష నేతలందరినీ అరెస్టు చేసే కుట్ర: మమత

కోల్‌కతా: కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ సర్కారుపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ బుధవారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోగా విపక్ష నేతలందరినీ కేసుల్లో ఇరికించి జైలుపాలు చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. అలా ప్రత్యర్థులంటూ ఎవరూ లేకుండా చేసుకుని ఎన్నికలకు వెళ్లాలని చూస్తోందని మీడియాతో మాట్లాడుతూ మండిపడ్డారు. ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు మద్యం విధానం కుంభకోణం కేసులో గురువారం విచారణకు రావాల్సిందిగా ఈడీ సమన్లివ్వడం తెలిసిందే. ఇలాగే పలు కేసుల్లో పలువురు విపక్ష నేతలు కూడా ఇప్పటికే దర్యాప్తు సంస్థల నోటీసులు అందుకున్నారు. వీటిని ఉద్దేశించి మమత ఈ ఆరోపణలు చేశారు.

అరెస్టు కానున్న నేతలు వీరే: ఆప్

కోల్‌కతా: మమత ఆరోపణలు వాస్తవమేనని ఆప్ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల్లోపు విపక్ష ఇండియా కూటమి నేతలందరినీ ఏదోలా జైలుపాలు చేయాలని మోదీ సర్కారు కుట్ర చేస్తోందని ఆ పార్టీ నేత రాఘవ్ ఛద్దా ఆరోపించారు. తొలుత తమ అధినేత కేజ్రీవాల్‌ను అరెస్టు చేయజూస్తోందన్నారు. 2014 నుంచి దర్యాప్తు సంస్థలు నమోదు చేసిన కేసుల్లో ఏకంగా 95 శాతం విపక్ష నేతలపైనే కావడం మోదీ సర్కారు కక్షపూరిత వైఖరిని అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. ''ఇండియా కూటమి ఆవిర్భావంతో బీజేపీ వణికిపోతోంది. అందుకే విపక్ష కూటమిలోని అగ్ర నేతలందరినీ లక్ష్యంగా చేసుకుందని మాకు విశ్వసనీయ వర్గాల నుంచి ఇప్పటికే సమాచారం అందింది. ''కేజ్రీవాల్ తర్వాత జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీలను అరెస్టు చేయడం మోదీ సర్కారు లక్ష్యం. వారి తర్వాత జాబితాలో కేరళ సీఎం పినరయ్ విజయన్, తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్, శివసేన, ఎన్సీపీల అగ్ర నేతలున్నారు'' అని ఆరోపించారు.

ఉత్తర కొరియా నుంచి రష్యాకు ఆయుధాలు

సియోల్: ఉత్తర కొరియా పెద్ద సంఖ్యలో ఆయుధాలను రష్యాకు సరఫరా చేస్తోందని దక్షిణ కొరియా నిఘా సంస్థ 'నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్' బుధవారం వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు 10 లక్షలకుపైగా ఆర్టిలరీ షెల్స్‌ను రష్యాకు పంపించిందని పేర్కొంది. ఉక్రెయిన్‌పై యుద్ధంలో ఈ ఫిరంగి గుండ్లను రష్యా ఉపయోగిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేసింది. అమెరికాతోపాటు పశ్చిమ దేశాల నుంచి ఆంక్షలను ఎదుర్కొంటున్న ఉత్తర కొరియా, రష్యా సంబంధాలు నానాటికీ బలపడుతున్నాయి. ఇరు దేశాలు కలిసి పని చేస్తున్నాయి. ఉక్రెయిన్‌పై సుదీర్ఘ యుద్ధం కొనసాగిస్తున్న రష్యా వద్ద ఆయుధ నిల్వలు నిండుకుంటున్నాయి. దాంతో ఉత్తర కొరియా ఆయుధ సాయం అందిస్తోంది. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్, రష్యా అధ్యక్షుడు పుతిన్ సెప్టెంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయుధాల సరఫరా విషయంలో వారిద్దరి మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది.

మరాఠా రిజర్వేషన్లకు ఓకే : ఏక్‌నాథ్ షిండే



ముంబై: విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో మరాఠాలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. రిజర్వేషన్ల అమ లు విషయంలో చట్టపరిధిలో విధివిధానాలు ఖరారు చేయడానికి కొంత సమయం అవసరమని చెప్పారు. రిజర్వేషన్ల అంశంపై మరాఠా ప్రజలంతా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి షిండే నేతృత్వంలో బుధవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. రిజర్వేషన్ల కోసం మరాఠాలు చేపడుతున్న ఆందోళనలు, జరుగుతున్న హింసాకాండపై చర్చించారు. నిరవధిక దీక్ష విరమించాలని సామాజిక కార్యకర్త మనోజ్ జారంగీని కోరుతూ అఖిలపక్ష భేటీలో ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఈ తీర్మానంపై ముఖ్యమంత్రి షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, శివసేన(ఉద్ధవ్‌వర్గం) నాయకుడు అనిల్ పారబ్ తదితరులు సంతకాలు చేశారు. అనంతరం సీఎం షిండే మీడియాతో మాట్లాడారు. హింసకు దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరించవద్దని రాజకీయ పార్టీలకు సూచించారు.

రిజర్వేషన్లకు ఇంకా సమయం ఎందుకు?

ముంబై: మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించే విషయంలో జాప్యం చేయడం తగదని ఉద్యమకారుడు మనోజ్ జారంగీ చెప్పారు. రిజర్వేషన్లు అమలు చేయడానికి ఇంకా సమయం ఎందుకు కావాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎప్పటి నుంచి రిజర్వేషన్లు అమలు చేస్తారో స్పష్టంగా చెప్పాలని బుధవారం డిమాండ్ చేశారు. మనోజ్ జారంగీ జాల్నా జిల్లా అంతర్వాలీ శరతి గ్రామంలో నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తనతో చర్చలకు రావాలని ఆయన సూచించారు.

సెల్యులాయిడ్‌పై సిద్ధూ మూసేవాలా జీవితం!

ముంబై: పంజాబ్ యువ గాయకుడు, దివంగత సిద్ధూ మూసేవాలా జీవితగాథ త్వరలో సినిమాగా తెరకెక్కే అవకాశముంది. సిద్ధూ మూసేవాలా తన జీవితంలో చవిచూసిన పేరుప్రఖ్యాతలు, గ్యాంగ్‌స్టర్ల బెదిరింపులు, విషాదం అన్నింటినీ స్పృశిస్తూ జుపిందర్‌జీత్ సింగ్ రాసిన 'హూ కిల్డ్ మూసేవాలా? ది స్పైరలింగ్ స్టోరీ ఆఫ్ వాయలెన్స్ ఇన్ పంజాబ్' పుస్తకంపై హక్కులను చిత్ర నిర్మాణరంగ సంస్థ మ్యాచ్‌బాక్స్ షాట్స్ కొనుగోలుచేసింది. మూసేవాలా జీవితాన్ని వెబ్ సిరీస్‌గా లేదంటే సినిమాగా తెరకెక్కించే అవకాశముంది. 'శుభ్‌దీప్ సింగ్ సిద్ధూ.. సిద్ధూ మూసేవాలాగా ఎదిగిన క్రమాన్ని ఈ పుస్తకం అద్భుతంగా ఆవిష్కరించింది. పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ల ఆధిపత్యం, వారి మధ్య మనస్పర్థలు, మాదకద్రవ్యాల వినియోగం, పంజాబ్‌లో సంగీత ప్రపంచం వెనుక దాగి ఉన్న చీకటి కోణాలనూ ఈ పుస్తకం చూపించింది' అని మ్యాచ్‌బాక్స్ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

50 శాతం కమీషన్ల పాలన: కమల్‌నాథ్

నర్సింగాపూర్: మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్ పాలనలో 50 శాతం కమీషన్ల రాజ్యం నడుస్తోందంటూ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ ఆరోపించారు. చౌహాన్ అవినీతి పాలన రాష్ట్ర భవిష్యత్తును అంధకారమయం చేసిందన్నారు. బుధవారం నర్సింగాపూర్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో యువత, రైతులు, అన్ని సామాజిక వర్గాల భవిష్యత్తును బీజేపీ పాలన సర్వనాశనం చేసిందన్నారు. కేవలం బీజేపీ నేతలు, అధికార పెద్దలు మాత్రమే అభివృద్ధి చెందారని ఆరోపించారు. 18 ఏళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి వ్యవస్థ వంటివన్నీ పూర్తిగా పట్టాలు తప్పాయన్నారు. అబద్ధపు పథకాలను ప్రకటించనిదే చౌహాన్‌కు నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు.

గాజా రక్తసిక్తం

ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడులు

- జబాలియా శరణార్థి శిబిరంపై నిప్పుల వాన
- నేలమట్టమైన భవనాలు
- 50 మందికిపైగా మృతి.. వందలాది మందికి గాయాలు
- గాజా నుంచి వెళ్లిపోవడానికి విదేశీయులకు అనుమతి
- క్షతగాత్రులకు ఈజిప్టులో చికిత్స





జబాలియా శిబిర శిథిలాల్లో చిక్కుకున్న బాలికను బయటకు తీసి ప్రథమ చికిత్స చేశాక ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యాలు

ఖాన్ యూనిస్/రఫా/జెరూసలేం: గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భీకర స్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. భూతల దాడులతోపాటు వైమానిక దళం బాంబులు ప్రయోగిస్తోంది. గాజా రక్తసిక్తంగా మారుతోంది. హమాస్ మిలిటెంట్లతోపాటు వందలాది మంది సాధారణ ప్రజలు మృత్యువాత పడుతున్నారు. మృతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. గాజా సిటీ సమీపంలో జబాలియా శరణార్థి శిబిరంలోని అపార్టుమెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం రెండో రోజు బుధవారం కూడా దాడులు సాగించింది. పలు భవనాలు నేలమట్టమయ్యాయి. క్షతగాత్రులుగా మారి రక్తమోడుతున్న మహిళలను, చిన్నపిల్లలను శిథిలాల నుంచి బయటకు తీసుకొస్తున్న దృశ్యాలు కనిపించాయి. జబాలియాలో సాధారణ నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన హమాస్ కమాండ్ సెంటర్‌ను, మిలిటెంట్ల సొరంగాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఇక్కడ హమాస్ కీలక కమాండర్‌తోపాటు చాలామంది మిలిటెంట్లు హతమయ్యారని ప్రకటించింది. సాధారణ ప్రజలు 50 మందికిపైగానే మరణించినట్లు, వందలాది మంది గాయాలపాలైనట్లు తెలుస్తోంది. శరణార్థి శిబిరంలో ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)తోపాటు పాకిస్తాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.

గాజాలో భారత సంతతి ఇజ్రాయెల్ సైనికుడు మృతి

గాజాలో హమాస్ మిలిటెంట్లతో జరుగుతున్న ఘర్షణలో భారత సంతతి ఇజ్రాయెల్ సైనికుడు హలెల్ సోలోమాన్ (20) బుధవారం మృతిచెందాడు. దక్షిణ ఇజ్రాయెల్‌లోని డిమోనా పట్టణానికి చెందిన సోలోమాన్ హమాస్ మిలిటెంట్లపై వీరోచితంగా పోరాడుతూ ప్రాణాలు కోల్పోయాడు. అతడి మృతిపట్ల డిమోనా మేయర్ సంతాపం ప్రకటించారు. డిమోనా పట్టణాన్ని 'లిటిల్ ఇండియా'గా పిలుస్తుంటారు. భారత్ నుంచి వలస వచ్చిన యూదులు ఇక్కడ స్థిరపడ్డారు. గాజాలో మిలిటెంట్ల దాడుల్లో ఇప్పటివరకు 11 మంది ఇజ్రాయెల్ సైనికులు మృతిచెందారు. బుధవారం ఒక్కరోజే 9 మంది మరణించారు.

హమాస్ చెరలో 240 మంది బందీలు

ఇజ్రాయెల్ సైన్యం-హమాస్ మిలిటెంట్ల మధ్య ఘర్షణ మొదలై మూడు వారాలు దాటింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 8,700 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారని, 22,000 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ బుధవారం ప్రకటించింది. ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో 122 మంది పాలస్తీనియన్లు చనిపోయారని వెల్లడించింది. హమాస్ చెరలో దాదాపు 240 మంది బందీలుగా ఉన్నారు. ఇప్పటివరకు నలుగురు బందీలను హమాస్ విడుదల చేసింది. బందీగా ఉన్న ఒక ఇజ్రాయెల్ మహిళా జవాన్‌ను ఇజ్రాయెల్ ప్రత్యేక దళాలు విడిపించాయి.

34 మంది జర్నలిస్టులు బలి

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో 34 మంది జర్నలిస్టులు మరణించారని 'రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్' సంస్థ వెల్లడించింది. ఇరు పక్షాలూ యుద్ధ నేరాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గాజాలో పాలస్తీనియన్ జర్నలిస్టులు దారుణ హత్యలకు గురవుతున్నారని, వీటిపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు విచారణ జరపాలని పేర్కొంది. సాధారణ ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో హమాస్ మిలిటెంట్లు మకాం వేస్తున్నారని, తద్వారా ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.

ఇంటర్నెట్, ఫోన్ సేవలకు అంతరాయం

గాజాలో ఇంటర్నెట్, మొబైల్ ఫోన్ సేవలు బుధవారం కొన్ని గంటలపాటు నిలిచిపోయాయి. సాయంత్రానికల్లా పునరుద్ధరించారు. ఇంటర్నెట్, ఫోన్ల సేవలకు తరచూ అంతరాయం కలుగుతుండడం వల్ల సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయని స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి.

ఇజ్రాయెల్‌కు ఆహారం, ఇంధనం ఎగుమతులు ఆపేయండి



గాజాలో సాధారణ పాలస్తీనియన్ల ప్రాణాలను బలిగొంటున్న ఇజ్రాయెల్‌కు తగిన బుద్ధి చెప్పాలని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అన్నారు. ఇజ్రాయెల్‌కు ఆహారం, ఇంధనం ఎగుమతులను తక్షణమే నిలిపివేయాలని బుధవారం ఆస్లామిక్ దేశాలకు పిలుపునిచ్చారు. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న నేరాలకు తక్షణమే అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇజ్రాయెల్‌ను ఏకాకిని చేయాలని, ఆర్థిక సంబంధాలు తెంచుకోవాలని ఇస్లామిక్ దేశాలకు సూచించారు.

విదేశీ పాస్‌పోర్టులు ఉన్నవారికి భారీ ఊరట

ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో గాజా-ఈజిప్టు సరిహద్దును ఎట్టకేలకు తెరిచారు. విదేశీ పాస్‌పోర్టులు కలిగి ఉన్న ప్రజలు గాజా నుంచి రఫా క్రాసింగ్ గుండా ఈజిప్టుకు తరలివెళ్తున్నారు. ఇప్పటికే 150 మందికి పైగా జనం గాజా నుంచి బయటకు వెళ్లిపోయారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్ సైన్యం-హమాస్ మధ్య ఘర్షణ మొదలైన తర్వాత గాజా నుంచి విదేశీయులను బయటకు అనుమతిస్తుండడం ఇదే మొదటిసారి. విదేశీ పాస్‌పోర్టులు కలిగిన 400 మందికి బుధవారం అనుమతి ఇచ్చినట్లు పాలస్తీనా అధికార వర్గాలు తెలిపాయి. మరో బ్యాచ్‌లో మరికొంత మందికి అనుమతి ఇస్తామని వెల్లడించాయి. మరోవైపు గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన 80 మందికిపైగా పాలస్తీనియన్లను చికిత్స కోసం ఈజిప్టుకు తరలించారు. దాదాపు 20 అంబులెన్స్‌లు ఈజిప్టుకు చేరుకున్నాయి. గాయపడిన వారికి చికిత్స అందించడానికి ఈజిప్టు-గాజా సరిహద్దుల్లో తాత్కాలికంగా ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు ఈజిప్టు అధికారులు చెప్పారు. చాలామంది క్షతగాత్రులు ఈజిప్టుకు వెళ్లడానికి తమ వంతు కోసం ఎదురు చూస్తున్నారు.



బాంబుదాడులతో దద్దరిల్లుతున్న గాజా స్ట్రిప్ నుంచి రఫా సరిహద్దు గుండా ఈజిప్ట్‌లోకి అడుగుపెట్టిన పాలస్తీనియన్లు

పలు సమస్యలున్నాయి!

- ఎన్నికల బాండ్ల పథకంపై సుప్రీం
- బాండ్ల కొనుగోలులో పూర్తి గోప్యత లేదు
- అధికార పార్టీ ప్రతీకారానికి దిగే ఆస్కారం
- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్లతో పలు సమస్యలున్నాయంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. విరాళాలు పొందేందుకు పార్టీలన్నింటికీ అవి సమానావకాశం కల్పించకపోతే వివక్షే అవుతుందని అభిప్రాయపడింది. 'అంతేగాక ఈ పథకంలో అస్పష్టత కూడా దాగుంది. బాండ్లు కొనేవారి వివరాలు ఎవరికీ తెలియకుండా సంపూర్ణ గోప్యత పాటించడమూ వీలు కాదు. వారి వివరాలను సంబంధిత బ్యాంకు (ఎస్‌బీఐ), దర్యాప్తు సంస్థలు తెలుసుకునే వీలుంది' అని అభిప్రాయపడింది. అంతేగాక విపక్షాల బాండ్లను కొనేవారిపై అధికార పక్షాలు ప్రతీకారానికి దిగకుండా ఎటువంటి రక్షణా లేదని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆందోళన వెలిబుచ్చారు. ''ఏ పార్టీ ఎంత పవిత్రమైనదో తేల్చడం మా ఉద్దేశం కాదు. ఎన్నికల బాండ్ల పథకానికి రాజ్యాంగ బద్ధత ఉందా లేదా అన్నదానిపై మాత్రమే విచారణ జరుపుతున్నాం'' అని స్పష్టం చేశారు. ఎన్నికల బాండ్ల చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన 4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై సీజేఐ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం బుధవారం రోజంతా విచారణ జరిపింది. ''ఎన్నికల ప్రక్రియలో నల్లధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలన్న ఈ పథకం ఉద్దేశం అభినందనీయమే. కానీ ఈ పథకంలో అతి పెద్ద సమాచార లోపముంది'' అని అభిప్రాయపడింది. ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా, జస్టిస్ గవాయ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా సభ్యులుగా ఉన్నారు.

మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్

- రాజస్తాన్‌లో బీజేపీకి ఆధిక్యం
- తెలంగాణలో బీఆర్ఎస్‌కు మొగ్గు
- టైమ్స్ నౌ-ఈటీజీ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు టైమ్స్ నౌ ఛానల్- ఈటీజీ రీసెర్చ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒపీనియన్ పోల్‌లో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్‌కే ఆధిక్యం ఉన్నట్లు వెల్లడైంది. మధ్యప్రదేశ్‌లో పోటా పోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు స్వల్ప మొగ్గు కనపడుతోంది. బీజేపీ 43.7 శాతం ఓట్లతో 107–115 స్థానాల్లో నెగ్గే అవకాశాలున్నాయని పేర్కొన్న సర్వే.. కాంగ్రెస్ 44.9 ఓట్లతో 112–122 సీట్లు సాధిస్తుందని తేల్చింది. ఇతరులు కేవలం 1–3 స్థానాలకే పరిమితమవుతారని పేర్కొంది. మరోవైపు రాజస్తాన్‌లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యంలో ఉందని టైమ్స్ నౌ సర్వే వెల్లడించింది. 43.8 శాతం ఓట్లతో బీజేపీ 114–124 స్థానాల్లో గెలవనుందని పేర్కొంది. కాంగ్రెస్ 41.9 శాతం ఓట్లతో 68 నుంచి 78 స్థానాలకు పరిమితం కానుందని తెలిపింది. చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ 51–59 స్థానాలతో స్పష్టమైన ఆధిక్యం సాధిస్తుందని, బీజేపీ 27 నుంచి 35 స్థానాలకు పరిమితమవుతుందని సర్వే వెల్లడించింది. పైన పేర్కొన్న మూడు రాష్ట్రాల్లో ప్రస్తుతం రాజస్తాన్, చత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. ఇక తెలంగాణ విషయానికి వస్తే సర్వే వివరాలు పూర్తిగా అందనప్పటికీ ప్రాథమిక సమాచారాన్ని బట్టి అధికార బీఆర్ఎస్‌కే మొగ్గు కనపడుతోందని టైమ్స్ నౌ సర్వే పేర్కొంది.

మధ్యప్రదేశ్ (మొత్తం స్థానాలు 230)

పార్టీ	గెలుపు	ఓట్ల శాతం
కాంగ్రెస్	112-122	44.9
బీజేపీ	107-115	43.7
ఇతరులు	1-3	11.4

రాజస్తాన్ (మొత్తం స్థానాలు 200)

పార్టీ	గెలుపు	ఓట్ల శాతం
బీజేపీ	114-124	43.8
కాంగ్రెస్	68-78	41.9
ఇతరులు	6-10	14.3

చత్తీస్‌గఢ్ (మొత్తం స్థానాలు 90)

పార్టీ	గెలుపు	ఓట్ల శాతం
కాంగ్రెస్	51-59	42.3
బీజేపీ	27-35	39.3
ఇతరులు	2-6	18.4

పార్లమెంటరీ 'చర్చ' జరగాల్సిందే

- తమ సభ్యుల ఐఫోన్ల 'హ్యాకింగ్' ఉదంతంపై విపక్షాల పట్టు
- యాక్సెస్ నౌ నివేదిక వెనుక విపక్షాల హస్తముందన్న బీజేపీ

న్యూఢిల్లీ: విపక్ష సభ్యుల ఐఫోన్లపైకి ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకర్లు దాడికి తెగబడ్డారన్న ఆరోపణలను విపక్షాలు తీవ్రతరం చేశాయి. ఈ అంశంపై పార్లమెంటరీ స్థాయి సంఘంలో చర్చించాల్సిందేనని పట్టుబట్టాయి. ఈ మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అంశంపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయి సంఘానికి కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టస్‌లు లేఖ రాశారు. స్టాండింగ్ కమిటీని అత్యవసరంగా సమావేశపరిచి హెచ్చరిక అలర్ట్‌లు అందుకున్న ఎంపీలతోపాటు ఐఫోన్ తయారీదారు యాపిల్ సంస్థ ప్రతినిధులనూ చర్చకు పిలవాలని లేఖలో డిమాండ్‌చేశారు. స్థాయి సంఘంలో చర్చకు అధికార బీజేపీ ససేమిరా అంటోంది. ' యాపిల్ సబ్‌స్క్రైబర్లకు సంబంధించిన ఈ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిది. హ్యాకింగ్ దాడిని ఎదుర్కొన్నాయంటున్న ఐఫోన్లను చెక్ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర పోలీసులది. ఈ అంశాన్ని స్థాయీ సంఘంలో చర్చించాల్సిన అవసరమే లేదు' అని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే వ్యాఖ్యానించారు.

అందుకే కేంద్రాన్ని వేలెత్తిచూపుతున్నారు: చిదంబరం

గతంలో పెగసస్ సాఫ్ట్‌వేర్ సాయంతో దేశంలో పలు రంగాల వ్యక్తులపై కేంద్రప్రభుత్వం నిఘా పెట్టిందన్న ఆరోపణల నడుమ ఐఫోన్ల హ్యాకింగ్ వెలుగుచూడటంతో అందరూ సహజంగానే కేంద్రప్రభుత్వం వైపే వేలెత్తిచూపుతారని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం వ్యాఖ్యానించారు. '2019లో పలువురు సామాజిక కార్యకర్తలు, విపక్ష సభ్యులు, ప్రముఖ పాత్రికేయులు, జడ్జీల ఫోన్లపై పెగసస్ సాఫ్ట్‌వేర్‌తో కేంద్రం నిఘా పెట్టిందని దేశమంతటా కలకలం రేగడం తెల్సిందే. ఇప్పుడు వందలాది విపక్ష నేతలకు యాపిల్ ఐఫోన్ హ్యాకింగ్ అలర్ట్‌లు వచ్చాయనేది వాస్తవం. కేవలం విపక్ష నేతలకు మాత్రమే ఎందుకొచ్చాయి? హ్యాకింగ్ వల్ల భారీ ప్రయోజనం ఒనగూరేది ఎవరికి ?. ఈ ప్రశ్నలు తలెత్తినపుడు అందరూ అనుమానంతో కేంద్ర నిఘా సంస్థల వైపే వేలు చూపిస్తారు. ఎందుకంటే అనుమానించదగ్గ సంస్థలు అవి మాత్రమే' అని చిదంబరం ఆరోపించారు.

రక్షణ కల్పించండి: లోక్‌సభ స్పీకర్‌కు మొయిత్రా లేఖ

ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే హ్యాకర్ల దాడుల నుంచి విపక్ష ఎంపీలను రక్షించాలని లోక్‌సభ స్పీకర్ బిర్లాను తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా కోరారు. ఈ మేరకు బిర్లాకు ఆమె లేఖ రాశారు.

నిఘాకు రూ.1,000 కోట్లు!

'అంతర్జాతీయ సంస్థలైన యాక్సెస్ నౌ, సిటిజెన్ ల్యాబ్ వంటి సంస్థలు సెప్టెంబర్‌లోనే ఇలాంటి యాపిల్ సంస్థ జారీచేసే హెచ్చరిక నోటిఫికేషన్ల విశ్వసనీయతను నిర్ధారించాయి. ఇంటెలెక్సా అలయెన్స్ వంటి సంస్థలతో కలిసి నిఘా కాంట్రాక్ట్‌లను కుదుర్చుకునేందుకు భారత ప్రభుత్వం తన బడ్జెట్ కేటాయింపులను పెంచుకుంటోందని ఇటీవలే 'ది ప్రెడేటర్ ఫైల్స్' పేరిట ఫైనాన్షియల్ టైమ్స్ ఒక పరిశోధనాత్మక సమగ్ర కథనాన్ని వెలువరిచింది. ఈ నిఘా ఒప్పందాల విలువ దాదాపు 1,000 కోట్లు ఉంటుందని అంచనావేసింది' అని మొయిత్రా తన లేఖలో పేర్కొన్నారు. 2014 తర్వాత ఏదైనా నిఘా సాఫ్ట్‌వేర్‌ను కొన్నదీ లేనిదీ కేంద్రం బయటపెట్టాల్సిందేనని స్వతంత్ర రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ డిమాండ్‌చేశారు. కాగా, అలర్ట్ ఘటనపై వివరణ కోరుతూ యాపిల్ సంస్థకు సమన్లు జారీ చేయాలని పార్లమెంటరీ కమిటీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

భారత్, బంగ్లా సంయుక్తంగా..
పలు ప్రాజెక్టులకు శ్రీకారం



ఢాకా/అగర్తలా: భారత్, బంగ్లాదేశ్ ప్రధానులు నరేంద్ర మోదీ, షేక్ హసీనాలు బుధవారం సంయుక్తంగా పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. త్రిపురలోని నిశ్చింతపూర్, గంగాసాగర్‌ను బంగ్లాదేశ్‌తో కలుపుతూ 65 కిలోమీటర్ల ఖుల్నా–మోంగ్లా పోర్ట్ రైల్వే లైన్, బంగ్లాలోని రామ్‌పూర్‌లో ఉన్న మైత్రీ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టులను నేతలు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అగర్తలా నుంచి బంగ్లాలోని అఖౌరా వరకు నిర్మించిన రైలు మార్గం ఇరుదేశాల వాణిజ్యాన్ని పెంచుతుందని ఆశిస్తున్నారు. రైలులో అగర్తలా నుంచి ఢాకా మీదుగా కోల్‌కతా వెళ్లే వారికి ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. 'ఈశాన్య భారతం, బంగ్లాల మధ్య తొలి రైలు మార్గం అగర్తలా–అఖౌరా క్రాస్‌బోర్డర్ రైల్వేలింక్‌ను ప్రారంభించడం చరిత్రాత్మకం' అని ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. 12.24 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గంలో రైలు 5.46 కి.మీ.లు త్రిపురలో మిగతా 6.78 కిలోమీటర్లు బంగ్లాదేశ్‌లో ప్రయాణిస్తుంది. 'రెండు దేశాల పరస్పర సహకార విజయాన్ని సంబరంగా జరుపుకునేందుకు మళ్లీ కలిశాం. గత దశాబ్దాల్లో రెండు దేశాల్లో జరగని అభివృద్ధిని ఈ 9 ఏళ్లలో సాధించాం. మన దేశాల పటిష్ట మైత్రీ బంధానికి ఈ ప్రాజెక్టులే సంకేతం' అని హసీనాతో వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. అగర్తలా–అఖౌరా రైలు మార్గం నిర్మాణం కోసం బంగ్లాకు భారత్ రూ.392.52 కోట్ల ఆర్థికసాయం అందజేసింది. కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి రావడంతో ఈశాన్య రాష్ట్రాల్లో వాణిజ్యం, పర్యాటకం, అనుసంధానత ఊపందుకోనుంది. ఢాకా మీదుగా ఈ రైలు మార్గంలో అగర్తలా నుంచి కోల్‌కతాకు చాలా త్వరగా చేరుకోవచ్చు. ఈ మార్గం అందుబాటులోకి రావడంతో గతంలో ఉన్న 1,600 కిలోమీటర్ల దూరం ఏకంగా 500 కి.మీ.లకు తగ్గతోందని కార్యక్రమంలో పాల్గొన్న త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

గురువారం । 2 । నవంబర్ । 2023

సేవాస్ఫూర్తిగా.. పుట్టినరోజు వేడుక

బనశంకరి: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా రథ సారథి సజ్జల భార్గవ్‌రెడ్డి జన్మదినాన్ని బుధవారం పార్టీ సోషల్ మీడియా, వైఎస్సార్ కుటుంబం– బెంగళూరు ఘనంగా ఆచరించింది. హెచ్ఎస్ఆర్ లేఔట్‌లోని సమర్థనం ట్రస్ట్ అనాథాశ్రమంలో బాలల మధ్య కేక్ కట్ చేశారు. చిన్నారులకు అల్పాహారం, పండ్లు అందజేశారు.



సజ్జల భార్గవ్‌రెడ్డి జన్మదిన వేడుకలో నేతలు

న్యూస్‌రీల్

ఉత్సాహంగా ఊరేగింపు



నృత్యం చేస్తున్న మహిళలు

బనశంకరి: సిలికాన్ సిటీలోని జయనగరలో కన్నడ రాజ్యోత్సవం ఘనంగా జరిగింది. నాలుగోబ్లాక్‌లో వీరవనిత ఒనకె ఓబవ్వ, కన్నడసేనా సమితి, డాక్టర్ రాజ్ మంటప కన్నడ కట్టె అధ్యక్షుడు ఎస్‌జీ. రమేశ్‌రాజు ఆధ్వర్యంలో కన్నడపతాకాన్ని ఎగురవేసి మొక్కలు నాటారు. నాడదేవత అణ్ణమ్మదేవి ఉత్సవమూర్తి విగ్రహాన్ని వెండిరథంలో డొళ్లుకుణిత వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రథం ముందు నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం పవర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

పాలించే సత్తా లేక అబద్ధాలు

- కాంగ్రెస్‌పై యత్నాళ్ ధ్వజం

దొడ్డబళ్లాపురం: బీజేపీ ఎమ్మెల్యేలు ఎవరైనా సరే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి రూ.50 కోట్లు ఇస్తామని, పార్టీలో చేరమని ప్రలోభపెట్టి ఉంటే ఆ ఆడియోలను విడుదల చేయాలని బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ సవాలు విసిరారు. బుధవారం బిజాపూర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇచ్చారని, పాలించే యోగ్యత లేని వారు అకారణంగా ఆపరేషన్ కమల అంటూ అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఆపరేషన్ సాక్ష్యాలు ఉంటే బయటపెట్టాలన్నారు. 50 కోట్లు, 100 కోట్లు అంటూ మార్కెట్‌లో వారి రేటు పెంచుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చూస్తున్నారని విమర్శించారు. ఎవరైనా పిలిచి ఆఫర్ ఇవ్వాలి, కానీ వారే ఇలాంటి వదంతులు పుట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నించదన్నారు. ఇప్పటికే 5 నెలల్లోనే కాంగ్రెస్ తలరాత రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయిందని, సర్కారు ఎక్కువ రోజులు ఉండేలా లేదన్నారు.

బెళగావి జిల్లాను విభజించాలి: మంత్రి

దొడ్డబళ్లాపురం: కన్నడ రాజ్యోత్సవం నాడు బ్లాక్ డే ఆచరించే వారికి తల్లిలాంటి కన్నడ రాష్ట్రం, భాష విలువ తెలియదని బెళగావి మంత్రి సతీష్ జార్కిహొళి అన్నారు. బుధవారం బెళగావిలో కన్నడ రాజ్యోత్సవంలో పాల్గొని మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోనే నివసిస్తూ బ్లాక్ డే ఆచరించడం ఎంతవరకూ సమంజసమో వారే చెప్పాలని మరాఠా సంఘాలను డిమాండ్ చేశారు. పోలీసులు గొడవలు జరగకుండా భద్రత కల్పిస్తే, మరాఠా సంఘాలకు అండగా ఉన్నారని ఆరోపించడం తగదన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం బెళగావి జిల్లా విభజించాలని డిమాండు ఉందన్నారు. ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు. జిల్లా విభజనకు ముందు బెళగావి తాలూకాను విభజించాలన్నారు.

ఎయిర్‌పోర్టులో పసిడి సీజ్



పట్టుబడ్డ బంగారం

దొడ్డబళ్లాపురం: బెంగళూరు కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు ప్రయాణికుని నుంచి రూ.57లక్షల విలువైన అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్ 30న బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని తనిఖీ చేయగా 951 గ్రాముల బంగారం బిస్కెట్ పట్టుబడింది. దాని విలువ రూ.57 లక్షలుగా అధికారులు తెలిపారు. ప్రయాణికున్ని అరెస్టు చేశారు.

ఆవులు, రైతుపై పులి దాడి

మైసూరు: పెద్ద పులి దాడి చేసి ఆవును చంపివేసింది, రైతును తీవ్రంగా గాయపరచింది. ఈ సంఘటన మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని మహాదేవనగరలో చోటు చేసుకుంది. బుధవారం వీరభద్ర బోవి అనే వ్యక్తి బండీపుర అడవి సమీపంలో ఆవులను మేపుతుండగా పులి దాడి చేసింది. ఆవులను రక్షించడానికి గట్టిగా కేకలు వేస్తూ పులిని అడ్డుకున్నాడు. కానీ పులి దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. పులి ఒక ఆవును చంపి పాక్షికంగా భక్షించింది. ఈ శబ్దాలు విని సహచర రైతులు వచ్చి బాధితున్ని మైసూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

అటవీ సిబ్బందిపై జనం దాడి

అటవీ సిబ్బంది వచ్చి ఘటనాస్థలిని పరిశీలిస్తుండగా, గ్రామస్తులు ఆవేశం పట్టలేక వారిపై దాడిచేశారు. ఇక్కడ అనేకసార్లు అడవి జంతువులు ప్రజలపైన దాడులు చేస్తూ ప్రాణాలు తీస్తుంటే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సంఘటనతో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది.



బుధవారం బెంగళూరు కంఠీరవ మైదానంలో రాజ్యోత్సవ సంబరం



కంఠీరవలో.. మువ్వన్నెల జెండాలతో పాఠశాల బాలికలు



చిక్కమగళూరులో.. కన్నడమాత రథంతో బాలల నృత్య ప్రదర్శన

రాజ్యోత్సవ అట్టహాసం

- రాష్ట్రమంతటా వైభవంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం
- మురిపించిన సాంస్కృతిక వేడుకలు
- బెళగావిలోనూ జయప్రదం
- ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, నీటి వసతి: సీఎం



వేడుకలో సీఎం, డీసీఎం తదితరులు



కంఠీరవలో.. బాలల నాట్య విన్యాసం



బెళగావిలో కన్నడ సంఘాల ఆర్భాటం

బనశంకరి: కన్నడ రాష్ట్ర అవతరణ దినం సందర్భంగా కన్నడ రాజ్యోత్సవం రాష్ట్రంలో వాడవాడలా వైభవంగా జరిగింది. పిల్లలూ పెద్దలూ ఉత్సాహంగా రాష్ట్ర పండుగలో పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితనీరు, విద్యుత్ వసతి అందిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. బుధవారం కంఠీరవ స్టేడియంలో 68 వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలో సీఎం కన్నడ పతాకాన్ని ఎగురవేసి ప్రసంగించారు. కన్నడ పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యాశాఖ విజ్ఞప్తి మేరకు తక్షణం ఉచిత విద్యుత్, తాగునీటి సౌలభ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కన్నడిగులను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్య అందించడం, పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సార్వభౌమ భాష కన్నడ: సీఎం

దేవరాజు అరసు ముఖ్యమంత్రి అవదిలో మైసూరు రాష్ట్రానికి కర్ణాటక అని నామకరణం చేసి 50 ఏళ్లు పూర్తయింది. అందుకు గుర్తుగా ఏడాదిపాటు కర్ణాటక సంభ్రమ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తమిళనాడు, కేరళ, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక అధికార భాష మాట్లాడకపోతే బతకలేని వాతావరణం ఉంది. కానీ కర్ణాటకలో కన్నడ మాట్లాడకపోయినా జీవించవచ్చన్నారు. ఏ భాష అయినా నేర్చుకోండి కానీ మన సార్వభౌమ కన్నడ భాషనే మాట్లాడాలన్నారు. ప్రభుత్వపాలన కన్నడభాషలో ఉండాలని, ఇక్కడ ఉద్యోగం చేసే వారు కన్నడలో వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కవాతు చేస్తూ గౌరవ వందనం సమర్పించారు. జాతీయ, కన్నడ పతాకాన్ని సీఎం ఎగురవేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, ప్రాథమిక విద్యాశాఖమంత్రి మధు బంగారప్ప, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

కంఠీరవ వర్ణమయం

కంఠీరవలో వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కన్నడనాడు కళలు, సంస్కతిని చాటిచెప్పిన సాంస్కతిక కార్యక్రమాలు ముగ్దుల్ని చేశాయి. బాల బాలికలు రంగు రంగుల దుస్తులు ధరించి సంగీతం, నాడభక్తి గీతాలకు అనుగుణంగా చేసిన నృత్యాలు కనువిందు చేశాయి. జయకన్నడ నృత్య రూపకంతో ప్రదర్శన ఆరంభమైంది. కన్నడ కళలు, సంస్కృతి, సాహితీ పరంపరను పాటల రూపంలో ప్రదర్శించారు. డొళ్లుకుణిత, పూజా కుణిత, పటదకుణిత, యక్షగానం అలరించాయి.

ప్రధాని శుభాకాంక్షలు

కన్నడ రాజ్యోత్సవం సందర్భంగా కన్నడిగులకు ప్రధాని నరేంద్రమోదీ కన్నడలో శుభాకాంక్షలు తెలిపారు. కన్నడ రాజ్యోత్సవం రోజున కర్ణాటక చైతన్యం పరిఢవిల్లుతోందని, ప్రేమ, విశ్వాసాలు మిళితమైన కన్నడిగులు, రాష్ట్రం పురోగమిస్తోందన్నారు. కర్ణాటక మరింత అభివృద్ధి చెందాలని ట్విట్టర్‌లో ఆకాంక్షించారు.

బెళగావిలో కోలాహలం

మరోవైపు రాష్ట్రం నలుమూలలా రాజ్యోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా మైదానంలో జెండా వందనం, బాలల కళా పాటవం అబ్బురపరచింది. బెళగావిలో మరాఠా సంఘాల హెచ్చరికల మధ్య కన్నడ సంఘాలు వైభవంగా వేడుకలను నిర్వహించాయి. సాయంత్రం కిత్తూరు చెన్నమ్మ కూడలిలో కన్నడ బావుటాలను పట్టుకుని నినాదాలు చేస్తూ పెద్దఎత్తున అట్టహాసం చేశారు.



కొప్పళలో బాలల నృత్యం



కోలారులో ఏనుగు అంబారీ ఊరేగింపు

ఆ చిరుత కాల్చివేత

- బెంగళూరు బొమ్మనహళ్లిలో 4 రోజులుగా హల్‌చల్
- వందమందికిపైగా అటవీ సిబ్బంది గాలింపు
- తుపాకీ కాల్పుల్లో మృత్యువాత





పొదల్లో దాగిన చిరుత పులి

బొమ్మనహళ్లి: గడిచిన నాలుగు రోజుల నుంచి బెంగళూరు బొమ్మనహళ్లి పరిధిలోని కూడ్లు గేట్‌తో పాటు హోసపాళ్య, సామసంద్రపాళ్య, బండెపాళ్య, ఏఈసీఎస్ లేఔట్‌తో పాటు కూడ్లు ప్రాంతంలో సంచరిస్తూ ప్రజలకు నిద్ర లేకుండా చేసిన చిరుతపులిని అధికారులు సజీవంగా పట్టుకోలేకపోయారు. తుపాకీతో దానిని కాల్చిచంపారు. గత శనివారం రాత్రి నుంచి పులి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తోంది. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడ్డారు. ఈ చిరుతను బంధించడం కోసం మైసూరు అటవీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సుమారు 70 మంది, బెంగళూరు బన్నేరుఘట్ట అభయారణ్యం నుంచి 50 మంది అటవీ సిబ్బంది గాలింపు చేపట్టారు. పగలు అపార్టుమెంట్ల మరుగున పొదల్లో దాక్కుంటూ, రాత్రి కాగానే బయట రోడ్లపై తిరుగుతోంది.

భారీ కార్యాచరణ

- బుధవారం ఉదయం ఆరుగంటల నుంచి సుమారు 150 మందికి పైన అటవీ శాఖ సిబ్బంది, పోలీసులు, బొమ్మనహళ్లి బీబీఎంపీ అధికారులు తుపాకులు, వలలు, బుల్డోజర్లు తదితరాలతో ముమ్మరంగా కూంబింగ్ చేపట్టారు.
- కూడ్లు గేట్‌లోని కృష్ణారెడ్డి లేఔట్‌లో ఒక అపార్టుమెంటు పక్కన పొదల్లో గాలింపు జరుపుతుండగా ఉదయం 11 గంటల సమయంలో చెట్ల పొదల్లో నుంచి చిరుత బయటకు వచ్చి పారిపోసాగింది.
- అటవీ సిబ్బంది మూడుసార్లు మత్తు తూటాలను పేల్చగా తప్పించుకుంది. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ధనరాజుపైకి చిరుత దూకి దాడి చేయగా ఆయన కాలుకు, కడుపు, చేతికి గాయాలయ్యాయి.
- చిరుత మళ్లీ పొదల్లోకి వెళ్లిపోగా జేసీబీతో తొలగింపు చేపట్టారు. మత్తు తూటాలు పేల్చగా ఈసారి కూడా తగల్లేదు.
- దీంతో అటవీ సిబ్బంది చుట్టూ వలలు వేసి చిరుత కోసం ఇనుప రాడ్లు, కట్టెలు పట్టుకొని నిలబడి ఉన్నారు.
- సుమారు మూడు గంటల తరువాత చిరుత పారిపోతుండగా, అటవీ సిబ్బంది తుపాకీతో కాల్చడంతో చిరుత తీవ్రంగా గాయపడింది. దానిని వలలో బంధించి తరలిస్తుండగా మృత్యువాత పడింది.
- కాగా, చిరుత ఎక్కడి నుంచి వచ్చి ఉంటుందన్నది సస్పెన్స్‌గా ఉంది. గాలింపును చూడడానికి పెద్దసంఖ్యలో జనం పోగయ్యారు. చిరుతను సజీవంగా పట్టుకుని ఉండాల్సిందని పలువురు అన్నారు.



ఈ ప్రాంతంలోనే చిరుత నక్కింది



చిరుత కళేబరాన్ని వలలో వేస్తున్న దృశ్యం

కబళించిన మట్టిదిబ్బ

- మడికేరిలో ముగ్గురు వలస కూలీల మృతి

యశవంతపుర: ఇంటి నిర్మాణం కోసం మట్టిని తోడుతుండగా మట్టి చరియలు విరిగి పడి ముగ్గురు కూలీలు మృతి చెందిన ఘటన కొడగు జిల్లా మడికేరి పట్టణంలోని స్టీవార్ట్ హిల్ లేఔట్‌లో బుధవారం జరిగింది. ఫైర్ సిబ్బంది వచ్చి ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. మృతులు బెళగావి జిల్లా చిక్కోడి తాలూకాకు చెందిన బసప్ప, నింగప్ప, ఆనంద అనే వలస కూలీలుగా గుర్తించారు. ఓ స్థలంలో ఇల్లు కట్టడానికి పునాది తీస్తుండగా పక్కనే మట్టి దిబ్బ కదిలి పెద్ద మొత్తంలో మన్ను వారి మీద పడింది. ముగ్గురు అక్కడికక్కడే సజీవ సమాధి అయ్యారు. ఆ సమయంలో అక్కడ 9 మంది పనిచేస్తున్నారు. మిగతావారు క్షేమంగా బయటపడ్డారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మడికేరి ఎమ్మెల్యే మంతరగౌడ, ఎస్పీ రామరాజన్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.



మృతదేహాల కోసం వెతుకుతున్న పోలీసులు, స్థానికులు



రాజ్యోత్సవం సందర్భంగా బెంగళూరు బసవనగుడిలో బృహత్ జెండా ప్రదర్శన

స్కూలు పిల్లల బ్యాగుల బరువు తగ్గిస్తాం

బనశంకరి: పిల్లలు బ్యాగ్ బరువు 50 శాతం తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రాథమిక విద్యాశాఖా మంత్రి మధు బంగారప్ప తెలిపారు. కంఠీరవ స్టేడియంలో రాజ్యోత్సవంలో మాట్లాడుతూ 600 కన్నడ పబ్లిక్ పాఠశాలలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశం ఉందన్నారు. కర్ణాటకలో కన్నడ అధికార భాష అన్నారు. ప్రస్తుతం స్కూలు పిల్లల బ్యాగులు బరువు ఎక్కువగా ఉన్నాయని, ఆ బరువును సగం తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆ కీచకుడు.. రిటైర్డు హెచ్‌ఎం!

యశవంతపుర: గత ఆదివారం బెంగళూరులో షాపింగ్ మాల్‌లో మహిళల వెంటపడి అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. అతని చేష్టల వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అతడు బెంగళూరు అగ్రహార దాసరహళ్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయునిగా గుర్తించారు. శివనహళ్లి సమీపంలోని పాఠశాలలో పని చేసి రిటైరైనట్లు తెలిసింది. కుటుంబం గౌరవ మర్యాదలతో ఉండగా, వీడియో వైరల్ కావడంతో అతడు ఇంటికి రాకుండా తప్పించుకు తిరుగుతున్నాడని తెలిసింది.

బీదర్‌కు స్పెషల్ రైళ్లు

అనంతపురం సిటీ: యశ్వంతపుర–బీదర్–యశ్వంతపుర మధ్య వచ్చే శని, ఆదివారం నుంచి వారాంతపు రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. యశ్వంతపురలో వచ్చే శనివారం రాత్రి 11.15కు బయలుదేరే ఎక్స్‌ప్రెస్ (నంబర్: 16577) రైలు హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, గుల్బర్గా మీదుగా బీదర్‌కు ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుందన్నారు. మార్గమధ్యంలో అనంతపురానికి తెల్లవారుజామున 4.38 గంటలకు వస్తుంది. తిరిగి ఆదివారం మధ్యాహ్నం 2.40కు బీదర్‌లో బయలుదేరే రైలు (నంబర్: 16578) యశ్వంతపురకు రాత్రికి చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సర్కారును కాపాడుకోండి

- సీఎంకు సుర్జేవాలా సూచన

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పడిపోకూడదని, అందుకు పార్టీ నాయకులు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని, లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నందున ఇలాంటి వాటిని పసిగట్టి అడ్డుకోవాలని రాష్ట్ర నాయకులకు కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశించినట్లు తెలిసింది. పదవులు దక్కని కాంగ్రెస్ అసంతృప్త నాయకులకు బీజేపీ ఆపరేషన్ కమల పేరుతో గాలం వేస్తోందని వార్తలు రావడంతో ఏఐసీసీ నేత రణదీప్‌సింగ్ సుర్జేవాలా సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లతో ప్రత్యేకంగా చర్చించారు. రాజకీయ పరిణామాలపై నిఘా పెట్టాలి. మంత్రి సతీష్ జార్కిహొళి దీపావళి తరువాత 30 మంది ఎమ్మెల్యేలతో కలిసి దుబాయ్ టూర్ వెళ్తున్నారనే తెలుస్తోంది. అదే నిజమైతే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయి. దుబాయ్ టూర్‌ని అడ్డుకోవాలి అని సుర్జేవాలా సూచించినట్టు సమాచారం. కాంగ్రెస్‌లో ముఠాలు, విభేదాలు, తిరుగుబాట్లకు తావివ్వరాదని, పార్టీ పరిస్థితుల గురించి బయట మాట్లాడరాదని తెలిపారు.

శాసనసభలో సారథులెవరు?

- ఇప్పటికీ నియమించకపోతే ఎలా?
- బీజేపీ ఎమ్మెల్యేల అసహనం!



దొడ్డబళ్లాపురం: విధానసభ, విధాన పరిషత్‌లో బీజేపీ పక్ష నాయకులు ఎవరనేది తక్షణం ప్రకటించాలి, లేదంటే త్వరలో బెళగావిలో జరగబోయే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాబోమని బీజేపీ ఎమ్మెల్యేలు పార్టీ హైకమాండ్‌కు స్పష్టంచేసినట్లు సమాచారం. ఈ రెండు పదవులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం యడియూరప్ప ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బీజేపీ పక్ష నేత లేకుండా సమావేశాల్లో ఎలా పాల్గొనాలని ప్రశ్నించారు. తాము పార్టీ పెద్దలను ఎదిరించడం లేదని, కానీ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఆరునెలలు కావస్తున్నా ఉభయ సభల్లో బీజేపీ సారథులెవరో అనేది ఎంపిక చేయకపోవడం పార్టీకి నష్టం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం విధానాలపై ఎలా పోరాడగలమని ప్రశ్నించారు. పాలక పక్షం కాంగ్రెస్ ఈ విషయమై తమను లోకువగా చూస్తోందని వాపోయారు.

హైకమాండ్‌తో మాట్లాడాను

యడియూరప్ప స్పందిస్తూ ఈ విషయంలో తనకూ బాధగా ఉందన్నారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన సమయంలో పార్టీ పెద్దలను కలిసి ఇదే విషయమై చర్చించానన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుని అవధి కూడా ముగిసి చాలా రోజులైందని, కొత్త నేత ఎంపికలోనూ ఆలస్యం జరుగుతోందని యడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు చాలా ఉన్నాయని, అయితే అసెంబ్లీలో వైఫల్యాలపై గళం విప్పి పోరాడేందుకు ప్రతిపక్ష నేత లేకపోవడం పార్టీకి పెద్ద లోటుగా ఉందన్నారు. ఏదేమైనా నవంబర్ నెల చివరిలోపు నేతలను ఎన్నుకోవాలని, లేదంటే బెళగావి అసెంబ్లీ సమావేశాలకు ముఖం చాటేస్తామని ఎమ్మెల్యేలు తెలిపారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారంలో అగ్రనేతలు బిజీగా ఉన్నారని, మరోసారి ఢిల్లీకి వెళ్లి పరిస్థితి వివరిస్తానని యడ్డి హామీ ఇచ్చారు.

భారీగా చోరీ సొత్తు స్వాధీనం



పట్టుబడిన నిందితుడు,స్వాధీనం చేసుకున్న సొత్తుతో పోలీసులు

బనశంకరి: ఉడుపి కుంజిబెట్టు లాలా లజపతిరాయ్ మార్గంలోని ఇంట్లో కొద్దిరోజులు క్రితం జరిగిన చోరీ కేసును ఉడుపి పోలీసులు ఛేదించారు. బెంగళూరు ఉత్తరహళ్లి భువనేశ్వరినగర నివాసి మంజునాథయానె కల్కెరె(43) అనే వ్యక్తిని అరెస్ట్‌చేసి రూ.31,55,930 విలువచేసే 530 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.15,12,200 విలువచేసే 16.800 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2.50 లక్షల విలువచేసే కారు, నకిలీ నెంబరుప్లేట్, ఇనుపరాడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ ఎస్‌టీ.సిద్ధలింగప్ప తెలిపారు. గతనెల 8 తేదీ రాత్రి కుంజిబెట్టువిన అమ్ముంజె విట్టలదాస్ నాయక్ ఇంట్లోకి చొరబడిన దొంగలు రూ.73,06,800 విలువచేసే 1.882 గ్రాములు బంగారు ఆభరణాలు. 7450 గ్రాములు వెండి ఆభరణాలు దోచుకెళ్లారన్నారు. ఉడుపినగర సీఐ మంజప్ప, ఎస్ఐ పునీత్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది గాలించి బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బ్రహ్మావార, తరికెరె, అరసికెరె, బాణవార పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీ ఘటనలో నిందితుడి పాత్ర ఉందని తెలిపారు. బెంగళూరు, కోలారు, తుమకూరు, దావణగెరె, చిక్కబళ్లాపుర జిల్లాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్లలో 60కి పైగా కేసులు ఉన్నాయని అదనపు కమిషనర్ ఎస్‌టీ.సిద్ధలింగప్ప తెలిపారు.

క్లుప్తంగా

హంతకులను కఠినంగా శిక్షిస్తాం

మాలూరు: కాంగ్రెస్ నాయకుడు, జీపీ సభ్యుడు అనిల్‌కుమార్ హంతకులను కఠినంగా శిక్షించాలని, అప్పుడే అతని ఆత్మకు శాంతి కలుగుతుందని ఎమ్మెల్యే కె వై నంజేగౌడ తెలిపారు. బుధవారం మిణసంద్ర గ్రామంలో అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులను కలిసి ఆయన సాంత్వన తెలిపి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. పంచాయతీ సభ్యుడిగా అనిల్‌కుమార్ గ్రామ అభివృద్ధి కోసం ఎంతో శ్రమించడమేగాక మంచి సేవలను అందించారన్నారు. గ్రామస్తులతో సత్సంబంధాలు కలిగిన అతని హత్య ఖండనీయమన్నారు. తాను ఎస్పీ, డీఎస్పీలతో చర్చించి హంతకులను కఠినంగా శిక్షించేలా చూస్తానన్నారు.

ఎగసిన క-క ప్రత్యేక రాష్ట్ర నినాదం

- కలబుర్గిలో ఆందోళనకారుల అరెస్ట్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేస్తూ ఆందోళన చేస్తున్న నేతలను కలబుర్గిలో అరెస్ట్ చేసిన ఘటన బుధవారం జరిగింది. కలబుర్గిలోని సర్దార్ వల్లభాయి పటేల్ క్రీడా మైదానంలో కర్ణాటక రాష్ట్రవతరణ దినోత్సవంలో కళ్యాణ కర్ణాటక ప్రత్యేక రాష్ట్ర సమితి సంచాలకుడు ఎంఎస్ నరిబోళ్ ఆధ్వర్యంలో ప్రత్యేక రాష్ట్ర జెండా లాంఛనాన్ని ప్రారంభిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నరిబోళ్ మాట్లాడుతూ కళ్యాణ కర్ణాటక అభివృద్ధికి రాజ్యాంగంలోని ఆర్టికల్-371(జె) అమలుపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపడం తగదని, కలబుర్గిని ఉపరాజధానిగా చేయాలని డిమాండ్ చేశారు.

చివరి ఆయకట్టుకు నీరు విడుదల



పోలీస్ బందోబస్తు మధ్య కాలువకు నీరు వదిలిన దృశ్యం

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ చివరి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. 15 రోజుల నుంచి ఎడమ కాలువ 104వ మైలు రైతు పోరాట సమితి నేతలు చేస్తున్న ఆందోళనకు తలొగ్గిన ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించి కాలువకు ఏడు అడుగుల మేర నీరు వదిలారు. ఆయకట్టు చివరి భూములకు నీరందేలా గేజ్‌ను ఐదు అడుగుల మేర పెంచారు. ఉప కాలువలకు సక్రమంగా నీరందేలా ఇంజినీర్లు నీటి నిర్వహణ చేశారు. రెండు రోజుల పాటు ఐదు అడుగుల మేర నీరు వదిలి ఐదు రోజుల్లో గణేకల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను కూడా నీటితో నింపారు. మాన్వి తాలూకాలో సీఐ వీరభద్రయ్య హిరేమఠ నేతృత్వంలో పోలీసు సిబ్బంది కాలువపై బందోబస్తు నిర్వహించారు.

బైక్ నుంచి కిందపడి నవవధువు మృతి

బళ్లారి రూరల్ : జిల్లాలోని సిరుగుప్ప సమీపంలో బైక్ నుంచి కిందపడటంతో సింధనూరుకు చెందిన నవవధువు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. సింధనూరు పోలీసులు తెలిపిన వివరాలు... సింధనూరుకు చెందిన వాజియాబేగం(19)కు సిరుగుప్పకు చెందిన ఎలక్ట్రీషియన్ మహ్మద్ సోయాజ్(26)తో 20 రోజుల క్రితం పెళ్లైంది. మంగళవారం వాజియాబేగం సింధనూరులోని తన పుట్టినింట్లో జరిగే ఓ శుభకార్యానికి భర్త మహ్మద్ సోయాజ్‌తో కలిసి మోటారు సైకిల్‌పై బయలుదేరింది. మార్గమధ్యంలో ఓ స్పీడుబ్రేకర్ వద్ద బైక్‌ను అదుపు చేయలేక భర్త వేగంగా ఎగిరించగా వెనుక కూర్చొన్న వాజియా బేగం పట్టు తప్పి కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆమెను విమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనపై సింధనూరు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

అన్నదమ్ముల్లా జీవించాలి

- మంత్రి మహాదేవప్ప



భువనేశ్వరిమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

మైసూరు: మైసూరులో కన్నడ రాజ్యోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓవల్ మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వేడుకలు జరపగా మంత్రి హెచ్.సీ.మహాదేవప్ప పాల్గొని కన్నడ పతాకం ఎగురవేసి భువనేశ్వరి దేవికి పూజలు నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందించినవారికి సన్మానించారు. రాజ్యోత్సవాలు అందరిలోనూ మంచితనం నింపి సౌహార్ద్రతను పెంచుతాయన్నారు. స్వాభిమానంతో పాటు అందరూ అన్నదమ్ముల మాదిరిగా కలిసి మెలిసి జరుపుకోవాలన్నారు.

సచ్చిదానంద ఆశ్రమంలో

తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో, కన్నడలో చదివించడంతో పాటు వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. మైసూరు శ్రీరాఘవేంద్ర ప్రతిష్టాన ఆధ్వర్యంలో సచ్చిదానంద ఆశ్రమంలో రాజ్యోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కన్నడ సరళ భాష, కన్నడ నాడు అభివృద్ధి కోసం సాహితీవేత్తలు కృషి చేశారన్నారు.

ఏకీకరణ యోధులను మరువకూడదు



బళ్లారిలో కర్ణాటక జ్యోతిని స్వీకరిస్తున్న మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి తదితరులు



విమ్స్‌లో ట్రాక్టర్‌పై కన్నడమాతను ఊరేగిస్తున్న దృశ్యం



విమ్స్‌లో ఊరేగింపులో డాన్సులతో హోరెత్తిస్తున్న వైద్యులు, విద్యార్థులు



గంగావతిలో భువనేశ్వరి దేవి చిత్రపటం ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలిజనార్దనరెడ్డి

- సంబరంగా రాజ్యోత్సవాలు

సాక్షి,బళ్లారి: కర్ణాటక ఏకీకరణ కోసం పాటుపడిన మహనీయులను మరువకూడదని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం కర్ణాటక రాజ్యోత్సవం సందర్భంగా నగరంలోని రాజ్‌కుమార్ రహదారిలోని మైదానంలో రాజ్యోత్సవ సంబరాలను భువనేశ్వరి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి పూజ చేసిన అనంతరం మాట్లాడారు. రాష్ట్ర ఏకీకరణకు శ్రమించిన మహనుభావుల పేర్లను నగరంలోని ప్రముఖ రోడ్లకు పెడతామన్నారు. మహానుభావులను స్మరించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంకలో జన్మించిన మనందరం ధన్యులమని గుర్తు చేశారు. కన్నడను కాపాడుకొనేందుకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, మేయర్ త్రివేణి, అధికారులు, కరవే ప్రముఖులు చానాళ్ శేఖర్, జనార్ధన్ పాల్గొన్నారు.

కోటపై 68 అడుగుల జెండా ఆవిష్కరణ

బళ్లారి అర్బన్: కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలో కన్నడ రాజ్యోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోటపై నవ కర్ణాటక యువశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 68 అడుగుల కన్నడ పతాకాన్ని సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఎగరవేసి భువనేశ్వరి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. **గంగావతిలో..**

గంగావతి: కర్ణాటకగా ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి అన్నారు. రాజ్యోత్సవాన్ని పురస్కరించుకొని కనకగిరి రోడ్డులోని క్రీడా మైదానంలో వందన స్వీకారం అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేయాలన్నారు. అంతకు ముందు సువర్ణ పతాకాన్ని తహసీల్దార్ మంజునాథ్ బోగావతి ఎగరవేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. దివ్యాంగులకు ఈ సందర్భంగా ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీ ఈఓ లక్ష్మీదేవి, నగరసభ కమిషనర్ విరుపాక్షప్ప మూర్తి, డీఎస్పీ, బీఈఓ వెంకటేష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా

రాయచూరు రూరల్: భాష, ప్రాంతీయ అసమానత నివారణల మధ్య కళ్యాణ కర్ణాటకకు నిజాం పాలన నుంచి విముక్తి లభించినా రాష్ట్రాన్ని, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ అన్నారు. బుధవారం 68వ రాష్ట్రవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మగాంధీ క్రీడాంగణంలో జాతీయ పతాకావిష్కరణ గావించి ప్రజల నుద్దేశించి ఆయన ప్రసంగించారు. 1956 నవంబరు 1న 19 జిల్లాలతో కర్ణాటక రాష్ట్రం ఏర్పడిందన్నారు. 1973లో 29 జిల్లాలతో అఖండ కర్ణాటక ఏకీకరణ చేశారన్నారు. కన్నడ భాషకు 8 జ్ఞాన పీఠ అవార్డులు లభించాయని గుర్తు చేశారు. జాతీయ పతాకావిష్కరణలో ఎమ్మెల్యే బసనగౌడ, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, అదనపు జిల్లాధికారి దురుగేష్, ఎస్పీ నిఖిల్, సీఈఓ రాహుల్ తుకారాం పాండేలున్నారు. నగరంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఎడదొరె నాడు అవార్డులను ప్రదానం చేశారు.

కర్ణాటకలో పుట్టడం ఎంతో అదృష్టం

హొసపేటె: కన్నడిగుల కన్నడ ప్రేమ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని విజయనగర జిల్లా ఇన్‌చార్జి, గృహ నిర్మాణ, వక్ఫ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి బీజెడ్ జమీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఆయన బుధవారం నగరంలోని జిల్లా స్టేడియంలో ఏర్పాటు చేసిన 68వ కర్ణాటక రాజ్యోత్సవంలో భువనేశ్వరి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. కన్నడ నేలపై పుట్టిన మనందరం పుణ్యాత్ములం అన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప అధ్యక్షత వహించారు. మున్సిపల్ అధ్యక్షురాలు ఏ.లతా, జిల్లాధికారి ఎంఎస్ దివాకర్, జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు. టీబీ డ్యాం పీఎల్‌సీ ప్రభుత్వ హయ్యర్ ప్రైమరీ స్కూల్‌లో రాజ్యోత్సవం జరిపారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తొలుత మాతృమూర్తి భువనేశ్వరిదేవి చిత్రపటానికి పూజలు చేసి జెండాను ఎగురవేశారు. హేమలత, నిర్మల, ఈరప్ప, రవి, మంజుల పరశురాం పాల్గొన్నారు.

రాజ్యోత్సవ సంబరం

బనశంకరి: రాష్ట్రమంతటా రాజ్యోత్సవ సంబరాలు బుధవారం మిన్నంటాయి. కూడళ్లు, కార్యాలయాలు, మైదానాల్లో బాల బాలికల కళా ప్రదర్శనలు సాంస్కృతిక వైభవానికి దర్పణం పట్టాయి. కలబురిగి నగరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బృహత్ ర్యాలీ నిర్వహించారు.



రాయచూరులో బాలికల సాంస్కృతిక ప్రదర్శన



ధార్వాడ జిల్లా మైదానంలో జరిగిన వేడుకలో బాలల నృత్యం



హుబ్లీలో ముఖానికి కన్నడ వర్ణాలతో బాలికల సంబరం



కలబురిగి నగరంలో రాజ్యోత్సవం సందర్భంగా నిర్వహించిన బృహత్ ర్యాలీ

చల్లారని మరాఠా రిజర్వేషన్ల వివాదం



టైర్లకు నిప్పంటించి ఆందోళన చేపడుతున్న దృశ్యం

- కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉద్రిక్తత
- పుణె-బెంగళూరు జాతీయ రహదారి దిగ్బంధం

సాక్షి,బళ్లారి: మరాఠా రిజర్వేషన్ల వివాదం తీవ్రరూపం దాల్చింది. బుధవారం ఆందోళనకారులు హింసాత్మకంగా తమ నిరసనలను చేపట్టారు. మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళన చినికిచినికి గాలివానగా మారింది. రిజర్వేషన్లు ఇవ్వకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని ఆందోళనకారులు హెచ్చరించారు. వందలాది మంది ఆందోళనకారులు పుణె-బెంగళూరు జాతీయ రహదారిని దిగ్బంధించారు. హైవేపై టైర్లకు నిప్పంటించారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకోవడంతో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. బెళగావి పోలీసులు శివసేన కార్యకర్తలను సరిహద్దులోనే అడ్డుకొని వెనక్కి పంపారు. కరవే కార్యకర్తలు మహారాష్ట్రకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. ఒక వైపు రాష్ట్ర వ్యాప్తంగా కర్ణాటక రాజ్యోత్సవ వేడుకలతో బెళగావిలో పండుగ వాతావరణం నెలకొంది. మరో వైపు సరిహద్దు గుండా బెళగావిలోకి ప్రవేశించేందుకు కొందరు శివసేన కార్యకర్తలు ప్రయత్నించడంతో కర్ణాటక పోలీసులు అడ్డుకున్నారు. నిప్పాణి మార్గంలో కర్ణాటక పోలీసులు, శివసేన కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. సరిహద్దు ప్రాంతంలోని బెళగావి, కార్వార, బీదర్, నిప్పాణి, ఖాల్కి తదితర ప్రాంతాలను మహారాష్ట్రలోకి చేర్చాలంటూ నినాదాలు చేశారు. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందినవారిని 100 మందికి పైగా పోలీసులు అడ్డుకొని మహారాష్ట్రకు పంపించారు. రెండు రోజులుగా మహారాష్ట్రలో రిజర్వేషన్ల వివాదం తీవ్రరూపం దాల్చడంతో కర్ణాటక బస్సు సర్వీసులను మహారాష్ట్రకు తాత్కాలికంగా నిలిపివేయడంతో ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు.

కర్ణాటక సంభ్రమ ఏర్పాట్ల పరిశీలన

హొసపేటె: నవంబర్ 1తో కర్ణాటకగా నామకరణం చేసి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కన్నడ, సంస్కృతి శాఖ బెంగళూరు, విజయనగర జిల్లా యంత్రాంగం సంయుక్తంగా గురువారం నిర్వహించే కర్ణాటక సంభ్రమ-50 వేడుకకు హంపీలో ఎదురు బసవణ్ణ మంటపం వద్ద చేసిన ఏర్పాట్లను బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గవియప్ప పరిశీలించారు.

శిశుపాలన కేంద్రాలు ప్రారంభం

గంగావతి: చిక్కజంతకల్, వడ్డరహట్టిల్లో ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి బుధవారం శిశుపాలన కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదలు తమ జీవనోపాధి కోసం పనులకు వెళ్లినప్పుడు వారి పిల్లల ఆలనాపాలనను చూసేందుకు వీలుగా ఈ కేంద్రాలను ప్రారంభించారన్నారు. వీటిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

తల్లి మందలించిందని బాలిక బలవన్మరణం

బళ్లారి రూరల్: తల్లి మందలించిందని మనస్తాపంతో పురుగుల మందుతాగి ఓ బాలిక బలవన్మరణానికి పాల్పడిన ఘటన నగరంలో జరిగింది. కౌల్‌బజార్ పోలీసులు తెలిపిన వివరాలు... నగరంలోని దేవీనగర్ చెందిన అమూల్య(15) అనే బాలిక పదో తరగతి చదువుతోంది. మంగళవారం రాత్రి అమూల్య చదువుకోకుండా మొబైల్ చూస్తుండటంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన అమూల్య ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైంది. వెంటనే తల్లి గమనించి విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది.పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. కాగా మృతురాలి తండ్రి 14 ఏళ్ల క్రితమే గుండెపోటుతో మరణించాడు. ఒక్కగానొక్క బిడ్డ మృతితో తల్లి రోదనలు బంధువులను కంటతడి పెట్టించాయి.

కోలారు వార్తలు...

అంగరంగ వైభవంగా కన్నడ రాజ్యోత్సవం



కోలారులో సాధకులకు అవార్డులను అందించిన దృశ్యం



కోలారులో ఊరేగింపులో సాగుతున్న స్తబ్దచిత్ర శకటాలు



కేజీఎఫ్‌లో రాజ్యోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం

- సాధకులకు, అవార్డు విజేతలకు సన్మానం
- అలరించిన స్తబ్ద చిత్ర శకటాల ఊరేగింపు

కోలారు: 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలను బుధవారం నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 9 గంటలకు జిల్లాధికారి అక్రం పాషా కన్నడ ధ్వజం, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఏకీకరణలో ఎంతోమంది మహనీయుల కృషి ఉందన్నారు. కన్నడ భాష, సంస్కృతి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడాలన్నారు. ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ మాట్లాడుతూ జిల్లాలో భాషాభివృద్ధికి కన్నడాభిమానులు శ్రమించాలన్నారు. కన్నడ భాషకు ఎలాంటి భంగం కలుగకుండా చూడాలన్నారు. ఎంపీ ఎస్.మునిస్వామి మాట్లాడుతూ కన్నడ భాష, సంస్కృతికి శాస్త్రీయ హోదా లభించడంపై హర్షం వ్యక్తం చేశారు.

అంబారీపై ఊరేగిన భువనేశ్వరి దేవి

వేడుకల సందర్భంగా దాదాపు 50కి పైగా స్తబ్ద చిత్ర శకటాలు నగర ప్రముఖ వీధుల్లో సంచరించాయి. భువనేశ్వరి దేవి చిత్రపటాన్ని శకటాల్లో ఉంచి నగరంలోని ఎంజీ రోడ్డు, ఎంబీ రోడ్డు, బస్టాండు సర్కిల్ మీదుగా ఊరేగించారు. భువనేశ్వరి దేవి విగ్రహాన్ని అంబారీపై ఉంచి నగరంలో ఘనంగా ఊరేగించారు. కళాబృందాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లోని 14 మంది సాధకులకు రాజ్యోత్సవ అవార్డులను అందించి సత్కరించారు. ఎమ్మెల్సీలు అనిల్‌కుమార్, ఇంచర గోవిందరాజులు, జెడ్పీ సీఈఓ పద్మా బసవంతప్ప, ఎస్పీ ఎం.నారాయణ్, తహసీల్దార్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

కన్నడ భాషే నిత్యం కావాలి

కేజీఎఫ్: కన్నడ కేవలం భాష మాత్రమే కాకుండా మన నిత్య జీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. బుధవారం జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కన్నడ భవన నిర్మాణానికి తన అభివృద్ధి నిధుల నుంచి రూ.20 లక్షలు అందిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ కన్నడ భాషపై స్వాభిమానాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం స్తబ్ద చిత్రాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ శాంతరాజ్, తహసీల్దార్ నాగవేణి, నగరసభ కమిషనర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో..

నగరంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలను ఎస్పీ శాంతరాజ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కన్నడ ధ్వజారోహణ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ బంగారు గనులకు ప్రఖ్యాతి గాంచిన కేజీఎఫ్ కన్నడ నాడుకు మకుటం లాంటిదన్నారు. సమసమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పాండురంగ, సహాయక పాలనాధికారి జీ.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాలూరులో..

మాలూరు: పట్టణంలో 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలను బుధవారం విశేషంగా నిర్వహించారు. ఉదయం జూనియర్ కళాశాల మైదానంలో కన్నడ ధ్వజాన్ని ఎమ్మెల్యే కె వై నంజేగౌడ ఆవిష్కరించారు. అనంతరం కన్నడ స్తబ్ద చిత్రాల ఊరేగంపును ప్రారంభించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి కన్నడ మాత భువనేశ్వరి దేవి చిత్రపటాల పల్లకీలను, భువనేశ్వరి దేవి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌లో ప్రతిష్ఠించి ప్రధాన వీధుల్లో వివిధ కళాబృందాలతో ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే ఏ.నాగరాజ్, తహసీల్దార్ కే.రమేష్, టీపీ ఈఓ కృష్ణప్ప, కసాప అధ్యక్షుడు ఎంపీ హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

కన్నడ భాష రక్షణ అందరి బాధ్యత

శ్రీనివాసపురం: కన్నడ నేల, నీరు, భాషను రక్షించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. కన్నడ భాషాభిమానం కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి తాను శ్రమిస్తున్నానన్నారు. పట్టణంలో రూ.25 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. కోలారు రహదారి విస్తరణకు రూ.40 కోట్ల వ్యయంతో పనులను త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం వచ్చే ఏడాది మార్చిలోగా జలజీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికి కొళాయి కనెక్షన్ ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో టెన్త్, ఇంటర్‌లో కన్నడ భాషలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. తహసీల్దార్ శరీన్‌తాజ్, పురసభ ముఖ్యాధికారి వైఎన్ సత్యనారాయణ, బీఈఓ కె భాగ్యలక్ష్మి, కోశాధికారి కుముద, కెఎల్ జయరాం, బలరామేచంద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.



కేజీఎఫ్‌లో ఎస్పీ కార్యాలయంలో రాజ్యోత్సవ వేడుకలు



మాలూరులో ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ



శ్రీనివాసపురంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వేశ్యావాటికపై పోలీసుల దాడి

మైసూరు : మైసూరు నగరంలోని లలితామహల్ నగర్ మెయిన్ రోడ్డులో నిర్వహిస్తున్న వేశ్యావాటికపై పోలీసులు దాడి చేశారు. బాండ్లి మహేష్, మధుసుద అనే నిర్వాహకులను అరెస్ట్ చేశారు. అక్కడ చిక్కుకుపోయిన ఐదుమంది మహిళలకు విముక్తి కల్పించారు. నిందితులు విశ్రాంత పోలీసు అధికారి ఇంటిని అద్దెకు తీసుకొని మసాజ్ సెంటర్ పేరుతో వేశ్యావాటిక నిర్వహిస్తున్నట్లు పోలసులు తెలిపారు.

తండ్రిపై కత్తితో దాడి చేసిన తనయుడు

మైసూరు: కుటుంబ గొడవల నేపథ్యంలో తండ్రిపై కుమారుడు కత్తితో దాడి చేశాడు. ఈఘటన మైసూరు జిల్లా సరగూరు తాలూకా కట్టె హుణసురులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రంగయ్య కుమారుడు రంగస్వామి పరాయి మహిళను ఇంటికి తీసుకొచ్చాడు. ఇది పద్ధతి కాదని తండ్రి బుద్ధిమాటలు చెప్పడంతో రంగస్వామి కోపోద్రిక్తుడై కత్తితో దాడి చేశాడు. అడ్డుకునేందుకు వెళ్లిన మరో వ్యక్తిపై కూడా దాడి చేశాడు. దాడిలో గాయపడిన రంగయ్యను స్థానికులు హెచ్‌డీకోటె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సరగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆద్యం బిద్దప్పపై మరో కేసు

యశవంతపుర: మత్తులో పోలీసులపై దౌర్జన్యం చేసిన ప్రముఖ డిజైనర్ ప్రసాదు బిద్దప్ప కుమారుడు ఆద్యం బిద్దప్పపై యలహంక న్యూటౌన్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు. అక్టోబర్ 25న తాగిన మత్తులో కారు డ్రైవ్ చేస్తూ వెళ్తుండగా వెనుక వైపు వస్తున్న చోదకులు హరన్ కొట్టారు. దీంతో ఆద్యం బిద్దప్పపై వారిపై దాడి చేశారు. అడ్డుకోబోయిన పోలీసులపై కూడా దౌర్జన్యం చేశాడు. ఏఎస్ఐ గౌస్‌పాషా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆద్యం బిద్దప్పపై కేసు నమోదు చేశారు.

గాలిపటాలు ఎగురవేసి సంబరాలు

యశవంతపుర: కార్వారలో కన్నడ రాజ్యోత్సవాలు వినూత్నంగా జరిగాయి. రవీంద్రనాథ ఠాగూరు బీచ్‌లో గాలిపటాల పోటీలు నిర్వహించి కన్నడ రాజ్యోత్సవాన్ని ఆచరించారు. తీరం పొడువునా వందలాదిమంది గాలిపటాలను ఎగురవేశారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

కోలారు: 30 ఏళ్లపాటు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి నివృత్తి పొందిన ఉపాధ్యాయులు వెంకటేశప్ప, లోకేశప్పలను బుధవారం నగరంలోని బాలికల కళాశాల ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. బీఈఓ కన్నయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ సేవావధిలో అందించిన సేవలు అపారమన్నారు. ఇతరులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలో నివృత్తి తప్పనిసరి అయినా సేవావధిలో తీసుకున్న శ్రద్ధ నివృత్తి అనంతరం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. పీయూ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, అధ్యాపకుడు చంద్రప్ప, మధ్యాహ్న భోజన పథకం ఏడీ సుబ్రమణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కన్నడ సంస్కృతిని కాపాడుకోవాలి


సాధకులను సన్మానించిన దృశ్యం

గౌరిబిదనూరు: ఎంతో మంది త్యాగాల ఫలితంగా కర్ణాటక రాష్ట్రం ఏర్పడిందని, వారి త్యాగాలు వృథా కాకుండా కన్నడ సంస్కృతి, కన్నడ భాషను కాపాడుకోవాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ సూచించారు. నేతాజీ క్రీడా మైదానంలో బుధవారం జరిగిన రాజ్యోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని కన్నడ పతాకం ఎగురవేసి ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సాధన చేసిన వారిని సన్మానించారు. తహసీల్దార్ మహేశ్ పత్రి, ఈఓ హరీశ్, కమిషనర్ గీత, సీఐ సత్యనారాయణ, సాహితీవేత్త ప్రభానారాయణగౌడ, సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నంజుండప్ప పాల్గొన్నారు.

రూ.70 కోట్లతో క్రీడాప్రాంగణం అభివృద్ధి


మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

చిక్కబళ్లాపురం: నగరంలోని సర్ ఎం విశ్వేశ్వరయ్య క్రీడా ప్రాంగణాన్ని రూ. 70 కోట్లతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఉన్నత శిక్షణ శాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ వెల్లడించారు. ఆ క్రీడా మైదానంలో బుధవారం జరిగిన కన్నడ రాజ్యోత్సవంలో ఆయన పాల్గొని ధ్వజా రోహణ నెరవేర్చి భువనేశ్వరిమాత చిత్ర పటానికి పూజలు చేసి మాట్లాడారు. కన్నడ సంస్కృతి పరిరక్షణకు కృషి చేసిన మహనీయులను మరువరాదన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడారు. టెన్త్ పరీక్షల్లో కన్నడ సబ్జెక్టులో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో సాధన చేసినవారిని సన్మానించారు. పత్రికా రంగంలో సాధన చేసిన ఎం.కృష్ణప్ప, ఎన్ వెంకటేశ్‌లను సత్కరించారు. ఎంపీ బీఎన్ బచ్చేగౌడ, జిల్లా కలెక్టర్ రవీంద్ర, జిల్లా ఎస్పీ నాగేశ్, ప్రముఖులు పాల్గొన్నారు.

కఠోర సాధనతో కుస్తీ పోటీల్లో రాణింపు


మ్యాట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి

బొమ్మనహళ్లి : మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండటంతోపాటు కఠోర సాధనతో కుస్తీ పోటీల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి అన్నారు. హెచ్ఎస్ఆర్ లేఔట్ అగరలోని అగర బసవణ్ణ వ్యాయామ శాలలో కొత్తగా ఏర్పాటు చేసిన కుస్తీ మ్యాట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బసవణ్ణ వ్యాయామశాలకు మంచి పేరు ఉందన్నారు. ఇక్కడ శిక్షణ పొందినవారు అనేక చోట్ల జరిగిన పోటీల్లో విజయం సాధించారన్నారు. జాతీయస్థాయిలో రాణించేలా కృషి చేయాలని నిర్వాహకులకు సూచించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డి.కుపేంద్రరెడ్డి, మాజీ కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, బొమ్మనహళ్లి నగరసభ మాజీ ఉపాధ్యక్షుడు మునిరాజు, ఏఎం. నరసింహమూర్తి, అనంద్ రెడ్డి పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం


అవార్డుతో శంకరప్ప

తుమకూరు: జిల్లాలోని శిరా తాలూకా హారోగేరి గ్రామానికి చెందిన నీలకంఠయ్య, కుమారుడు శంకరప్ప హెచ్.ఎస్. తాలూకా స్థాయి రాజ్యోత్సవ పురస్కారం అందుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఆయనకు అవార్డు అందజేశారు. ఈయన పాత్రికేయ వృత్తితోపాటు తిపటూరు ప్రభుత్వ కళాశాలలో పత్రికోద్యమ విభాగంలో ఉపన్యాసకుడిగా పనిచేస్తున్నారు. ఈయన సేవలను గుర్తించి కన్నడ రాజ్యోత్సవ అవార్డు అందజేశారు.

నెలమంగల వద్ద చిరుత

దొడ్డబళ్లాపురం: నెలమంగల తాలూకా మారుతినగర, ఇందిరానగర ప్రదేశాల్లో చిరుతపులి సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మారుతినగరలోని ఒక గోడౌన్ వద్ద రాత్రి 11 గంటల సమయంలో చిరుత తిరుగాడిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సమీపంలోని ఆలదేనహళ్లి కొండమీద చిరుత మకాం వేసిందని అనుమానిస్తున్నారు. త్వరగా చిరుతను పట్టుకోవాలని స్థానికులు కోరారు.

మిన్నంటిన కన్నడ రాజ్యోత్సవ సంబరాలు


హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో కన్నడ పతాకాన్ని ఎగురవేస్తున్న దృశ్యం




తుమకూరులో భువనేశ్వరి మాత విగ్రహం ఊరేగింపు, తుమకూరులో చంద్రయాన్-3 శకటం

రాష్ట్రావతరణ దినం కన్నడిగుల్లో ఆనందోత్సాహాలను నింపింది. కన్నడ కస్తూరి పరిమళాలతో కన్నడ భాష, నేల, నీరు పులకించిపోయాయి. బుధవారం వాడవాడలా కన్నడ ధ్వజం రెపరెపలాడింది. కన్నడ మాత భువనేశ్వరి దేవికి విశేష పూజలు నిర్వహించారు.

బొమ్మనహళ్లి: హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో డాక్టర్ అంబేడ్కర్ సముదాయ భవనం ఆవరణలో దళిత నాయకుడు, సమాజ సేవకుడు సునందప్ప భువనేశ్వరి దేవి చిత్రపటానికి పూజలు చేసిన అనంతరం కన్నడ పతాకం ఎగురవేశారు. అదేవిధంగా కర్ణాటక రత్న డాక్టర్ పునీత్ రాజ్ కుమార్ చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు.

దొడ్డబళ్లాపురం: చామరాజపేట మూడవ మెయిన్ రోడ్డులో కన్నడ రాజ్యోత్సవాన్ని ఘనంగా ఆచరించారు. ధార్వాడ, బళ్లారి, చామరాజనగర, మండ్య తదితర జిల్లాల నుంచి విచ్చేసిన వివిధ సాంస్కృతిక కళా బృందాలు ప్రదర్శనలిచ్చాయి. కన్నడ తల్లి భువనేశ్వరిదేవి, రాజరాజేశ్వరిదేవి, మలె మహదేశ్వర స్వామి, ఆదిశక్తి చిక్కన్నమ్మ, గంగమ్మ, హహౌన్నాశమ్మ అమ్మవార్లను పల్లకీల్లో ప్రతిష్ఠించి ఊరేగించారు. యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు హ్యారిస్ నలపాడ్, మాజీ కార్పొరేటర్ సుజాత, గణేశ్, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

గౌరిబిదనూరు: అరుణోదయ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో కన్నడ రాజ్యోత్సవ సంబరాలు మిన్నంటాయి. ప్రజా ట్రస్ట్ ముఖ్యస్థురాలు విజయలక్ష్మి ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధికి పాటు పడాలన్నారు.

కృష్ణరాజపురం: నియోజకవర్గ పరిధిలోని రామ్మూర్తి నగరలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భువనేశ్వరి మాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు ఇటాచి మంజునాథ్ పాల్గొన్నారు.

కన్నడభాషను మరిస్తే తల్లిని విస్మరించినట్లే

బనశంకరి: కన్నడభాషపై అభిమానం కేవలం నవంబరు 1వతేదీకి మాత్రమే పరిమితం కారాదని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తెలిపారు. కంఠీరవ స్టేడియంలో ఏర్పాటుచేసిన కన్నడ రాజ్యోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కన్నడ హృదయభాష కావాలన్నారు.కర్ణాటక ఏకీకరణకు పోరాటం చేసిన మహనీయులను స్మరించుకోవాలని తెలిపారు. కన్నడభాషను మరచిపోతే కన్నతల్లిని మరచినట్లే అని తెలిపారు. తుంగభద్ర, కావేరి, కృష్ణా నదులు ప్రవహించే కన్నడనాడు పవిత్రభూమి అన్నారు.

కృష్ణరాజపురం: దేవసంద్ర వార్డులో ఉన్న బీఈఎస్ హెచ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కే.పూర్ణిమా శ్రీనివాస్ పాల్గొని కన్నడ పతాకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా పునీత్ రాజ్‌కుమార్ వర్ధంతిని పురస్కరించుకొని కేపీసీసీ ప్రధాన కార్యదర్శి డీకే మోహన్‌బాబు, కాంగ్రెస్ నాయకుడు డి.కే.రమేష్ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

తుమకూరు: రాష్ట్ర అభివృద్ధికి, కన్నడిగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర హోం మంత్రి, తుమకూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్‌జీ పరమేశ్వర్ అన్నారు. తుమకూరు నగరంలో మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన 68వ కన్నడ రాజ్యోత్సవంలో ఆయనన పాల్గొని భువనేశ్వరి మాత చిత్రపటానికి పూజలు చేసి కన్నడ పతాకం ఎగురవేశారు. అనంతరం పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళలు, సాహిత్యం,సంస్కృతి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మహానగర పాలికెలో కన్నడ రాజ్యోత్సవం

బనశంకరి: బెంగళూరు మహానగర పాలికె ఆధ్వర్యంలో బుధవారం కన్నడరాజ్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాలికె కేంద్రకార్యాలయ ఆవరణలో కన్నడపతాకాన్ని బీబీఎంపీ పాలనాధికారి రాకేశ్‌సింగ్, తుషార్‌గిరినాథ్ ఎగురవేశారు. అనంతరం భువనేశ్వరిదేవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రగీతం, నాడగీతం 5 కన్నడ పాటలను ఆలపించారు. ప్రత్యేక కమిషనర్ మునీశ్‌మౌద్గిల్, శివానందకల్కేరి, డాక్టర్ హరీశ్ కుమార్, రెడ్డిశంకరబాబు, ప్రీతిగెహ్లాట్ తదితరులు పాల్గొన్నారు.

2.25 లక్షల టన్నుల చెరుకు క్రషింగ్

మండ్య : మైషుగర్ చెక్కర పరిశ్రమంలో ఈ సీజన్‌లో 2.25 లక్షల టన్నుల చెరుకు క్రషింగ్ చేయగా 1.58 లక్షల క్వింటాళ్ల చెక్కరను ఉత్పత్తి చేశామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయ స్వామి అన్నారు. మండ్యలోని పరేడ్ మైదానంలో నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. ఈ ఏడాది 5 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

సాధకులకు సన్మానం

కన్నడ రాజ్యోత్సవం సందర్భంగా మండ్య నగరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పలు రంగాలలో సేవలందించినవారికి సన్మానం చేశారు. మంత్రి చెలువరాయ స్వామి పాల్గొన్నారు. ప్రముఖ పాత్రికేయుడు మద్దూరు సుందర్‌రాజ్‌ను ఘనంగా సత్కరించారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి పరమేశ్వర్


గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి చెలువరాయస్వామి


మండ్యలో సాధకులను సత్కరించిన దృశ్యం



బెంగళూరు పాలికెలో భువనేశ్వరి మాతకు పూజలు, కంటి అద్దాలు అందజేస్తున్న దృశ్యం



చామరాజపేట, గౌరిబిదనూరులో భువనేశ్వరీ దేవికి పుష్పార్చన

బీజేపీ ఎమ్మెల్యేల నిధులు మళ్లింపు

- మాజీ ఉప ముఖ్యమంత్రి సీఎస్ అశ్వత్థనారాయణ ఆరోపణ

దొడ్డబళ్లాపురం: బెంగళూరు నగరంలోని బీజేపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు ఇచ్చిన నిధులను కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు మళ్లిస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి డా.సీఎస్ అశ్వత్థనారాయణ ఆరోపించారు. బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రాండ్ బెంగళూరును కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాడ్ బెంగళూరుగా మారుస్తోందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి బెంగళూరు అభివృద్ధిని రాజకీయ దురుద్దేశంతో అడ్డుకుంటున్నారని, అందువల్లే బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. అభివృద్ధి ఆగిపోయిందన్నారు. బెంగళూరు సిటీలో సమస్యలను పరిష్కరించే దిశలో భాగంగా కార్యాచరణ చేపట్టాలని తమ నాయకుడు యడియూరప్పతో చర్చించామన్నారు. బెంగళూరు సిటీకి సంబంధించి ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలపై కూడా చర్చించామన్నారు. రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో 17 బృందాలతో రాష్ట్రంలోని కరువు పరిస్థితిని అధ్యనం చేస్తున్నట్లు తెలిపారు.

అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయులు


అమరజీవి పొట్టి శ్రీరాములు, భువనేశ్వరిమాత చిత్ర పటాలకు పూజలు చేసిన దృశ్యం

బనశంకరి: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని కర్ణాటక రాష్ట్ర పొట్టిశ్రీరాములు తెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరనారాయణ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిగినిలో ఆంధ్ర అవతరణ దినోత్సవం, కన్నడరాజ్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టిశ్రీరాములు, కన్నడ మాత భువనేశ్వరిదేవి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టిశ్రీరాములు చేసిన పోరాటం మరవలేమన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. సంఘం సభ్యులు పోలకసుబ్బారెడ్డి, పాణ్యంబాషా, బైరెడ్డిపుల్లారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నరేశ్, హరీశ్‌రెడ్డి, ఇ.నాగయ్య, సురేంద్రరెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

7న చౌకధాన్యపు డిపో డీలర్ల ధర్నా

దొడ్డబళ్లాపురం: అన్నభాగ్య పథకం కింద కార్డుదారులకు నగదుకు బదులు బియ్యం ఇవ్వడంతోపాటు అనేక డిమాండ్ల సాధనకు ఈ నెల 7న బెంగళూరులోని ఫ్రీడం పార్క్‌లో రేషన్ డీలర్లు ధర్నా నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరో వైపు ఇప్పటికే డిపోల్లో రేషన్ పంపిణీని నిలిపివేశారు. సంఘం అధ్యక్షుడు టీ కృష్ణప్ప మాట్లాడుతూ అన్నభాగ్య కార్డు దారులకు 10 కేజీల బియ్యం పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి రాగానే బియ్యం దొరకడంలేదనే కారణం చెప్పి నగదు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోందని, ఫలితంగా తమకు రావాల్సిన కమీషన్‌లో కోతపడిందన్నారు. కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రేషన్ పంపిణీకి ఇస్తున్న కమీషన్ ధర పెంచాలని, 2022లో కేంద్రప్రభుత్వం ప్రకటించిన కమిషన్ డబ్బును రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని, సర్వర్ సమస్యను పరిష్కరించాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ధర్నా శిబిరంలో మాటల యుద్ధం


వాగ్వాదం చేస్తున్న మాజీ మంత్రి ఆత్మానంద, రైతు సంఘం నేత ఇండువాల చంద్రశేఖర్

మండ్య: తమిళనాడుకు కావేరి నీటిని వదలడాన్ని నిరసిస్తూ మండ్యలోని సర్ ఎం.వి. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ధర్నా శిబిరంలో మాజీ మంత్రి ఎం.ఎస్. ఆత్మానంద, రైతు సంఘం నాయకుడు ఇండువాల చంద్రశేఖర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. గడిచిన రెండు నెలలుగా తాము పోరాటం చేస్తున్నా ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాత్రం తమిళనాడుకు కావేరి నీటిని విడుదల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు, పంటలకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో ఆత్మానంద కలుగజేసుకొని తమిళనాడుకు నీరు విడుదల చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వంపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

హోసూరు వార్తలు..

బైక్‌ను ఢీకొన్న కారు.. భర్త దుర్మరణం

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలేర్పడిన ఘటన క్రిష్ణగిరి తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని కొంకనపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణప్పనాయుడు (50) కూలి కార్మికుడు. భార్య రమాదేవి(40)తో కలిసి ద్విచక్రవాహనంలో హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారి బయనపల్లి వద్ద వెళుతున్నాడు. ఒక కారు అదుపు తప్పి ముందు వెళుతున్న కంటైనర్ లారీని, ఆపై వీరి బైక్‌ను ఢీకొంది. బైక్ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలేర్పడిన క్రిష్ణప్పనాయుడు ఘటనా స్థలంలోనే మృతి చెందగా రమాదేవిని స్థానికులు, పోలీసులు క్రిష్ణగిరి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

పంట పాడు చేస్తోందని ఏనుగు హత్య


నిందితుడు ముత్తుమల్లేష్‌తో పోలీసులు

కెలమంగలం: రాగి పంటపై దాడి చేస్తుండడంతో ఏనుగును నాటుతుపాకీతో కాల్చిచంపానని ఏనుగు హత్య కేసులో అరెస్టయిన రైతు ముత్తు మల్లేష్ (34) తెలిపాడు. డెంకణీకోట తాలూకా జవుళగిరి అటవీ ప్రాంతంలో షణ్మాశం గ్రామం వద్ద మూడురోజుల క్రితం ఏనుగును కాల్చి చంపిన ఘటన తెలిసిందే. అటవీశాఖాధికార్లు, తళి పోలీసులు, పశువైద్యులు పరిశీలించి అక్కడే ఏనుగును పాతిపెట్టారు. విచారణలో అదే గ్రామానికి చెందిన రైతు ముత్తుమల్లేష్ నాటుతుపాకీతో ఏనుగును హతమార్చినట్లు తెలిసింది. అతన్ని అరెస్టు చేసి విచారించగా, షణ్మాశం అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగు తరచూ తన రాగి పొలంపై పడి పంటను ధ్వంసం చేస్తోందని, ఆ కోపంతో చంపినట్లు ఒప్పుకున్నాడు. అతన్ని అరెస్ట్ చేసి డెంకణీకోట కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

ఇద్దరు దొంగల పట్టివేత

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో ప్రభుత్వ టాస్‌మార్క్ దుకాణంలో, ఓ ఇంట్లో దోపిడీకి పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని ఇరుదుకోటలోని టాస్‌మార్క్ మద్యం షాపులో రెండు రోజుల క్రితం దొంగలు చొరబడి 10 బాక్సుల మద్యం బాటిళ్లను దోచుకెళ్లారు. తరువాత అదే ప్రాంతానికి చెందిన జాకీర్ ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 1.90 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బాధితులు డెంకణీకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపగా హోసూరు సమీపంలోని బేళగొండపల్లి గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ (31), హోసూరు పారిశ్రామికవాడ మూకొండపల్లికి చెందిన ధర్మలింగం(22)లు దోపిడీకి పాల్పడినట్లు తెలిసింది. వీరిని పోలీసులు అరెస్ట్ చేశారు.

బీజేపీలోకి చేరికలు


పార్టీలోకి చేరినవారితో నాయకులు

హోసూరు: వివిధ పార్టీలకు చెందిన వందమందికి పైగా కార్యకర్తలు బీజేపీ పార్టీలో చేరారు. పట్టణంలోని క్రిష్ణగిరిలోని పార్టీ ఆఫీసులో పశ్చిమ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజ్ అధ్యక్షతన వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

గ్రామాల్లో కలెక్టర్ పర్యటన


నూరొందుస్వామిబెట్ట గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ శరయు

కెలమంగలం: తళి నియోజకవర్గంలోని అంచెట్టి తాలూకా సరిహద్దు అటవీ ప్రాంత గ్రామాలైన కోట్టైయ్యూరు, నూరొందుస్వామిబెట్ట గ్రామాల్లో కలెక్టర్ శరయు ఆకస్మిక పర్యటన నిర్వహించారు. నూరొందుస్వామిబెట్ట గ్రామస్థుల చిరకాల కోరికైన అత్తినత్తం- నూరొందిస్వామిబెట్ట గ్రామాల మధ్య రూ. 49.98 లక్షలతో తారురోడ్డు నిర్మాణానికి భూమిపూ చేసి పనులు ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అటవీ ప్రాంత గ్రామాల్లో బాల్య వివాహాలను చేయరాదని, పిల్లలను బాగా చదివించాలని సూచించారు.

సాధకులకు సన్మానం


సాధకులను సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: అనేకల్ పట్టణంలో వాటాళ్ నాగరాజు కన్నడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కన్నడ రాజ్యోత్సవాలు జరిగాయి. క్రీడా రంగానికి సంబంధించి రేణుకా శ్రీనివాస్, సాహిత్య రంగంలో జగన్నాథరావు, బహుళె, న్యాయవాది విజయకుమార్, ఆఫ్సర్ అలీఖాన్, గుడ్డనహళ్లి మునిరాజులను అధ్యక్షుడు సనాఉల్లా ఘనంగా సన్మానించారు. చుటుకు శంకర్, ఆదూర్ రమేష్ పాల్గొన్నారు.

దర్శన్‌పై ఫిర్యాదు చేసిన మహిళకు నోటీసులు

యశవంతపుర: నటుడు దర్శన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళకు ఆర్ఆర్‌నగర పోలీసులు నోటీసులిచ్చారు. దర్శన్‌కు చెందిన పెంపుడు కుక్క తనను కరిచిందంటూ అమితా జిందాల్ అనే మహిళ దర్శన్‌పై ఫిర్యాదు చేశారు. అమితా జిందాల్ మంగళవారం ఆర్ఆర్‌నగరలోని ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లటానికి కారు నిలిపిన చోటుకు నడిచి వెళ్తుండగా దర్శన్ ఇంటి వద్ద ఆయనకు చెందిన పెంపుడు శునకాలు దాడికి యత్నించాయి. వాటిని పట్టుకోవాలని అమితా జిందాల్.. ఆ ఇంటి పని సిబ్బందికి సూచించారు. అయితే ఇక్కడ కారు నిలపవద్దని సిబ్బంది సూచించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. కుక్కలను వదిలి వేయటంతో తనపై దాడి చేసినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆమెనుంచి మరిన్ని వివరాలకు నోటీసులు అందించినట్లు పోలీసులు తెలిపారు.

ముత్యాల అలంకరణలో ఘాటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


ముత్యాల అలంకరణలో ఘాటి సుబ్రహ్మణ్య స్వామి, వెన్న అలంకరణలో నరసింహస్వామి(పైన)

దొడ్డబళ్లాపురం: తాలూకాలోని ఘాటి సుబ్రమణ్య పుణ్యక్షేత్రంలో బుధవారం విశేష అలంకరణలు, పూజలు జరిగాయి. ముత్యాల అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి, వెన్న అలంకరణలో నరసింహస్వామి ఒకే చోట భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చారు. బారులుతీరి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

కన్నడ పాట పెట్టలేదని గొడవ

యశవంతపుర: పబ్‌లో కన్నడ పాటను పెట్టలేదని యువకులు గొడవకు దిగిన ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్టోబర్ 24న రాత్రి కెంచనహళ్లి రోడ్డులోని పబ్‌కు కొందరు యువకులు వెళ్లారు. ఆ సమయంలో పబ్ నిర్వాహకులు హిందీ పాటలు పెట్టగా కన్నడ పాటలు పెట్టాలని యువకుడు శ్రేయస్, అతడి స్నేహితులు మేనేజర్ రవి కాంత్‌పై ఒత్తిడి చేశారు. ఆయన అంగీకరించకపోవడంతో గొడవకు దిగారు. పబ్ మేనేజర్ ఆర్ఆర్ నగర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో శ్రేయస్, అతని స్నేహితులపై కేసు నమోదు చేశారు.

భువనేశ్వరిదేవిగా బనశంకరీదేవి


భువనేశ్వరిమాత అలంకరణలో బనశంకరీదేవి

బనశంకరి: కన్నడరాజ్యోత్సవాలను పురస్కరించుకొని బనశంకరీ దేవి ఆలయంలో బుధవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏ .చంద్రమోహన్ బనశంకరీదేవి మూలవిరాట్‌ను భువనేశ్వరిదేవిగా అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శిథిలావస్థలో ఉద్దనపల్లి బస్టాప్


అధ్వానంగా తయారైన బస్టాప్

హోసూరు: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఉద్దనపల్లి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సూళగిరి తాలూకాలోని ఉద్దనపల్లి గ్రామపంచాయతీలో సుమారు 2,500 కుటుంబాలున్నాయి. ప్రాథమిక ఆస్పత్రి, బ్యాంక్, పోలీస్‌స్టేషన్ తదితర సౌలభ్యాలు ఈ గ్రామంలో ఉండడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాదిమంది ప్రజలు రోజూ వచ్చి వెళ్తుంటారు. గ్రామంలో 20 ఏళ్ల క్రితం గ్రామస్థులచే ఏర్పాటు చేసిన బస్టాప్ శిథిలావస్థకు చేరుకొంది. పర్యవేక్షణలేక పగలు అనాథలు తలదాచుకుంటారు, రాత్రి కాగానే మందుబాబులు మద్యం తాగుతుంటారు. చుట్టూ మురుగు నీరు పేరుకుపోయి దుర్వాసన వస్తుంటుంది. ఈ బస్టాప్‌ను తొలగించి పెరిగిన అవసరాల ప్రకారం నూతన బస్టాప్ నిర్మించాలని ప్రజలు చాలారోజులుగా కోరుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు తామే స్వయంగా ఇంటికి రూ. వెయ్యి చొప్పున విరాళం సేరించి బస్టాప్ కట్టుకుంటామని సూళగిరి బీడీవోను అనుమతి కోరగా నిరాకరించారని వాపోయారు.

ఆస్పత్రిలో మేయర్ తనిఖీ

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని అణ్ణామలై నగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మేయర్ ఎస్.ఏ.సత్య తనిఖీలు చేశారు. రోగులతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకొన్నారు. రోగులకు అవసరమైన ఉపకరణాలు, మందులు, ఇతర సమస్యలపై ఆస్పత్రి డాక్టర్లను అడిగి తెలుసుకొన్నారు. డాక్టర్ ప్రభాకర్, రవి, నాగరాజ్ తదితరులు మేయర్ వెంట ఉన్నారు.


విశాఖలోని పెదజాలరిపేటలో పొట్టి పైడమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పొట్టి మంగ


ఒంగోలు గద్దలగుంటలో దివ్యాంగుడు ఇండ్ల వాసుదేవరావుకు పింఛన్ అందజేస్తున్న దివ్యాంగుడైన వలంటీర్ శ్రీధర్


విజయవాడలో డయాలసిస్ పేషెంట్ ప్రశాంత్‌కుమార్‌కు పింఛన్ ఇస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ నాగబాబు, అడ్మిన్ నాగలక్ష్మి


శ్రీకాకుళం నగరంలోని 23వ వార్డులో సింహాద్రి కామేశ్వరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రూబిన్సీరాణి


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరులో వృద్ధురాలు నరసమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రవల్లిక


కాకినాడ జిల్లా పెదకొత్తూరులో వృద్ధురాలు లక్ష్మీదేవికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ దేవి


వైఎస్సార్ జిల్లా కడపలోని రాజీవ్‌గాంధీనగర్‌లో గౌస్ మొహిద్దీన్‌కు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సాబిరా


కర్నూలు జిల్లా ఆర్.కొట్టాలలో లద్దు రజాబీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షేక్ అలీబాషా

ఒకటో తేదీనే అవ్వాతాతల చేతికి

రూ. 1,359.35 కోట్లు

సాక్షి, అమరావతి: ఠంఛన్‌గా ఒకటో తేదీనే రాష్ట్ర వ్యాప్తంగా అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ డబ్బులు ప్రభుత్వం పంపిణీ చేసింది. బుధవారం తెల్లవారు జాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి సాయంత్రం వరకు 49,32,936 మందికి రూ.1,359.35 కోట్ల పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు. నవంబర్‌లో మొత్తం 65.54 లక్షల మందికి పింఛన్ల పంపిణీ గాను రూ.1806.90 కోట్లను ప్రభుత్వం మంగళవారమే ఆయా గ్రామ వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. మొత్తం లబ్ధిదారుల్లో 75.26 శాతం మందికి బుధవారమే పింఛన్ల పంపిణీ పూర్తి కాగా, మిగిలిన వారి కోసం ఈ నెల ఐదో తేదీ వరకు వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారు ఇంటి వద్దనే పంపిణీ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.


పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని గొల్లవీధిలో వృద్ధుడు కొత్తకోట అప్పారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జ్యోతి


అనంతపురం నాలుగో డివిజన్‌లో దివ్యాంగుడు నాగసాయికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వలి


తిరుపతి మధురానగర్‌కు చెందిన దివ్యాంగుడు మునికన్నయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మునిలక్ష్మి


ఏలూరులో జీలు కాంతమ్మకు వృద్ధాప్య పింఛన్ ఇస్తున్న వలంటీర్ సీహెచ్ సందీప్

గ్రామీణ రహదారులకూ మహర్దశ

రాష్ట్రంలో రూ.784.22 కోట్లతో 202 పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణం

- ఈ నెల 6వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా బిడ్లు నమోదు
- డిసెంబర్ 1 నుంచి పనులు ప్రారంభించేలా సిద్ధమైన ప్రణాళిక



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉండే (హై ఇంపాక్ట్) మరో 202 రోడ్లను రూ.784.22 కోట్లతో పూర్తిస్థాయిలో మరమ్మతులతోపాటు పునర్నిర్మాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 26 జిల్లాల్లో 1,035 కిలోమీటర్ల మేర ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రాష్ట్రంలో 258 రోడ్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో ఉండగా.. వాటిలో 56 రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం గతంలోనే అనుమతులు ఇవ్వగా.. పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 202 రోడ్ల పునర్నిర్మాణ పనుల కోసం పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో కొత్తగా అనుమతులిచ్చిన హై ఇంపాక్ట్ రోడ్ల వివరాలిలా..

రోడ్ల వివరం	రోడ్ల సంఖ్య	రోడ్ల పొడవు (కి.మీ.)	ఖర్చు (రూ.కోట్లలో)
మట్టి రోడ్ల స్థానే తారు రోడ్ల నిర్మాణం	63	329.87	313.51
రోడ్లపై తారు లేయర్ వేసేవి	6	44.89	20.55
పూర్తి స్థాయిలో పునర్నిర్మించే తారు రోడ్లు	127	655.79	389.01
వంతెనల నిర్మాణం	6	5.40	61.15
మొత్తం	202	1,035.95	784.22 3

టెండర్ల ప్రక్రియ షురూ!

ఈ పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ మొదలైంది. ఈ నెల 6వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానంలో కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు ప్రక్రియను మొదలు పెట్టినట్టు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఎన్‌సీ బాలు నాయక్ తెలిపారు. 14 రోజుల పాటు టెండర్ల దాఖలుకు గడువు ఉంటుందని.. నవంబర్ నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి డిసెంబర్ మొదటి వారంలోనే ఆయా రోడ్ల పనులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. కాగా.. ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో గుర్తించిన హై ఇంపాక్ట్ కేటగిరీ రోడ్లకు ప్రభుత్వం ఆ శాఖ ఆధ్వర్యంలో అనుమతులు మంజూరు చేసింది. ఆ పనులు కూడ మొదలైనట్టు అధికారులు వెల్లడించారు.

విదేశీ నర్సింగ్ అవకాశాలపై దృష్టి

ఏపీఎన్ఎంసీతో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం

సాక్షి, అమరావతి: నర్సింగ్ రంగంలో స్థానిక యువతకు అంతర్జాతీయంగా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ... ఆంధ్రప్రదేశ్ నర్సులు మరియు మిడ్‌వైవ్స్ కౌన్సిల్ (ఏపీఎన్ఎంసీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం నర్సులు, నర్సింగ్ విద్యార్థులకు ఏపీఎస్ఎస్‌డీసీ ఆరోగ్య సంరక్షణ రంగంలో నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను అందిస్తుంది. బుధవారం తాడేపల్లిలోని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రెండు సంస్థలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో వినోద్ కుమార్ మాట్లాడుతూ మిడిల్ ఈస్ట్, యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, అమెరికావంటి విదేశీ అవకాశాలపై ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. రాష్ట్రంలో భారీసంఖ్యలో నర్సింగ్ గ్రాడ్యుయేట్‌లకు అవసరమైన నైపుణ్య, మౌలిక సదుపాయాలను అందించడం ద్వారా అంతర్జాతీయ నియామకాల కోసం నర్సులకు శిక్షణ ఇవ్వడానికి రాష్ట్రం సరైన వేదిక అని ఆయన అన్నారు.

క్లుప్తంగా...

స్పెషల్ కేటగిరి విద్యార్థులకు మాన్యువల్ కౌన్సెలింగ్

రేపు ఎన్జీరంగా వర్సిటీ పరిధిలో సీట్ల భర్తీ

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో స్పెషల్ కేటగిరి విద్యార్థులకు బీఎస్సీ (హ్యాన్స్) అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీన గుంటూరు నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆడిటోరియంలో స్పెషల్ కేటగిరి, పీహెచ్, ఎన్‌సీసీ, సీఏపీ, స్పోర్ట్స్, స్కౌట్ అండ్ గైడ్స్‌లో రిజిస్టర్ చేసుకున్న ప్రయార్టీల్లో ఉన్న విద్యార్థులకు మిగిలిన సీట్ల భర్తీకి మాన్యువల్ కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఉద్దానం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య పోస్టుల భర్తీ

11 డాక్టర్ పోస్టుల కోసం 6వ తేదీన వాక్–ఇన్ ఇంటర్వ్యూ

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ బాధితులకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం పలాసలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్‌లో 11 వైద్య పోస్టుల భర్తీకి ఈ నెల 6న వాక్–ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఒక కార్డియాలజీ, మూడు నెఫ్రాలజీ, మూడు రేడియాలజీ, నాలుగు యూరాలజీ డాక్టర్ పోస్టులను కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేయనున్నట్టు తెలిపారు. విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ కార్యాలయంలో 6వ తేదీన ఇంటర్వ్యూ ఉంటుందని చెప్పారు. అర్హులైన వైద్యులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల మధ్య ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

రేపు, ఎల్లుండి సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లకు పోస్టింగ్‌లు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ఖాళీలను భర్తీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- 340 మంది అభ్యర్థులు ఎంపిక

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విభాగంలోని పీహెచ్‌సీలతో పాటు వైద్య శాఖ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్) ఖాళీల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. శుక్ర, శనివారాల్లో విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో 340 మంది వైద్యుల సర్టిఫికెట్‌లను పరిశీలించి, కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఎంపిక జాబితాలోని 1 నుంచి 150 మంది అభ్యర్థులు శుక్రవారం, 151 నుంచి మిగిలినవారంతా శనివారం కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 2019 నుంచి ఇప్పటి వరకు 53 వేలకు పైగా పోస్టుల భర్తీ చేపట్టింది. కాగా, 2023–24 విద్యా సంవత్సరానికి ఇన్‌సర్వీస్ కోటాలో సీఏఎస్ వైద్యులు పీజీ చదివేందుకు వెళ్లడంతో 300కు పైగా ఖాళీలు ఏర్పడ్డాయి. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్‌తో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇతర వైద్య సేవలకు ఇబ్బంది ఏర్పడకుండా ప్రభుత్వం ముందే భర్తీ ప్రక్రియను ప్రారంభించింది. పీజీ చదివేందుకు వెళ్తున్న వైద్యుల స్థానాల్లో కొత్తగా ఎంపికైన వారికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

సాగు నీటిలో నవచరిత్ర

▶ మొదటి పేజీ తరువాయి

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. సాగునీటి కోసం ప్రత్యామ్నాయ జలవనరుల వినియోగం (సముద్రపు నీటిని డీశాలినేషన్ చేయడం, మురుగు నీటిని శుద్ధి చేయడం తదితరాలు), తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగు, అధిక ఉత్పాదకత విధానాలపై పరిశోధన నివేదికలను సదస్సులో సమర్పించి చర్చించనున్నారు. ఈ అంశాలపై రెండు అంతర్జాతీయ సెమినార్లు, అంతర్భాగంగా పది కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

4న అవార్డుల ప్రదానోత్సవం

ప్రపంచవ్యాప్తంగా జల సంరక్షణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన సంస్థలకు, ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడాలుగా ఎంపికైన ప్రాజెక్టులకు ఈనెల 4న అవార్డులు ప్రదానం చేయనున్నారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలో గోస్తని నదిపై 1963–68 మధ్య 3.175 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన తాటిపూడి రిజర్వాయర్‌ను ఈనెల 5న ఐసీఐడీ ప్రతినిధుల బృందం పరిశీలించి నీటి పారుదల వ్యవస్థను అధ్యయనం చేయనుంది. సదస్సు ముగింపు సందర్భంగా ఈనెల 8న ఐఈసీ (ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ) 74వ సమావేశాన్ని నిర్వహిస్తారు. అదే రోజు ఐఈసీ ఆఫీస్ బేరర్స్ ఎన్నికలు నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు. 9న ఐసీఐడీ ప్రతినిధులు అరకు వ్యాలీని సందర్శించడంతో సిల్వర్ జూబ్లీ (25వ వేడుక) కాంగ్రెస్ పూర్తవుతుంది.

57 ఏళ్ల తర్వాత విశాఖ వేదికగా

అంతర్జాతీయంగా సుస్థిర సాగునీటి నిర్వహణ లక్ష్యంగా 1950 జూన్ 24న సిమ్లా వేదికగా ఐసీఐడీ ఆవిర్భవించింది. ఐసీఐడీ తొలి కాంగ్రెస్ 1951 జనవరి 11–16 వరకు ఢిల్లీలో జరిగింది. మన దేశంలో చివరిగా ఐసీఐడీ ఆరో కాంగ్రెస్ 1966 జనవరి 4–13 వరకూ జరిగింది. సంస్థ ఆవిర్భవించిన 57 ఏళ్ల తరువాత సిల్వర్ జూబ్లీ వేడుకలు విశాఖలో జరగనుండటం గమనార్హం. ఈ ప్రతిష్టాత్మక సదస్సును కేంద్ర జలసంఘం, కేంద్ర జల్ శక్తి శాఖ, ఇన్‌సిడ్(ఇండియన్ నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఐసీఐడీ సిల్వర్ జూబ్లీ కాంగ్రెస్‌కు విశాఖ అందంగా ముస్తాబైంది. సదస్సును ర్యాడిసన్ బ్లూ రిసార్ట్స్ వేదికగా నిర్వహించనున్నారు.

నేడు విశాఖ సదస్సుకు సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో మొదలయ్యే 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ ప్లీనరీ (ఐసీఐడీ) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారు. సీఎం ఉదయం 7.35 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటారు. సదస్సుకు హాజరైన అనంతరం మధ్యాహ్నం తిరిగి తాడేపల్లి చేరుకుంటారు.

సర్కారు చిత్తశుద్ధికి దక్కిన గౌరవం

నదీ జలాలను ఒడిసి పట్టి భూగర్భ జలాలను సంరక్షిస్తూ మెరుగైన యాజమాన్య పద్ధతులలో అధిక ఆయకట్టుకు నీళ్లందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2019లో రాష్ట్రంలో కోటి ఎకరాలకు నీళ్లందించి రికార్డు నెలకొల్పారు. అదే ఒరవడితో 2020, 2021, 2022లోనూ కోటి ఎకరాలకు నీళ్లందించి అన్నదాతలకు దన్నుగా నిలిచారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ ఏడాది కూడా ఆయకట్టుకు సమర్థంగా నీళ్లందిస్తున్నారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరంతో పాటు సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నారు. సూక్ష్మ నీటిపారుదల (డ్రిప్, స్ప్రింక్లర్లు) విధానాలకు పెద్దపీట వేస్తున్నారు. సాగు నీటికి సీఎం జగన్ ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఐసీఐడీ సిల్వర్ జూబ్లీ సదస్సును ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. ఇది సుస్థిర సాగునీటి నిర్వహణ దిశగా అడుగులు వేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వానికి దక్కిన గౌరవంగా సాగునీటి రంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు.

ఆహార భద్రతకు ప్రాధాన్యం

అధిక ఆయకట్టుకు సుస్థిరంగా సాగునీటిని అందించి ఆహార భద్రత చేకూర్చడమే లక్ష్యంగా సీఎం జగన్ నీటిపారుదల రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. దీన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తూ ఐసీఐడీ సిల్వర్ జూబ్లీ కాంగ్రెస్ నిర్వహణకు విశాఖను వేదికగా ఎంపిక చేసింది. ఈ సదస్సు ద్వారా రాష్ట్ర నీటిపారుదల రంగంలో నవ చరిత్రను లిఖిస్తాం. సీఎం జగన్ నేతృత్వంలో ప్రపంచంలో అత్యుత్తమ నీటిపారుదల విధానాలను ఈ సదస్సు ద్వారా అందిపుచ్చుకుని రైతులకు బాసటగా నిలుస్తాం.

– శశిభూషణ్‌కుమార్, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి

అత్యుత్తమ నీటి విధానాలే లక్ష్యం

సుస్థిర సాగునీటి నిర్వహణతో రాష్ట్రాన్ని సుభిక్షం చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. అందులో భాగంగానే వరద నీటిని ఒడిసి పట్టి దుర్భిక్ష ప్రాంతాలను సుభిక్షం చేసే ప్రాజెక్టులు చేపట్టాం. పోలవరం నిర్మాణం శరవేగంగా సాగుతోంది. మెరుగైన యాజమాన్య పద్ధతుల ద్వారా గతంలో ఎన్నడూ లేని రీతిలో ఆయకట్టుకు నీళ్లందిస్తున్నాం. ప్రపంచంలో అత్యుత్తమ నీటిపారుదల విధానాలను రాష్ట్రంలో అమలు చేయాలన్నదే సీఎం జగన్ ఆలోచన.

– సి.నారాయణరెడ్డి, ఇంజనీర్–ఇన్–చీఫ్, జలవనరుల శాఖ

ఉద్దానంలో పెద్దపులి

- శ్రీకాకుళం జిల్లా సహలాల పుట్టుగ, కొండిపుట్టుగలో పశువులపై దాడి
- భయాందోళనలో ప్రజలు

కంచిలి/కవిటి: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో పెద్దపులి మంగళవారం రాత్రి పశువులపై పంజా విసిరింది. కవిటి మండలం సహలాల పుట్టుగలో ఓ ఆవుపై దాడిచేసి చంపేసింది. అదే మండలంలోని కొండిపుట్టుగలో ఓ గేదె దూడను హతమార్చింది. గుజ్జుపుట్టుగలో ఓ ఆవు దూడ తలపై దాడి చేసి గాయపరిచింది. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో కవిటి–నెలవంక మార్గంలో శీమూరు–నెలవంక గ్రామాల మధ్య రోడ్డు దాటుతూ బస్సు ప్రయాణికులకు కనిపించింది. ఈ ఘటనలతో ఉద్దానం ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కంచిలి మండలం మండపల్లిలో ఆవుపై దాడిచేసిన పులి, కవిటి మండలంలో కనిపించిన పులి ఒక్కటేనా.. వేర్వేరా అనే విషయం తెలియడం లేదు. అటవీ శాఖ అధికారులు ఒక పులి మాత్రమే తిరుగుతోందంటున్నారు. పులికి ఒక రోజులో గరిష్టంగా 70 కిలోమీటర్ల దూరం ప్రయాణించే సామర్థ్యం ఉంటుందని చెబుతున్నారు. ఈ ఘటనపై పలాస ఆర్డీవో భరత్‌నాయక్ మాట్లాడుతూ.. పులి సంచారంపై రెవెన్యూ, పోలీస్, అటవీ, పంచాయతీ అధికారులతో ఇప్పటికే సమీక్షించామన్నారు. పులి సంచరిస్తున్న గ్రామాలతోపాటు సమీప గ్రామాల ప్రజలు రాత్రిపూట బయట తిరగొద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తోడు లేకుండా బయటకు రావొద్దన్నారు.


మండపల్లిలో పెద్దపులి దాడిలో మృతిచెందిన ఆవు

ఒడిశా నుంచి రాక!

పెద్దపులి ఒడిశాలోని గజపతి జిల్లా గండాహతి అటవీ ప్రాంతం నుంచి అక్టోబర్ 21న శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లొత్తూరు వరి పొలాల్లో సంచరించినట్టు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. తరువాత పలాస మండలం టబ్బుగాం, మందస మండలం కొండలోగాం, పట్టులోగాం గ్రామాల్లో తిరిగిందని తెలిపారు. 27న రాత్రి కంచిలి మండలం మండపల్లి పంచాయతీ పరిధి అమ్మవారిపుట్టుగ వచ్చిన పులిని 28న గ్రామస్తులు గుర్తించారు. అక్కడి నుంచి ఆందోళన మొదలైంది. నవంబర్ 1న కంచిలి మండలం మండపల్లి పరిసరాలు, సోంపేట కొబ్బరితోటల్లో సంచరించిందని స్థానికులు చెప్పడంతో అటవీ అధికారులు పరిశీలించారు.

ఉద్యోగాలు వచ్చేశాయ్!

▶ మొదటి పేజీ తరువాయి

పలు వర్సిటీల్లోని నిపుణులతో చర్చించి సిలబస్‌లో సమూల మార్పులు తెస్తున్నట్లు చెప్పారు.

తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

ఓ వర్గం మీడియా ప్రభుత్వంపై, కమిషన్‌పై తప్పుడు కథనాలను ప్రచురిస్తూ నిరుద్యోగ యువతలో ఆందోళన రేకెత్తించేందుకు ప్రయత్నించటాన్ని ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో ఖండించింది. గ్రూప్ 2 విషయంలో ఇప్పటికే దాదాపు 900 ఖాళీల భర్తీకి ఆర్థికశాఖ నుంచి అనుమతులు లభించాయని, 54 శాఖల నుంచి జోన్ల వారీగా జీవో నం.77కు అనుగుణంగా సమాచారం రావడం ఆలస్యమైందని పేర్కొంది. ఈ అంశంపై కసరత్తు దాదాపు పూర్తయిందని, ఈ నెలలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. కొన్ని పత్రికలు ఉద్దేశపూర్వకంగా సర్వీస్ కమిషన్‌పై తప్పుడు కథనాలను వెలువరిస్తూ నిరుద్యోగులను ఆందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, గ్రూప్–1, గ్రూప్–2 నోటిఫికేషన్ల జారీపై తప్పుడు వార్తలు ప్రచురించడాన్ని ఖండించింది. సాధారణంగా ఏపీపీఎస్సీ పరిధిలోని నియామకాలకు మాత్రమే ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ వినియోగిస్తామని, శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా కమిషన్ పరిధిలోకి రాని పోస్టుల నియామక బాధ్యతలను తమకు అప్పగించినప్పుడు వాటి భర్తీ ఖర్చును ఆయా శాఖలే భరిస్తాయని తెలిపింది. 2018లో కూడా ఏపీపీఎస్సీ నిర్వహించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల పరీక్షల ఖర్చును ఆయా విద్యాసంస్థలే భరించాయని గుర్తు చేసింది. ఇప్పుడు కూడా అదే విధానాన్ని అనుసరించి పరీక్ష నిర్వహణ ఖర్చు అంచనాలను ఉన్నత విద్యా మండలికి పంపించామని తెలిపింది. ఈ లేఖను వక్రీకరిస్తూ కథనాలు ప్రచురించడం బాధాకరమని, వీటిని నమ్మవద్దని సూచించింది. ఈ నెలలోనే 23 నోటిఫికేషన్లు వెలువడనున్నట్లు వెల్లడించింది.

ఈ నెలలో రానున్న నోటిఫికేషన్లు	పోస్టుల సంఖ్య
గ్రూప్–2	900
గ్రూప్–1 (క్యారీ ఫార్వర్డ్ పోస్టులు కలిపి మొత్తం 100 వరకు)	89+
లైబ్రేరియన్స్ ఇన్ ఏపీ కాలేజీ ఎడ్యుకేషన్	23
డిగ్రీ కాలేజీ లెక్చరర్స్	267
ఏపీ రెసిడెన్షియల్ కాలేజీ జేఎల్స్	10
ఏపీ రెసిడెన్షియల్ కాలేజీ డీఎల్స్	05
టీటీడీ డీఎల్స్, జేఎల్స్	78
ఇంగ్లిష్ రిపోర్టర్స్(ఏపీ లెజిస్లేచర్ సర్వీస్)	10
జూనియర్ లెక్చరర్స్ (లిమిటెడ్)	47
అసిస్టెంట్ కెమిస్ట్స్ ఇన్ గ్రౌండ్ వాటర్ సర్వీస్	01
జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్స్	06
అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్స్	03
అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్స్	01
టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్స్	04
సంక్షేమశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్స్	02
జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(కేటగిరి–2)	01
సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(కేటగిరి–3)	04
జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(కేటగిరి–4)	06
డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్	38
ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్	04
జూనియర్ అసిస్టెంట్స్ (జైళ్లు)	01
పాలిటెక్నిక్ లెక్చరర్స్	99
లైబ్రేరియన్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్	02
పురపాలకశాఖ అకౌంట్స్ విభాగంలోనూ పోస్టుల భర్తీ చేపడతారు.	

విద్యా సంస్కరణలతో ఏపీలో అద్భుత ఫలితాలు

నెదర్లాండ్స్ కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: విద్యారంగంలో అద్భుతమైన సంస్కరణలతో ఆంధ్రప్రదేశ్ గొప్ప ఫలితాలను సాధించిందని, గొప్ప సంస్కరణలకు ఏపీ కేంద్రంగా నిలిచిందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ వెల్లడించారు. నెదర్లాండ్స్‌లో బుధవారం జరిగిన గ్లోబల్ సోషల్ అండ్ ఫైనాన్షియల్ స్కిల్స్ కాన్ఫరెన్స్–2023లో భారతదేశ ప్రతినిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చేయికలిపితే విద్యావ్యవస్థలో మార్పులతో పాటు అభివృద్ధి సుసాధ్యమవుతుందన్నారు. దాదాపు 75 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్న సదస్సులో ఏపీలో పాఠశాలల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను, ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) విజయంతోపాటు పిల్లలను ప్రపంచస్థాయి విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈఎండీపీ మూల్యాంకన అధ్యయనాన్ని ప్రపంచ బ్యాంక్ ఆరు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల సహకారంతో నిర్వహిస్తోందని, ఇది విద్యాభివృద్ధిలో విప్లవాత్మక విధానంగా నిలిచిందని చెప్పారు. సదస్సులో ఈఎండీపీ ప్రోగ్రామ్ మేనేజర్ సతీష్ దుల్లా పాల్గొన్నారు.



సుధా భరద్వాజ్

అమెరికాలో పుట్టి పెరిగింది సుధా భరద్వాజ్ అమ్మతో పాటు స్వదేశానికి వచ్చి కాన్పూర్ ఐఐటీలో చదువు పూర్తి చేసింది. కార్మికులు, గిరిజన మహిళల వెతలు తెలుసుకొని అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకుని న్యాయవాద వృత్తిని చేపట్టింది. మహిళా ఖైదీల సమస్యలపై పోరాడింది. సాధారణ జీవనం నుంచి సామాజిక కార్యకర్తగా బలహీనులకు న్యాయం చేయడానికి సమస్యలపై పోరాడుతూనే ఉంది. సుధా భరద్వాజ్ జీవితం తెలుసుకుంటే స్త్రీ శక్తి మరో కోణంలో పరిచయం అవకుండా ఉండదు. ఈ విషయాలను ఆమె ప్రస్తావిస్తూ...

పోరాటమే ఆమె జెండా

సుధా భరద్వాజ్ అలుపెరుగని ప్రయాణం

అరవై ఏళ్ల క్రితం నవంబర్ 1న అమెరికాలో పుట్టాను. అమ్మానాన్నలు ఇద్దరూ పేరొందిన ఆర్థిక వేత్తలు. సామాజికంగానూ చాలా చురుకుగా ఉండేవారు. నేను పుట్టిన ఏడాదికి వారిద్దరూ భారతదేశం వచ్చారు. నాకు నాలుగేళ్ల వయసులో అమ్మానాన్నలు విడిపోయారు. అమ్మ ఒంటరిగా ఉంటూ నన్ను పెంచి, పెద్దచేసింది. అమ్మకు కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ఫెలోషిప్ రావడంతో విదేశాలకు వెళ్లిపోయాం. ఆ తర్వాత కొన్నేళ్లకు రాజస్థాన్‌లోని జెఎన్‌యూలో టీచింగ్ చేయడానికి అమ్మ స్వదేశానికి వచ్చింది. అలా అమ్మతోపాటు నేనూ వచ్చేశాను. 'సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్'ని స్థాపించడంలో ఆమె ముఖ్యమైన పాత్ర పోషించింది. గొప్ప గొప్ప ఆర్థిక వేత్తలతో కలిసి భారత ఆర్థిక వ్యవస్థపై లోతయిన అధ్యయనాలు చేసింది. జేఎన్‌యులో చదువుతో పాటు సామాజిక రాజకీయ అంశాలపై కూడా విద్యార్థులు చురుకుగా ఉండేవారు. నేను అలాంటి వాతావరణంలో పెరిగాను. సాహిత్య, సామాజిక కార్యక్రమాలంటే ఇష్టంగా ఉండేది. గణితంలో కూడా మంచి ఆసక్తి ఉండటంతో ఐఐటీ కాన్పూర్‌లో అడ్మిషన్ తీసుకున్నాను.

■ చదువుతూ కూలీలతో..

ఐఐటీలో కొంతమంది విద్యార్థులతో ఒక చిన్న రీసెర్చ్ టీమ్ ఏర్పడింది. కోర్సుతో పాటు పబ్లిక్ సెక్టార్, సైన్స్ అండ్ టెక్నాలజీ వరకు చదివే వాళ్లం. సామాజిక సమస్యలనూ చర్చించేవాళ్లం. అప్పుడే ప్రజా సంక్షేమానికి కృషి చేస్తేనే నా చదువుకు సార్థకత అనుకునేదానిని. కొంతమంది తోటివిద్యార్థులతో కలిసి కూలీల మధ్య పని చేయడం ప్రారంభించాం. ఓసారి ఉన్నావ్‌లోని ఓ ఫ్యాక్టరీలో కార్మికులపై పోలీసులు కాల్పులు జరిపిన ఘటన చోటుచేసుకుంది. మా టీమ్‌తో కలిసి నిజనిర్ధారణ కోసం వెళ్లాం. కష్టపడి పనిచేసే వారితో అనుబంధం అలా మొదలైంది. అక్కడ కార్మికులతో కలిసి వారి పాటలు, సంగీతం ఆస్వాదించేదాన్ని. కాన్పూరియా యాసలో మాట్లాడటం, పాడడం అంటే చాలా ఇష్టం ఉండేది. ఆ విధంగా కార్మికుల ఉద్యమంతో చాలా ప్రభావితమయ్యాను. 1982లో ఆసియా క్రీడలు జరగడానికి ముందు ఢిల్లీలో ఫ్లై ఓవర్లు, స్టేడియం నిర్మిస్తున్నారు. ఈ పనులకోసం ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లోని మారుమూల ప్రాంతాల నుంచి పేద కూలీలను రప్పించి, వారిని శిబిరాల్లో ఉంచారు. అయితే, వారు తమ ఇంటికి వెళ్ళడానికి టికెట్లు కూడా కొనలేని విధంగా చాలా తక్కువ కూలీ ఇచ్చేవారు. నాకెందుకో వారిని క్యాంపులో బంధించినట్లు అనిపించింది. ఆ తర్వాత 1984లో సిక్కుల ఊచకోత, భోపాల్ గ్యాస్ విషాదం దిగ్భ్రాంతికి గురిచేశాయి. సమాజంలో మార్పు తీసుకు రావాలనే సంకల్పం అప్పుడే నా మనసులో బలంగా మారింది.

■ నా దేశం కోసం అమెరికా పౌరసత్వం వదులుకున్నా

నాకు 21 ఏళ్లు వచ్చినప్పుడు, నేను పుట్టుకతో పొందిన అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకోవాలని అమ్మతో కలిసి అమెరికన్ ఎంబసీకి వెళ్లాను. నేను పౌరసత్వాన్ని వదులుకుంటున్నానని చెబితే ఆశ్చర్యపోయారు. అందుకు తగిన ఫారమ్ కోసం వెతికితే, దొరకలేదు. 'వారం తర్వాత రండి. ఈ నిర్ణయం తీసుకునేముందు మీ ఇంట్లో ఎవరినైనా అడిగారా...?' వంటి ప్రశ్నలు వేశారు. అంటే ఇంట్లో మగవారికి తెలియకుండా అమెరికన్ పౌరసత్వాన్ని వదులుకోవడానికి వచ్చామని వారు అనుకున్నారు. యుఎస్ పౌరసత్వాన్ని వదులుకున్న తర్వాత, హోం మంత్రిత్వ శాఖలో భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేశాను.



■ కార్మిక ఉద్యమాల్లో భాగంగా..

మరోవైపు దేశంలో అలజడి కొనసాగుతోంది. మిల్లు కార్మికుల ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఈ ఉద్యమాల్లోనే అద్భుతమైన కార్మిక నాయకుడు శంకర్ గుహ నియోగి పేరు మొదటిసారిగా తెలిసింది. 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా' ద్వారా కార్మికుల ఆర్థిక అవసరాలను పెంచడంతోపాటు, వారికోసం పాఠశాలలు, ఆసుపత్రులను నడుపుతూ వారి మధ్య ఉంటూ వ్యసనాల నుండి బయటపడటానికి సహాయం చేస్తున్నాడు. జాతీయ భద్రతాచట్టం కింద అతణ్ణి అరెస్టు చేసినప్పుడు, అతని విడుదల కోసం విద్యార్థులుగా మేం పోరాడాం. విడుదలైన తర్వాత ఆయనను కలిశాం. 1986 నాటికి, నేను 'ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా'తో పనిచేయాలని నిర్ణయించుకున్నాను. భిలాయ్ సమీపంలోని రాజహారా గనులలో పని చేసే పిల్లలకు చదువు నేర్పించడం ప్రారంభించాను. కొంతకాలం తర్వాత, భిలాయ్‌లో కార్మిక చట్టాలను అమలు చేయడానికి భీకర పోరాటం ప్రారంభమైంది. 16 పెద్ద కంపెనీలు 4,200 మంది కార్మికులను తొలగించాయి. కార్మికులను తిరిగి పనిలో చేర్చడానికి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు జరిగాయి. కొంతమంది కార్మికులు చనిపోయారు. వారి కుటుంబాలతో కలిసి ఎండ వానలు లెక్కచేయకుండా గడిపాం.

■ న్యాయం కోసం పోరాటం ...

కార్మికుల అభ్యర్థన మేరకు, నేను 2000 సంవత్సరంలో నా న్యాయవిద్యను పూర్తి చేసి వారి కోసం న్యాయపోరాటం ప్రారంభించాను. కూలీలు, గిరిజనులు, మహిళలు అనే తేడా లేకుండా వారి కోసం చేసిన చట్టాలు సక్రమంగా అమలు కాకపోవడం చూశాను. నిరసన తెలిపితే వారిపై కేసులు పెడతారు. ఆ తర్వాత కొంత మంది తోటి లాయర్లతో కలిసి జన్-హిత్ పేరుతో గ్రూప్‌ని ప్రారంభించాను. ఆ తర్వాత భూసేకరణ, అటవీ హక్కులు, పర్యావరణ సంబంధిత సమస్యలకు సంబంధించిన అనేక కేసులను వాదించడం ప్రారంభించాం. కేసులన్నీ కార్పొరేట్లపైనే ఉన్నాయి. అప్పటికి చాలామంది శత్రువులను కూడగట్టుకున్నానని గ్రహించాను. కానీ, ఏ మాత్రం భయపడకుండా బలహీనుల కోసం నా గొంతు పెంచుతూనే ఉన్నాను.

■ ఆశ సన్నగిల్లిన సందర్భాలు..

2006లో దంతెవాడలో ఐదుగురు మహిళలపై సామూహిక అత్యాచారం జరిగిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆ మహిళల కేసుపై పోరాడేందుకు న్యాయవాది ఎవరూ సిద్ధంగా లేరు, నేను నా సహోద్యోగులతో కలిసి వారికి న్యాయం చేసే బాధ్యతను తీసుకున్నాను. బాధితుల వాంగ్మూలం నమోదు చేసేందుకు దంతెవాడకు 150 కి.మీ దూరంలోని కొంటకు వెళ్లాల్సి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ భాషలో, కొంట అంటే మూల అని అర్థం, ఆ ప్రదేశం నిజానికి ఛత్తీస్‌గఢ్‌లోని ఒక మూల. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ప్రారంభమవుతుంది. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫ్యాన్ సైకిల్‌పై ఎక్కి వస్తారంటే అక్కడి పరిస్థితిని అంచనా వేయవచ్చు. బాధితులు గోండీ భాషలో తమ బాధలను వివరిస్తుంటే అక్కడ ఉన్న ఫ్యూన్ అనువాదకుడిగా మారాడు. అప్పుడే అత్యాచారం కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కేసు దంతెవాడకు బదిలీ అయింది. ఆ తర్వాత మహిళలపై ఒత్తిడి తెచ్చి కేసులు ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకునేలా చేశారు. అప్పుడు న్యాయంపై ఆశ చచ్చిపోయిందనిపించింది.

■ గర్భస్రావం తర్వాత దత్తత కుమార్తె

రాజహారలో ఉన్నప్పుడు 8 నెలల గర్భిణిని. ఆ రోజు చాలా వర్షం, మెరుపులు, కడుపు నొప్పితో బాధపడుతున్నాను. మా యూనియన్ చెందిన షాహీద్ హాస్పిటల్ కి నడుచుకుంటూ వెళుతుండగా రక్తం కారుతున్నట్లు అనిపించింది. ఎలాగోలా ఆసుపత్రికి చేరుకుని అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆపరేషన్ అయింది. స్పృహ వచ్చాక గర్భస్రావం అయిందని తెలిసింది. ఈ ప్రమాదం జరిగిన తర్వాత, మళ్లీ గర్భం ప్రమాదకరమనుకున్నాను. అందుకే ఒకమ్మాయిని దత్తత తీసుకున్నాను. కూతురు డిగ్రీ చదువు కోసం డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఢిల్లీకి వచ్చి 58 ఏళ్ల వయసులో నేషనల్ లా యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా తొలిసారి రెగ్యులర్ ఉద్యోగంలో చేరాను. ఏడాది సాఫీగానే గడిచింది. కానీ, ఉద్యమకారిణిగా నన్ను అరెస్టు చేసి జైలుకు పంపారు. చాలా పోరాటం తర్వాత తను గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. జైలులో ఉన్నప్పుడు కూతురిని కలవాలని చాలా తపించేదాన్ని. నెలకు ఒకసారి ఉత్తరానికి సమాధానం వచ్చేది. కలవడానికి వీలయ్యేది కాదు. జైలులో ఉన్న మూడేళ్లు మహిళా ఖైదీల సమస్యలను వింటూ, వారి కోసం వర్క్ చేశాను. సామాజిక కార్యకర్తలకు వ్యక్తిగత జీవితం లేదన్నది నిజం. వారు ఇంటికీ, సామాజిక జీవితానికీ మధ్య సమన్వయం చేసుకోలేరు. దీపం కింద చీకటి అనే సామెత నిజం అవుతుంది. ముఖ్యంగా మహిళా సామాజిక కార్యకర్తలు మరిన్ని సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. నా జైలు డైరీ 'ఫ్రం ఫాన్సీ యార్డ్'లో నేను అలాంటి చాలామంది మహిళల కథలను పంచుకున్నాను. సమాజంలోని ఈ దురాచారాలకు వ్యతిరేకంగా నేను ఎప్పుడూ పోరాడుతూనే ఉన్నాను'' అని వివరిస్తారు ఈ సామాజిక కార్యకర్త.

కిచెన్‌టిప్స్

మిరియాలు, ముద్దకర్పూరాలను సమపాళ్లలో తీసుకుని పొడిచేయాలి. ఈ మిశ్రమంలో కొద్దిగా టూత్‌పేస్టు, కొద్దిగా ఫేస్‌పౌడర్ వేసి కలపాలి. చివరిగా నాలుగు వెల్లుల్లి గర్భాలను మెత్తగా నూరి అందులో కలపాలి. ఈ మిశ్రమాన్ని బొద్దింకలు తిరిగే ప్రాంతాల్లో రాస్తే బొద్దింకలు లోపలికి రావు. చూద్దామన్నా ఇంట్లో ఎక్కడా కనిపించవు.





వంటింట్లో వాడే టవల్స్, మసిబట్టలు జిడ్డుపట్టి ఒక పట్టాన వదలవు. వీటిని ఉతకడానికి పెద్దగా శ్రమపడనక్కర్లేదు. వేడినీటిలో కాస్తంత షాంపు కలపాలి. ఈ నీటిలో జిడ్డుపట్టిన టవల్‌ను నానబెట్టాలి. 20 నిమిషాల తరువాత బ్రష్‌తో రుద్దుతూ ఉతికితే జిడ్డు, దుర్వాసన పోయి టవల్ శుభ్రంగా మారుతుంది. వారానికి ఒకసారి కిచెన్ టవల్స్‌ను ఇలా ఉతికితే జిడ్డుగా అనిపించవు.

బ్యూటిప్స్



రెండు టీస్పూన్ల కొబ్బరి నూనెలో టీ స్పూను పసుపు, టేబుల్ స్పూను పెరుగు, టేబుల్ స్పూను శనగపిండి, రెండు టీస్పూన్ల టొమాటో రసం, రెండు టీస్పూన్ల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు రాసి ఐదుని మిషాలు రుద్దాలి. తరువాత నీటితో కడిగితే ట్యాన్ మొత్తం పోతుంది.

స్ట్రెయిట్‌గా... సిల్కీగా...



గ్లాసు నీటిలో రెండు టీస్పూన్ల అవిసె గింజలు, రెండు టీస్పూన్ల బియ్యప్పిండి వేసి పదిని మిషాలు మరిగించాలి. తరువాత వడగట్టి...పేస్టులాంటి పదార్థాన్ని తీసుకోవాలి. దీనిలో టేబుల్ స్పూను కొబ్బరి నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడు నుంచి చివర్లవరకు పట్టించాలి. గంట తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్ జుట్టుని స్ట్రెయిట్‌గా, సిల్కీగా మారుస్తుంది.

విశేషం

ఆనాటి మహానగరాలు మన చెంతకు వచ్చేలా..

మన పార్వతీశం... అదేనండీ బారిష్టర్ పార్వతీశం మొగల్తూరు నుంచి ఇంగ్లాండ్‌కు వెళతాడు.

ఆ కాలంలో మొగల్తూరు ఎలా ఉండేదో?

మహీధర సాహిత్యంలో ముంగండ అగ్రహారం నిండుగా కనిపిస్తుంది. అప్పటి అగ్రహారం జనాభా ఎంత? ఆచార, వ్యవహారాలు ఏమిటి?

మన తెలుగు సాహిత్యం అనే కాదు భారతీయ సాహిత్యంలో ఎన్నో పట్టణాలు, ఊళ్లు కనిపిస్తాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కోణంలో వాటి గురించి డేటా బేస్ తయారు చేస్తే ఎలా ఉంటుంది?

'బ్రహ్మాండంగా ఉంటుంది' అనే భావనతో 'ది సిటీస్ ఇన్ ఫిక్షన్' అనే ప్రాజెక్ట్‌ను చేపట్టారు దివ్య రవీంద్రనాథ్, అపూర్వ సైనీ...

ప్రయాణాలలో సాహిత్య ప్రయాణాలు వేరు. వీసాలతో పని లేకుండా ప్రపంచంలోని ఏ నగరానికైనా రెక్కలు కట్టుకొని ఎగిరిపోవచ్చు. భారతీయ సాహిత్యంలో కాల్పనిక నగరాలతో పాటు వాస్తవిక నగరాలు ఎన్నో ఉన్నాయి. సాహిత్యం అనే రెక్కలతో ఎన్నో కథల్లో ఎన్నో నగరాలకు ఎగురుకుంటూ వెళ్లిపోవచ్చు.


అపూర్వ సైనీ, దివ్య రవీంద్రనాథ్

ఒక పుస్తకంలో ఒక నగరం ఒకే కోణంలో కనిపించవచ్చు. అలాంటి నగరాల గురించి అన్ని కోణాలలో దర్శించగలిగే సమాచార నిధిని నిర్మించడానికి నడుం కట్టారు దివ్య రవీంద్రనాథ్, అపూర్వ సైనీ.

రచయితలు, పాఠకులు, పరిశోధకులు, విద్యావేత్తలకు ఉపకరించే సమాచారం 'ది సిటీస్ ఇన్ ఫిక్షన్' లో ఉంటుంది.

దక్షిణ ఆసియా కేంద్రంగా ఈ ప్రాజెక్ట్ చేపట్టారు. దీనిలో భాగంగా మొదట మన దేశాన్ని ఎంచుకున్నారు.

పుస్తకంలో ఒక నగరాన్ని ఎలా వర్ణించారు అనేదానితో పాటు ఆ నగరానికి సంబంధించి అప్పటి జనాభా, అరుదైన జ్ఞాపకాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, అర్బన్ ప్లానింగ్, పర్యావరణం... ఇలా సవివరమైన సమాచారం ఉంటుంది.

ముఖ్యంగా ఈ తరం విద్యార్థులు ఆనాటి నగరాలను వివిధ కోణాలలో చూడవచ్చు.

'కాల్పనిక సాహిత్యం అంటే ఎంతో ఇష్టం. ఎన్నో పుస్తకాలు చదివాను. సాహిత్యంలో ఉండే నగరాలపై ఆసక్తి ఉండేది. అమృత మహలే రాసిన మిల్క్ టీత్‌లో హౌసింగ్ నుంచి రియల్ ఎస్టేట్ వరకు తొంభైల నాటి ముంబై కనిపిస్తుంది. ఇలా చెబుతూ పోతే నగరాల చుట్టూ అల్లుకున్న ఎంతో సాహిత్యం ఉంది' అంటున్న దివ్య రవీంద్రనాథ్ బెంగళూరులోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్'లో పరిశోధకురాలు.

'ఫలానా పుస్తకాలు మాత్రమే అని పరిమితి లేదు. అన్ని రకాల పుస్తకాలను మా ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నాం. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎన్నో లైబ్రరీలు, బుక్‌స్టోర్స్‌కు వెళ్లాను. అదొక మహాసముద్రం అనిపించింది' అంటున్న అపూర్వ సైనీ దిల్లి యూనివర్శిటీలో చదువుకుంది. ఆమె రైటర్, ఎడిటర్, ట్రాన్స్‌లేటర్.

ప్రాజెక్ట్ మొదలు కాగానే దక్షిణ ఆసియా నలుమూలల నుంచి సలహాలు, సూచనలు వస్తున్నాయి. ఈ ఆన్‌లైన్ ఆర్కైవ్ ప్రాజెక్ట్‌కు ఎవరైనా తమ వంతు సహకారం అందించవచ్చు.

డీజేవాలీ దీదీ



డిస్కోనైట్ అయినా, పెళ్లి బరాత్, దావత్ ఏదైనా డీజే మోత మోగి పోవాల్సిందే. నచ్చిన పాటను అడిగి మరీ పెట్టించుకుని స్టెప్పులతో ఊగిపోతుంది నేటి యువతరం. వెరైటీగా మిరుమిట్లు గొలిపే డ్రెస్ వేసుకుని, ఉత్సాహం నింపే పాటలను పెడుతూ ఊగిపోతుంటాడు డీజే. అబ్బాయిలు మాత్రమే డీజేగా కనిపిస్తుంటారు. కానీ డీజేవాలి దీదీ పురుషులకు ఏ మాత్రం తగ్గకుండా డీజేను దంచి కొడుతోంది. తన రీమిక్స్ బీట్స్‌తో మ్యూజిక్ లవర్స్‌ను ఉర్రూతలూగిస్తూ, సరికొత్త బాటలో నడిచేందుకు నేటి యువతరానికి మార్గం చూపుతోంది డీజే రింక్.


స్నేహల్ షా

డీజే రింక్ మరెవరో కాదు 38 ఏళ్ల స్నేహల్ షా. గుజరాత్‌లో పుట్టినప్పటికీ ముంబైలో పెరిగింది. షాకు సంగీతం అంటే ఎంతో ఇష్టం. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తయ్యాక... కామర్స్‌లో పీజీ చేసింది. మార్కెటింగ్ కంపెనీలో చేరింది. ఉద్యోగం చేస్తున్నప్పటికీ స్నేహల్ మనసంతా సంగీతంపైనే ఉండేది. దీంతో.. మంచి మంచి పాటలను వినడం, వాటన్నింటినీ తన మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో భద్రపరుచుకోవడం అలవాటుగా మార్చుకుంది. ఇలా స్నేహల్ కలెక్ట్ చేసిన వాటిలో బాలీవుడ్ పాటలు కోకొల్లలు. సంగీతంపై ఉన్న మక్కువతో సౌండ్ ఇంజినీరింగ్ డిప్లొమా కూడా చేసింది.

డీజే రింక్‌గా...

ఒకసారి స్నేహల్ పార్టీకి వెళ్లింది. అక్కడ ఎంతో ఉత్సాహమైన డీజే పాటలు వస్తున్నాయి. తనకిష్టమైన పాటను ప్లేచేయమని డీజేను అడిగింది. అందుకు ఆ డీజే ప్లేచేయడం కుదరదు అన్నాడు. దీంతో తనే ప్లే చేసుకుంటాను అని అడిగి పాటను ప్లే చేసింది. అప్పటి నుంచి తను కూడా డీజేగా మారాలనుకుని.. ప్రముఖ డీజే జో అజెరెడో, డీజే సుకేతు దగ్గర డీజే శిక్షణ తీసుకుంది. నైపుణ్యాలన్నింటిని ఔపోసన పట్టాక 2015లో డీజే రింక్‌గా మారింది. వివిధ రకాల క్లబ్స్‌లో పని చేస్తూ 'డీజేయింగ్' సంబంధించిన అప్‌డేటెడ్ టెక్నాలజీ గురించి తెలుసుకునేది. స్నేహల్ ఇష్టాన్ని తల్లిదండ్రులు వెన్నంటే ఉండి ప్రోత్సహించేవారు. తల్లిదండ్రులు ముద్దుగా పిలుచుకునే 'రింకు' పేరునే ... డీజే రింక్‌గా మార్చుకుని డీజే ప్రపంచంలోకి అడుగుపెట్టింది.

పదమూడులో పాపులర్...

డీజే రింక్ ఈడీఎమ్ ''ఎల్రక్టానిక్ డ్యాన్స్ మ్యూజిక్''లో కష్టపడి నైపుణ్యం సాధించింది. ముఖ్యంగా హిప్ హాప్, బాంగ్రా పాటలను ప్లేచేయడంలో అందె వేసిన చెయ్యిగా పేరుగాంచింది. పండుగల్లో రీమిక్స్ చేసిన పాటలను కూడా ప్లే చేసేది. అవి అందరినీ ఆకర్షిస్తుండడంతో డీజే రింక్ 2013లో బాగా పాపులర్ అయ్యింది. దీంతో భారతదేశంలో బాలీవుడ్ పాటలను మిక్స్ చేసే తొలి మహిళా డీజేగాను, ఇండియాలోని టాప్ -22 డీజేలలో ఒకటిగా నిలిచింది. పురుషుల ఆధిపత్యం కొనసాగే డీజే సౌండ్స్‌లో రింక్ ఏమాత్రం భయపడలేదు. ప్రారంభంలో పురుష డీజేలతో కలిసి పనిచేయడం కష్టం అయినప్పటికీ.. తనని తాను నిరూపించుకుని తన కలను నిజం చేసుకుంది.

అందర్నీ బీట్ చేస్తూ...

మంచి మంచి బీట్స్‌ను అందిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుతో పాటు అనేక రికార్డులను బద్దలు కొడుతోంది స్నేహల్ షా. మల్టీటాలెంటెడ్ సింగర్, రీమిక్సర్, పెర్‌ఫార్మర్‌గా అనేక ప్రశంసలు అందుకుంటోంది. సోనీ మ్యాక్స్ ఐపీఎల్ సీజన్ -6లో పాల్గొన్న ఒక్కగానొక్క మహిళా డీజే రింక్ కావడం విశేషం. గత పదేళ్లుగా ప్రపంచంలోని డీజేలతో పోటీ పడుతూ టాప్-100 జాబితాలో ఇండియా తరపున తనకంటూ స్థానం కల్పించుకుంది. 2023 సంవత్సరానికి గాను ఏషియా టాప్-50 డిజేల జాబితాలో ఐదో స్థానంలో నిలిచింది రింక్. అంతేగాక ఇటీవల 'బెస్ట్ వెడ్డింగ్ డీజే' అవార్డును అందుకుంది.

శ్రావ్యమైన బీట్స్‌తో సాగిపోతున్న డిజే రింక్ ఎంతోమంది మహిళలు, అమ్మాయిలకు ఆదర్శంగా నిలుస్తోంది. అనాదిగా వస్తోన్న పద్ధతులను దాటుకుని తమని తాము నిరూపించుకోవచ్చని తన బీట్స్‌తో చక్కగా వినిపిస్తోంది. ఇప్పటిదాక రెండువేల బాలీవుడ్ పాటలను రీమిక్స్ చేసింది. డిజే స్కూల్ నడుపుతూ మరింతమంది డీజేలను తయారు చేస్తోంది. "డీజే రింక్స్ సౌండ్ ఫ్యాక్టరీ" పేరిట యూ ట్యూబ్ ఛానల్ నడుపుతోంది. అమృతారావ్, జాన్ అబ్రహమ్, కరణ్ గ్రోవర్, ఇలియానా డిక్రూజ్ వంటి బాలీవుడ్ సెలబ్రెటీలతో స్టేజ్ పంచుకుంది."ద వే యూ లైక్ మి" పేరిట రింక్ విడుదల చేసిన తొలి ఆల్బమ్‌కు మంచి ఆదరణ లభించి, బాగా పాపులర్ అయ్యింది.

స్పోర్ట్స్



సబలెంకాకు షాక్

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్)కు రెండో లీగ్ మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. మెక్సికోలోని కాన్‌కున్ నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో అమెరికా ప్లేయర్ జెస్సికా పెగులా 6-4, 6-3తో సబలెంకాను ఓడించి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. 88 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో పెగులా ఐదు ఏస్‌లు సంధించడంతోపాటు సబలెంకా సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. సబలెంకా, రిబాకినా (కజకిస్తాన్) మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచిన ప్లేయర్‌కు రెండో సెమీఫైనల్ బెర్త్ లభిస్తుంది.

వ్రితి అగర్వాల్‌కు మూడో పతకం

గోవాలో జరుగుతున్న జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో 12వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ (2ని:22.28 సెకన్లు) కాంస్య పతకం నెగ్గి ఈ క్రీడల్లో మూడో పతకం సాధించింది. ఓవరాల్‌గా తెలంగాణ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి 12 పతకాలతో 22వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 4 స్వర్ణాలు, 2 రజతాలు, 9 కాంస్యాలతో కలిపి 15 పతకాలతో 17వ స్థానంలో ఉంది.





రోహిత్ శర్మ

సెమీఫైనల్ లక్ష్యంగా...

- ప్రపంచకప్‌లో నేడు శ్రీలంకతో తలపడనున్న టీమిండియా
- జోరు మీదున్న రోహిత్ బృందం
- మ. 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఎదురులేని ఆటతో వరల్డ్‌కప్‌లో వరుసగా ఆరు మ్యాచ్‌లు గెలిచి దూసుకుపోతున్న భారత జట్టు ఇప్పుడు మరో గెలుపుపై దృష్టి పెట్టింది. గురువారం జరిగే పోరులో మాజీ విశ్వవిజేత శ్రీలంకతో భారత్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిస్తే సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది. ఒకవైపు భారత్ అజేయంగా చెలరేగుతుండగా, మరోవైపు శ్రీలంక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా ఈ మెగా ఈవెంట్‌కు అర్హత సాధించిన ఆ జట్టు ప్రస్థానం పడుతూ లేస్తూ సాగుతోంది. మూడు పరాజయాల తర్వాత రెండు మ్యాచ్‌లు గెలిచిన ఆ జట్టు గత మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడటం వారిని తీవ్రంగా నిరాశపర్చింది. ఈ నేపథ్యంలో ఈ మ్యాచ్ కూడా ఏకపక్షంగా ముగియవచ్చు.

మార్పుల్లేకుండా...

భారత జట్టు విషయంలో తుది జట్టులో మార్పులు చేసే అవకాశం, అవసరం కనిపించడం లేదు. హార్దిక్ పాండ్యా ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతను ఈ మ్యాచ్‌లోనూ ఆడటం లేదు. ఇంగ్లండ్‌తో పోరులో జట్టు బ్యాటింగ్ కాస్త తడబడినట్లుగా కనిపించినా... అది పూర్తిగా భిన్నమైన, కఠినమైన పిచ్ కావడం మన బ్యాటర్లకు పరీక్ష పెట్టింది. కానీ అది పునరావృతం కాకుండా మన ఆటగాళ్లు చెలరేగిపోగలరు. అయితే నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ మాత్రమే కాస్త సమస్యగా కనిపిస్తోంది. బుమ్రా, షమీల ప్రమాదకరమైన బౌలింగ్... స్పిన్‌లో జడేజా, కుల్దీప్‌ల జోరు భారత్‌ను దుర్భేద్యంగా మారుస్తున్నాయి.

మాథ్యూస్‌పై ఆశలు...

ఒకవైపు ఆట పేలవంగా ఉండటంతో పాటు మరోవైపు కీలక ఆటగాళ్లకు వరుస గాయాలు శ్రీలంకను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. దాంతో తుది జట్టులో వరుసగా మార్పులు చేయాల్సి ఉంది. అనూహ్యంగా ప్రపంచకప్ జట్టులోకి వచ్చిన సీనియర్ ఎంజెలో మాథ్యూస్‌కు భారత్‌పై మంచి రికార్డు ఉంది. 54 సగటుతో అతను మూడు సెంచరీలు కూడా సాధించాడు. అదే ఆటను మళ్లీ చూపించాలని లంక కోరుకుంటోంది. బౌలింగ్‌లో అందరూ అంతంతమాత్రమే. రజిత, తీక్షణ, మదుషంకలాంటి జూనియర్లు భారత బ్యాటింగ్ బలగాన్ని నిలువరించడం చాలా కష్టం. మొదటి నుంచి వాంఖెడే మైదానం పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. ఈ టోర్నీలో జరిగిన తొలి రెండు మ్యాచ్‌లలో ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 399, 382 పరుగులు చేసింది. మ్యాచ్‌కు వర్షసూచన లేదు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
దక్షిణాఫ్రికా	7	6	1	12	2.290
భారత్	6	6	0	12	1.405
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
న్యూజిలాండ్	7	4	3	8	0.484
పాకిస్తాన్	7	3	4	6	-0.024
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	7	1	6	2	-1.446
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

కివీస్ నెత్తిన సఫారీ పిడుగు!

- 190 పరుగులతో న్యూజిలాండ్ చిత్తు
- దక్షిణాఫ్రికాకు ఆరో విజయం
- డసెన్, డికాక్ సెంచరీలు



డికాక్



డసెన్

పుణే: ప్రపంచకప్‌లో ఆసక్తి రేపిన మ్యాచ్‌లలో ఇదొకటి... ఇరు జట్ల తాజా ప్రదర్శన, బలాబలాలు, గత రికార్డులను బట్టి చూస్తే న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా పోరు హోరాహోరీగా సాగడం ఖాయమనిపించింది. కానీ చివరకు వచ్చేసరికి అంతా సఫారీల హవానే సాగి ఏకపక్ష విజయం దక్కింది. పేలవ బౌలింగ్‌తో భారీగా పరుగులిచ్చిన కివీస్ ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ కుప్పకూలింది. దక్షిణాఫ్రికా వరుసగా నాలుగో విజయంతో అగ్రస్థానానికి చేరగా... టోర్నీ ఆరంభంలో అద్భుతంగా అనిపించిన న్యూజిలాండ్ ఖాతాలో ఇప్పుడు వరుసగా మూడో ఓటమి చేరింది. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 190 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి సెమీఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. టాస్ గెలిచిన కివీస్ ఊహించని విధంగా ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించింది. ముందుగా దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 357 పరుగుల భారీ స్కోరు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డసెన్ (118 బంతుల్లో 133; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు), డికాక్ (116 బంతుల్లో 114; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 200 పరుగులు జోడించగా, ఆఖరి 10 ఓవర్లలో సఫారీ జట్టు 119 పరుగులు సాధించింది. డికాక్‌కు ఈ మెగా టోర్నీలో ఇది నాలుగో శతకం. అనంతరం న్యూజిలాండ్ బ్యాటర్లు విఫలం కావడంతో ఆ జట్టు 35.3 ఓవర్లలో 167 పరుగులకే కుప్పకూలింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) ఫిలిప్స్ (బి) సౌతీ 114; బవుమా (సి) మిచెల్ (బి) బౌల్ట్ 24; డసెన్ (బి) సౌతీ 133; మిల్లర్ (సి) మిచెల్ (బి) నీషమ్ 53; క్లాసెన్ (నాటౌట్) 15; మార్క్‌రమ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 4 వికెట్లకు)** 357. **వికెట్ల పతనం:** 1-38, 2-238, 3-316, 4-351. **బౌలింగ్:** బౌల్ట్ 10-1-49-1, హెన్రీ 5.3-0-31-0, సౌతీ 10-0-77-2, సాన్‌ట్నర్ 10-0-58-0, ఫిలిప్స్ 7-0-52-0, రచిన్ 2-0-17-0, నీషమ్ 5.3-0-69-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 2; యంగ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 33; రచిన్ (సి) కొయెట్జీ (బి) జాన్సెన్ 9; మిచెల్ (సి) మిల్లర్ (బి) మహరాజ్ 24; లాథమ్ (సి) మహరాజ్ (బి) రబడ 4; ఫిలిప్స్ (సి) రబడ (బి) కొయెట్జీ 60, సాన్‌ట్నర్ (బి) మహరాజ్ 7; సౌతీ (ఎల్బీ) (బి) జాన్సెన్ 7; నీషమ్ (బి) మహరాజ్ 0; బౌల్ట్ (సి) మిల్లర్ (బి) మహరాజ్ 9; హెన్రీ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (35.3 ఓవర్లలో ఆలౌట్)** 167. **వికెట్ల పతనం:** 1-8, 2-45, 3-56, 4-67, 5-90, 6-100, 7-109, 8-110, 9-133, 10-167. **బౌలింగ్:** జాన్సెన్ 8-1-31-3, ఎన్‌గిడి 6-1-28-0, రబడ 6-2-16-1, కొయెట్జీ 6.3-0-41-2, కేశవ్ మహరాజ్ 9-0-46-4.

ప్రతాప్ సింగ్‌కు పసిడి పతకం



న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌ను భారత్ స్వర్ణ పతకంతో ముగించింది. పోటీల చివరిరోజు బుధవారం భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ వ్యక్తిగత విభాగంలో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ పసిడి పతకం గెలిచాడు. ఫైనల్లో ప్రతాప్ సింగ్ 463.5 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ఐశ్వరీ ప్రతాప్ సింగ్, అఖిల్ షెరాన్, స్వప్నిల్ కుసాలేలతో కూడిన భారత బృందం ఇదే విభాగంలో టీమ్ ఈవెంట్‌లో 1764 పాయింట్లతో రజత పతకం కైవసం చేసుకుంది. పురుషుల 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్ ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో ప్రదీప్ సింగ్ షెఖావత్ 582 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత బృందం 8 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 22 పతకాలతో రెండో స్థానంలో నిలిచింది.

'టాప్' ర్యాంక్‌లో షాహీన్ అఫ్రిది



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్ పేస్ బౌలర్ షాహీన్ షా అఫ్రిది తొలిసారి టాప్ ర్యాంక్‌ను అందుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో షాహీన్ అఫ్రిది 673 పాయింట్లతో ఏడు స్థానాలు ఎగబాకి నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. హాజల్‌వుడ్ (ఆస్ట్రేలియా) టాప్ నుంచి రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. భారత బౌలర్లు సిరాజ్, కుల్దీప్ యాదవ్ వరుసగా మూడు, ఏడు స్థానాల్లో ఉన్నారు. ప్రస్తుత వన్డే ప్రపంచకప్‌లో షాహీన్ 16 వికెట్లు పడగొట్టి ఆడమ్ జంపా (ఆస్ట్రేలియా), మార్కో జాన్సెన్ (దక్షిణాఫ్రికా)లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో బాబర్ ఆజమ్ తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఐసీసీ ర్యాంకింగ్స్ ప్రవేశపెట్టాక వన్డే ఫార్మాట్‌లో ఏకకాలంలో బౌలింగ్, బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్ క్రికెటర్లు నంబర్‌వన్ స్థానంలో ఉండటం ఇదే తొలిసారి.

సచిన్ విగ్రహావిష్కరణ





ముంబై: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ విగ్రహాన్ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే బుధవారం ఆవిష్కరించారు. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సచిన్ తన భార్య అంజలి, కుమార్తె సారా, సోదరుడు అజిత్ తదితరులతో హాజరయ్యాడు. ఈ కార్యక్రమంలో ఐసీసీ, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శరద్ పవార్, బీసీసీఐ కార్యదర్శి జై షా, కోశాధికారి ఆశిష్ షెలార్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ వాంఖెడే స్టేడియంలో తనకెన్నో చిరస్మరణీయ జ్ఞాపకాలు ఉన్నాయన్నాడు.

పరాజయంతో ముగింపు



తాష్కెంట్: ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ (ఏఎఫ్‌సీ) పారిస్ ఒలింపిక్స్ మహిళల క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌ను భారత జట్టు పరాజయంతో ముగించింది. గ్రూప్ 'సి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0-3 గోల్స్ తేడాతో ఉజ్బెకిస్తాన్ చేతిలో ఓడిపోయింది. ఉజ్బెకిస్తాన్ తరఫున కుద్రతోవా (2వ ని.లో) ఒక గోల్ చేయగా... కరాచిక్ (51వ, 83వ ని.లో) రెండు గోల్స్ సాధించింది. భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ ఈ మ్యాచ్‌లో 61వ నిమిషంలో అంజూ తమాంగ్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగింది. నాలుగు జట్లున్న గ్రూప్ 'సి'లో భారత్ మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడి చివరి స్థానంలో నిలిచింది. 13 గోల్స్ సమర్పించుకున్న భారత్ టోర్నీ మొత్తంలో ఒక గోల్ మాత్రమే చేసింది.

సినిమా



● రామ్

ముంబైలో డబుల్ ఇస్మార్ట్

హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' సూపర్ హిట్టయిన విషయం తెలిసిందే. తాజాగా రామ్, పూరి కాంబినేషన్‌లోనే 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తెరకెక్కుతోంది. ఇందులో సంజయ్ దత్ కీలక పాత్రధారి. ఈ సినిమా కోసం ముంబైలో రామ్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ''స్కంద' కోసం బరువు పెరిగిన రామ్ 'డబుల్ ఇస్మార్ట్' కోసం బరువు తగ్గి, సిక్స్ ప్యాక్‌తో మేకోవర్ అయ్యారు'' అని యూనిట్ పేర్కొంది. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 8న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.




● నయనతార

ఆ రోజు థియేటర్స్‌లో అన్నపూరణి

అన్నపూరణిగా థియేటర్స్‌లోకి వచ్చేందుకు రెడీ అయ్యారు హీరోయిన్ నయనతార. ఆమె కెరీర్‌లో రూపొందుతున్న 75వ సినిమా 'అన్నపూరణి' (తెలుగులో 'అన్నపూర్ణ' అని అర్థం). 'ది గాడెస్ ఆఫ్ ఫుడ్' అనేది ఉపశీర్షిక. జీ స్టూడియోస్, నాడ్ స్టూడియోస్, ట్రైడెంట్ ఆర్ట్స్ నిర్మాణ భాగస్వామ్యులుగా ఉన్న ఈ సినిమాకు నీలేష్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 1న విడుదల చేస్తున్నట్లుగా వెల్లడించి, ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఫుడ్.. ఫన్.. ఎమోషన్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

మూడు ముళ్లు... ఏడడుగులు



'మిస్టర్, అంతరిక్షం' సినిమాల్లో జోడీగా నటించిన వరుణ్ తేజ్, లావణ్యా త్రిపాఠి నిజ జీవితంలో పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. ఇటలీలోని టస్కనీలో బుధవారం రాత్రి వీరి వివాహం ఘనంగా జరిగింది. ఇరు కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు, స్నేహితుల సమక్షంలో ఈ పెళ్లి వేడుక జరిగింది. చిరంజీవి, రామ్‌చరణ్, అల్లు అర్జున్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, నితిన్ తదితరులు ఈ వివాహానికి హాజరయ్యారు.

షూటింగ్‌కే రెండేళ్లు పట్టింది

– రక్షిత్ అట్లూరి



''**న**రకాసుర' చిత్రం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దుల్లోని ఓ కాఫీ ఎస్టేట్ నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమాలో శివ అనే లారీ డ్రైవర్ పాత్ర చేశాను. నా గత సినిమా 'పలాస 1978'లో దళితుల సమస్యలు చూపించినట్లే 'నరకాసుర'లో హిజ్రాలకు సంబంధించిన పాయింట్ ఒకటి తీసుకున్నాం. కథలో ఇదొక అంశం మాత్రమే. మా సినిమా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం'' అని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి హీరోగా, అపర్ణా జనార్దన్, సంకీర్తనా విపిన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'నరకాసుర'. డా. అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ– ''2020లో 'నరకాసుర' ప్రారంభించి, ఏడాదిలో పూర్తి చేయాలనుకున్నాం. అయితే రెండుసార్లు కరోనా లాక్‌డౌన్ రావడం, కథపరంగా ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో షూటింగ్ చేయడం, ఆర్టిస్టుల డేట్స్, మా డైరెక్టర్ ప్రమాదంలో చేయి కోల్పోవడం... ఇలా పలు కారణాలతో షూటింగ్‌కే రెండున్నరేళ్లు పట్టింది. అయితే కథపై నమ్మకంతో నిర్మాతలు సపోర్ట్ చేశారు. ఇక నేను నటించిన 'శశివదనే', 'ఆపరేషన్ రావణ్' సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. మరికొన్ని కథలు వింటున్నాను'' అన్నారు.

అందుకే వాయిదా వేశాం

– నిర్మాత నాగవంశీ



● నాగవంశీ, శ్రీకాంత్ ఎన్. రెడ్డి

''**ప్ర**స్తుతం వన్ డే క్రికెట్ ప్రపంచ కప్ జరుగుతోంది. ఈ ప్రభావం సినిమాల వసూళ్లపై పడుతోంది. అందుకే ఈ నెల 10న విడుదల కావాల్సిన మా 'ఆదికేశవ' సినిమాని 24కి వాయిదా వేస్తున్నాం'' అన్నారు నాగవంశీ. వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆదికేశవ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. బుధవారం విలేకరుల సమావేశంలో నాగవంశీ మాట్లాడుతూ– ''ఇండియా ఫైనల్‌కి వెళ్లి, వరల్డ్ కప్ గెలుస్తుందనే అంచనాలున్నాయి. ఈ టైమ్‌లో విడుదల చేయడం కరెక్ట్ కాదని డిస్ట్రిబ్యూటర్స్ కూడా చెప్పడంతో ఈ నెల 24న విడుదల చేయాలని నిర్ణయించాం'' అన్నారు నాగవంశీ. ''కుటుంబ ప్రేక్షకులతో పాటు యూత్, మాస్ ఆడియన్స్‌ని మా చిత్రం అలరిస్తుంది'' అన్నారు శ్రీకాంత్ ఎన్. రెడ్డి.



● బాబీ, సురేందర్ రెడ్డి, కేఈ జ్ఞానవేల్ రాజా, విక్రమ్, పా. రంజిత్

తంగలాన్ నాకో కొత్త అనుభవం

– విక్రమ్

''**నే**ను విదేశాలు వెళ్లినప్పుడు మీరు బాలీవుడ్డా అని అడుగుతుంటారు. నేను కోలీవుడ్, టాలీవుడ్ అని చెబుతుంటాను. అంటే... వారు ఎక్కువగా హిందీ చిత్రాలే చూసేవారు. కొన్నేళ్లుగా సౌత్ సినిమాలు చూస్తున్నారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్', 'కేజీఎఫ్'..లాంటి సినిమాలు పెద్ద విజయాలు సాధించాయి. దక్షిణాది సినిమాలు ఇప్పుడు ఓ మార్క్‌ని క్రియేట్ చేస్తున్నాయి. రాజమౌళిగారు ఆస్కార్‌ను మనకు తీసుకొచ్చారు. ఆయనతో ఓ సినిమా చేయాలని ఉంది'' అన్నారు విక్రమ్. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో రూపొందిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'తంగలాన్'. విక్రమ్ హీరోగా పా. రంజిత్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. పా. రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. పార్వతీ, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా జనవరి 26న రిలీజ్ కానుంది. బుధవారం జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో విక్రమ్ మాట్లాడుతూ– ''తంగలాన్' ఎమోషనల్ అండ్ రా ఫిల్మ్. రెగ్యులర్ సాంగ్స్, ఫైట్స్.. ఇలాంటి తరహా సినీ గ్లామర్ 'తంగలాన్'లో లేదు. నా పాత్రకు డైలాగ్స్ అంతగా ఉండవు. లైవ్ సౌండింగ్‌లో సినిమా చేశాం. నాకు కొత్త ఎక్స్‌పీరియన్స్. మేకప్‌కు మూడు గంటలు పట్టేది. మీనింగ్‌ఫుల్ సినిమాలు చేస్తుంటారు పా. రంజిత్‌గారు. 'తంగలాన్'తో ప్రేక్షకులు ఓ కొత్త ప్రపంచంలోకి వెళ్తారు. ఇక నేను చేసిన '9 నెలలు' చిత్రానికి సురేందర్‌రెడ్డి, వినయ్‌లు అసిస్టెంట్ డైరెక్టర్స్‌గా చేశారు. ఇప్పుడు సురేందర్ రెడ్డి ఈ ఈవెంట్‌కు వచ్చారు. లైఫ్ సర్కిల్‌లా అనిపిస్తోంది'' అన్నారు. ''విక్రమ్‌గారితో నేను చేసిన తొలి చిత్రమిది. ఆయన అంకితభావం, టైమింగ్ సూపర్. 'తంగలాన్' సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు పా. రంజిత్. ''విక్రమ్ ట్రిమెండస్ యాక్టర్. వరల్డ్ సినిమా లవర్స్‌కు 'తంగలాన్' ఓ గ్రేట్ ట్రీట్‌లా ఉంటుంది'' అన్నారు కేఈ జ్ఞానవేల్ రాజా. ''విక్రమ్ సార్ ఓ నటుడుగా తనను తానే మళ్లీ ఆవిష్కరించుకుంటుంటారు'' అని అతిథిగా పాల్గొన్న సత్యదేవ్ అన్నారు. దర్శకులు వేణు ఊడుగుల, కరుణకుమార్, దర్శక-నిర్మాత మధుర శ్రీధర్ అతిథులుగా పాల్గొన్నారు.

మా ఊరి పొలిమేర 2 నా సినిమా లాంటిది

– హీరో అడివి శేష్



● 'సత్యం' రాజేశ్, అడివి శేష్, కరుణకుమార్, అనిల్

''**నా** 'క్షణం' సినిమాకి పని చేసిన టీమ్ అంతా ''మా ఊరి పొలిమేర 2' టీమ్‌లో ఉన్నారు. ముఖ్యంగా దర్శకుడు అనిల్ నాకు మంచి స్నేహితుడు. 'మా ఊరి పొలిమేర' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తీసి, దానికి సీక్వెల్‌గా 'మా ఊరి పొలిమేర 2' తీయడం ఆనందంగా ఉంది. ఇది నా సొంత సినిమా లాంటింది. తప్పకుండా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో అడివి శేష్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథులుగా అడివి శేష్, నిర్మాత ఎస్‌కేఎన్ హాజరయ్యారు. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''ఇప్పుడు చిన్న సినిమా పెద్ద సినిమా అనే తేడా లేదు. ఏదైనా అదే కష్టమే. ప్రేక్షకులకు మంచి సినిమా కావాలి.. అంతే. 'మా ఊరి పొలిమేర-2'కి హిట్ కళ కనిపిస్తోంది'' అన్నారు. ''ఈ చిత్రం ఇంత గ్రాండ్‌గా విడుదల కావడానికి కారణం వంశీ నందిపాటిగారు. మా సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు 'సత్యం' రాజేశ్, గౌరీకృష్ణ, అనిల్ విశ్వనాథ్. ఈ వేడుకలో కామాక్షీ భాస్కర్ల, గాయకుడు పెంచల్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓ తండ్రి తీర్పు



● పునర్వి, వివా

వివా రెడ్డి, పునర్వి జంటగా ప్రతాప్ భీమవరపు దర్శకత్వం వహించిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. శ్రీరామ్ దత్తి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి రెడీగా ఉంది. చిత్ర సమర్పకుడు ఆరిగపూడి విజయ కుమార్ బర్త్‌డే (మంగళవారం) సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ విడుదల చేశారు. ''సామాజిక ఇతివృత్తంతో తీసిన ఈ చిత్రం బాగా వచ్చింది'' అన్నారు ఆరిగపూడి విజయ్ కుమార్. ''నా తొలి ప్రయత్నంగా ఇంత మంచి సినిమా చేసినందుకు గర్వపడుతున్నాను'' అన్నారు శ్రీరామ్ దత్తి. ''ఏపీకేగారి ఆశీర్వాదం, శ్రీరామ్ దత్తిగారి సహకారంతో ఇంత మంచి సినిమా తీశా'' అన్నారు ప్రతాప్ భీమవరపు.

బొమ్మాళి డేట్ ఫిక్స్



● శివానీ, రాహుల్ విజయ్, శ్రీకాంత్

శ్రీకాంత్ మేకా కీలక పాత్రలో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ కీలక పాత్రల్లో, వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రత్యేక పాత్రలో నటించారు. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న రిలీజ్ కానుంది. ''ఓ పోలీస్ అధికారికి, రాజకీయ నాయకుడికి మధ్య జరిగే పవర్‌ఫుల్ పొలిటికల్ పవర్ గేమ్‌గా ఈ మూవీ ఉంటుంది. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. అలాగే 'లింగి లింగిడి..' పాట కొన్ని కోట్ల వ్యూస్ సాధించింది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: జగదీష్ చీకటి, సంగీతం: రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్, సహనిర్మాతలు: భాను ప్రతాప్, రియాజ్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
284	90
63,591	18,989

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,939	▲ 88
డోజోన్స్	33,199	▲ 66
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,342	▲ 21
డాక్స్	14,923	▲ 113
షాంఘై	3,023	▲ 4
నికాయ్	31,602	▲ 743

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,012	▽ 358
బంగారం (99.5 స్వచ్ఛత)	60,768	▽ 356
వెండి (కేజీ)	70,984	▽ 118

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.52	84.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.59	102.89
€	యూరో	ఎస్‌బీఐ	86.59	89.67
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.31	55.98
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.78	54.06
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.92	61.84
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.33

జీఎస్‌టీ వసూళ్ల దూకుడు

- అక్టోబర్‌లో రూ.1.72 లక్షల కోట్లు
- 2022 ఇదే నెలతో పోల్చితే 13 శాతం అప్
- రెండో భారీ స్థాయి నిధులు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు అక్టోబర్‌లో భారీగా రూ.1.72 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది అక్టోబర్‌లో పోల్చితే ఈ పరిమాణం 13 శాతం అధికంకాగా, 2017 జూలైలో ప్రారంభం తర్వాత ఇవి రెండవ భారీ స్థాయి వసూళ్లు. ఇంతక్రితం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) ప్రారంభ నెల ఏప్రిల్‌లో రూ.1.87 లక్షల కోట్ల రికార్డు స్థాయి వసూళ్లు జరిగాయి. ఎకానమీ క్రియాశీలత, పన్నుల ఎగవేతలను అడ్డుకునేందుకు కేంద్రం చర్యలు, వసూళ్ల వ్యవస్థలో సామర్థ్యం పెంపు, పండుగల డిమాండ్ తాజా సానుకూల వసూళ్లకు కారణమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. రానున్న నెలల్లో సైతం ఇదే ధోరణి కొనసాగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశాయి.

విభాగాల వారీగా...

- మొత్తం వసూళ్లు రూ.1,72,003 కోట్లు.
- ఇందులో సీజీఎస్‌టీ వాటా రూ.30,062 కోట్లు.
- స్టేట్ జీఎస్‌టీ వసూళ్లు రూ.38,171 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.91,315 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.42,127 కోట్లతో సహా)
- సెస్ రూ.12,456 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.1,294 కోట్ల వసూళ్లుసహా)

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్ నెలల్లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి. జూలై వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లు. ఆగస్టు వసూళ్లు రూ. 1.59 లక్షల కోట్లుకాగా, సెప్టెంబర్‌లో రూ. 1.63 లక్షల కోట్ల జీఎస్‌టీ రాబడి నమోదయ్యింది.

విదేశాల్లో నేరుగా లిస్టింగ్‌కు గ్రీన్ సిగ్నల్..

సెక్షన్ 5ను నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: భారతీయ కంపెనీలు విదేశీ ఎక్స్ఛేంజీల్లో నేరుగా లిస్టయ్యేందుకు మార్గం సుగమం చేస్తూ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం కంపెనీల చట్టంలో సంబంధిత సెక్షన్ 5ని నోటిఫై చేసింది. దీని ప్రకారం నిర్దిష్ట తరగతులకు చెందిన పబ్లిక్ కంపెనీలు .. ఆమోదయోగ్యమైన కొన్ని విదేశీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తమ షేర్లను లిస్ట్ చేసుకోవచ్చు. అయితే, ఈ సెక్షన్‌కు సంబంధించిన నిబంధనలను ఇంకా నోటిఫై చేయాల్సి ఉంది. విదేశాల్లో లిస్టింగ్ కోసం విదేశీ మారక నిర్వహణ చట్టం మొదలైన వాటిని కూడా సవరించాల్సి ఉంటుందని న్యాయ సేవల సంస్థ సిరిల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ పార్ట్‌నర్ యష్ అషర్ తెలిపారు. తాజా పరిణామంతో పెట్టుబడుల సమీకరణకు దేశీ కంపెనీలకు మరో మాధ్యమం అందుబాటులోకి వచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. అయితే, వ్యాల్యుయేషన్లను అంతర్జాతీయ ఇన్వెస్టర్లు లెక్కగట్టే విధానం, విదేశాల్లో లిస్టింగ్ వల్ల వాణిజ్యపరంగా ఒనగూరే ప్రయోజనాలు మొదలైన వాటన్నింటినీ కంపెనీలు మదింపు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ప్రస్తుతం దేశీ కంపెనీలు అమెరికన్ డిపాజిటరీ రిసీట్స్ (ఏడీఆర్), గ్లోబల్ డిపాజిటరీ రిసీట్స్ (జీడీఆర్) రూపంలో విదేశాల్లో లిస్టవుతున్నాయి. 2020 మే నెలలో కోవిడ్ ఉపశమన ప్యాకేజీలో భాగంగా భారతీయ సంస్థలు విదేశాల్లో నేరుగా లిస్టయ్యేందుకు అనుమతించే ప్రతిపాదనను కేంద్రం తెరపైకి తెచ్చింది. సదరు సంస్థలు ప్రపంచ మార్కెట్ల నుంచి పెట్టుబడులను సమీకరించుకునేందుకు తోడ్పాటు అందించేలా దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు జూలై 28న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించిన సంగతి తెలిసిందే. పటిష్టమైన మనీలాండరింగ్ నిబంధనలు అమలయ్యే ఎన్‌వైఎస్‌ఈ, నాస్‌డాక్, ఎల్‌ఎస్‌ఈ మొదలైన పది ఎక్స్ఛేంజీలను పరిశీలించవచ్చని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది.



2,000 నోట్లు 97% వెనక్కి వచ్చేశాయ్

వ్యవస్థలో మిగిలింది రూ.10,000 కోట్లే: ఆర్‌బీఐ



ముంబై: చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ''మే 19వ తేదీ బిజినెస్ ముగింపు సమయానికి వ్యవస్థలో రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2,000 బ్యాంక్ నోట్లు చెలామణిలో ఉన్నాయి. అక్టోబర్ 31వ తేదీ బిజినెస్ ముగింపు సమయానికి ఈ విలువ రూ.10,000 కోట్లకు తగ్గింది'' అని ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించింది.

ప్రాంతీయ కార్యాలయాల్లో బారులు..

దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రాష్ట్ర రాజధానుల్లో ఆర్‌బీఐ కార్యాలయాలు ఉన్నందున, ఎవరైనా ఈ కార్యాలయాలకు వెళ్లలేని పక్షంలో పోస్టల్ శాఖ సేవలను పొందవచ్చని ఆర్‌బీఐ సూచించింది. కాగా, రూ.2,000 నోట్ల మార్పిడి లేదా డిపాజిట్ కోసం ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద పని వేళల్లో పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలను 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి. ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద వ్యక్తులు, కంపెనీలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను ఒకసారి రూ.20,000 వరకు మార్చుకోవచ్చు. డిపాజిట్‌కు మాత్రం ఎటువంటి పరిమితి లేదు. 2016 నవంబరులో రూ.500, రూ.1,000 నోట్ల రద్దు తర్వాత ఆర్‌బీఐ రూ.2,000 నోట్లతోపాటు కొత్త రూ.500 నోట్లను పరిచయం చేసింది.

టాటా స్టీల్ నష్టాలు రూ. 6,511 కోట్లు



న్యూఢిల్లీ: టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 6,511 కోట్ల నష్టం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో కంపెనీ రూ. 1,297 కోట్ల లాభం నమోదు చేసింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 60,207 కోట్ల నుంచి రూ. 55,910 కోట్లకు, ఖర్చులు రూ. 57,684 కోట్ల నుంచి రూ. 55,853 కోట్లకు తగ్గాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

02-11-2023	
విశాఖ	540-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	536-00
విజయవాడ	536-00
రిటైల్ ధర (డజను)	72.00
01-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	524-00
వరంగల్	526-00
రిటైల్ ధర	5.85

వాహన అమ్మకాలు.. ఆల్‌టైం 'హై'!

కలిసొచ్చిన పండుగ డిమాండ్



ముంబై: పండుగ సీజన్ డిమాండ్ కలిసిరావడంతో దేశీయ ఆటో పరిశ్రమ అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో అత్యధిక వాహనాలు అమ్ముడయ్యాయి. మొత్తం 3,91,472 యూనిట్ల విక్రయాలు జరిగాయి. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన 3,36,679 వాహనాలతో పోలిస్తే ఇవి 16% అధికం. సెమీ కండక్టర్ల కొరత ప్రభావం తగ్గడం, దసరా సందర్భంగా నెల కొన్న కొనుగోళ్లు గత నెలలో రికార్డు అమ్మకాల వృద్ధికి తోడ్పడ్డాయని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ ఏడాది తొలి 3 నెలలు మినహా ప్రతి నెలా అమ్మకాల వృద్ధి జరగడం పరిశ్రమకు సానుకూల సంకేతమన్నారు. క్షేత్ర స్థాయిలో డీలర్ల వద్ద నిల్వల స్థాయి ఇంకా అధికంగా ఉంది. ఈ నవంబర్ తొలి 15 రోజుల్లో రిటైల్ అమ్మకాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో హోల్‌సేల్ అమ్మకాలు జరగొచ్చన్నారు.

కంపెనీ	అక్టోబర్-2023	అక్టోబర్-2022	(%లో)
మారుతీ సుజుకీ	1,99,217	1,67,520	(+)19
హ్యుందాయ్ మోటార్స్	68,728	58,006	(+)18
టాటా మోటార్స్	82,954	76,537	(+)6
ఎండ్అండ్ఎం	80,679	61,114	(+)32
హోండా కార్స్	13,083	11,221	(+)17
ఎంజీ మోటార్స్	5,108	4366	(+)17
టయోటా కిర్లోస్కర్	21,879	13,143	(+)66
కియా మోటార్స్	24,351	23,323	(+)4
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	4,71,188	3,95,238	(+)19
హీరో మోటోకార్ప్	5,74,930	4,54,582	(+)26
టీవీఎస్ మోటార్స్	4,34,714	3,60,288	(+)4
సుజుకీ మోటార్‌సైకిల్	1,00,507	88150	(+)14
రాయల్ ఎన్‌ఫీల్డ్	84,435	80,958	(+)6
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	7,486	6,038	(+)24
అశోక్ లేలాండ్	16,864	14,864	(+)13
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	12,642	13,843	(-)9
మహీంద్రా ట్రాక్టర్స్	50,460	51,994	(-)3

19 వేల దిగువకు నిఫ్టీ



- విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ప్రభావం
- ఫెడ్ పాలసీ వెల్లడికి ముందు అప్రమత్తత

ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగడంతో దేశీయ స్టాక్ సూచీలు వరుసగా రెండోరోజూ నష్టాలు చవిచూశాయి. దేశీయ తయారీ రంగ పీఎంఐ, మౌలిక వృద్ధి గణాంకాలు నిరాశపరిచాయి. ఫెడ్ రిజర్వ్ పాలసీ వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా మెటల్, పవర్, ఆటో, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 284 పాయింట్లు పతనమైన 63,591 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 90 పాయింట్లు క్షీణించి 18,989 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు బలహీన సెంటిమెంట్ ప్రభావంతో నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 324 పాయింట్లు క్షీణించి 63,550 వద్ద, నిఫ్టీ 106 పాయింట్లు దిగివచ్చి 18974 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. మరోవైపు మీడియా, ఫార్మా, రియల్టీ, ఇంధన రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

అక్టోబర్‌లో తయారీ రంగం డీలా

- ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ 55.5కు డౌన్
- ఎనిమిది నెలల కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: భారత్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో అత్యధిక వెయిటేజ్ కలిగిన తయారీ రంగం అక్టోబర్‌లో బలహీన ధోరణి నమోదుచేసుకుంది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మ్యాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) సెప్టెంబర్‌లో 57.5 వద్ద ఉంటే, తాజా సమీక్షా నెల అక్టోబర్లో 55.5కు జారింది. ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత ఈ స్థాయికి సూచీ పడిపోవడం ఇదే తొలిసారి. ఈ సూచీ 50 పైన ఉంటే వృద్ధిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సూచీ వరుసగా 28 నెలల నుంచి వృద్ధి బాటలోనే కొనసాగుతోంది.

మిజోరంలో శాంతి కోసం మాకే ఓటేయండి

ఓటర్లకు సోనియా గాంధీ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: మిజోరం రాష్ట్రంలో మరో ఐదు రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ వీడియో సందేశం పంపించారు. 'బీజేపీ పక్ష పార్టీలకు ఓటు వేసి ప్రయోగాలు చేయాల్సిన సమయం కాదిది. రాష్ట్రంలో శాంతి సామరస్యాలు వెల్లివిరియాలంటే కాంగ్రెస్‌కు ఓటేయండి. మేం అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తాం. దశాబ్దాల పాలనా అనుభవం కాంగ్రెస్ సొంతం. రాష్ట్రం మా పాలనలో భద్రంగా ఉంటుంది. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సాధికారతకు, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ మాత్రమే భరోసా ఇవ్వగలదు. ఎన్నికలప్పుడు మేం ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చామో కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, హిమాచల్ ప్రదేశ్‌లను చూస్తే ఇట్టే మీకు అవగతమవుతుంది' అని అన్నారు. మూడు నిమిషాల నిడివి గల ఈ వీడియోలో మిజోరం రాష్ట్రంతో తనకు ఉన్న ప్రత్యేక అనుబంధాన్నీ ఆమె గుర్తుచేసుకున్నారు. ' రాష్ట్రానికి నా భర్త, దివంగత ప్రధాని రాజీవ్ గాంధీతో కలిసి విచ్చేసిన ఘటన నాకింకా గుర్తు. నా హృదయంలో ఈ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇన్నేళ్లలో ఎన్నోసార్లు రాష్ట్రానికొచ్చా. ఇక్కడి సంప్రదాయాలు, సంస్కృతి, ప్రకృతి అందాలు నా మదిని దోచుకున్నాయి. ఇక్కడి వారు చూపించే ప్రేమాభిమానాలు ఎన్నటికీ మరువలేను. 1986 జూన్ 30న చారిత్రక మిజో శాంతి ఒప్పందం కుదిరాక కుటుంబం మొత్తం ఇక్కడికొచ్చాం. ఆ సందర్భాన్ని ఇప్పటికీ 'రేమ్నా నీ(శాంతి దినం)గా జరుపుకుంటున్నాం' అని సోనియా అన్నారు.

ఆ రెండూ ఒక్కటే

' తాము స్వతంత్రంగా పనిచేస్తామని మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్), జోరం పీపుల్స్ మూమెంట్(జెడ్‌పీఎం) చెబుతుంటాయి. అదంతా అబద్ధం. రెండూ బీజేపీ తొత్తులే. ఎంఎన్‌ఎఫ్, జెడ్‌పీఎంలు కమల దళం కోసమే పనిచేస్తుంటాయి. రాష్ట్రంలో బీజేపీ ఆటలు సాగనివ్వం. యువత, మహిళలకు చెప్పేదొక్కటే. కాంగ్రెస్‌కు ఓటేయండి' అని సోనియా విజ్ఞప్తిచేశారు.

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లతో ముప్పు

' మిజోరంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కారణంగా ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతోంది. వైవిధ్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సంప్రదింపులకు మోదీ సర్కార్ ఏమాత్రం విలువ ఇవ్వదు. అటవీ భూములపై గిరిజనుల హక్కులను తగ్గించే చట్టాలను బీజేపీ బలవంతంగా రుద్దుతోంది. దీనిపై పార్లమెంట్‌లో మిజోరం ఎంపీలను ప్రభుత్వం కనీసం మాట్లాడనివ్వలేదు. మణిపూర్ రాష్ట్రంలో వాళ్లేం చేశారో చూశాం. జాతుల మధ్య చిచ్చుపెట్టి అశాంతిని రగిల్చారు. ఇంతజరిగినా మణిపూర్‌కు ఒక్కసారైనా వెళ్దామన్న స్పృహ ప్రధాని మోదీకి లేకపోవడం దారుణం' అని సోనియా ఆగ్రహం వ్యక్తంచేశారు. వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో షేర్‌చేశారు. మిజోరంలో ఈనెల ఏడో తేదీన పోలింగ్, డిసెంబర్ మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

తీవ్రమైన కేసుల్ని పేర్కొనలేదు

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్-1 శాసనసభ నియోజకవర్గంలో పోటీకి దిగిన బీజేపీ జాతీయ కార్యదర్శి కైలాశ్ విజయ్ వర్గీయ ఉద్దేశపూర్వకంగా రెండు తీవ్రమైన కేసులను నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదని కాంగ్రెస్ ఆరోపించింది. ఆయన అభ్యర్థిత్వంపై చట్టప్రకారం పోరాడేందుకు సుప్రీంకోర్టుదాక అయినా వెళ్తామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి చరణ్ సాప్రా వ్యాఖ్యానించారు. '1999లో దుర్గ్ కోర్టులో కైలాశ్‌పై ఛత్తీస్‌గఢ్ మాజీ అడ్వొకేట్ జనరల్ తివారీ పరువునష్టం దావా వేశారు. కోర్టుకు హాజరుకావాలని ఎన్నిసార్లు సమన్లు జారీచేసినా కైలాశ్ రాలేదు. దీంతో ఆయనను తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిగా కోర్టు 2019లో ప్రకటించింది. ఈ కేసు వివరాలను కైలాశ్ తన ఎన్నికల నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదు' అని చరణ్ వెల్లడించారు. 'తనను రేప్ చేశారంటూ కైలాశ్‌పై ఒకావిడ వేసిన కేసు పశ్చిమబెంగాల్‌లోని అలీపూర్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ కేసు వివరాలను కేలాశ్ పేర్కొనలేదు. ఈ వివరాలను ఇండోర్-1 కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ శుక్లా.. వెంటనే జిల్లా ఎన్నికల అధికారికి అందజేశారు. అయినా ఆయన బీజేపీ ఒత్తిడికి తలొగ్గి అభ్యర్థనను తోసిపుచ్చారు' అని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీలు గనుకనే... కోవింద్, ముర్ములను పిలవలేదు

మోదీపై ఖర్గే ధ్వజం • పేదలకు అధికారం ప్రధానికి నచ్చదు • ఛత్తీస్‌గఢ్ ప్రచారంలో కాంగ్రెస్ చీఫ్

సుక్మా: దేశంలోని నిరుపేదలకు అధికారం అందడం ప్రధాని నరేంద్ర మోదీకి సుతరామూ ఇష్టముండదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో బుధవారం ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. జల్, జంగిల్, జమీన్ ఆశయాల సాధనకు గిరిజనులు చేసే ప్రయత్నాల్లో కాంగ్రెస్ ఎన్నడూ వారికి దన్నుగా నిలిచిందని చెప్పారు. ''పార్లమెంటు నూతన భవనం శంకుస్థాపన కార్యక్రమానికి నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మోదీ ఆహ్వానించలేదు. ఆయన అంటరానివాడు (దళితుడు) కావడమే అందుకు కారణం. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గిరిజన సామాజిక వర్గం కనుకనే పార్లమెంటు భవన ప్రారంభ కార్యక్రమానికి ఆమెను ఆహ్వానించలేదు'' అని తీవ్ర ఆరోపణలు చేశారు. ''కేవలం మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాత్రమే ఇలాంటి పనులు చేయగలరు. ఎస్సీ, ఎస్టీలను రాష్ట్రపతులుగా ఎన్నుకున్నా, ఇలాంటి అధికారిక శుభ కార్యక్రమాల్లో వారికి అవకాశమే ఇవ్వకపోవడం ద్వారా తమ అసలు రంగును బయట పెట్టుకున్నారు'' అంటూ దుయ్యబట్టారు.

మీరు చేసిందేమిటి?


గత 60 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందన్న బీజేపీ విమర్శలపై ఖర్గే మండిపడ్డారు. కాంగ్రెస్‌ను విమర్శించడం తప్ప బీజేపీ కూడా ఇన్నేళ్లలో చేసిందంటూ ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ''నేనిక్కడికి కేవలం ఓట్లడిగేందుకు, రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు రాలేదు. గిరిజన సామాజిక వర్గాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, మొత్తంగా దేశాన్నే కాపాడుకోవాలన్నది మా ప్రయత్నం'' అని చెప్పుకొచ్చారు. 90 స్థానాలున్న ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి నవంబర్ 7న తొలి దశలో 20 సీట్లకు, 17న మిగతా 70 సీట్లకు పోలింగ్ జరగనుంది.

పంచతంత్రం

ఇటు స్థానిక, అటు జాతీయ నేతల ముమ్మర ప్రచారంతో మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. అయితే పోలింగ్ తేదీ సమీపిస్తున్న వేళ ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ రెండూ రెబెల్స్ బెడదతో సతమతమవుతున్నాయి. టికెట్లు రాని ఎంతోమంది నేతల అసంతృప్తి స్వరాలు తిరుగుబాట్లుగా మారుతున్నాయి. స్వతంత్రులుగా రంగంలోకి దిగి సొంత పార్టీలకే వారు సవాలు విసురుతున్నారు. వాళ్లను బుజ్జగించలేక రెండు పార్టీలూ సతమతమవుతున్నాయి. అసలే హోరాహోరీ పోరు నేపథ్యంలో ఈ తిరుగుబాట్లు ఎక్కడ పుట్టి ముంచుతాయోనని ఆందోళన చెందుతున్నాయి...

ఇరు పార్టీలకూ రె'బెల్స్'!

మధ్యప్రదేశ్‌లో ప్రధాన పార్టీలకు తలనొప్పి
అనునయించలేక కాంగ్రెస్, బీజేపీ ఆపసోపాలు



అమీర్ అకిల్, జితేంద్ర దాగా, కమలేశ్వర్ దేవలియా, కె.కె.శ్రీవాత్సవ, కమలేశ్ అగర్వాల్, శైలేంద్ర చౌధరి, జైకాంత్ సింత్, రాజేంద్ర సింగ్ సోలంకి, కౌశల్య గోటియా, నందరాం కుశ్వాహా, హర్షవర్ధన్. వీళ్లంతా ఎవరో తెలుసా? మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, బీజేపీలపై అలిగి రెబెల్స్‌గా ఎన్నికల బరిలో దిగుతున్న నేతల్లో కొందరు! ఈ తిరుగుబాట్ల దెబ్బకు ప్రస్తుతం రెండు పార్టీలకూ గుండెల్లో అక్షరాలా రైళ్లు పరిగెత్తుతున్నాయి. అసలే పోలింగ్‌కు మూడు వారాలు కూడా లేని ఈ సమయంలో వీరు పెద్ద సమస్యగా మారారు. దాంతో రెబెల్స్‌ను ఎలాగోలా సముదాయించేందుకు బీజేపీ నుంచి సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో పాటు కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, ప్రహ్లాద్ పటేల్, కైలాశ్ విజయ్ వర్గీయ తదితరులు రంగంలోకి దిగారు. కాంగ్రెస్ తరఫున పీసీసీ చీఫ్ కమల్‌నాథ్, మాజీ సీఎం దిగ్విజయ్‌సింగ్, రాష్ట్ర ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలా తదితరులు రెబెల్స్‌ను బుజ్జగించే పనిలో తలమునకలుగా ఉన్నారు! కానీ వారిలో చాలామంది పట్టువీడకపోవడంతో తలపట్టుకుంటున్నారు.



బీజేపీకి తలపోట్లు

బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా పలు అసెంబ్లీ స్థానాల్లో తిరుగుబాటు బెడదను ఎదుర్కొంటోంది. బుర్హాన్‌పూర్‌లో ఎంపీగా, రాష్ట్ర బీజేపీ చీఫ్‌గా చేసిన దివంగత నేత నందకుమార్ సింగ్ చౌహాన్ కుమారుడు హర్షవర్ధన్ స్థానికంగా పట్టున్న నేత. గత లోక్‌సభ ఉప ఎన్నిక సమయంలోనే టికెట్ ఆశించి భంగపడ్డారు. తాజాగా అసెంబ్లీ టికెటిస్తారని భావించినా మాజీ మంత్రి అర్చనా చిట్నిస్‌కు ఇవ్వడంతో భగ్గుమన్నారు. స్వతంత్రునిగా బరిలో దిగారు. కీలక నేతలెందరు బుజ్జగించినా తప్పుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఇక 2021లో బీఎస్పీ నుంచి బీజేపీలో చేరిన నందరాం కుశ్వాహాదీ ఇదే పరిస్థితి. తనకు పట్టున్న నివారీ స్థానంలో రెంసార్లు ఎమ్మెల్యేగా నెగ్గిన అనిల్‌జైన్‌కు టికెట్ దక్కడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. ఆయనతో పాటు జిల్లా బీజేపీ మాజీ చీఫ్ కమలేశ్వర్ దేవలియా కూడా బరిలో ఉండటం పార్టీని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. కీలకమైన తికంగఢ్ నుంచి కె.కె.శ్రీవాత్సవ, జబల్‌పూర్ నార్త్-సెంట్రల్‌లో సీనియర్ బీజేపీ నేత కమలేశ్ అగర్వాల్ కూడా టికెట్ ఆశించి భంగపడి స్వతంత్రునిగా రంగంలోకి దిగారు.

కాంగ్రెస్‌కూ కష్టాలే...

కాంగ్రెస్ కూడా రెబెల్స్ బెడదతో ఇక్కట్లలో పడింది. భోపాల్ నార్త్‌లో ఆరుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గిన సీనియర్ నేత ఆరిఫ్ అకిల్ స్థానంలో కుమారుడు అతీఫ్‌కు పార్టీ అవకాశమిచ్చింది. టికెట్ ఆశించిన ఆరిఫ్ సోదరుడు అమీర్ స్వతంత్రునిగా దిగారు. హుజూర్ స్థానంలో మాజీ ఎమ్మెల్యే జితేంద్ర దాగా కూడా స్వతంత్రునిగా బరిలో దిగారు. గోటేగావ్‌లో శైలేంద్ర చౌధరికి కాంగ్రెస్ తొలి జాబితాలో టికెటిచ్చి రెండో జాబితాలో వెనక్కు తీసుకుంది. దీన్ని తీవ్ర అవమానంగా భావించిన ఆయన స్వతంత్రునిగా పోటీ చేస్తున్నారు. బద్‌నగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే మురళీ మొర్వాల్‌కు తొలి జాబితాలో ఇచ్చిన టికెట్‌ను రెండో జాబితాలో రాజేంద్రసింగ్ సోలంకీకి మార్చింది. మొర్వాల్ కూడా బెదిరింపులకు దిగడంతో సోలంకీని కాదని మళ్లీ ఆయనకే టికెటిచ్చింది. దాంతో సోలంకీ రెబెల్‌గా మారారు! సిరోహాలో మాజీ మంత్రి కౌసల్య గోటియా, జమునా మరావీ ఇద్దరూ తిరుగుబాటు అభ్యర్థులుగా రంగంలో ఉన్నారు! బార్గీ స్థానంలో కూడా మాజీ ఎమ్మెల్యే సా్రబాన్‌సింగ్ కుమారుడు జైకాంత్ రెబెల్‌గా బరిలో ఉన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

క్లుప్తంగా...

ఏపీ ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ శుభసందర్భంగా చైతన్యవంతులైన రాష్ట్ర ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఏపీ ప్రజలు అసాధారణ ప్రతిభ, అచంచలమైన సంకల్పం, దృఢమైన పట్టుదలతో విభిన్న రంగాల్లో తమదైన ముద్ర వేశారు. వారి శ్రేయస్సు, విజయం కోసం ప్రార్థిస్తున్నా' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

ఏపీ భవన్‌లో ఘనంగా వేడుకలు

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఘనంగా వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్, ఆదిలీల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో ఏపీ కీలక పాత్ర: గవర్నర్

సాక్షి, అమరావతి: భారతదేశ ప్రగతిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం దూరదర్శన్ ద్వారా ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో ఆంధ్రప్రదేశ్ విశేష అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. అపార సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. దార్శనికత దృక్పథంతో ముందుకు వెళ్తోందన్నారు. రాష్ట్ర కళలు, సంస్కృతి, సంప్రదాయాలు అంతర్జాతీయ స్థాయిలో తెలుగువారి ప్రత్యేకతను చాటిచెబుతున్నాయన్నారు. రానున్న కాలంలో రాష్ట్రం మరింత ప్రగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి గవర్నర్ నజీర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

సమున్నత లక్ష్యంతో ముందుకు..

- ప్రజలకు సీఎం జగన్ రాష్ట్ర అవతరణ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు. 'అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములు త్యాగఫలం, ఎంతో మంది పోరాట ఫలితంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. నేడు వారి స్ఫూర్తితో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న సమున్నత లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఆంధ్ర రాష్ట్ర ప్రజలుగా మనం బలపడుతూ ఈ దేశాన్ని మరింత బలపరిచేందుకు ఎన్నో అడుగులు ముందుకు వేస్తున్నాం. దేశాభివృద్ధిలో మనవంతు పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతున్నాం. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు. అలాగే వైఎస్సార్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్న అందరికీ అభినందనలు' తెలుపుతూ సీఎం జగన్ ట్వీట్ చేశారు. అంతకుముందు సీఎం వైఎస్ జగన్ తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు రచించిన 'స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్రులు' పుస్తకాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, సాంస్కృతిక, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ తదితరులు పాల్గొన్నారు.

ముంబైలో..

సాక్షి, ముంబై: ముంబైలోని రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నవీ ముంబై తెలుగు కళా సమితితో కలిసి మహారాష్ట్ర రాజ్ భవన్ బుధవారం రాత్రి వేడుకలను నిర్వహించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర, విశేషాలను తెలిపే వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ రమేశ్ బైస్, తెలుగు సినీ నటుడు సుమన్, తెలుగు కళా సమితి ప్రధాన కార్యదర్శి కొండారెడ్డితోపాటు పలువురు తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు అనకాపల్లి, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో బస్సు యాత్ర

సాక్షి, అమరావతి: ఏపీలో 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మంచిని వివరించడానికిగాను వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర జైత్రయాత్రలా సాగుతోంది. యాత్ర ఐదో రోజు అనకాపల్లి జిల్లా మాడుగుల, కృష్ణా జిల్లా అవనిగడ్డ, చిత్తూరు జిల్లా చిత్తూరు నియోజకవర్గాల్లో జరుగుతుంది.



జగనన్న ఆరోగ్య సురక్ష





కర్నూలు జిల్లా చిలకలదోణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి భారీగా తరలివచ్చిన స్థానికులు



విశాఖ ఐదో వార్డులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న స్థానికులు



ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొప్పాక గ్రామంలోని శిబిరంలో వృద్ధురాలి సమస్యలు వింటున్న వైద్యురాలు



శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం నేరడి గ్రామంలో నిర్వహించిన శిబిరానికి హాజరైన ప్రజలు



కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ఏర్పాటుచేసిన శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న మహిళ



గుంటూరు జిల్లా తెనాలి చెంచుపేటలో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కృష్ణా జిల్లా గొల్లగూడెంలో నిర్వహించిన శిబిరంలో చిన్నారికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

93.07% శిబిరాలు పూర్తి

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా 12,422 ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ లక్ష్యం కాగా, 93.07 శాతం.. అంటే 11,562 శిబిరాలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. వైఎస్సార్, ప్రకాశం, పల్నాడు, అల్లూరి సీతారామరాజు, కృష్ణా జిల్లాల్లో వంద శాతం కార్యక్రమం పూర్తి అయింది. మిగిలిన జిల్లాల్లో 860 గ్రామాలు, పట్టణాల్లో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో ఈనెల 15వ తేదీ లోగా పూర్తి చేసేలా వైద్య శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం

ఆరోగ్య సురక్ష శిబిరాల్లో స్పెషలిస్ట్ వైద్యుల పరిశీలన అనంతరం మెరుగైన వైద్యం అవసరం ఉన్న వారిని ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇలా ఇప్పటివరకూ సుమారు 80 వేల మందికి పైగా రోగులను రిఫర్ చేశారు. వారిని స్థానిక ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)లకు అనుసంధానించి తదుపరి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం అందించేలా వైద్య శాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో అక్టోబర్ 29వ తేదీ నాటికి 520 మందికి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సర్జరీ/వైద్యం చేశారు. వీరిలో 451 మంది ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయి ఇళ్లకు కూడా వెళ్లారు. ఇదే తరహాలో మిగిలిన రోగులందరికీ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం, పరీక్షలు, మందులు, అవసరం ఉన్న వారికి సర్జరీ సేవలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయిన అనంతరం కూడా వీరి ఆరోగ్యంపై ఫ్యామిలీ డాక్టర్ నేతృత్వంలోని వైద్య సిబ్బంది ద్వారా నిరంతరం వాకబు చేస్తున్నారు.

దీర్ఘకాలిక జబ్బుల బాధితులకు భరోసా..

కొత్తగా మధుమేహం, రక్తపోటు, క్షయ వంటి దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్నవారిని ఆరోగ్య సురక్షలో ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ మెరుగైన వైద్యం అందించడంతో పాటు నిరంతరం వైద్య పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటినీ జల్లెడ పట్టి స్క్రీనింగ్ చేయగా.. గతంలో ఉన్న బీపీ, షుగర్ బాధితులు కాకుండా కొత్తగా 2,25,451 మంది బీపీ, 1,40,218 మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. మరోవైపు నమూనాలు సేకరించి 417 మందిలో క్షయ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. అలాగే కుష్ఠు వ్యాధి నిర్ధారణ ప్రక్రియ కొనసాగుతోంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం అందించడంతో పాటు.. ఉచితంగా మందులిస్తున్నారు.

రాష్ట్ర వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు

- ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజారోగ్యానికి భరోసా
- హరియాణ ట్రైనీ అధికారులకు వివరించిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్



మాట్లాడుతున్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, పక్కన ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ చెప్పారు. రాష్ట్ర పర్యటనలో ఉన్న హరియాణ ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం బుధవారం మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. రాష్ట్రంలో వైద్యశాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి ఈ బృందానికి కమిషనర్ నివాస్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ వేమిరెడ్డి రామిరెడ్డి వివరించారు. కమిషనర్ నివాస్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, నాడు–నేడు కింద ప్రభుత్వాస్పత్రుల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల కల్పన, 17 కొత్త వైద్యకళాశాలల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి పథకాలే ఈ ప్రభుత్వం వైద్యశాఖలో తెచ్చిన మార్పునకు నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి వైద్యపరమైన సమస్యలు, అవసరాలు తీర్చేలా ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని 45 రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన రోగులకు విశ్రాంతి సమయంలో రోజుకు రూ.250 చొప్పున ఆరునెలల వరకు భృతిని ఇస్తున్నట్టు తెలిపారు. ఇటువంటి పథకం బహుశా దేశంలోనే ఎక్కడా అమలులో లేదన్నారు. సీఎం చైర్మన్‌గా వ్యవహరించే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఆరోగ్యశ్రీతో పాటు 108 ఉచిత అంబులెన్స్ సేవలు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో అనుసంధానమైన 104 మొబైల్ మెడికల్ యూనిట్ సేవలు, ఈహెచ్ఎస్, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం అమలు చేస్తున్నట్లు తెలిపారు. హరియాణ ట్రైనీ అధికారులు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యరంగంపై ఏపీ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెట్టడం అభినందనీయమని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష అమలు తీరును తాము పరిశీలించామన్నారు. 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నెలకొల్పడమే కాకుండా బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత ఉన్న సీహెచ్‌వోలను నియమించి మారుమూల గ్రామాలకు సైతం వైద్యసేవల్ని విస్తరించడం ప్రశంసనీయమని చెప్పారు. అత్యధిక ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అకౌంట్‌లను సృష్టించడంలో కూడా దేశంలోనే ఏపీ ముందు నిలిచిందన్నారు. ఏపీలోని వలంటీర్లు గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను ఎంతో చేరువ చేశారని వారు పేర్కొన్నారు.

బాధితులకు సత్వర భరోసా

విజయనగరం రైలు ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

- సీఎం వైఎస్ జగన్ వేగవంతమైన నిర్ణయాలతో నిలిచిన జీవితాలు
- ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలోనే ఆస్పత్రికి క్షతగాత్రులు
- అత్యవసర వైద్యంతో కొంత మందికి తప్పిన ప్రాణాపాయం
- మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా



విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాముకు ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ



రైలు ప్రమాదంలో మృతి చెందిన గార్డు కుటుంబ సభ్యులకు విశాఖలో చెక్కు అందజేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

కుటుంబంలో ముగ్గురూ ఒకేచోట..



రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈ వ్యక్తి పేరు జక్కల వెంకటరమణ. ఆ పక్కనున్న బెడ్‌పై ఉన్నవారు అతని భార్య బంగారుతల్లి, చిన్నారి కుమార్తె కోమలి. విశాఖపట్నం గాజువాకకు చెందిన ఆ కుటుంబం విజయనగరం జిల్లా గరివిడిలోని అత్తారింటికి వస్తూ ఈ ప్రమాదం బారినపడ్డారు. తండ్రి, తల్లి, చిన్నబిడ్డ.. ఇలా ముగ్గురు ఒకేచోట గాయాలతో ఉండటం చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చలించిపోయారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బంగారుతల్లికి రూ.10 లక్షలు, వెంకటరమణకు రూ.5 లక్షలు, కోమలికి రూ.2 లక్షలు.. మొత్తం రూ. 17 లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేశారు. ఆ చెక్కులను మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం అందజేశారు.

ఎక్స్‌గ్రేషియా ఇలా...

ఎక్స్‌గ్రేషియా	బాధితుల సంఖ్య	మొత్తం ఎక్స్‌గ్రేషియా
మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున	13	రూ. 1.30 కోట్లు
స్వల్ప గాయాలైనవారికి రూ.2 లక్షలు చొప్పున	12	రూ. 24 లక్షలు
నెలకు పైగా వైద్యం అవసరమైన క్షతగాత్రులకు రూ.5 లక్షల చొప్పున	15	రూ. 75 లక్షలు
శాశ్వత వైకల్యం సంభవించిన క్షతగాత్రులకు రూ.10 లక్షలు చొప్పున	3	రూ. 30 లక్షలు
మొత్తం	43	రూ. 2.59 కోట్లు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



రైలు ప్రమాదంలో నా భర్త రాము చనిపోయాడని తెలిసి కుప్పకూలిపోయాను. మా కుటుంబానికి ఆ దేవుడే దిక్కు అని కుమిలిపోయాను. అంతటి విషాదంలో ఉన్న మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అండగా నిలబడటంతో కొండంత ధైర్యం వచ్చింది. రూ. 10 లక్షలు ఇచ్చిన ఆయనకు రుణపడి ఉంటాం. వైఎస్సార్ బీమా కింద మరో రూ. 5 లక్షలు సాయం అందుతుందని చెప్పారు. తక్షణ సాయం కింద రూ. 10 వేలు ఇచ్చారు.

– మజ్జి శారద, గదబవలస, గరివిడి మండలం, విజయనగరం జిల్లా

వెంటనే సాయం



నా భర్త పిళ్లా నాగరాజు రైలు ప్రమాదంలో చనిపోయారు. ఎలా బతకాలో తెలియక కుటుంబమంతా రోదిస్తున్నాం. ఇలాంటి పరిస్థితిలో మా పట్ల ముఖ్యమంత్రి స్పందించిన తీరు మరచిపోం. ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పిన వెంటనే చెక్కు పంపించారు. ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాం.

– పిళ్లా కళావతి, కాపుశంభాం, గరివిడి మండలం, విజయనగరం జిల్లా

సాక్షి ప్రతినిధి, విజయనగరం/ఆరిలోవ (విశాఖ తూర్పు): బాధితులకు సహాయం చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనితీరు మరోసారి రుజువైంది. జెట్‌స్పీడ్‌తో ఆయన తీసుకున్న నిర్ణయాలు విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ప్రాణనష్టాన్ని కనిష్టస్థాయికి తీసుకురాగలిగాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును సంఘటన స్థలికి పంపించారు. క్షతగాత్రులను త్వరగా ఆస్పత్రికి తరలించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని ఆదేశించారు. మిగతా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయించారు. విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో క్షతగాత్రుల కోసం రెండు వార్డులను సిద్ధం చేశారు. తీవ్ర రక్తస్రావంతో వచ్చినవారికి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి వెనువెంటనే వైద్యులు తగిన చికిత్స చేశారు. దీంతో కొంతమందికి ప్రాణాపాయం తప్పింది. సోమవారం మధ్యాహ్నం సీఎం వైఎస్ జగన్ విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 28 మంది క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎక్స్‌గ్రేషియాను ప్రకటించడంలోనూ, రెండురోజుల వ్యవధిలోనే వారి చేతికి చెక్కులను అందించడంలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవను విమర్శకులు సైతం మెచ్చుకుంటున్నారు.

మానవతా దృక్పథంతో ఎక్స్‌గ్రేషియా..

రైల్వే శాఖ ప్రకటించిన నష్టపరిహారంతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా మంజూరుచేశారు. 13 మంది మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున రూ.1.30 కోట్లు, క్షతగాత్రులకు తీవ్రతను బట్టి రూ. 2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కులను క్షతగాత్రులకు మంగళవారం, బుధవారం ఇచ్చారు. బుధవారం చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలోని నాలుగు కుటుంబాలకు మంత్రి బొత్స సత్యనారాయణ, శృంగవరపుకోట నియోజకవర్గం పరిధిలో ఒక కుటుంబానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చెక్కు అందజేశారు. మిగతా వారికి గురువారం అందించనున్నారు.

విశాఖలో రైలు ప్రమాద బాధితులకు..

విజయనగరం జిల్లా రైలు ప్రమాదంలో మృతిచెందిన రైల్వేగార్డు మరిపి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున నష్టపరిహారాన్ని ప్రజాప్రతినిధులు బుధవారం అందించారు. విశాఖపట్నం ఆరిలోవ బాలాజీనగర్‌లో ఉంటున్న ఆయన కుటుంబసభ్యులకు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, అధికారులతో కలిసి రూ.10 లక్షల చెక్కును అందజేశారు. హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్వతీపురం మన్యం జిల్లా ఇందిరాకాలనీకి చెందిన కోలా నానాజీకి రూ. 5 లక్షల చెక్కు ఇచ్చారు. ఇక, కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నల్లా కుమారికి రూ. 5 లక్షలు, రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.తేజేశ్వరరావుకు రూ. 2 లక్షల చొప్పున చెక్కులను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అందజేశారు.

రైలు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): రైలు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముద్రు లక్ష్మి (40) మృతి చెందారు. గాజువాకకు చెందిన ఆమె బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు.


వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీ నందిగం సురేష్, ఇతర నేతలు.. అమరజీవి శ్రీపొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎంపీ నందిగం మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమేనన్నారు. త్యాగధనుల స్ఫూర్తితో సీఎం జగన్ పరిపాలన సాగిస్తూ ప్రతి కుటుంబానికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుత్తా ప్రతాప్‌రెడ్డి, తొండమల్ల పుల్లయ్య, రామనబోయిన బ్రహ్మయ్య పాల్గొన్నారు.

బాలుడి చికిత్సకు సీఎం జగన్ సాయం

- రూ.12,94,656లకు ఎల్‌ఓసీ జారీ
- తల్లికి అందజేసిన కలెక్టర్ మాధవీలత



భానుకు ఎల్‌వోసీ లేఖ అందిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సీఎం జగన్ చొరవతో కొడపల్లి రెహాన్ అనే బాలుడి వైద్య చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.12,94,656 లెటర్ ఆఫ్ క్రెడిట్ జారీ అయ్యిందని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ చాంబర్‌లో కమిషనర్ కె.దినేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ సమక్షంలో రెహాన్ తల్లి ఎస్‌బీ భాను(శానిటరీ ఇన్‌స్పెక్టర్)కు ఎల్‌వోసీ లేఖ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం జగన్ సెప్టెంబర్ 16న తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఎస్‌బీ భాను తన కుమారుడు రెహాన్ జన్యుపరమైన హిమోఫిలియా అనే వ్యాధితో బాధపడుతున్నారని అర్జీ ఇచ్చారన్నారు. ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయగా ఈ వ్యాధికి 6 నెలల పాటు ఇమిసిజోమాబ్ అనే మెడిసిన్ వాడాలని సూచించినట్టు తెలిపారు. వైద్యం చేయించుకునేందుకు తమకు స్థోమత లేదని, సాయం చేయాలని కోరినట్టు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్.. తదుపరి వైద్య సేవల కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్ లేఖను జారీ చేశారని, సీఎం ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ ఎం.హరికృష్ణ సీఎంఆర్ఎఫ్ నుంచి చికిత్స కోసం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి లెటర్ ఆఫ్ క్రెడిట్ ఉత్తర్వులిచ్చారని పేర్కొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 2 । నవంబర్ । 2023

సేవాస్ఫూర్తిగా.. పుట్టినరోజు వేడుక

బనశంకరి: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా రథ సారథి సజ్జల భార్గవ్‌రెడ్డి జన్మదినాన్ని బుధవారం పార్టీ సోషల్ మీడియా, వైఎస్సార్ కుటుంబం– బెంగళూరు ఘనంగా ఆచరించింది. హెచ్ఎస్ఆర్ లేఔట్‌లోని సమర్పనం ట్రస్ట్ అనాథాశ్రమంలో బాలల మధ్య కేక్ కట్ చేశారు. చిన్నారులకు అల్పాహారం, పండ్లు అందజేశారు.


సజ్జల భార్గవ్‌రెడ్డి జన్మదిన వేడుకలో నేతలు

న్యూస్‌రీల్

ఉత్సాహంగా ఊరేగింపు


నృత్యం చేస్తున్న మహిళలు

బనశంకరి: సిలికాన్ సిటీలోని జయనగరలో కన్నడ రాజ్యోత్సవం ఘనంగా జరిగింది. నాలుగో బ్లాక్‌లో వీరవనిత ఒనకె ఓబవ్వ, కన్నడసేనా సమితి, డాక్టర్ రాజ్ మంటప కన్నడ కట్టె అధ్యక్షుడు ఎస్‌జీ. రమేశ్‌రాజు ఆధ్వర్యంలో కన్నడపతాకాన్ని ఎగురవేసి మొక్కలు నాటారు. నాడదేవత అణ్ణమ్మదేవి ఉత్సవమూర్తి విగ్రహాన్ని వెండిరథంలో డొళ్లుకుణిత వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రథం ముందు నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం పవర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

పాలించే సత్తా లేక అబద్ధాలు

- కాంగ్రెస్‌పై యత్నాళ్ ధ్వజం

దొడ్డబళ్లాపురం: బీజేపీ ఎమ్మెల్యేలు ఎవరైనా సరే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి రూ.50 కోట్లు ఇస్తామని, పార్టీలో చేరమని ప్రలోభపెట్టి ఉంటే ఆ ఆడియోలను విడుదల చేయాలని బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ సవాలు విసిరారు. బుధవారం బిజాపూర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇచ్చారని, పాలించే యోగ్యత లేని వారు అకారణంగా ఆపరేషన్ కమల అంటూ అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఆపరేషన్ సాక్ష్యాలు ఉంటే బయటపెట్టాలన్నారు. 50 కోట్లు, 100 కోట్లు అంటూ మార్కెట్‌లో వారి రేటు పెంచుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చూస్తున్నారని విమర్శించారు. ఎవరైనా పిలిచి ఆఫర్ ఇవ్వాలి, కానీ వారే ఇలాంటి వదంతులు పుట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నించదన్నారు. ఇప్పటికే 5 నెలల్లోనే కాంగ్రెస్ తలరాత రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయిందని, సర్కారు ఎక్కువ రోజులు ఉండేలా లేదన్నారు.

బెళగావి జిల్లాను విభజించాలి: మంత్రి

దొడ్డబళ్లాపురం: కన్నడ రాజ్యోత్సవం నాడు బ్లాక్ డే ఆచరించే వారికి తల్లిలాంటి కన్నడ రాష్ట్రం, భాష విలువ తెలియదని బెళగావి మంత్రి సతీష్ జార్కిహొళి అన్నారు. బుధవారం బెళగావిలో కన్నడ రాజ్యోత్సవంలో పాల్గొని మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోనే నివసిస్తూ బ్లాక్ డే ఆచరించడం ఎంతవరకూ సమంజసమో వారే చెప్పాలని మరాఠా సంఘాలను డిమాండ్ చేశారు. పోలీసులు గొడవలు జరగకుండా భద్రత కల్పిస్తే, మరాఠా సంఘాలకు అండగా ఉన్నారని ఆరోపించడం తగదన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం బెళగావి జిల్లా విభజించాలని డిమాండు ఉందన్నారు. ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు. జిల్లా విభజనకు ముందు బెళగావి తాలూకాను విభజించాలన్నారు.

ఎయిర్‌పోర్టులో పసిడి సీజ్


పట్టుబడ్డ బంగారం

దొడ్డబళ్లాపురం: బెంగళూరు కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు ప్రయాణికుని నుంచి రూ.57లక్షల విలువైన అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్ 30న బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని తనిఖీ చేయగా 951 గ్రాముల బంగారం బిస్కెట్ పట్టుబడింది. దాని విలువ రూ.57 లక్షలుగా అధికారులు తెలిపారు. ప్రయాణికున్ని అరెస్టు చేశారు.

ఆవులు, రైతుపై పులి దాడి

మైసూరు: పెద్ద పులి దాడి చేసి ఆవును చంపివేసింది, రైతును తీవ్రంగా గాయపరచింది. ఈ సంఘటన మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని మహాదేవనగరలో చోటు చేసుకుంది. బుధవారం వీరభద్ర బోవి అనే వ్యక్తి బండీపుర అడవి సమీపంలో ఆవులను మేపుతుండగా పులి దాడి చేసింది. ఆవులను రక్షించడానికి గట్టిగా కేకలు వేస్తూ పులిని అడ్డుకున్నాడు. కానీ పులి దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. పులి ఒక ఆవును చంపి పాక్షికంగా భక్షించింది. ఈ శబ్దాలు విని సహచర రైతులు వచ్చి బాధితున్ని మైసూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

అటవీ సిబ్బందిపై జనం దాడి

అటవీ సిబ్బంది వచ్చి ఘటనాస్థలిని పరిశీలిస్తుండగా, గ్రామస్తులు ఆవేశం పట్టలేక వారిపై దాడిచేశారు. ఇక్కడ అనేకసార్లు అడవి జంతువులు ప్రజలపైన దాడులు చేస్తూ ప్రాణాలు తీస్తుంటే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సంఘటనతో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది.


బుధవారం బెంగళూరు కంఠీరవ మైదానంలో రాజ్యోత్సవ సంబరం


కంఠీరవలో.. మువ్వన్నెల జెండాలతో పాఠశాల బాలికలు


చిక్కమగళూరులో.. కన్నడమాత రథంతో బాలల నృత్య ప్రదర్శన

రాజ్యోత్సవ అట్టహాసం

- రాష్ట్రమంతటా వైభవంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం
- మురిపించిన సాంస్కృతిక వేడుకలు
- బెళగావిలోనూ జయప్రదం
- ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, నీటి వసతి: సీఎం


వేడుకలో సీఎం, డీసీఎం తదితరులు


కంఠీరవలో.. బాలల నాట్య విన్యాసం


బెళగావిలో కన్నడ సంఘాల ఆర్భాటం

బనశంకరి: కన్నడ రాష్ట్ర అవతరణ దినం సందర్భంగా కన్నడ రాజ్యోత్సవం రాష్ట్రంలో వాడవాడలా వైభవంగా జరిగింది. పిల్లలూ పెద్దలూ ఉత్సాహంగా రాష్ట్ర పండుగలో పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితనీరు, విద్యుత్ వసతి అందిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. బుధవారం కంఠీరవ స్టేడియంలో 68 వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలో సీఎం కన్నడ పతాకాన్ని ఎగురవేసి ప్రసంగించారు. కన్నడ పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యాశాఖ విజ్ఞప్తి మేరకు తక్షణం ఉచిత విద్యుత్, తాగునీటి సౌలభ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కన్నడిగులను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్య అందించడం, పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సార్వభౌమ భాష కన్నడ: సీఎం

దేవరాజు అరసు ముఖ్యమంత్రి అవదిలో మైసూరు రాష్ట్రానికి కర్ణాటక అని నామకరణం చేసి 50 ఏళ్లు పూర్తయింది. అందుకు గుర్తుగా ఏడాదిపాటు కర్ణాటక సంభ్రమ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తమిళనాడు, కేరళ, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక అధికార భాష మాట్లాడకపోతే బతకలేని వాతావరణం ఉంది. కానీ కర్ణాటకలో కన్నడ మాట్లాడకపోయినా జీవించవచ్చన్నారు. ఏ భాష అయినా నేర్చుకోండి కానీ మన సార్వభౌమ కన్నడ భాషనే మాట్లాడాలన్నారు. ప్రభుత్వపాలన కన్నడభాషలో ఉండాలని, ఇక్కడ ఉద్యోగం చేసే వారు కన్నడలో వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కవాతు చేస్తూ గౌరవ వందనం సమర్పించారు. జాతీయ, కన్నడ పతాకాన్ని సీఎం ఎగురవేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, ప్రాథమిక విద్యాశాఖమంత్రి మధు బంగారప్ప, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

కంఠీరవ వర్ణమయం

కంఠీరవలో వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కన్నడనాడు కళలు, సంస్కతిని చాటిచెప్పిన సాంస్కతిక కార్యక్రమాలు ముగ్ధుల్ని చేశాయి. బాల బాలికలు రంగు రంగుల దుస్తులు ధరించి సంగీతం, నాడభక్తి గీతాలకు అనుగుణంగా చేసిన నృత్యాలు కనువిందు చేశాయి. జయకన్నడ నృత్య రూపకంతో ప్రదర్శన ఆరంభమైంది. కన్నడ కళలు, సంస్కృతి, సాహితీ పరంపరను పాటల రూపంలో ప్రదర్శించారు. డొళ్లుకుణిత, పూజా కుణిత, పటదకుణిత, యక్షగానం అలరించాయి.

ప్రధాని శుభాకాంక్షలు

కన్నడ రాజ్యోత్సవం సందర్భంగా కన్నడిగులకు ప్రధాని నరేంద్రమోదీ కన్నడలో శుభాకాంక్షలు తెలిపారు. కన్నడ రాజ్యోత్సవం రోజున కర్ణాటక చైతన్యం పరిఢవిల్లుతోందని, ప్రేమ, విశ్వాసాలు మిళితమైన కన్నడిగులు, రాష్ట్రం పురోగమిస్తోందన్నారు. కర్ణాటక మరింత అభివృద్ధి చెందాలని ట్విట్టర్‌లో ఆకాంక్షించారు.

బెళగావిలో కోలాహలం

మరోవైపు రాష్ట్రం నలుమూలలా రాజ్యోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా మైదానంలో జెండా వందనం, బాలల కళా పాటవం అబ్బురపరిచింది. బెళగావిలో మరాఠా సంఘాల హెచ్చరికల మధ్య కన్నడ సంఘాలు వైభవంగా వేడుకలను నిర్వహించాయి. సాయంత్రం కిత్తూరు చెన్నమ్మ కూడలిలో కన్నడ బావుటాలను పట్టుకుని నినాదాలు చేస్తూ పెద్దఎత్తున అట్టహాసం చేశారు.


కొప్పళలో బాలల నృత్యం


కోలారులో ఏనుగు అంబారీ ఊరేగింపు

ఆ చిరుత కాల్చివేత

- బెంగళూరు బొమ్మనహళ్లిలో 4 రోజులుగా హల్‌చల్
- వందమందికిపైగా అటవీ సిబ్బంది గాలింపు
- తుపాకీ కాల్పుల్లో మృత్యువాత


పొదల్లో దాగిన చిరుత పులి



బొమ్మనహళ్లి: గడిచిన నాలుగు రోజుల నుంచి బెంగళూరు బొమ్మనహళ్లి పరిధిలోని కూడ్లు గేట్‌తో పాటు హోసపాళ్య, సామసంద్రపాళ్య, బండెపాళ్య, ఏఈసీఎస్ లేఔట్‌తో పాటు కూడ్లు ప్రాంతంలో సంచరిస్తూ ప్రజలకు నిద్ర లేకుండా చేసిన చిరుతపులిని అధికారులు సజీవంగా పట్టుకోలేకపోయారు. తుపాకీతో దానిని కాల్చిచంపారు. గత శనివారం రాత్రి నుంచి పులి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తోంది. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడ్డారు. ఈ చిరుతను బంధించడం కోసం మైసూరు అటవీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సుమారు 70 మంది, బెంగళూరు బన్నేరుఘట్ట అభయారణ్యం నుంచి 50 మంది అటవీ సిబ్బంది గాలింపు చేపట్టారు. పగలు అపార్టుమెంట్ల మరుగున పొదల్లో దాక్కుంటూ, రాత్రి కాగానే బయట రోడ్లపై తిరుగుతోంది.

భారీ కార్యాచరణ

- బుధవారం ఉదయం ఆరుగంటల నుంచి సుమారు 150 మందికి పైన అటవీ శాఖ సిబ్బంది, పోలీసులు, బొమ్మనహళ్లి బీబీఎంపీ అధికారులు తుపాకులు, వలలు, బుల్డోజర్లు తదితరాలతో ముమ్మరంగా కూంబింగ్ చేపట్టారు.
- కూడ్లు గేట్‌లోని కృష్ణారెడ్డి లేఔట్‌లో ఒక అపార్టుమెంటు పక్కన పొదల్లో గాలింపు జరుపుతుండగా ఉదయం 11 గంటల సమయంలో చెట్ల పొదల్లో నుంచి చిరుత బయటకు వచ్చి పారిపోసాగింది.
- అటవీ సిబ్బంది మూడుసార్లు మత్తు తూటాలను పేల్చగా తప్పించుకుంది. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ధనరాజుపైకి చిరుత దూకి దాడి చేయగా ఆయన కాలుకు, కడుపు, చేతికి గాయాలయ్యాయి.
- చిరుత మళ్లీ పొదల్లోకి వెళ్లిపోగా జేసీబీతో తొలగింపు చేపట్టారు. మత్తు తూటాలు పేల్చగా ఈసారి కూడా తగల్లేదు.
- దీంతో అటవీ సిబ్బంది చుట్టూ వలలు వేసి చిరుత కోసం ఇనుప రాడ్లు, కట్టెలు పట్టుకొని నిలబడి ఉన్నారు.
- సుమారు మూడు గంటల తరువాత చిరుత పారిపోతుండగా, అటవీ సిబ్బంది తుపాకీతో కాల్చడంతో చిరుత తీవ్రంగా గాయపడింది. దానిని వలలో బంధించి తరలిస్తుండగా మృత్యువాత పడింది.
- కాగా, చిరుత ఎక్కడి నుంచి వచ్చి ఉంటుందన్నది సస్పెన్స్‌గా ఉంది. గాలింపును చూడడానికి పెద్దసంఖ్యలో జనం పోగయ్యారు. చిరుతను సజీవంగా పట్టుకుని ఉండాల్సిందని పలువురు అన్నారు.


ఈ ప్రాంతంలోనే చిరుత నక్కింది


చిరుత కళేబరాన్ని వలలో వేస్తున్న దృశ్యం


రాజ్యోత్సవం సందర్భంగా బెంగళూరు బసవనగుడిలో బృహత్ జెండా ప్రదర్శన

స్కూలు పిల్లల బ్యాగుల బరువు తగ్గిస్తాం

బనశంకరి: పిల్లలు బ్యాగ్ బరువు 50 శాతం తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప తెలిపారు. కంఠీరవ స్టేడియంలో రాజ్యోత్సవంలో మాట్లాడుతూ 600 కన్నడ పబ్లిక్ పాఠశాలలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశం ఉందన్నారు. కర్ణాటకలో కన్నడ అధికార భాష అన్నారు. ప్రస్తుతం స్కూలు పిల్లల బ్యాగులు బరువు ఎక్కువగా ఉన్నాయని, ఆ బరువును సగం తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆ కీచకుడు.. రిటైర్డు హెచ్‌ఎం!

యశవంతపుర: గత ఆదివారం బెంగళూరులో షాపింగ్ మాల్‌లో మహిళల వెంటపడి అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. అతని చేష్టల వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అతడు బెంగళూరు అగ్రహార దాసరహళ్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయునిగా గుర్తించారు. శివనహళ్లి సమీపంలోని పాఠశాలలో పని చేసి రిటైరైనట్లు తెలిసింది. కుటుంబం గౌరవ మర్యాదలతో ఉండగా, వీడియో వైరల్ కావడంతో అతడు ఇంటికి రాకుండా తప్పించుకు తిరుగుతున్నాడని తెలిసింది.

బీదర్‌కు స్పెషల్ రైళ్లు

అనంతపురం సిటీ: యశ్వంతపుర–బీదర్–యశ్వంతపుర మధ్య వచ్చే శని, ఆదివారం నుంచి వారాంతపు రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. యశ్వంతపురలో వచ్చే శనివారం రాత్రి 11.15కు బయలుదేరే ఎక్స్‌ప్రెస్ (నంబర్: 16577) రైలు హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, గుల్బర్గా మీదుగా బీదర్‌కు ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుందన్నారు. మార్గమధ్యంలో అనంతపురానికి తెల్లవారుజామున 4.38 గంటలకు వస్తుంది. తిరిగి ఆదివారం మధ్యాహ్నం 2.40కు బీదర్‌లో బయలుదేరే రైలు (నంబర్: 16578) యశ్వంతపురకు రాత్రికి చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సర్కారును కాపాడుకోండి

- సీఎంకు సుర్జేవాలా సూచన

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పడిపోకూడదని, అందుకు పార్టీ నాయకులు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని, లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నందున ఇలాంటి వాటిని పసిగట్టి అడ్డుకోవాలని రాష్ట్ర నాయకులకు కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశించినట్లు తెలిసింది. పదవులు దక్కని కాంగ్రెస్ అసంతృప్త నాయకులకు బీజేపీ ఆపరేషన్ కమల పేరుతో గాలం వేస్తోందని వార్తలు రావడంతో ఏఐసీసీ నేత రణదీప్‌సింగ్ సుర్జేవాలా సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లతో ప్రత్యేకంగా చర్చించారు. రాజకీయ పరిణామాలపై నిఘా పెట్టాలి. మంత్రి సతీష్ జార్కిహొళి దీపావళి తరువాత 30 మంది ఎమ్మెల్యేలతో కలిసి దుబాయ్ టూర్ వెళ్తున్నారనే తెలుస్తోంది. అదే నిజమైతే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయి. దుబాయ్ టూర్‌ని అడ్డుకోవాలి అని సుర్జేవాలా సూచించినట్టు సమాచారం. కాంగ్రెస్‌లో ముఠాలు, విభేదాలు, తిరుగుబాట్లకు తావివ్వరాదని, పార్టీ పరిస్థితుల గురించి బయట మాట్లాడరాదని తెలిపారు.

శాసనసభలో సారథులెవరు?

- ఇప్పటికీ నియమించకపోతే ఎలా?
- బీజేపీ ఎమ్మెల్యేల అసహనం!



దొడ్డబళ్లాపురం: విధానసభ, విధాన పరిషత్‌లో బీజేపీ పక్ష నాయకులు ఎవరనేది తక్షణం ప్రకటించాలి, లేదంటే త్వరలో బెళగావిలో జరగబోయే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాబోమని బీజేపీ ఎమ్మెల్యేలు పార్టీ హైకమాండ్‌కు స్పష్టంచేసినట్లు సమాచారం. ఈ రెండు పదవులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం యడియూరప్ప ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బీజేపీ పక్ష నేత లేకుండా సమావేశాల్లో ఎలా పాల్గొనాలని ప్రశ్నించారు. తాము పార్టీ పెద్దలను ఎదిరించడం లేదని, కానీ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఆరునెలలు కావస్తున్నా ఉభయ సభల్లో బీజేపీ సారథులెవరో అనేది ఎంపిక చేయకపోవడం పార్టీకి నష్టం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం విధానాలపై ఎలా పోరాడగలమని ప్రశ్నించారు. పాలక పక్షం కాంగ్రెస్ ఈ విషయమై తమను లోకువగా చూస్తోందని వాపోయారు.

హైకమాండ్‌తో మాట్లాడాను

యడియూరప్ప స్పందిస్తూ ఈ విషయంలో తనకూ బాధగా ఉందన్నారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన సమయంలో పార్టీ పెద్దలను కలిసి ఇదే విషయమై చర్చించానన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుని అవధి కూడా ముగిసి చాలా రోజులైందని, కొత్త నేత ఎంపికలోనూ ఆలస్యం జరుగుతోందని యడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు చాలా ఉన్నాయని, అయితే అసెంబ్లీలో వైఫల్యాలపై గళం విప్పి పోరాడేందుకు ప్రతిపక్ష నేత లేకపోవడం పార్టీకి పెద్ద లోటుగా ఉందన్నారు. ఏదేమైనా నవంబర్ నెల చివరి లోపు నేతలను ఎన్నుకోవాలని, లేదంటే బెళగావి అసెంబ్లీ సమావేశాలకు ముఖం చాటేస్తామని ఎమ్మెల్యేలు తెలిపారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారంలో అగ్రనేతలు బిజీగా ఉన్నారని, మరోసారి ఢిల్లీకి వెళ్లి పరిస్థితి వివరిస్తానని యడ్డి హామీ ఇచ్చారు.

కబళించిన మట్టిదిబ్బ

- మడికేరిలో ముగ్గురు వలస కూలీల మృతి

యశవంతపుర: ఇంటి నిర్మాణం కోసం మట్టిని తోడుతుండగా మట్టి చరియలు విరిగి పడి ముగ్గురు కూలీలు మృతి చెందిన ఘటన కొడగు జిల్లా మడికేరి పట్టణంలోని స్టీవార్ట్ హిల్ లేఔట్‌లో బుధవారం జరిగింది. ఫైర్ సిబ్బంది వచ్చి ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. మృతులు బెళగావి జిల్లా చిక్కోడి తాలూకాకు చెందిన బసప్ప, నింగప్ప, ఆనంద అనే వలస కూలీలుగా గుర్తించారు. ఓ స్థలంలో ఇల్లు కట్టడానికి పునాది తీస్తుండగా పక్కనే మట్టి దిబ్బ కదిలి పెద్ద మొత్తంలో మన్ను వారి మీద పడింది. ముగ్గురు అక్కడికక్కడే సజీవ సమాధి అయ్యారు. ఆ సమయంలో అక్కడ 9 మంది పనిచేస్తున్నారు. మిగతావారు క్షేమంగా బయటపడ్డారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మడికేరి ఎమ్మెల్యే మంతరగౌడ, ఎస్పీ రామరాజన్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.


మృతదేహాల కోసం వెతుకుతున్న పోలీసులు, స్థానికులు

క్లుప్తంగా

శిశుపాలన కేంద్రాలు ప్రారంభం

గంగావతి: చిక్కజంతకల్, వడ్డరహట్టిల్లో ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి బుధవారం శిశుపాలన కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదలు తమ జీవనోపాధి కోసం పనులకు వెళ్లినప్పుడు వారి పిల్లల ఆలనాపాలనను చూసేందుకు వీలుగా ఈ కేంద్రాలను ప్రారంభించారన్నారు. మహానగరాలకే పరిమితమైన ఇలాంటి కేంద్రాలను నేడు గ్రామాల్లో కూడా ప్రభుత్వం ప్రారంభించిందని, వీటిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. టీపీ ఈఓ లక్ష్మీదేవి, జీపీ అధ్యక్షులు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎగసిన క-క ప్రత్యేక రాష్ట్ర నినాదం

- కలబుర్గిలో ఆందోళనకారుల అరెస్ట్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేస్తూ ఆందోళన చేస్తున్న నేతలను కలబుర్గిలో అరెస్ట్ చేసిన ఘటన బుధవారం జరిగింది. కలబుర్గిలోని సర్దార్ వల్లభాయి పటేల్ క్రీడా మైదానంలో కర్ణాటక రాష్ట్రావతరణ దినోత్సవంలో కళ్యాణ కర్ణాటక ప్రత్యేక రాష్ట్ర సమితి సంచాలకుడు ఎంఎస్ నరిబోళ్ ఆధ్వర్యంలో ప్రత్యేక రాష్ట్ర జెండా లాంఛనాన్ని ప్రారంభిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నరిబోళ్ మాట్లాడుతూ కళ్యాణ కర్ణాటక అభివృద్ధికి రాజ్యాంగంలోని ఆర్టికల్-371(జె) అమలుపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపడం తగదని, కలబుర్గిని ఉపరాజధానిగా చేయాలని డిమాండ్ చేశారు.

చివరి ఆయకట్టుకు నీరు విడుదల



పోలీస్ బందోబస్తు మధ్య కాలువకు నీరు వదిలిన దృశ్యం

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ చివరి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. 15 రోజుల నుంచి ఎడమ కాలువ 104వ మైలు రైతు పోరాట సమితి నేతలు చేస్తున్న ఆందోళనకు తలొగ్గిన ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించి కాలువకు ఏడు అడుగుల మేర నీరు వదిలారు. ఆయకట్టు చివరి భూములకు నీరందేలా గేజీను ఐదు అడుగుల మేర పెంచారు. ఉప కాలువలకు సక్రమంగా నీరందేలా ఇంజినీర్లు నీటి నిర్వహణ చేశారు. రెండు రోజుల పాటు ఐదు అడుగుల మేర నీరు వదిలి ఐదు రోజుల్లో గణేకల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను కూడా నీటితో నింపారు. మాన్వి తాలూకాలో సీఐ వీరభద్రయ్య హిరేమఠ నేతృత్వంలో పోలీసు సిబ్బంది కాలువపై బందోబస్తు నిర్వహించారు.

బైక్ నుంచి కిందపడి నవవధువు మృతి

బళ్లారి రూరల్: జిల్లాలోని సిరుగుప్ప సమీపంలో బైక్ నుంచి కిందపడటంతో సింధనూరుకు చెందిన నవవధువు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. సింధనూరు పోలీసులు తెలిపిన వివరాలు... సింధనూరుకు చెందిన నాజియాబేగం(19)కు సిరుగుప్పకు చెందిన ఎలక్ట్రీషియన్ మహ్మద్ సోయాజ్(26)తో 20 రోజుల క్రితం పెళ్లైంది. మంగళవారం వాజియాబేగం సింధనూరులోని తన పుట్టినింట్లో జరిగే ఓ శుభకార్యానికి భర్త మహ్మద్ సోయాజ్‌తో కలిసి మోటారు సైకిల్‌పై బయలుదేరింది. మార్గమధ్యంలో ఓ స్పీడుబ్రేకర్ వద్ద బైక్‌ను అదుపు చేయలేక భర్త వేగంగా ఎగిరించగా వెనుక కూర్చొన్న నాజియా బేగం పట్టు తప్పి కింద పడటంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆమెను విమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనపై సింధనూరు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

జీపీ భవనాన్ని మరమ్మతు చేయించండి



నెల్లుడి గ్రామ పంచాయతీ కార్యాలయం

కంప్లి: తాలూకాలోని నెల్లుడి గ్రామ పంచాయతీ భవనాన్ని 2002-03లో అప్పటి కురుగోడు ఎమ్మెల్యే అల్లం వీరభద్రప్ప హయాంలో నిర్మించారు. ప్రస్తుతం 2 దశాబ్దాల అనంతరం పైకప్పు శిథిలమై వర్షాకాలంలో నీరు కారుతోంది. గ్రామీణ ప్రజలకు అత్యవసరమైన ఈ గ్రామ పంచాయతీ భవనానికి సత్వరం మరమ్మతులను చేయించాలని నెల్లుడి కొట్టాల గ్రామప్రముఖుడు ఏ.లక్ష్మిపతి డిమాండ్ చేశారు.

రాజ్యోత్సవ పురస్కారాల అందజేత

పావగడ: పట్టణంలోని క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకల సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 20 మంది వ్యక్తులకు స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ కన్నడ రాజ్యోత్సవ పురస్కారాలను అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏకీకరణ యోధులను మరువకూడదు



బళ్లారిలో కర్ణాటక జ్యోతిని స్వీకరిస్తున్న మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి తదితరులు



విమ్స్‌లో ట్రాక్టర్‌పై కన్నడమాత ఊరేగింపులో పాల్గొన్న డైరెక్టర్ గంగాధరగౌడ తదితరులు



విమ్స్‌లో ఊరేగింపులో డాన్సులతో హోరెత్తిస్తున్న వైద్యులు, విద్యార్థులు



బళ్లారి చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంపై కన్నడ జెండాను ఎగరవేసిన దృశ్యం



రాయచూరులో సాధకులను ప్రశస్తులతో సత్కరిస్తున్న మంత్రి శరణ ప్రకాష్ పాటిల్

- సంబరంగా రాజ్యోత్సవాలు

సాక్షి,బళ్లారి: కర్ణాటక ఏకీకరణ కోసం పాటుపడిన మహనీయులను మరువకూడదని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం కర్ణాటక రాజ్యోత్సవం సందర్భంగా నగరంలోని రాజ్‌కుమార్ రహదారిలోని మైదానంలో రాజ్యోత్సవ సంబరాలను భువనేశ్వరి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి పూజ చేసిన అనంతరం మాట్లాడారు. రాష్ట్ర ఏకీకరణకు శ్రమించిన మహానుభావుల పేర్లను నగరంలోని ప్రముఖ రోడ్లకు పెడతామన్నారు. సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, మేయర్ త్రివేణి, అధికారులు, కరవే ప్రముఖులు చానాళ్ శేఖర్, జనార్ధన్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో..

బళ్లారి రూరల్: విమ్స్ కన్నడ సంఘం ఆధ్వర్యంలో 68వ కర్ణాటక అవతరణ దినోత్సవాన్ని బుధవారం విమ్స్‌లో వైభవంగా ఆచరించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ ఆసుపత్రి ముందు రాష్ట్ర పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కన్నడమాత ప్రతిమను పూలమాలతో అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి డప్పుల వాయిద్యాలతో విమ్స్ ఆవరణలో ఊరేగించారు. విమ్స్ వైద్యులు, వైద్య, దంతవైద్య, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులు స్టెప్పులతో హోరెత్తించారు. ట్రామా కేర్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, దంతవైద్య కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ భారతి, డాక్టర్ పరసప్ప, వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటపై 68 అడుగుల జెండా ఆవిష్కరణ

బళ్లారి అర్బన్: కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలో కన్నడ రాజ్యోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోటపై నవ కర్ణాటక యువశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 68 అడుగుల కన్నడ పతాకాన్ని సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఎగరవేసి భువనేశ్వరి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. యువశక్తి సిద్మల్ మంజునాథ్, కప్పగల్ చంద్రశేఖర్ ఆచారి, చానాళ్ శేఖర్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంపై అధ్యక్షులు మహారుద్రగౌడ, కార్యదర్శి సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు యశ్వంత్‌రాజ్, ఛాంబర్ పదాధికారులు గాదెం గోపాలకృష్ణ, అవ్వారు మంజునాథ్, దొడ్డబసవనగౌడ, మర్చేడు మల్లికార్జున, వీ.రామచంద్ర, పాలన్న, నాగళ్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. దుర్గమ్మ గుడి సమీపంలో వివేకానంద యువక సంఘం ఆధ్వర్యంలో పూజారి గాదెప్ప ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవాన్ని ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ త్రివేణి, కార్పొరేటర్లు పాల్గొని ప్రారంభించారు. సూర్య కళా ట్రస్ట్ అభిషేక్ బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ అలరించాయి. జిల్లా గొల్ల సంఘం ఆధ్వర్యంలో నందగోకుల పాఠశాలలో కన్నడ పతాకాన్ని సంఘం పదాధికారులు ఎగరవేసి రాజ్యోత్సవ వేడుకలను జరుపుకున్నారు. కన్నడ సంఘాల నేతలు నారాయణ రావు పార్క్‌లో, తమ తమ కన్నడ సంఘాల కార్యాలయాల వద్ద రాజ్యోత్సవ వేడుకలను ఆచరించారు.

గంగావతిలో..

గంగావతి: కర్ణాటకగా ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. రాజ్యోత్సవాన్ని పురస్కరించుకొని కనకగిరి రోడ్డులోని క్రీడా మైదానంలో వందన స్వీకారం అనంతరం ఆయన మాట్లాడారు. అంతకు ముందు సువర్ణ పతాకాన్ని తహసీల్దార్ మంజునాథ్ బోగావతి ఎగరవేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. టీపీ ఈఓ లక్ష్మీదేవి, నగరసభ కమిషనర్ విరుపాక్షప్ప మూర్తి, డీఎస్పీ, బీఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా

రాయచూరు రూరల్: రాష్ట్రాన్ని, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ అన్నారు. బుధవారం 68వ రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మగాంధీ క్రీడాంగణంలో జాతీయ పతాకావిష్కరణ గావించి ప్రజల నుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఎమ్మెల్యే బసనగౌడ, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, అదనపు జిల్లాధికారి దురుగేష్, ఎస్పీ నిఖిల్, సీఈఓ రాహుల్ తుకారాం పాండేలున్నారు. నగరంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఎడదొరె నాడు అవార్డులను ప్రదానం చేశారు.

వాడవాడలా రాజ్యోత్సవ వేడుకలు

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కరవే ప్రముఖులు, కార్యకర్తలు ఖావినకెరె వద్ద ధ్వజారోహణ గావించారు. అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్ భువనేశ్వరి చిత్రపటానికి పూజలు చేశారు. నేతాజీ నగర్‌లో కన్నడ కలా యువ వేదిక ఆధ్వర్యంలో కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల వీరశివాచార్యులు కన్నడ ధ్వజాన్ని ఎగురవేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కర్ణాటక సంఘాధ్వర్యంలో భువనేశ్వరి చిత్రపటాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. గడినాడులో కన్నడ రాజ్యోత్సవ ఆచరణలో భాగంగా ధ్వజారోహణ గావించారు. శక్తినగర్‌కు ఐదు కి.మీ దూరంలోని మక్తల్ తాలూకా మాగనూరు మండలం కృష్ణాలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నిజాముద్దీన్ భువనేశ్వరి చిత్ర పటానికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా నాగరాజ్, గోపాల్, రంగారావు, రేణుకాదేవి, శేఖర్, రఘు, మహేష్ కుమార్‌లున్నారు.

కర్ణాటకలో పుట్టడం ఎంతో అదృష్టం

హొసపేటె: కన్నడిగుల కన్నడ ప్రేమ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని విజయనగర జిల్లా ఇన్‌చార్జి, గృహ నిర్మాణ, వక్ఫ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి బీజెడ్ జమీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఆయన బుధవారం నగరంలోని జిల్లా స్టేడియంలో ఏర్పాటు చేసిన 68వ కర్ణాటక రాజ్యోత్సవంలో భువనేశ్వరి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. కన్నడ నేలపై పుట్టిన మనందరం పుణ్యాత్ములం అన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప అధ్యక్షత వహించారు. మున్సిపల్ అధ్యక్షురాలు ఏ.లత, జిల్లాధికారి ఎంఎస్ దివాకర్, జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు. టీబీ డ్యాం పీఎల్‌సీ ప్రభుత్వ హయ్యర్ ప్రైమరీ స్కూల్‌లో రాజ్యోత్సవం జరిపారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తొలుత మాతృమూర్తి భువనేశ్వరిదేవి చిత్రపటానికి పూజలు చేసి జెండాను ఎగురవేశారు. అనంతరం చిన్నారులు కన్నడ పాటలు ఆలపించారు. హేమలత, నిర్మల, ఈరప్ప, రవి, మంజుల పరశురాం తదితరులు పాల్గొన్నారు.

కంప్లిలో..

కంప్లి: కన్నడ నాడు, నుడి సంరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని కన్నడహిత రక్షక సంఘం అధ్యక్షులు కే.హేమయ్యస్వామి తెలిపారు. ఆయన బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో కన్నడ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం వివిధ రంగాల్లో సాధకులను సన్మానించారు. టీపీ ఈఓ శ్రీకుమార్, ఏడీ కేఎస్ మల్లనగౌడ, ఉపతహసీల్దార్, కసాప అధ్యక్షులు ఎస్‌జీ.చిత్రగార్, కరవే అధ్యక్షులు, శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షులు జీ.ప్రకాష్, ప్రముఖులు బీ.అంబణ్ణ, బంగి దొడ్డమంజునాథ్, కారేకల్ మనోహర్, ఆర్‌ఐ జగదీష్, శిరస్తేదార్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని సోమప్ప చెరువు వద్ద నుంచి కన్నడాంబ భువనేశ్వరి మాత చిత్రపటాన్ని ఊరేగించారు.

ధార్వాడలో రాజ్యోత్సవం

హుబ్లీ: ధార్వాడలోని ఆర్ఎన్ శెట్టి మైదానంలో బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతోష్‌లాడ్ 68వ కర్ణాటక రాజ్యోత్సవ ధ్వజారోహణ నెరవేర్చారు. వివిధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలోని వివిధ విద్యా సంస్థల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా లాడ్ మాట్లాడుతూ కర్ణాటక ఏకీకరణ కోసం జరిపిన పోరాటం ధార్వాడ గడ్డపైనే ప్రారంభం అయిందన్నారు. నాటి ఆందోళనలో పాల్గొన్న దేశ్‌పాండే, చెన్నబసప్ప, శంకర్‌గౌడ పాటిల్ తదితర ప్రముఖుల సేవలను కొనియాడారు.



గంగావతిలో భువనేశ్వరి దేవి చిత్రపటం ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



హొసపేటెలో రాజ్యోత్సవంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు



ధార్వాడలో కర్ణాటక ధ్వజానికి వందనం చేస్తున్న మంత్రి సంతోష్‌లాడ్



కంప్లిలో భువనేశ్వరి చిత్రపటం ఊరేగింపులో పాల్గొన్న అధికారులు, ప్రముఖులు



హొసపేటెలో దేశభక్తి గీతానికి విద్యార్థుల నృత్యం

చల్లారని మరాఠా రిజరేషన్ల వివాదం

- కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉద్రిక్తత
- పుణె-బెంగళూరు జాతీయ రహదారి దిగ్బంధం



టైర్లకు నిప్పంటించి ఆందోళన చేపడుతున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: మరాఠా రిజర్వేషన్ల వివాదం తీవ్ర రూపం దాల్చింది. బుధవారం ఆందోళనకారులు హింసాత్మకంగా తమ నిరసనలను చేపట్టారు. మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళన చినికిచినికి గాలివానగా మారింది. రిజర్వేషన్లు ఇవ్వకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని ఆందోళనకారులు హెచ్చరించారు. వందలాది మంది ఆందోళనకారులు పుణె-బెంగళూరు జాతీయ రహదారిని దిగ్బంధించారు. హైవేపై టైర్లకు నిప్పంటించారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకోవడంతో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. బెళగావి పోలీసులు శివసేన కార్యకర్తలను సరిహద్దులోనే అడ్డుకొని వెనక్కి పంపారు. కరవే కార్యకర్తలు మహారాష్ట్రకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. ఒక వైపు రాష్ట్ర వ్యాప్తంగా కర్ణాటక రాజ్యోత్సవ వేడుకలతో బెళగావిలో పండుగ వాతావరణం నెలకొంది. మరో వైపు సరిహద్దు గుండా బెళగావిలోకి ప్రవేశించేందుకు కొందరు శివసేన కార్యకర్తలు ప్రయత్నించడంతో కర్ణాటక పోలీసులు అడ్డుకున్నారు. నిప్పాణి మార్గంలో కర్ణాటక పోలీసులు, శివసేన కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. సరిహద్దు ప్రాంతంలోని బెళగావి, కార్వార, బీదర్, నిప్పాణి, భాల్కి తదితర ప్రాంతాలను మహారాష్ట్రలోకి చేర్చాలంటూ నినాదాలు చేశారు. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందినవారిని 100 మందికి పైగా పోలీసులు అడ్డుకొని మహారాష్ట్రకు పంపించారు. రెండు రోజులుగా మహారాష్ట్రలో రిజర్వేషన్ల వివాదం తీవ్రరూపం దాల్చడంతో కర్ణాటక బస్సు సర్వీసులను మహారాష్ట్రకు తాత్కాలికంగా నిలిపివేయడంతో ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు.

భారీ చోరీ ఇంటి దొంగల పనే

- 10 మంది నిందితుల అరెస్ట్
- పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్



మాట్లాడుతున్న రేణుకాసుకుమార్

హుబ్లీ: నగరంలోని రాయాపురలో ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ట్రస్ట్ కార్యాలయంలో గత నెల 24న జరిగిన భారీ చోరీకి సంబంధించి 10 మందిని నిందితులను అరెస్ట్ చేసినట్లు హుబ్లీ ధార్వాడ పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్ తెలిపారు. కార్యాలయంలోని పని చేసేవారే ఈ పనికి పాల్పడినట్లు ఆమె ధార్వాడలో విలేకరులకు వివరించారు. ఈ కేసు పోలీసులకు సవాలుగా మారిందన్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించినప్పుడు సీసీ టీవీ కెమెరాలతో పాటు ఎటువంటి క్లూ లభించలేదన్నారు. ఈ కేసు విషయమై ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యానగర ఎస్ఐ సంగమేశ్ నేతృత్వంలోని బృందం ఎటువంటి ఆధారాలు లేని ఈ కేసును శాస్త్రీయంగా దర్యాప్తు జరిపి ఇంటి దొంగల పని పట్టడంలో విజయం సాధించారన్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.79.89 లక్షల నగదు, చోరీ కోసం వాడిన కారు, మొబైల్‌తో పాటు మొత్తం రూ.85.89 లక్షల విలువ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారన్నారు. అరెస్ట్ అయిన వారిలో కుషల్‌కుమార్, బసవరాజ్, మహంతేష్ అనే ముగ్గురు సంబంధిత కార్యాలయంలోనే పని చేసేవారన్నారు. ప్రాథమికంగా వీరు చోరీకి ప్రణాళిక వేసి మరో 7 మందిని కలుపుకొని ఈ కృత్యానికి పాల్పడ్డారన్నారు. జిలాని, పరశురామ, రంగప్ప, మంజునాథ, కిరణ్, రజాక్, వీరేష్ మిగిలిన నిందితులు అని ఆమె వివరించారు. అలాగే ఇటీవల ప్రజల దృష్టి మళ్లించి చోరీలకు పాల్పడే విదేశాలకు చెందిన దొంగలను కూడా అరెస్ట్ చేశామన్నారు. హుబ్లీ, బెళగావి తదితర చోట్ల చోరీలకు పాల్పడుతున్న నలుగురు విదేశీ నిందితులను అరెస్ట్ చేశామన్నారు. హుబ్లీలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారని ఆమె తెలిపారు.

వంద మంది విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తాం

గంగావతి: రాష్ట్ర వ్యాప్తంగా 100 మంది విద్యార్థులకు 2024-25వ సంవత్సరంలో పీయూసీ విద్యాభ్యాసాన్ని ఉచితంగా అందిస్తామని విద్యానికేతన్ సంస్థ యజమాని నెక్కంటి సూరిబాబు ప్రకటించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ప్రభుత్వ కన్నడ మీడియం, నవోదయ పాఠశాలల్లో చదివి ప్రథమ ర్యాంక్‌లు పొందిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసుకొని వారికి ఉచిత వసతితోపాటు రెండేళ్ల పీయూసీ విద్యాభ్యాసం కల్పిస్తామన్నారు.

తాగునీటి ఎద్దడి అరికట్టండి

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా చూడాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా తుంగభద్ర ఎడమ కాలువలకు నీరు వదిలినప్పుడే ముందు జాగ్రత్తగా కుంటలు, చెరువులను నీటితో నింపాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ నియమావళి ప్రకారం రైతులకు కరువు నష్టపరిహారం అందించాలన్నారు.

కర్ణాటక సంభ్రమ ఏర్పాట్ల పరిశీలన

హొసపేటె: నవంబర్ 1తో కర్ణాటకగా నామకరణం చేసి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కన్నడ, సంస్కృతి శాఖ బెంగళూరు, విజయనగర జిల్లా యంత్రాంగం సంయుక్తంగా గురువారం నిర్వహించే కర్ణాటక సంభ్రమ-50 వేడుకకు హంపీలో ఎదురు బసవణ్ణ మంటపం వద్ద చేసిన ఏర్పాట్లను బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గవియప్ప పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా ఈ వేడుకలను ప్రారంభించనున్న సంగతి విదితమే. ఈసందర్భంగా అధికారులు పాల్గొన్నారు.

దళవాయి సిద్దప్పకు రాజ్యోత్సవ ప్రశస్తి

కంప్లి: రాజ్యోత్సవ ప్రశస్తి పొందిన విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా బిన్నళ్లి బయలాట కళాకారుడు దళవాయి సిద్దప్ప ఇంటికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ వెళ్లారు. ముందుగా దళవాయి సిద్దప్పను రాజ్యోత్సవ ప్రశస్తితో అభినందించి రూ.లక్ష బహుమతిని అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వెనుకబడిన హందిజోగి సముదాయపు సిద్దప్పకు ఈ ఏడాది రాజ్యోత్సవ ప్రశస్తి లభించడంపై హర్షం వ్యక్తం చేశారు.

గణేకల్ రిజర్వాయర్‌లో నీరు నింపుతాం

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ నుంచి గణేకల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీటిని నింపుతామని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ పేర్కొన్నారు. ఆయన బుధవారం క్రీడాంగణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 15 అడుగుల మేర నీటిని నిల్వ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. బెళగావిలో ఎంఈఎస్ సభ్యులు బీదర్, నిప్పాణి, భాల్కి, బెళగావిలను మహారాష్ట్రలో విలీనం చేయాలని పేర్కొనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

తల్లి మందలించిందని బాలిక బలవన్మరణం

బళ్లారి రూరల్: తల్లి మందలించిందని మనస్తాపంతో పురుగుల మందుతాగి ఓ బాలిక బలవన్మరణానికి పాల్పడిన ఘటన నగరంలో జరిగింది. కౌల్‌బజార్ పోలీసులు తెలిపిన వివరాలు... నగరంలోని దేవీనగర్ చెందిన అమూల్య(15) అనే బాలిక పదో తరగతి చదువుతోంది. మంగళవారం రాత్రి అమూల్య చదువుకోకుండా మొబైల్ చూస్తుండటంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన అమూల్య ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైంది. వెంటనే తల్లి గమనించి విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. కాగా మృతురాలి తండ్రి 14 ఏళ్ల క్రితమే గుండెపోటుతో మరణించాడు. ఒక్కగానొక్క బిడ్డ మృతితో తల్లి రోదనలు బంధువులను కంటతడి పెట్టించాయి.

కోలారు వార్తలు...

అంగరంగ వైభవంగా కన్నడ రాజ్యోత్సవం



కోలారులో సాధకులకు రాజ్యోత్సవ అవార్డులను అందించిన దృశ్యం



కోలారులో నిర్వహించిన ఊరేగింపులో సాగుతున్న స్తబ్దచిత్ర శకటాలు



కేజీఎఫ్‌లో నిర్వహించిన రాజ్యోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం

- సాధకులకు అవార్డులతో సన్మానం
- అలరించిన స్తబ్ద చిత్ర శకటాల ఊరేగింపు

కోలారు: 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలను బుధవారం నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 9 గంటలకు జిల్లాధికారి అక్రం పాషా కన్నడ ధ్వజం, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఏకీకరణలో ఎంతో మంది మహనీయుల కృషి ఉందన్నారు. కన్నడ భాష, సంస్కృతి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడాలన్నారు. ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ మాట్లాడుతూ జిల్లాలో భాషాభివృద్ధికి కన్నడాభిమానులు శ్రమించాలన్నారు. కన్నడ భాషకు ఎలాంటి భంగం కలుగకుండా చూడాలన్నారు. ఎంపీ ఎస్.మునిస్వామి మాట్లాడుతూ కన్నడ భాష, సంస్కృతికి శాస్త్రీయ హోదా లభించడంపై హర్షం వ్యక్తం చేశారు.

అంబారీపై ఊరేగిన భువనేశ్వరి దేవి

వేడుకల సందర్భంగా దాదాపు 50కి పైగా స్తబ్ద చిత్ర శకటాలు నగర ప్రముఖ వీధుల్లో సంచరించాయి. భువనేశ్వరి దేవి చిత్రపటాన్ని శకటాల్లో ఉంచి నగరంలోని ఎంజీ రోడ్డు, ఎంబీ రోడ్డు, బస్టాండు సర్కిల్ మీదుగా ఊరేగించారు. భువనేశ్వరి దేవి విగ్రహాన్ని అంబారీపై ఉంచి నగరంలో ఘనంగా ఊరేగించారు. కళాబృందాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లోని 14 మంది సాధకులకు రాజ్యోత్సవ అవార్డులను అందించి సత్కరించారు. ఎమ్మెల్సీలు అనిల్‌కుమార్, ఇంచర గోవిందరాజులు, జెడ్పీ సీఈఓ పద్మా బసవంతప్ప, ఎస్పీ ఎం.నారాయణ్, తహసీల్దార్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

కన్నడ భాషే నిత్యం కావాలి

కేజీఎఫ్: కన్నడ కేవలం భాష మాత్రమే కాకుండా మన నిత్య జీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. బుధవారం జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కన్నడ భవన నిర్మాణానికి తన అభివృద్ధి నిధుల నుంచి రూ.20 లక్షలు అందిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ కన్నడ భాషపై స్వాభిమానాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం స్తబ్ద చిత్రాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పి శాంతరాజ్, తహసీల్దార్ నాగవేణి, నగరసభ కమిషనర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో..

నగరంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలను ఎస్పీ శాంతరాజ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కన్నడ ధ్వజారోహణ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ బంగారు గనులకు ప్రఖ్యాతి గాంచిన కేజీఎఫ్ కన్నడ నాడుకు మకుటం లాంటిదన్నారు. సమసమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పాండురంగ, సహాయక పాలనాధికారి జి.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాలూరులో..

మాలూరు: పట్టణంలో 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలను బుధవారం విశేషంగా నిర్వహించారు. ఉదయం జూనియర్ కళాశాల మైదానంలో కన్నడ ధ్వజాన్ని ఎమ్మెల్యే కె వై నంజేగౌడ ఆవిష్కరించారు. అనంతరం కన్నడ స్తబ్ద చిత్రాల ఊరేగంపును ప్రారంభించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి కన్నడ మాత భువనేశ్వరి దేవి చిత్రపటాల పల్లకీలను, భువనేశ్వరి దేవి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌లో ప్రతిష్ఠించి ప్రధాన వీధుల్లో వివిధ కళాబృందాలతో ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే ఏ.నాగరాజ్, తహసీల్దార్ కే.రమేష్, టీపీ ఈఓ కృష్ణప్ప, కసాప అధ్యక్షుడు ఎంపీ హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

కన్నడ భాష రక్షణ అందరి బాధ్యత

శ్రీనివాసపురం: కన్నడ నేల, నీరు, భాషను రక్షించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో 68వ కన్నడ రాజ్యోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. కన్నడ భాషాభిమానం కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి తాను శ్రమిస్తున్నానన్నారు. పట్టణంలో రూ.25 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. కోలారు రహదారి విస్తరణకు రూ.40 కోట్ల వ్యయంతో పనులను త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం వచ్చే ఏడాది మార్చిలోగా జలజీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికి కొళాయి కనెక్షన్ ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో టెన్త్, ఇంటర్‌లో కన్నడ భాషలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. తహసీల్దార్ శరీన్‌తాజ్, పురసభ ముఖ్యాధికారి వైఎన్ సత్యనారాయణ, బీఈఓ కె భాగ్యలక్ష్మి, కోశాధికారి కుముద, కెఎల్ జయరాం, బలరామేచంద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.



కేజీఎఫ్‌లో ఎస్పీ కార్యాలయంలో రాజ్యోత్సవ వేడుకలను నిర్వహించిన దృశ్యం



మాలూరులో ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ తదితరులు



శ్రీనివాసపురంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తదితరులు